ఆంధ్ర యోగులు

(సప్తమ భాగము)

రచయిత

డా॥ బి.రామరాజు

భారతప్రభుత్వం నేషనల్ రీసెర్చ్ ప్రొఫెసర్

హైదరాబాదు

2011 అక్టోబర్

విషయసూచిక

స్మృతి

దేశసంస్కృతిపై ఉన్న అభిమానం, ఆధ్యాత్మిక మార్గానురక్తి సామాజిక ధర్మం పట్లగల పట్టుదల ఆంధ్రయోగుల చరిత్ర రచన ఆరంభించటానికి కారణం. ఇప్పటికి ఆరుభాగాలుగా 300 మంది యోగుల చరిత్రలు వెలువడినవి. అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక తాము సేకరించిన 16 మంది యోగుల సమాచారానికి సప్తమ భాగమని పేరు పెట్టినారు. నిరంతర పరిశోధన అధ్యయనానికి సంబంధించిన జిజ్ఞాసకు నిదర్శనం ఈ చివరి భాగం. ఆరు భాగాలు చదివిన ఆధ్యాత్మిక మిత్రులు ఇంకొక సంపుటం ఎప్పుడు వస్తుందని ఆసక్తిగా అడిగేవారు. చదువరుల ప్రోత్సాహమే రామరాజుగారి రచనకు ప్రేరణ. వారి జీవితధ్యేయం ఈ ప్రచురణ. డిటిపి చేసిన శ్రీమతి శ్రీహరిగారికి, ఓపికగా అభిమానంతో ముద్రించిన ఓం సాయి గ్రాఫిక్స్ వారికి కృతజ్ఞతలు.

కుటుంబసభ్యులు.

అంకితం

శ్రీశ్రీశ్రీ భగవాన్ సత్యసాయి బాబావారికి

ఆంధ్ర యోగులు (సప్తమ భాగము)

ప్రొఫెసర్ బి. రామరాజు

1-8-117/2, చిక్కడపల్లి, హైదరాబాదు - 500 020.

ఫోను: (040) 27661034

ప్రథమముద్రణ: 2011, 1000 ప్రతులు

వెల రూ. 100/-

సోల్ డిస్ట్రిబ్యూటర్స్

నవోదయ బుక్‌హౌస్

3-3-865, ఆర్యసమాజం ఎదురువీధి,

కాచిగూడ, హైదరాబాదు - 500 027

ఫోను : (040) 24652387

డి.టి.పి.

శ్రీ సత్యసాయి గ్రాఫిక్స్

సెల్ : 9866245797

ముద్రణ

ఓం సాయి గ్రాఫిక్స్

నారాయణగూడ, హైదరాబాదు - 500 029

ఫోను: (040) 2756 4141.

1. భగవద్రామానుజులు (1017-1137)

ద్వైత అద్వైత విశిష్టాద్వైతములు మూడును వేద సమ్మతములైన మతములు. వీటినే మతత్రయమంటారు. ద్వైత మత స్థాపనాచార్యులు మధ్వాచార్యులు కన్నడిగలు (1199–1303). అద్వైతమత స్థాపనా చార్యులు శంకరాచార్యులు (684–716) కేరళీయులు, విశిష్టాద్వైత మతస్థాపనాచార్యులు భగవద్రామానుజాచార్యులు (1017–1137) ఆంధ్రులు. ఆత్మయే పరమాత్మయని అద్వైతమత వాదము. "బ్రహ్మ సత్యం, జగన్మిథ్యా, జీవో బ్రహ్మైవ నాపరః" బ్రహ్మమొక్కటే సత్యము, జగత్తు సర్వము మిథ్య, జీవుడు బ్రహ్మమే. బ్రహ్మము కంటె వేరుకాదు అని దీని తాత్పర్యము. విశేషణ యుక్తమైన అద్వైతము విశిష్టాద్వైతము. పరబ్రహ్మము విశేషణయుక్తము. అనగా గుణములు కలదనీ, శ్రీమన్నారాయణుడొక్కడే ఆ పరబ్రహ్మమనీ విశిష్టాద్వైతుల వాదము. ఆత్మ (జీవాత్మ) వేరు, పరమాత్మ వేరనీ, శ్రీమహావిష్ణువే పరమాత్మయనీ

ప్రతిపాదించునది ద్వైతము. ఈ మూడు మతములవారికి వేదములు, ఉపనిషత్తులు, పురాణములు ఆధారము.

పైన పేర్కొన్న మూడు మతాలలో విశిష్టాద్వైతమత ప్రతిష్ఠాపనాచార్యులు భగవద్రామానుజాచార్యులు. చెన్నపట్నానికి సమీపానగల శ్రీ పెరుంబుదూరులో (భూతపురి) ఆసూరి యింటిపేరుగల కేశవస్వామియనే ఆంధ్రవైష్ణవ బ్రాహ్మణులుండేవారు. అనేక యజ్ఞయాగాదులు నిష్ఠతో చేసినారు కనుక ఆయనను కేశవయజ్వ అనేవారు. తిరుపతి తిరుమలలో మానవసేవ, మాధవసేవలను కఠోర నియమంతో చేస్తుండిన తిరుమల నంబికి (శ్రీశైలపూర్ణులకు) ఇరువురు చెల్లెండ్రు; పెద్ద చెల్లెలు కాంతిమతిని కేశవయజ్వకు, చిన్నచెల్లెలు శ్రీదేవిని మలవైమంగలం కమలనయన భట్టరుకు ఇచ్చి పెండ్లి చేసినారు. కేశవయజ్వ కాంతిమతి ఒకరికోసం మరొకరు జన్మించినవారు. వారికి దీర్ఘకాలందాక సంతానం కలుగకపోతే వారు ఒక చంద్ర గ్రహణంనాడు చెన్నపట్నం సముద్రస్నానం చేసి తిరువళ్ళిక్కేణి పార్థసారథి ఆలయంలో పుత్రకామేష్టి స్వామినారాధించినారు. పార్థసారథి ప్రీతుడై "నేనే మీకు పుత్రుడనై పుడుతా"నని వరమిచ్చినాడు. అన్నట్లే కాంతిమతి గర్భం ధరించినది. క్రీ.శ. 1017 సం॥ చైత్ర శుద్ధ పంచమీ గురువారం ఆర్ద్రానక్షత్ర కర్కాటకలగ్నంలో ఒక దివ్యబాలుడు పుట్టినాడు. ఈ వార్త విన్న తిరుమల నంబి తిరుపతి నుండి వచ్చి మేనల్లుని చుట్టు వెలుగుతున్న కాంతిమండలం చూచి శ్రీరామచంద్రుని ప్రియతమసోదరుడైన లక్ష్మణుని విశిష్టలక్షణాలు గుర్తించి రామానుజులని నామకరణం చేసినారు. అనతికాలంలోనే కాంతిమతి చెల్లెలు శ్రీదేవి ప్రసవించి కొడుకును కంటే గోవిందుడని నామకరణం చేసినారు. శ్రీ పెరుంబుదూరులోని వైష్ణవు లందరూ వచ్చి ఆ దివ్యబాలుని అందం,

తేజస్సు చూచి ఆశ్చర్యానందాలు పొంది దీవించిపోయినారు. ఆ వచ్చిన వారిలో తిరుక్కచ్చినంబి అనే వైశ్యుడు సంప్రదాయ పరిరక్షకుడు ఒకరు. రామానుజులకు ఐదవయేట అక్షరాభ్యాసము, గర్భాష్టమున ఉపనయనము చేసి కేశవాచార్యులే తమకు వచ్చిన సమస్తవిద్యలు నేర్పి 16వ యేట తంజమ్మతో పెండ్లి చేసినారు. కొడుకు కోడలు ముద్దుముచ్చటలు చూడకుండానే కేశవయజ్వ పరమపదించినారు. కొంత కాలము తల్లివద్దనేయుండి ఆమె నూరడించి రామానుజులు వేదాంత మభ్యసించుటకై పిన్నమ్మకొడుకు గోవిందుని తోడుకొని కాంచీపురమున నున్న నాటి గొప్ప వేదాంత పండితుడు యాదవ ప్రకాశులను ఆశ్రయించినాడు. యాదవ ప్రకాశుడు గొప్ప పండితుడే కాని ఋజువర్తనుడు కాడు, మీదు మిక్కిలి విష్ణుద్వేషి. ఐనా రామానుజులు గోవిందుడు యాదవప్రకాశులను సేవిస్తూ వేదాంత విద్య నభ్యసిస్తుండినారు.

ఒకనాడు యాదవప్రకాశులు 'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ' అనే తైత్తిరీయోపనిషత్తులోని వాక్యాన్ని వ్యాఖ్యానిస్తూ శ్రుతితాత్పర్యం పరమా ద్వైతమని వివరిస్తే, రామానుజులు వ్యతిరేకిస్తూ అవి బ్రహ్మమునకు విశేషణములు మాత్రమే అని నిరూపించినారు. యాదవప్రకాశులు కుపితులై రామానుజులను వెళ్ళిపొమ్మన్నారు. రామానుజులు గురువులతో వాదించ కూడదని నిశ్చయించుకొని విద్యాభ్యాసం కొనసాగించినారు. ఇంకొకనాడు రామానుజులు గురువులకు తలంటుతుండగా ఆయన "తస్య యథా కప్యాసం పుండరీక మేవ మక్షిణీ" అనే ఛాందోగ్యోపనిషద్వాక్యాన్ని వ్యాఖ్యానిస్తూ బ్రహ్మము (శ్రీమన్నారాయణుని) కన్నులు కోతిపృష్ఠంవలె ఎఱ్ఱగా ఉంటాయని వివరిస్తే రామానుజులు దుఃఖితులై కప్యాసమంటే సూర్యునిచే ఉన్మీలిత మని అర్థం చెప్పి ఆ వాక్యానికి భగవంతుని నేత్రాలు సూర్య వికసిత

పద్మాల వంటివని ప్రత్యాఖ్యానించినారు. యాదవప్రకాశులు కోపం పట్టలేక రామానుజులను వెళ్ళి పొమ్మన్నారు. రామానుజులట్లే మునుముందు ఇంకా బలీయుడైతే అద్వైతానికి ప్రబల విరోధి ఔతాడనీ కనుక రామానుజులను ఎట్లాగైనా కడతేర్చవలెనని నిశ్చయించుకున్నాడు. ఇట్లుండగా కాంచీపురం రాజకుమారిని బ్రహ్మరాక్షసుడావేశిస్తే యాదవ ప్రకాశులు విడిపించలేక పోయినాడు. కాని రామానుజులు గ్రహమును పారద్రోలితే రాజుగారు గురుశిష్యులను ఇరువురినీ సత్కరించినారు. ఇది కూడ యాదవ ప్రకాశులకు రామానుజులపై ఈర్ష్య పెరగటానికి మరొక కారణమైనది. యాదవప్రకాశులు తమకు నమ్మకమైన శిష్యులతో సంప్రదించి కాశీయాత్రమిషతో రామానుజులను తమ వెంట తీసుకుపోయి మార్గ మధ్యంలో ఎక్కడో ఒక అడవిలో చంప నిశ్చయించుకున్నారు. రామానుజుల పినతల్లి కుమారుడైన గోవిందుడీ విషయం పసికట్టి తానుగూడ కాశీయాత్రకు బయలుదేరినాడు. అదనుచూచి రామానుజులను హెచ్చరించవచ్చు ననుకున్నాడు. వింధ్యపర్వత ప్రాంతాలు చేరిన తరువాత గోవిందుడు అన్నగారికీ విషయం చెప్పి, హెచ్చరించినాడు. రామానుజులా బృందంనుండి వెనుకబడినట్లు నటించి కాంచీపురం బాటపట్టినారు. తనను అనుమానించకుండా గోవిందుడు మాత్రం గురువులవెంట కాశీయాత్రకు పోయినాడు. యాదవప్రకాశులు రామానుజుల కోసం వెదకించి ఏదో క్రూరమృగం వాతబడియుంటాడని సంబరపడ్డారు.

భగవంతునిపై భారంవేసి రామానుజులు ధైర్యంతో దుర్గ మారణ్యాలు దాటుతూ రాత్రులు అనువైనచోట్ల విశ్రమిస్తూ ఒక రేయి అలసిపోయి భగవంతుని స్మరిస్తూ, నిద్రపోయి లేచేవరకు, ఎదుట వ్యాధదంపతులు కనబడ్డారు. వారు రామానుజులను విచారించి

విషయములు తెలిసికొని తాము రామేశ్వరానికి పోతున్నట్లు చెప్పి తమవెంట తోడుకపోయినారు. ఒక మధ్యరాత్రి వ్యాధుని భార్యకు దాహం వేస్తే రామానుజులు సమీపానగల బావినుండి నీరు తెచ్చి యిచ్చినారు. దంపతులు సంతోషించి నిద్ర పోయినారు. తెల్లవారి రామానుజులు మేల్కొని చూస్తే కిరాత దంపతులు లేరు. రామానుజులటుయిటు చూస్తే తాము కంచి బయట ఉన్నట్లు తెలుసుకొని కంచివరదుడు సతీసమేతంగా వచ్చి తనను క్షేమంగా కంచికి చేర్చినాడని పరమానందం పొందినారు. రామానుజులు ఇల్లుచేరి తల్లి కాంతిమతికీ విషయాలన్నీ చెప్పినారు. ఐనా ఈ విషయాలన్నీ రహస్యంగానే ఉంచినారు. ఎప్పటట్లు రామానుజులు కొంతకాలం యాదవప్రకాశులను శుశ్రూషించినారు. తల్లిగారి ఆదేశం ప్రకారం రామానుజులు కాంచీ పూర్ణులనే శూద్రవైష్ణవయోగి నాశ్రయించగా ఆయన "వ్యాధరూపంలో వచ్చినది కంచివరదుడే, కనుక నీవు ఇప్పటినుండి కంచి బయటనున్న ఆ బావినుండి నీరు తెచ్చి కంచివరదుని తిరుమంజనకైంకర్యం చేయు" మన్నారు. ఆళవందారు తరువాత రామానుజుల నాయకత్వంలో వైష్ణవమత భవిష్యత్తు సురక్షితంగా ఉండగలదని కాంచీ పూర్ణులు విశ్వసించినారు.

ఆ కాలంలో శ్రీరంగంలో యామునాచార్యులు (ఆళవందారులు), శ్రీ వైష్ణవ కులపతులు. వారు విశిష్టాద్వైత సిద్ధాంత ప్రచారకుల్లో శ్రేష్ఠులు. మహాపూర్ణులు (పెరియనంబి), శ్రీశైలపూర్ణులు (తిరుమల నంబి), కాంచీపూర్ణులు (తిరుక్కచ్చినంబి) వంటి ప్రముఖులందరూ వారివద్దనే విశిష్టాద్వైత సిద్ధాంతగ్రంథములను విష్ణుభక్తితత్త్వమును అభ్యసించినారు. ఆళవందారులు రామానుజుల గూర్చి విని ఒకసారి కంచికి వచ్చినపుడు దూరంనుండి చూచి మునుముందాయనే వైష్ణవజ్యోతిని ప్రజ్వలింప జేసే సమర్థు డౌతాడని నిశ్చయించినారు.

తిరుక్కచ్చినంబికి రామానుజులు శిష్యులైన వార్త విని రామానుజులను తోడితేర పెరియనంబిని పంపినారు. అప్పటికే ఆళవందారులు కడువృద్ధులు, జీవితచరమాంకంలో ఉన్నారు. పెరియనంబి నీర కైంకర్యం చేస్తున్న రామానుజులను దూరంనుండి చూచి వారి ఆకార వైభవానికి ముగ్ధులై ఆళవందారుల స్తోత్రరత్నం బిగ్గరగా గానం చేసినారు. రామానుజులా గానం విని ఆకృష్టులై విచారిస్తే తమ గురువులు, కాంచీపూర్ణులకు గురువుల రచనమని మహానందం అనుభవించినారు. ఆళవందారులు మృత్యుముఖంలో ఉన్నారని, వారి ఆదేశం ప్రకారం తమను వారి సన్నిధికి తీసుకుపోవటానికి వచ్చి నామనీ చెప్పగనే రామానుజులు హుటుహుటిగా పెరియనంబి వెంట బయలుదేరినారు. వారు శ్రీరంగం ప్రవేశిస్తుండగా ఆళవందారులు పరమపదించినారనీ వారికి అంతిమ సంస్కారం చేయటానికి శ్రీవైష్ణవులందరూ అక్కడికి చేరినట్లు తెలిసి దుఃఖించినారు. ఆళవందారుల కళేబరం చూస్తుంటే కుడిచేయి మూడు వ్రేళ్ళు ముడిచియున్నట్లు గమనించిన రామానుజులు ధ్యానంలో శ్రీవారికి మూడు కోరికలుండేవని గ్రహించినారు. ఆ మూడు 1) వ్యాస పరాశరులకు శాశ్వతస్మృతి చిహ్నం ఏర్పాటు చేయటం, 2) తమిళ మహాకవులలో అగ్రేసరులైన నమ్మాళ్వారులకు ప్రేమ గౌరవాలు సమర్పించటం, 3) బ్రహ్మసూత్రాలకు విశిష్టాద్వైతపరంగా వ్యాఖ్యానం వ్రాయటమని తెలిసి వాటిని తాము తీర్చుతామని శపథం చేసినారు. ఆళవందారుల అంత్యక్రియల తరువాత రామానుజులు శ్రీరంగం లోనికి పోకుండా కంచికి తిరిగివచ్చి తాము చేసిన ప్రతిజ్ఞల సాధనకై నిరంతరాధ్యయనశీలురై యుంటూ తత్త్వచింతన చేస్తుండేవారు. ఇంతలో వారి తల్లి కాంతిమతిగారు పరమపదించినది. తల్లికి పరలోక క్రియలు చేసి రామానుజులు కంచిలోనే కాంచీపూర్ణులను సేవిస్తూ తత్త్వచింతన చేస్తుండినారు. రామానుజుల భార్య తంజమ్మ

తిరుక్కచ్చినంబి బ్రాహ్మణేతరులనే చిన్నచూపుతో వారియెడ వరుసగా మూడుసార్లు తప్పు చేసినది. రామానుజులెంత చెప్పినా, హెచ్చరించినా వినలేదు. రామానుజులు ఆమెను ఏదో సాకుతో పుట్టినింటికి పంపినారు.

రామానుజులు సత్యం తెలుసుకోవటానికి తిరుక్కచ్చినంబిని ఆశ్రయిస్తే ఆ మహానుభావుడు వరదరాజపెరుమాళ్ళ ఆదేశంగా

శ్లో॥ అహమేవ పరబ్రహ్మ జగత్కారణకారణః
క్షేత్రక్షేత్రజ్ఞయోర్భేదస్సిద్ధ ఏవ మహామతే,
మోక్షోపాయో న్యాస ఏవ జనానాం ముక్తిమిచ్ఛతాం
మద్భక్తానాం జనానాం చ నాంతిమస్మృతిరిష్యతే
పూర్ణాచార్యం మహాత్మానం సమాశ్రయ గుణాశ్రయమ్.

అనే శ్లోకాన్ని పఠించి వివరించి అర్థషట్కప్రాప్తిని కలిగించినారు. శ్రీరామానుజులు శ్రీరంగంలో పెరియనంబినుండి నేర్వవలసిన దెంతో ఉన్నది కనుక శ్రీరంగం పయనమైనారు. అదే సమయంలో శ్రీరంగం వైష్ణవమండలివారు రామానుజులవారిని తోడ్కొని రావలసిందిగా పెరియనంబినే కాంచీపురం పంపినారు. పెరియనంబి భార్యాసహితులై కంచికి బయలుదేరి త్రోవలో మధురాంతకంలో ఆగి కోదండరామ స్వామిని సేవించినారు. ఆడబోయిన తీర్థమెదు రైనట్లు త్రిపురాంతకంలో రామానుజులు పెరియనంబిని కలుసు కున్నారు. పెరియనంబి పాంచరాత్రాగమప్రోక్త దీక్షాప్రదానవిధి ననుసరించి రామానుజులకు పంచసంస్కారములు నిర్వర్తించి అష్టాక్షరీమంత్ర మిచ్చి ఆళవందారుల పరమానుగ్రహాన్ని అందించినారు. అక్కడే తత్త్వత్రయాన్ని (ప్రమాణ, ప్రమేయ, ప్రమాతలు) వివరించినారు. రామానుజుల వెంట కంచికిపోయి అక్కడ ఆరు

నెలలుండి ద్రావిడవేదం 4000 మంత్రాలలో 3000 మంత్రాలు, వ్యాసకృత బ్రహ్మసూత్రాలు రామానుజుల కుపదేశించినారు. రామానుజులు భార్యను త్యజించి, యామునాచార్యుల పాదాలు ధ్యానిస్తూ కంచిలో వరదరాజ స్వామివారినుండియే సన్న్యాసాశ్రమం స్వీకరించి కాషాయములు త్రిదండము కమండలము ధరించినారు. వరదరాజస్వామి ఆదేశంతో కాంచీపూర్ణులు సమస్తగౌరవ లాంఛనాలతో రామానుజులకు స్వామిసన్నిధిలో అర్చక ముఖంగా యతిరాజులనే ప్రశస్తి కల్పించి ఆ మందిరంలోనే ఒక భాగంలో వారికి మఠం ఏర్పాటు చేసినారు. అంత చిన్న వయస్సులో, అందమైన ఆకారంతో దివ్యరోచులు చిమ్మే యతిరాజులను పలుప్రదేశాల వైష్ణవులు, భక్తులు, సామాన్యులు వచ్చి దర్శించి పోయేవారు. యతిరాజుల కీర్తి దేశమంతట ప్రాకినది. ముందుగా యతిరాజుల మేనల్లుడు పురుష మంగళాగ్రహార వాసి దాశరథి, కూర గ్రామవాసి కూరేశులు రామానుజులకు శిష్యులై వారిచెంత సమస్తవిద్యలు నేర్చినారు. ఈ యిరువురు యతిరాజులకు కుడి యెడమ భుజముల వంటివారు. అటు తరువాత తమను చంప యత్నించిన అద్వైతా చార్యులు, పూర్వగురువులు, యాదవప్రకాశులు మనశ్శాంతిని కోలుపోయి తల్లిగారి ఆదేశం, తిరుక్కచ్చి నంబి ఆదేశం ప్రకారం రామానుజులను ఆశ్రయించి శిష్యులైనారు. అప్పటినుండి అద్వైతుల యిండ్లలో కూడ యతిరాజుల ప్రశస్తి ప్రాకి ఎందరో వచ్చి దర్శించి పోయేవారు. యతిరాజుల పిన్నమ్మ శ్రీదేవి కొడుకు శైవుడుగా మారి శ్రీకాళహస్తిలో ఉంటున్న గోవిందుడు వచ్చి రామానుజుల శిష్యు డైనాడు. ఈ నలుగురు అటు తరువాత శ్రీవైష్ణవ మతమునకు సంబంధించిన అనేకరచనలు చేసినారు.

ఆళవందారుల ప్రధానకేంద్రం శ్రీరంగం. అక్కడి వైష్ణవులు యతి రాజులను శ్రీరంగంలో నిలుపవలెనని నిశ్చయించి ఒక ఉపాయం

ఆలోచించి ఆళవందారుల ముఖ్యశిష్యులు భగవదనుగ్రహపాత్రులైన మహా గాయకులు తిరువరంగం పెరుమాళ్రాయరులను కంచికి పంపినారు. ఆయన తమ అమోఘమైన దివ్యప్రబంధ స్తోత్రగానంతో రామానుజులను మెప్పించి, వరం పొంది, రామానుజులను శ్రీరంగం రావటానికి ఒప్పించినారు. రామానుజులకు శ్రీరంగంలో గొప్ప స్వాగతంలభించింది. ఆళవందారులకు ఉత్తరాధికారిగా యతిరాజులు శ్రీరంగం దేవళంలో శిథిలావస్థలో ఉన్న కొన్ని ప్రదేశాలను బాగు చేయించి పుష్పవాటికలు నాటించి ఆలయపూజలో క్రొత్త కట్లుబాట్లు చేయించినారు. వైష్ణవమతం కేవలం పండితచర్చలవరకే పరిమితం కాకుండా ఆలయంలో ఉత్సవాలు, భాగవత పురాణగాథల సంగీత రూపకాలు, దివ్యప్రబంధ గానాలు ఏర్పాటు చేయించి వైష్ణవం సామాన్యజనులకు ఆకర్షణీయం చేసినారు. పెరియనంబి ఆదేశంతో ద్వయమంత్రమహార్థం తెలుసుకోవటానికై గోష్ఠీపూర్ణ నామాంతరంగల తిరుక్కోష్ఠియూరునంబి సన్నిధికి పోయినారు. ఆయన యతిరాజుల శ్రద్ధను పరీక్షించటానికై 18 పర్యాయాలు తమ గ్రామానికి తిప్పించుకొని, ఆయన పట్టుదలకు భక్తికి సంతసించి చివరిసారిగా ఒంటరిగా రమ్మన్నారు. చివరిసారి యతిరాజులు కూరేశదాశరథులను తోడ్కొని పోతే గోష్ఠీపూర్ణులు ఒంటరిగా రమ్మంటే ఇరువురిని తోడ్కొని వచ్చినావేమని ప్రశ్నిస్తే దాశరథి నా దండం, కూరేశులు నా ధ్వజ మన్నారు. గోష్ఠీపూర్ణుల హృదయం ద్రవించింది. మంత్రార్థం బోధించి దీన్ని రహస్యంగా దాచుమన్నారు. మోక్షం ప్రసాదించే దివ్య మంత్రార్థం కొద్దిమందికే పరిమితం కావటం యతిరాజులిష్టపడక మరునా డుదయం తిరుక్కొట్టియూర్ ఆలయగోపురమెక్కి అందరికీ మంత్రార్థం చాటినారు. ఈ వార్త విని గోష్ఠీపూర్ణులు కోపంతో రామానుజులను రప్పించుకొని సమాధానమడిగి మంత్రార్థం వెల్లడి చేసినందుకు నరకం పోతావంటే రామానుజులు నేనొక్కణ్ణి నరకం పోతాను కాని

తమ మంత్రార్థరహస్యం విన్న ఇంతజనం ముక్తులౌతారన్నారు. గోష్ఠీపూర్ణుల హృదయం ద్రవించింది. వారు యతిరాజుల కారుణ్యానికి, భక్తికీ మెచ్చి సజలనయనాలతో ఆలింగనం చేసుకొని 'ఎంబెరుమాన్' అని సంబోధించినారు. ఆ మాటకు మా ప్రభువు అని అర్థం. పునరుజ్జీవిత వైష్ణవానికి నాయకుడన్నమాట. మాలాధరులు, ఆళవందారుల ముఖతః నమ్మాళ్వారుల తిరువాయిమొళిని అధ్యయనం చేసినవారు. అట్టి మాలాధరులను ఆశ్రయించి తిరువాయిమొళిని (తమిళవేదం) నేర్చుకొమ్మని రామానుజులను గోష్ఠీపూర్ణులాదేశించినారు. యతిరాజులు మాలాధరుల చెంత ఆమంత్రాలు నేర్చుకుంటుంటే వారికి క్రొత్త అర్థాలు తోచినవి. ముందుగా కుపితులైనా యతిరాజుల నిశ్చితావ గాహనకు మాలాధరులు సంతోషించి గురువులకు గురువైనావని అభినందించినారు.

యతిరాజుల విద్యార్థిదశ ముగిసినది. వారి వైష్ణవ వేదాంత బోధనకు ఎందరో ఇతర సిద్ధాంతములవారు ప్రభావితులైనారు. ఈ సమయంలోనే ఉత్తరదేశంలో దిగ్విజయయాత్ర ముగించి స్వదేశానికి తిరిగివచ్చిన యజ్ఞమూర్తి అనే అద్వైతవేదాంతి వచ్చి రామానుజులతో 18 దినాలు వాదించి పాదాక్రాంతులై విశిష్టాద్వైతం పుచ్చుకున్నారు. యతిరాజులైన రామానుజుల కీర్తి దేశమంతటా మారుమ్రోగింది. వారు శ్రీరంగ దేవాలయానికి సర్వాధిపత్యం వహించి వైష్ణవోద్యమానికి దానిని కేంద్రంగా మలచినారు. అకలంకుడనే చోళసామంతరాజుకు దేవాలయ నిర్వహణం అప్పగించినారు. ఆయనకు మహాబలశాలి ధనుర్దాసు, అంగరక్షకుడు. ఆయనభార్య పొన్నాచి విశాలనేత్రాలుగల కోమలాంగి. ఆ దంపతులు చైత్రోత్సవానికి వచ్చినారు. వీథిలో నడుస్తుంటే ఆమెకు ఎండ తగులకుండా ధనుర్దాసు గొడుగు పడితే

యతిరాజుల శిష్యులు యతిరాజుల కాతణ్ణి చూపించి కామాంధు డన్నారు. రామానుజులాతడు గొప్ప ప్రేమికుడన్నారు. ప్రేమజీవులు నిజంగా భగవదనుగ్రహానికి పాత్రులౌతారని మరునాడుదయం ఇంతకంటె సుందరమైన నేత్రాలు చూపిస్తానని రామానుజులు ధనుర్దాసును గర్భగుడిలోనికి తీసుకపోయి శ్రీరంగనాథుని నేత్రాలు చూపించినారు. ధనుర్దాసు అవాక్కైపోయినాడు. భార్యాభర్తలిరువురు యతిరాజుల శిష్యులై తమ సర్వస్వం మతానికి సమర్పించినారు. ఈ వార్త తెలిసిన అకలంకుడు రామానుజుల శిష్యుడై వైష్ణవులలో అగ్రేసరుడైనాడు. ఆధ్యాత్మికాభ్యున్నతి సాధించినవారి గుణములకే కాని కులమునకు రామానుజులు ప్రాధాన్యమీయలేదు.

రామానుజుల ఉన్నతాశయాలకూ ఆలయ పూజారుల సంకుచిత మనస్తత్వానికీ సరిపడలేదు. ఉరంగవిల్లి బ్రాహ్మణేతరుడు. మారనేర్నంబి అస్పృశ్యుడు. రామానుజులు వారిని గొప్పగా సంభావించటం శిష్యులకు గాని ఆలయార్చకులకు కాని ఇష్టం కాలేదు. రామానుజులు వారి ఔదార్యము, ప్రపత్తి, సేవాభావములు పరీక్షలద్వారా శిష్యులకెరుక పరచి కనువిప్పు కలిగించినారు. ఆలయపూజారి వర్గం కుట్రపన్ని ఒకసారి విషాన్నం ఒకసారి విషం కలిపిన తీర్థమిచ్చినారు. ఆదిశేషుని అవతారమైన యతిరాజులీ గండములు శ్రీరంగనాథుని అనుగ్రహంతో గడచినారు. కుల, విద్యా, ధన, మదములున్న శిష్యుల చేత ఇతరుల ఇండ్లలో దాస్యం చేయించి సాత్త్విక సంపన్నులను చేసినారు. యతిరాజులు తమ మేనమామ తిరుమలనంబి చెంత రామాయణాధ్యయనం చేయటానికి శిష్యసమేతంగా తిరుపతికి పయనమైనారు. త్రోవలో అష్టసహస్ర గ్రామంలో వరదరాయలనే నిరుపేద శిష్యుని భార్య, గురువుల సమర్చనకై సమకట్టిన త్యాగమునకు మహానంద భరితులైనారు. ప్రపంచ భక్తి సాహిత్యంలో

ఇట్టి మహత్తర సన్నివేశం అరుదు. వరదరాయదంపతులను ఆశ్వీరదించి, ఆయమ్మ మానము దోచు కొనగోరిన వర్తకుని శిష్యునిగా స్వీకరించి, ధనగర్వాంధుడైన యజ్ఞేశునికి భక్తులు గురువులనెట్లు గౌరవించవలెనో బోధించినారు.

తరువాత రామానుజులు పవిత్రమైన తిరుమలకొండలు కాళ్ళతో గాక మోకాళ్ళపై నడచి పైకి ఎక్కి తన శిష్యుడు భగవత్సేవకై పెంచుతున్న రామానుజ పుష్పవాటిని ఇతర పవిత్ర క్షేత్రాలను దర్శించి, చివరకు శ్రీవెంకటేశ్వరస్వామికి మంగళాశాసనం చేసి మేనమామ తిరుమలనంబి చెంత ఒక సంవత్సరం విశిష్టాద్వైత దృక్పథంతో రామాయణాధ్యయనం చేసినారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి దివ్యశంఖచక్రాలు సమర్పించినారు. తిరుమలకొండ దిగి శ్రీశైలపూర్ణుల యింట మూడుదినాలుండి తమ పిన్నమ్మ కొడుకు గోవిందుని వెంటగొని శ్రీరంగం చేరి శ్రీభాష్యరచనకు పూనిక చేసినారు. ఆదిశంకరులు తమ భాష్యంలో ప్రశంసించిన బోధాయన వృత్తిని చూడటానికై ముఖ్య శిష్యులు కూరేశ ప్రభృతులతో బయలుదేరి ఎంతో శ్రమించి కాశ్మీరం శారదాపీఠంలోనున్న బోధాయన వృత్తిని సంపాదించినారు. తిరుగు ప్రయాణంలో పోగొట్టుకున్న ఆ గ్రంథాన్ని ఒక్కసారి మాత్రమే చదివి కంఠస్థం చేసుకున్న కూరేశుల జ్ఞాపకశక్తితో బ్రహ్మసూత్రములకు విశిష్టాద్వైతపరంగా భాష్యం రచించినారు. దానికి శ్రీభాష్యమని పేరు. ఈశ్వరుడు సాకారుడనీ, విశిష్టుడనీ, సర్వమునకు మూలమనీ ప్రతిపాదించే విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని శ్రీభాష్యం సమగ్రంగా వివరిస్తుంది. రామానుజులు చెప్పుతుంటే శ్రీభాష్యాన్ని వ్రాసినవారు కూరేశులే. ఇంకనూ కూరేశులు గురువులు చెప్పుతుండగా వేదాంతదీపము, వేదాంతసారము, వేదార్థ సంగ్రహము, గీతాభాష్యములను కూడ వ్రాసినారు. రామానుజ

లితః పూర్వమే గద్య త్రయమును, నిత్యమను భగవదారాధన క్రమమును రచించియుండిరి. ఈ గ్రంథాల మూలంగా శ్రీమన్నారాయణుని స్వరూప రూపగుణ విభూత్యాదులు లోకంలో ప్రకాశింపచేయటంచేత శ్రీవారు భగవద్రామానుజుల పేరుతో ప్రసిద్ధులైనారు. శ్రీవారు ఆళవందారుల ఒక వాంఛను పూర్తిచేసినవారైనారు.

భగవద్రామానుజులు శిష్యసమేతంగా ముందుగా దక్షిణదేశం దివ్య క్షేత్రాలు తరువాత ఉత్తరభారత క్షేత్రాలు సేవించి పరవాదులను పరాస్తం చేసి విశిష్టాద్వైతమత ప్రతిష్ఠాపనాచార్యులై వెలిగినారు. శ్రీవారి యాత్రల్లో కురుకాపురి, కురంగనగరి, కాశ్మీర శారద, ద్వారక, కాశీ, బృందావనం, జగన్నాథం, శ్రీకూర్మం, సింహాచలం, అహోబిలం దివ్యదేశములుండినవి. ఆయా ప్రదేశాల్లో అనేక భక్తుల అద్భుత గాథలు శ్రీవైష్ణవ వాఙ్మయంలో ఉన్నవి. తమిళదేశంలో ఆనాడు ప్రబలంగా ఉన్న అద్వైత, విశిష్టాద్వైత శైవ సిద్ధాంతాలకు అహమహమిక ఉండేది. చోళరాజ్యాధిపతి ప్రథమ కులోత్తుంగుడు (1070–1118) పరమశైవుడు. యతిరాజులచేత శివుని కంటె పరదైవం లేదని బలవంతాన ఒప్పించటానికి భటులను పంపితే రాబోయే ప్రమాదం తెలిసి భాష్యకారులు కొలదిమంది శిష్యులతో శ్రీరంగం విడిచి మైసూరు రాజ్యం పోయినారు. రామానుజుల శిష్యులైన కూరేశులను, పెరియనంబిని రాజభటులు తీసుకపోయి దారుణంగా శిక్షించిన కథలు, గురువులకోసం శిష్యులు చేసిన త్యాగాలు ఒడలు జలదరింప జేస్తవి. వృద్ధులైన పెరియనంబి ఆ బాధతోనే పరమపదించినారు. అంధులైన కూరేశులు శ్రీరంగం చేరినారు. శ్రీరామానుజులు మైసూరురాజ్యం నీలగిరి వనాలలోని ఆటవికులకు, తొన్నూరు పాలించే హొయసల విఠలదేవుడనే జైనునికి విశిష్టాద్వైత దీక్షలు ప్రసాదించి మీన పుష్కరిణిలో పడవేసియున్న స్వామివారి విగ్రహాన్ని

పునఃప్రతిష్ఠించినారు. కొంతకాలానికి అక్కడి ఉత్సవ బేరాలను శత్రువులు దొంగిలించ ప్రయత్నిస్తే అక్కడి అస్పృశ్యులు రామానుజులకు సహాయపడి శత్రువులను తరిమినారు. రామానుజులు అస్పృశ్యులకు దీక్షలిచ్చి ఆలయ ప్రవేశార్హత కల్పించినారు. అస్పృశ్యులకు దేవాలయ ప్రవేశం హిందూ మతచరిత్రలో ఇదే మొదటిసారి. యతిరాజులు వారిని తిరుకులత్తార్ – పవిత్రకులోద్భవులనేవారు. ఆ ప్రభావమే గాంధీమహాత్మునిచే వారిని హరిజనులనిపించినది.

భగవద్రామానుజులు తిరునారాయణపురంలో ఉన్నప్పుడే శ్రీవైష్ణవ మతంలో విప్లవాత్మకమైన సంస్కరణలెన్నో ప్రవేశపెట్టినారు. మైసూరు రాజ్యంలో శ్రీవారు 12 ఏండ్లున్నారు. ప్రథమ కులోత్తుంగుని పాలనం ముగియగానే శ్రీరంగం చేరి ముందుగా కూరేశుల యింటికి పోయి ఆయనను కౌగిలించుకొని "నీ స్పర్శచే నేను పవిత్రుడనైనా" నన్నారు. కనులు పోగొట్టుకున్న కూరేశులను కంచికి తోడ్కొనిపోయి వరదరాజస్వామి సన్నిధిలో నిలిపినారు. కూరేశులు వరదరాజస్తవం పాడితే కంచివరదుడు వరం కోరుకొమ్మన్నాడు. కనుచూపు కోరుకుంటాడని అందరనుకున్నారు. కానీ కూరేశులు తనను చోళరాజుకు పట్టియిచ్చి తన కండ్లు పీకించటానికి కారకుడైన నలూరాన్‌ను క్షమించి అనుగ్రహించవలసిందిగా కోరినారు. వైష్ణవ మతంలో క్షమాగుణాని కీసన్నివేశం పరాంకోటి. ఇంతటి క్షమా దయా గుణములు జీసస్ ప్రభువులోనే కనబడుతవి. పురుషులతో పాటు పతివ్రతలైన స్త్రీలకు, భక్తురాండ్రకు భగవద్రామానుజులు ఉచిత స్థానం కల్పించినారు. కూరేశుల చరమదశలో ఆయన కొడుకు, సాటిలేని పండితుడు, ప్రపన్నుడైన పరాశరుని తలపై భగవద్రామానుజులు పుష్పకిరీటం పెట్టి దీవించినారు. ప్రియశిష్యుడు తనకంటె ముందే పోవటం శ్రీరామానుజులు భరించలేకపోయినారు.

కూరేశులకు అంతిమసంస్కారం కావేరీతీరంలో జరిపించి ఆ దుఃఖంతో మరల శ్రీరంగం విడిచిపోలేదు. తిరునారాయణ పురం ఆలయంలోను అక్కడి వైష్ణవుల్లోను భగవద్రామానుజులు ప్రవేశపెట్టిన సంస్కరణలు, శ్రీరంగంలో ప్రవేశపెట్టలేక పోయినారు. శిష్యులందరూ ఒక్కరొక్కరే పరమపదిస్తుంటే వారికందరికీ శ్రీరామనుజులే వైభవంగా అంతిమసంస్కారాలు జరిపించినారు. వారిని వివిధ ప్రాంతాలవారు దర్శించి పోయేవారు. ఆళవందారుల మూడు కోరికలు 1) బ్రహ్మ సూత్రాలకు శ్రీభాష్యం రచించటం 2) కూరేశుల పెద్దకొడుక్కు పరాశరభట్టరని పేరు పెట్టటం 3) నమ్మాళ్వారులకు కృతజ్ఞతగా తమ ఆధ్యాత్మికవారసుడైన నంబిళ్ళను నమ్మాళ్వారులని సంబోధించటం ద్వారా పూర్తిగా తీర్చినారు. తమ అనంతరం శ్రీవైష్ణవమత ప్రచారం సక్రమంగా సాగటానికై 74 మంది శిష్యులను నియమించి ఆసేతుశీతాచలపర్యంతం శ్రీవైష్ణవధ్వజం రెపరెపలాడించినారు. 120 ఏండ్లు జీవించిన భగవద్రామానుజులు తమ అంత్యం సమీపించగానే పరాశరభట్టరును శ్రీరంగనాథ దాస్య సామ్రాజ్యానికి పట్టం కట్టి ఎంబరు ఒడిలో తల, వడుగనంబి ఒడిలో కాళ్ళు చాచి తమ అంతిమ సందేశాన్ని వినిపించి కపాలభేదనం చేసుకొని పరమపదం చేరినారు. వారి పార్థివశరీరాన్ని వారి శిష్యులు శ్రీరంగం దేవాలయంలోనే ఈజిప్షియన్ మమ్మీలకు చేసినట్టి ఏదో రసాయనిక ప్రక్రియ చేసి భద్రపరిచినారు. వారి విగ్రహాన్ని తిరుమలలో, కంచిలో, శ్రీపెరుంబుదూరులో ప్రతిష్ఠించినారు. తరువాతకాలాన శ్రీవారి బోధలు భారతదేశంలో బలపడిన అనేకమతాలను, నింబార్క, మధ్వాచార్య, శ్రీవల్లభాచార్య, రామానంద, శ్రీకృష్ణచైతన్య, నామదేవ, తుకారాం, గురునానక్, మీరా, సూరదాస్ వంటి మహాత్ములను, ఆధునికకాలంలో గాంధీ మహాత్ముని ప్రభావితం చేసినవి.

ఆధారములు :

1) రామానుజాచార్యులు, ఇంగ్లీషు ఆర్. పార్థసారథి, National Book Trust, India. 1991

2) భగవద్రామానుజ చరిత్ర - గుదిమెళ్ళ రామానుజాచార్యులు.

2. పహాడీషరీఫ్ బాబాషర్ఫుద్దీన్

(1178-1279)

ఖండాంతరాలనుండి భారతదేశానికి ఇస్లాం మతప్రవర్తకులు రావటం కొన్ని వందల యేండ్లు పూర్వమే ప్రారంభమైనది. ఆ వచ్చినవారు తాముపొందిన సిద్ధులను, మహిమలను ప్రదర్శించటం ద్వారా ప్రజలను అద్భుతావహులను చేసి, ఆకర్షించి తమ మతాన్ని స్వీకరించేటట్లు చేసినారు. వాళ్ళు హజ్రత్‌లుగా బాబాలుగా ప్రజల హృదయ పీఠాల నధివసించి కీర్తనీయులుగా నిలిచి పోయినారు. అట్టి మహానుభావులలో ఇరాక్ నుండి మనదేశానికి వచ్చిన షర్ఫుద్దీన్ ఒకరు. ఆయనను బాబాషర్ఫుద్దీన్ అని క్లుప్తంగానూ హజ్రత్ సయ్యదినా బాబా షర్ఫుద్దీన్ సాహెబ్, ఖిబ్లా సొహ్రెవర్దీ అని దీర్ఘంగానూ పేర్కొంటారు.

షర్ఫుద్దీన్ ఇరాక్‌లో 586 హిజ్రీ (1175 AD) 16 షాబాన్‌నాడు ఉదయం జన్మించినాడు. ఆయన తండ్రి హజ్రత్ సయ్యద్

మహమూద్‌సాహెబ్. సయ్యద్ వంశంలో ఆయన 12వ తరంవాడు. అందువల్ల ప్రస్తుత కథానాయకుడైన షర్ఫుద్దీన్ పదమూడవ తరానికి చెందినవాడు. షర్ఫుద్దీన్ ప్రాథమిక విద్యాభ్యాసం తండ్రిదగ్గరే జరిగినది. ప్రాపంచిక రీతులను అవగాహన చేసికొనే సామర్థ్యం అబ్బినది. ఆ తరువాత ఆయనలో ఆధ్యాత్మిక విద్యాజిజ్ఞాస అంకురించినది. బగ్దాద్‌లో షేఖుష్షేఖ్ (గురువులకు గురువైన) షేఖ్ షహాబుద్దీన్ సొహ్రెవర్దీ శిష్యుడైనాడు. విస్తార గ్రంథపఠనం ద్వారా లౌకిక విద్యాపారంగత్వాన్ని, నిరంతరబోధనల ద్వారా ఆధ్యాత్మిక విద్యా పారమ్యాన్ని సాధించినాడు.

పైగంబరు మహమ్మదునుండి ఆరంభమైన గురుపరంపరలో షర్ఫుద్దీన్ 20వ వాడు. అతడు నిసర్గమధురభాషి, నిర్వ్యాజత్యాగశీలి. భగవద్ధ్యానము, జాగరణ ఆయన శల్యాలలో జీర్ణించుకపోయిన విషయాలు. నిష్ఠాపరులైన మహమ్మదీయులను “పంచ్ నమాజీ’లని లోకం వ్యవహరిస్తున్నది. దినం ఐదుసార్లు నమాజు (ప్రార్థన) చేసేవాళ్ళని దాని అర్థం. కాని షర్ఫుద్దీన్ ‘తహజ్జుద్’ (ఆరవ నమాజు– రాత్రి 1–2 గంటలమధ్య) కూడ పాటించేవాడు. ఈ నియమం ఆయన అసామాన్య నిష్ఠాపరత్వానికి నిదర్శనం. ఉదయ ప్రార్థనా నంతరం ఆయన తన గురువుతో కలిసి మిత్రులను, రోగులను పరామర్శించటానికి వెళ్లేవాడు. గురుశిష్యుల పరామర్శ మిత్రులకు ఉత్సాహాన్నీ, రోగులకు స్వాస్థ్యాన్ని ప్రసాదించేది. ఆయన అన్యాయార్జనకు ప్రబల వ్యతిరేకి. న్యాయంగా ఆర్జించినదానిలో తన జీవికకు సరిపోను మిగిలినది బీదలకు పంచేవాడు. ఆయన పాటించిన అతిమాత్ర సంయమనం అటు ఆయన పూర్వులలో గాని తరువాతి వారిలోగాని కన్పించదు. నిరాడంబరత్వానికి ఆయన

జీవితం ప్రథమోదాహరణం. విద్యార్థులపట్ల ఆయన కనపరచిన వాత్సల్యం, వారి భవితను గూర్చిన ఆయన ఆశయాలు ఛాత్రలోకానికి సమధిక ప్రేరణనిచ్చినవి. గుర్వనుచరుడై వెళ్ళిన పెక్కుచోట్ల ఆయన నైతికజీవన నైర్మల్యాన్ని గురించి, పరోపకార పరిణామాన్ని గురించి చేసిన ప్రవచనాలు శ్రోతలను ఎంతో ప్రభావితులను కావించినవి. తత్ఫలితంగా ఎందరో క్రూరులు, చోరులు తమ మార్గాలను విడనాడి సన్మార్గగాములైనారు.

ఒకనాటిరాత్రి కలలో షర్ఫుద్దీన్‌కు మహమ్మద్ ప్రవక్త కన్పించి భారతదేశం లోని దక్షిణప్రాంతానికి వెళ్ళి ప్రబోధం సాగించవలసినదని ఆదేశించినారు. షర్ఫుద్దీన్ నిద్ర మేల్కొని ఆ స్వప్నవృత్తాంతాన్ని తన అంతరాత్మ ప్రబోధంగా భావించి జన్మసాఫల్యానికి మహమ్మద్ సూచించిన కర్తవ్యంగా శిరసావహించి భారతదేశ గమనోన్ముఖుడైనాడు.

631 హిజ్రీ (సుల్తాన్ షమ్సుద్దీన్ అల్తమష్‌కాలం)లో (1223AD) షర్ఫుద్దీన్ భారత దేశానికి వచ్చినాడు. మతప్రచారమే గురిగా పెట్టుకొని తొమ్మిది సంవత్సరాలపాటు అర్యావర్తంలోని వివిధప్రాంతాలలో పర్యటించి, ప్రవచించి దక్కను పీఠభూమిలో మహమ్మదు ఆదేశాను సారం తాను చేపట్టనున్న ఉద్యమానికి కావలసిన భూమికను సిద్ధం చేసికొన్నాడు. 640 హిజ్రీలో దక్కనులో ప్రవేశించి (1232 AD) ఇప్పటి హైదరాబాదు నగరానికి నైరృతిదిశగా పదిమైళ్ల దూరంలో ఉన్న ఒకగుట్టమీద విడిది చేసుకున్నాడు. ఆ దినాల్లో ఆ ప్రాంతమంతా క్రూర మృగాలతో నిండివున్న వన్యభూమి, జనసంచారం చాలా తక్కువ. ఆ కొద్దిపాటి జనులుకూడ విగ్రహారాధకులు. గుట్టపైనున్న ఒక విగ్రహాన్ని కూలద్రోసి, అది తన మాహాత్మ్యంగా చాటుకొని

షర్ఫుద్దీన్ తన సౌమనస్యంతో, మాటమెత్తనతో, సత్ప్రవర్తనతో అచ్చటి జనులను మచ్చిక చేసికొని వారి సహవాసాన్నీ, సానుభూతినీ సంపాదించినాడు. తాను విడిది చేసికొన్న ఆగుట్టపైని ఒక గుహలో తొమ్మిది సంవత్సరాలు తపస్సు (చిల్లాకషీ) చేసి సిద్ధిపొంది తన రాకకు ముఖ్యోద్దేశమైన ఇస్లాం మత ప్రచారాన్ని సాగించినాడు. ఇక బాబా చూపిన మాహాత్మ్యాలు అనేకములు. బాబాను నమ్మికున్న ఒక గ్రుడ్డివాడు కొంత ధనాన్ని పోగు చేసికొన్నాడు. ఆ మూట నెప్పుడూ భద్రంగా ఉంచే వాడు. ఒకనాడు ఆ గ్రుడ్డివాడు మూటను దగ్గర పెట్టుకొని నిద్రపోయినాడు. బాబా ఒక పేదవానికి ఆ మూటను చూపి అది తీసికొని పారిపో. అందులో నీకు కావలసిన డబ్బున్నది'' అని ప్రబోధించినాడు. బాబా చెప్పినది బీదవాడు చేసినాడు. అంతలో గ్రుడ్డివాని కలలో కన్పించి "నీ డబ్బు తీసికొని పరుగెత్తున్నాడెవడో, వాణ్ణి పట్టుకో, పరుగెత్తు" అని చెప్పినాడు. గ్రుడ్డివాడు లేచి అరుస్తూ తన మూట తీసికొని పరుగెత్తే వానిని వెంబడించి ద్వారబంధం తలకు తగిలి పడిపోయినాడు. అప్పుడుగాని వానికి తన దృష్టిప్రాప్తిని గూర్చి తెలియలేదు.

బాబా చూపిన మరొక మహిమ. ఒకని ఎద్దు తప్పిపోయింది. రెండు నెలలుగా వెదకివెదకి వేసారి బాబాను ఆశ్రయించి ఎద్దులేక తాను, తన కుటుంబం ఎంత ఇబ్బంది పడుతున్నారో చెప్పుకొని విలపించినాడు. బాబా అతనిని ఓదార్చి, ఒక బొమ్మను గీసి అతని చేతికిచ్చి ఒక సంకేతస్థలాన్ని నిర్దేశించి ఆ బొమ్మను అక్కడపెట్టి రమ్మన్నాడు. అతడు బాబా చెప్పినట్లుగా చేసి తిరిగివస్తుంటే తన ఎద్దు తనకు ఎదురువస్తూండగా చూచినాడు. బాబాకు వేయి నమస్కారాలు అర్పించినాడు. గోలకొండ వాస్తవ్యుడు వెంకటరెడ్డి

ఒక పాలికాపు. అతనికి ఒకే ఒక్క కొడుకు. ఆ బాలుడు వ్యాధి గ్రస్తుడైనాడు. తన వంశాంకురాన్ని రక్షించుకోవటం కొరకు అతడు ఆశ్రయించని వైద్యులు లేరు. చేయని పూజలు లేవు. చివరకు బాబా షర్ఫుద్దీన్ శరణు వేడినాడు. ఆ పాలికాపు నోదార్చి బాబా ఆబాలుని శరీరాన్ని ఒకసారి ఆమస్తకపాదం నిమిరినాడు. బాలునికిక మరేమీ భయంలేదు తీసికొని పొమ్మన్నాడు. తండ్రి కుమారుని తీసుక పోయినాడు. ఆ పిల్లవాడు క్రమేణ కోలుకొని సంపూర్ణ స్వాస్థ్యాన్ని పొందినాడు. వెంకటరెడ్డి ఆనందానికి అవధులులేవు. బాబాపట్ల కృతజ్ఞతలు వెలిబుచ్చినాడు. దేవుడొక్కడే అని నిరూపించటానికి బాబాషర్ఫుద్దీన్ జీవితంలో ఒక చిత్రమైన ఘటన జరిగింది. ఒకనాడొక సాధువు (ఫకీరు) బాబాను కలిసికొని, మాటల సందర్భంలో దేవుడొక్కడా, అనేకులా? అని అడిగినాడు. దానికి బాబా 'ఒక్కడని చెప్పటానికి వేరే ఉపపత్తు లనవసరం' అన్నాడు. 'ఈ చెట్టు ఆ విషయాన్ని నిరూపించగలదా?' అని సాధువు ప్రశ్న. 'నిస్సందేహంగా' అని బాబా సమాధానం. వాదవిషయాన్ని పొడుగించకుండా ఆ చెట్టు ఆకులు దూసి తెమ్మని బాబా సాధువుకు చెప్పినాడు. సాధువు దూసి తెచ్చినాడు. బాబా ఆ ఆకులను రెండురెండుగా లెక్కపెట్టుమన్నాడు. సాధువట్లే చేసినాడు. చివరకు ఒక్క ఆకు మిగిలింది. 'అనేకులయితే రెండాకుల లెక్క సరిపోయి ఉండేది. ఒక్కడే కాబట్టి ఒక్క ఆకే మిగిలింది' అని తేల్చి చెప్పినాడు. సాధువు నిరుత్తరుడైనాడు.

బాబాషర్ఫుద్దీన్ నివాసంగా చేసికొన్న ఆగుట్టకు పూర్వం ఏ పేరుండేదో తెలియదు. కాని ఆయన కాలధర్మం చెందిన తరువాత అది పహాడీషరీఫ్‌గా ప్రసిద్ధిపొందినది. ఆగుట్టమీద 'ఫీకీ బీబీ త్రోవ' అనే మార్గాన్ని గూర్చి ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉన్నది. పూర్వం

అది ఒక విస్తారమైన దిబ్బ. అవతలివైపు పోవలెననుకొన్న భక్తులకు దానిని చుట్టి పోవటం కష్టంగా ఉండేది. అట్లా పోవటం శ్రమతో కూడిన పనేకాక కాలంకూడా వృథా అయ్యేది. ఆదిబ్బను బాబా తన చేతికర్రతో తాకి రెండుగా చీలిపోయేటట్లు చేసినాడట. భక్తులీ విషయాన్ని ఆయన మహిమలలో ఒకటిగా చెప్పుకుంటారు. బాబాషర్ఫుద్దీన్ ప్రార్థనలలో పరిపూర్ణప్రభావం ఉండేది. రోగులు, రోగులైన బిడ్డలతల్లులు ఆయన దర్శనం చేసికొని తమ, తమపిల్లల రుగ్మతలను నివేదించుకునేవారు. ఆయన వారికొరకు ప్రార్థించి వారిదైహిక మానసికవ్యాధులను దూరం చేసేవాడు.

ఆగంతుకుల కోర్కెలను వారు చెప్పకుండానే తెలిసికొని తీర్చటం బాబాషర్ఫుద్దీన్ ప్రత్యేకత. ఈనాటికీ భక్తులు తమ కోర్కెలను చెప్పుకొని ఆయన సమాధిముందు సాష్టాంగపడుతుంటారు. అవి తప్పకుండా తీరుతాయని వారి విశ్వాసం. పహాడీషరీఫ్ అనే ఆగుట్టపైకి వెళ్ళటానికి 312 మెట్లున్నాయి. అన్నిమెట్లు ఎక్కిపోవటం అందరికీ అంతసులభం కాదు. కాని పిల్లలు, వృద్ధులుకూడ అనాయాసంగా, ఉత్సాహంతో ఎక్కిపోవటం మనకు అనుదినం ప్రత్యక్షమౌతున్న దృశ్యం. దీనివెనుక బాబాషర్ఫుద్దీన్ బలం ఉన్నదని అంటారు. ఆయన మహిమలు ఎంతో ప్రాచుర్యం పొందినవి. వాటిని గురించి ఆయన జీవితకాలంలోనేకాక ఈనాడు కూడా ఊరూరా వాడవాడలా ఆబాలగోపాలం గీతాలు పాడుకుంటూ ఉంటారు.

మతప్రచారం ముఖ్యోద్దేశమైనా మానవకల్యాణం అంతస్సూత్రంగా జీవితం గడిపి తన తరువాత తన ఆశయసాధనకు అర్హులైన శిష్యులకు శిక్షణనిచ్చి 101 సంవత్సరాలు జీవించిన షర్ఫుద్దీన్‌బాబా 19షాబాన్

687హిజ్రీ (1279AD) రాత్రి పాంచభౌతికమైన శరీరాన్ని పరిత్యజించి అల్లాలో ఐక్యం చెందినాడు. తన సోదరుడైన సయ్యద్ మూసా సాహెబు కుమారుని, సయ్యద్ ఫరీదుద్దీన్‌ను వారసుడుగా ప్రకటించినాడు. పహాడీ షరీఫ్‌పై బాబా షర్ఫుద్దీన్ సమాధి ఉన్నచోటనే ఫరీదుద్దీన్ సమాధికూడ ఉన్నది.

బాబాషర్ఫుద్దీన్ జీవితాశయాలను మనసామన్నించిన వితరణ శీలురైన భక్తులు ఆయన సమాధిమీదను, ఆ గుట్టమీదను తమకు తోచిన కొన్ని నిర్మాణాలు కావించినారు. 1288 హిజ్రీలో మునవ్వర్ ఖాన్ కుమారుడైన దౌలత్‌ఖాన్ బాబాషర్ఫుద్దీన్ సమాధిమీద ఒక మంటపం కట్టించినాడు. 1317 ఫసలీలో నవాబ్ ఖుర్షీద్ జా బహద్దర్ అక్కడొక పాలరాతి వేదిక కట్టించినాడు. పహాడీషరీఫ్ పైకి వెళ్ళేటప్పుడు అయిదు ద్వారాలు కనిపిస్తాయి. మొదటి ద్వారం బాలోజి చౌదరి కట్టించినాడు. రాజా రాంకిషన్ రెండవ ద్వారానికి, నవాబ్ ఆస్మాన్‌జా బహద్దరు మూడవద్వారానికి నిర్మాణకర్తలు. ద్వారా లన్నిటిలో చిన్నదైన నాలుగవ ద్వారాన్ని అహ్మద్‌షా షాజీ చౌక్దార్ నిర్మింపజేసినాడు. ఐదవద్వారం లోహనిర్మితము. ముసమ్మీ అలీ తాజీ అనే కర్నూలు వర్తకుడొకడు దీనిని కట్టించినాడు.

సమకాలీన మానవులను తమ సత్ప్రవర్తనచేతను, మానవా తీతమైన మహిమలచేతను లోగొన్న మహమ్మదీయయోగులు మరణించిన చోట సమాధులుండటం సహజం. వాటిచుట్టు చతురప్రాకారపు కుడ్యనిర్మాణం ప్రవేశద్వారయుక్తంగా కన్పడుతుంది. దానిని దర్గా (దరెగాహ్) అంటారు. గాహ్ అనగా స్థలం (సమాధి అయినచోటు) దర్ అనగా ద్వారం. అట్టి దర్గాల దగ్గర ప్రతియేట

జాతర (ఉర్స్)లు జరుగుతుంటాయి. అవి కొన్ని ఏకదినపర్యంతములు కాగా మరికొన్ని త్రిపంచసప్తదినపర్యంతములు. ఏడురోజులు జరిగే జాతరలో ఆయోగి చనిపోయినదినం నడిమిదై ఉంటుంది. ఈ ఆచారాన్ని బట్టి పహాడీ షరీఫ్‌మీద 16 షాబాన్ నుండి 22 షాబాన్ వరకు షర్ఫుద్దీన్ బాబా సమాధి దగ్గర ప్రతి సంవత్సరం జాతర జరుగుతుంది. వేలకొలది భక్తులు వచ్చి ఫాతెహా (నైవేద్య పూర్వకమైన ప్రార్థనలు) సమర్పిస్తుంటారు. బాబా షర్ఫుద్దీన్ సమాధికీ, ఆయన వారసుడు బాబా ఫరీదుద్దీన్ సమాధికీ, ఆయన సహధర్మచారిణి ఫీకి బీబీ సమాధికి పుష్పాంజలులు ఘటించి తమ భక్తిప్రత్యయాలను చాటుకుంటారు.

ఆధారం :

1. 'సవానెహ్ ముబారక్' (హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ రహ్మతుల్లాలియా)
   రచన : మహమ్మదలీఖాన్ ముజద్ద దీనఖ్షబందీ.

2. 'సుల్తానుల్ ఆరఫీన్' (సయ్యదినా బాబా షర్ఫుద్దీన్)
   రచన: సయ్యద్ మహ్మద్ దస్తగీర్ పాషా

3. నింబార్కులు (12వ శతాబ్దము)

భగవద్రామానుజులవలె విష్ణుపారమ్యాన్నీ, శ్రీమహావిష్ణువు పూర్ణా వతారమైన శ్రీకృష్ణపరమాత్మునీ భక్తి సేవలద్వారా పొంద వచ్చునని ప్రబోధించినవారు నింబార్కులు ఆంధ్రులు. ఆయన ఆదిశంకరులకంటె ప్రాచీనులని కొందరంటే మధ్వాచార్యులకంటె తరువాతివారని కొందరన్నారు. శ్రీమహావిష్ణువు సుదర్శనాయుధం అంశతో పుట్టిన తెలుగు బ్రాహ్మణుడనీ దేవనదీ (గోదావరీ) తీరాన పుట్టినారని కొందరంటే, యమునా తీరంలో కార్తీకపూర్ణిమనాడు పుట్టిన త్రైలింగబ్రాహ్మణుడని కొందరన్నారు. ఆయన తండ్రి అరుణుడని తల్లి జయంతి అనీ, తండ్రి జగన్నాథుడని తల్లి సరస్వతి యనీ బృందావనం గోవర్ధనగిరి సమీపాన నింబగ్రామంలో పుట్టిన ఆజన్మ బ్రహ్మచారి, త్రిదండి సంన్యాసియనీ భిన్నవాదములున్నవి. అందరూ ఆయన తెలుగు బ్రాహ్మణుడని మాత్రం అంగీకరించినారు.

ఆయన ఒక మహా పండితుడైన జైనసంన్యాసిని వాదంలో ఓడించినారట. సూర్యాస్తమయం ఐనందున భోజనం చేయనన్న ఆ పండిత సంన్యాసికి తమ యింటి ముందున్న నింబవృక్షంపైన అర్కుని అనగా సూర్యుని చూపించి భోజనం చేసేటట్లు అంగీకరింపజేసినందున ఆయనకు నింబార్క, నింబాదిత్య అనే పేర్లు ఏర్పడ్డాయట. హృషీకేశం స్వామి శివానందులు ఆంధ్రదేశం గోదావరీతీరం వైడూర్యపట్టణంలో త్రైలింగ బ్రాహ్మణులు జయంతీ అరుణముని దంపతుల సంతానమైన ఆయన 11.12వ శతాబ్దాల్లో ఉండిన వాడని ఆయనను నింబార్క, నియమా నందాచార్య, హరిప్రియా చార్యులనే మూడు పేర్లతో పిల్చేవారని అన్నారు. ఉపనయనం తరువాత తల్లిదండ్రు లాయనను వేద వేదాంగములు సమస్తశాస్త్రములు నేర్చుకోవటం కోసం ఋషీకేశం పంపినారనీ, శ్రీమహావిష్ణువు అంశావతారమైన ఆయన. చిన్న వయస్సులోనే సమస్త విద్యలునేర్చి బ్రహ్మచారిగానే ఉండినాడనీ, వైష్ణవమతం వ్యాపింపజేసినాడనీ అన్నారు.

నింబార్కులు సకల సద్గుణ సంపన్నులు; దయ, కారుణ్యం, పావిత్ర్యం, ప్రేమ మూర్తీభవించిన మహాత్ములు, నింబగ్రామంలో తీవ్రతపస్సు చేసి శ్రీమహావిష్ణువును సాక్షాత్కరింపజేసుకున్న మహానుభావులు, నింబ గ్రామంలోనే ఆయన అనేక మహిమలు ప్రదర్శించి వైష్ణవమతం ప్రచారం చేసినారు. ఈ మతంవారికి నింబగ్రామం ప్రధాన కేంద్రం, రెండవ పెద్దకేంద్రం రాజాస్థాన్‌లోని సాలెమాబాదు, అక్కడ ఆయన మందిరం కూడ ఉన్నది. ఈ మతంవారికి నందగ్రామం, బర్సానా, గోవర్ధనం, నింబ గ్రామం ప్రధానకేంద్రాలు ఇంకను వ్రజభూమి, ఒకారా, భరత్‌పూర్, జైపూర్, జోధ్‌పూర్, గవల్యార్, బుర్ద్వాన్, మధ్యభారతం, బిహార్, ఒరిస్సా,

పశ్చిమ బెంగాల్‌లలో ఈ మతానుయాయు లధికసంఖ్యాకులు. వీరికి రాధాకృష్ణ యుగళమూర్తులారాధ్యులు. భాగవతం ప్రధానగ్రంథం. వ్రజభూమి చుట్టు 168 మైళ్లు పరిక్రమం చేయటం నింబగ్రామం దర్శించటం ప్రధాన కర్తవ్యములు. శంకరులు కేవలాద్వైతం, రామానుజులు విశిష్టాద్వైతం, మధ్వాచార్యులు ద్వైతం, వల్లభా చార్యులు శుద్ధాద్వైతం, నింబార్కులు ద్వైతాద్వైతం సిద్ధాంతములను స్థాపించిన మహాత్ములు. వీరందరూ గొప్పవారే. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అని చెప్పటం తప్పు. ఒక్కొక్క రొక్కొక్క మార్గాన్ని ఆయా కాలాలకు అనుగుణంగా స్థాపించి ప్రచారంచేసి ప్రజలను చైతన్య వంతులుగా దిద్దితీర్చిన మహాపురుషులు. బిల్వపక్షగ్రామం చుట్టున్న బిల్వాటవిలో శివుని బిల్వపత్రాలతో అర్చించి ధ్యానించి శివానుగ్రహం పొందిన నల్గురు కుమారుల అనుగ్రహంతో బ్రహ్మవిద్యా పారగులైన మహాత్ములు నింబార్కులు. కనుకనే వారిది కుమార సంప్రదాయ మన్నారు. రామానుజదర్శనంలోవలె నింబార్కదర్శనంలోను చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు మూడు తత్త్వములు. నింబార్కులు, శ్రీవల్లభులు తెలుగువారైనా వీరు స్థాపించిన మతాలకు ఆంధ్రదేశంలో ప్రచారం లేదు. భాగవతమతం పేరుతో ప్రఖ్యాతిచెందిన ఈ మతానికి నింబార్కులు బ్రహ్మసూత్రాలపై వ్రాసిన వేదాంత పారిజాత సౌరభం, ద్వైతాద్వైత సిద్ధాంతాన్ని ప్రవచించే శ్రీకృష్ణ స్తవరాజం అనే 25 శ్లోకాలు, 18 శ్లోకాలున్న మంత్ర రహస్యషోడశీ (గోపాల అష్టాదశాక్షరమంత్ర వ్యాఖ్యానం), సిద్ధాంత ప్రతిపాదకములైన దశ 10 శ్లోకాలు, ముకుంద శరణమంత్రరహస్యం చెప్పే ప్రపన్నకల్పవల్లీ, గీతా వాక్యార్థం, సదాచార ప్రకాశం ముఖ్యమైన గ్రంథాలు. గోపాల మంత్రాన్ని, ముకుంద మంత్రాన్ని నారదమహర్షులే నింబార్కులకు ఉప దేశించినారట.

నింబార్కుల శిష్యుల్లో ముఖ్యులు శ్రీనివాసాచార్యులు, ఔదుంబరా చార్యులు, గౌరముఖాచార్యులు, లక్ష్మణ భట్టాచార్యులు. ఈ మతంలో ప్రసిద్ధాచార్య పురుషులు పురుషోత్తమాచార్యులు, దేవాచార్యులు, సుందర భట్టాచార్యులు, కేశవకాశ్మీరీ. ఈ కేశవ కాశ్మీరీగారి శిష్యుల్లో అత్యంత ప్రసిద్ధుడు, మధురభావోపాసకుడు శ్రీభట్టపండితుడు. ఆయన శ్రీకృష్ణ పరమాత్ముని రాసలీలాసౌందర్యాన్ని అనుభవించిన ధన్యుడు; నింబార్క సంప్రదాయంలో వ్రజభాషలో అనేకరచనలుచేసిన మహాపండితకవి. నింబార్క సంప్రదాయానికి చెందిన శ్రీహరిదాస స్వామి మాధుర్యభావానికి ప్రాధాన్యం ఇచ్చి గోపీభావంద్వారా సాధనా మార్గాన్ని ఏర్పరచిన పుణ్యపురుషుడు. మహాగాయకుడు భక్తుడూ ఐన హరిదాసస్వామి వారి శిష్యుడే సంగీతసమ్రాట్ తాన్‌సేన్ ఈ సంప్రదాయంలో సంసారదశలో నానాత్మకమైన జీవునికీ, ఏకాత్మక మైన బ్రహ్మకు భేదం ఉంది. ముక్తదశలో చైతన్యాత్మకత వలన ఈ రెండింటికీ భేదం లేదు. అందుకే దీనిని భేదాభేద సిద్ధాంతమంటారు. బాదరాయణులకు పూర్వమే ఈ భేదాభేద సిద్ధాంతాన్ని ఔడులోమి, అశ్మరథ్యులు ప్రవర్తింపజేసినారట. అశ్మరథ్యాచార్యులు కారణాత్మనా జీవబ్రహ్మలకు ఏకత్వమున్నదనీ, కార్యాత్మనా అనేకత్వ మున్నదనీ సిద్ధాంతీకరించినారు. కారణాత్మనా బంగారానికీ ఆభరణాలకు ఏకత్వం, కార్యరూపంలో అనేకత్వం. **"కార్యరూపేణ నానాత్వం, అభేదః కారణాత్మనా హేమాత్మనా యథా ఉ భేదః, కుండలాద్యాత్మనా భిదా"** బ్రహ్మ సగుణ స్వరూపుడు, ప్రాకృతదోషరహితుడు, సమస్త కల్యాణ గుణసంపన్నుడు, ఆయనే కమలేక్షణుడు, శ్రీకృష్ణుడు, శ్రీహరి. నింబార్క సంప్రదాయంలో యుగళమూర్త్యుపాసనకు విశిష్టస్థానం ఉన్నది. రాధారాణి సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుని హ్లాదినీశక్తి; పరకీయ కాదు.

స్వభావతో ఉపాస్తసమస్తదోష మశేషకల్యాణగుణైకరాశిమ్।
వ్యూహాంగినం బ్రహ్మపరం వరేణ్యం ధ్యాయేమ కృష్ణం కమలేక్షణం హరిమ్॥
అంగేతు వామే వృషభానుజాం ముదా, విరాజమానా మనురూపసౌభగామ్।
సఖీసహస్రైః పరిసేవితాం సదా, స్మరేమ దేవీం సకలేష్టకామదామ్॥

పురుష సూక్తంలోని **"శ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ"** అనే దానిలోని శ్రీ రాధాదేవిగాను, లక్ష్మీదేవి రుక్మిణిగాను అవతరించినారు. వైష్ణవ సంప్రదాయాలన్నింటిలో శరణాగతికి అధిక ప్రాధాన్యం ఉన్నది. దశశ్లోకీ టీకలో హరివ్యాసాచార్యులు **"తస్మాత్ కృష్ణ ఏవ పరో దేవః, తం ధ్యాయేత్, తం రసేత్, తం భజేత్, తం యజేత్, ఓం తత్సదితి"** అన్నారు. శ్రీకృష్ణ ప్రాప్తికి భక్తియే అత్యుత్తమ సాధనం. మానవులలో 1) శాంత 2) దాస్య 3) సఖ్య 4) వాత్సల్య, ఉజ్జ్వల భావాలుగా భక్తి స్ఫూర్తి కలుగుతుంది. నింబార్కమతానికీ గౌడీయ వైష్ణవ సంప్రదాయానికి చాలా పోలికలున్నవి. నింబార్క సంప్రదాయానికి, హంస సంప్రదాయమని, దేవర్షి సంప్రదాయమని, సనకాది సంప్రదాయమని మరికొన్ని పేర్లు. నింబార్క మతాను యాయులకు రాధాకృష్ణ యుగళమూర్తులు, వల్లభమతాను యాయులకు బాలకృష్ణుడు ఆరాధ్యులు.

సప్తగిరి 1973 జూన్ సంచికలో = Padmanabhan B.A; B.T., Vellore-12 ఇంగ్లీషులో ఒక చిన్నవ్యాసం ప్రకటించినారు; దాని సారాంశం. ఆంధ్రదేశం గోదావరీ తీరాన వైడూర్యపట్టణంలో అరుణముని జయంతీదేవి అనే బ్రాహ్మణ దంపతులకు 11వ శతాబ్దంలో పుట్టిన అవతారపురుషుడు నియమానందుడు. వారే

నింబార్కాచార్యుల పేరుతో ప్రసిద్ధులైనారు. మహోజ్జ్వల మూర్తులై వెలిగిన ఆదిశంకరులు భగవద్రామానుజుల తరువాత పుట్టిన ఈ మహానుభావుడు, తరువాత కాలాన బెంగాల్‌ను రామానందులు, గురునానక్ పంజాబ్‌ను వెలిగించినట్లు తెలుగుదేశాన్ని వెలిగించినారు. వల్లభాచార్యులు, చైతన్య మహాప్రభువులవలె భక్తిగంగలు పారించినారు. సంప్రదాయ వాదులాయనను సూర్యభగవానుని అవతారమంటారు. స్వయంగా నారదమహామునులే, నియమానందులకు గోపాలమంత్ర ముపదేశించి శ్రీకృష్ణ పరమాత్ముని అర్చించే విధానం బోధించినారు. ఆ కాలంలో గోదావరీ డెల్టాలో జైనులధికంగా ఉండినారు. నియమానందు లొకనాడొక ప్రసిద్ధ జైనమునితో వాదిస్తుండగా సూర్యుడస్తమించినాడు. నియమానందు లాజైనమునిని తమ ఆతిథ్యం స్వీకరించ వలసిందిగా ప్రార్థిస్తే ప్రొద్దు కుంకిన తరువాత జైనులం భోజనం చేయమని మీకు తెలియదా అన్నాడు. చిన్నబోయిన నియమానందుడు రెండు నిమిషాలు ధ్యానమగ్నుడైనాడు. సమీపానగల నింబ (వేప) వృక్షంపై సూర్యుడు గోచరించినాడు. సూర్యుడస్తమించలేదని జైనముని భోజనం చేసి పోయినాడు. ఈ అద్భుతం శ్రీకృష్ణపరమాత్ముని అనుగ్రహమని నియమానందులు పరమానందం పొందినారు. ఈ అద్భుత సంఘటనం జరిగినప్పటి నుండి నియమానందులను నింబార్కాచార్యులనేవారు. ఆయనను సూర్యుని అవతారంగా కొలిచేవారు. వారు రచించిన పెక్కు కృతులలో, బ్రహ్మసూత్రభాష్యం, పారిజాత సౌరభం చాలా ముఖ్యమైనవి. వారు ద్వైతాద్వైతముల సమన్వయం చేసినారు. వారి మార్గానుయాయు లందరూ రాధాకృష్ణులను ఉపాసిస్తారు. మధురాబృందావనాల్లోను ఇతరత్ర శ్రీకృష్ణ మందిరాల్లోను ఆయన చెప్పినట్లే చేస్తారు. వారికి

భాగవతమే ముఖ్యమైన గ్రంథం. వారు భాగవతంలోని శ్రీకృష్ణుని లీలలు బోధించేవారు. వల్లభాచార్యులు తుకారాంవలె భగవత్ప్రేమయే మతమని, అర్చనము, స్వచ్ఛహృదయము, సమస్త ప్రాణులయెడ ప్రేమయే ముఖ్యములన్నారు. దేశం అల్లకల్లోలంగా ఉండిన ఆ కాలంలో ఎంత దూరమైనా వారు కాలినడకనే తిరిగినారు భిక్షాన్నమే తిన్నారు... ఓకృష్ణా ప్రాణిసేవకే నన్ను వినియోగించుమనీ, నా మనస్సు నీ ప్రేమతో నింపుమనీ, నానోట మంచి మాటలే రానిమ్మనీ ప్రార్థించేవారు. శ్రీవారు వేదాంతమతానికి పునరుజ్జీవనం కలిగించి నారు. నింబార్కులు రాధికాదేవిని స్తుతించిన శ్లోకాలు : –

శ్లో॥సదా రాధికానామ జిహ్వాగ్రతః స్యాత్, సదా రాధికారూప మధ్యక్షమాస్తామ్।
శ్రుతే రాధికాకీర్తి రంతః స్వభావే, గుణో రాధికాయాః ప్రియాయాస్తు దేహే॥

శ్లో॥నమస్తే శ్రియై రాధికాయై పరాయై, నమస్తే నమస్తే ముకుందప్రియాయై।
సదానందరూపే ప్రసీదత్వమన్తః, ప్రకాశే స్ఫురన్తీ ముకుందేవ సార్ధమ్ ॥

ఆధారములు

1) అవతారతత్త్వ వివేచన, ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు – 1998

2) A.S.ప్రసాద్, గుంటూరు – పంపించిన సమాచారం

3) ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము – ఏడవ సంపుటము – 1962

4. సింహగిరి కృష్ణమాచార్యులు

(13, 14 శతాబ్దములు)

ఆంధ్రవచన గేయవాఙ్మయ ప్రథమాచార్యుడు, చాతుర్లక్షగ్రంథ సంకీర్తన రచయిత, తన పాటలతో సింహాచలస్వామిని ప్రత్యక్షం చేయించుకొని నాట్యమాడించిన పరమ భాగవతుడు కృష్ణమాచార్యులు. ఆయన జన్మప్రదేశం జననకాలం ఇదమిత్థంగా తెలియవు. ఆయన రచించిన గ్రంథాలు, రాగిరేకులపై చెక్కించిన చాతుర్లక్షగ్రంథం సంకీర్తన లేమైపోయినవో తెలియదు. ఆయా పండితపరిశోధకులు సింహగిరి వచనముల పేరుతో ప్రకటించినవి 250కి మించవు. శ్రీ నిడుదవోలు వెంకటరావుగారు (భారతి–పార్థివ భాద్రపదం) శ్రీ తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు (భారతి–నందనవైశాఖం) కృష్ణమాచార్యులు కాకతి ప్రతాపరుద్రుని (1295–1323) కాలంవాడన్నారు. నిడుదవోలు వెంకటరావుగారు కృష్ణమాచార్యులు

జన్మించిన సంతూర గ్రామం తమిళ దేశంలోనిది కావచ్చునన్నారు. ఈ విషయమై విశేషపరిశోధన చేసిన ఆచార్య ఎమ్. కులశేఖర రావుగారు, టి.పి. రామచంద్రాచార్యులుగారు, ప్రతాపరుద్రుని సమకాలీనత్వం అంగీకరించినా జన్మతిథి గురించి అభిజనం గురించి భిన్నాభిప్రాయములు ప్రకటించినారు. కులశేఖరరావుగారు కృష్ణమాచార్యులు మహబూబ్‌నగరం జిల్లా ఒకప్పటి సంతూరు ఈనాటి సంతవూరు గ్రామంలో పుట్టియుంటారనీ, ఆయన పొందించిన కల్లూరు గ్రామం కూడ మహబూబ్‌నగరం జిల్లాలో ఉందనీ అన్నారు. రామచంద్రాచార్యులుగారు సింహాచలం సమీపానగల సంతలూరే అలనాటి సంతూరన్నారు. ప్రతాపరుద్రుడు కృష్ణమాచార్యులను సత్కరించి కనకగిరిసీమలో ఏబది గ్రామాలు ఇచ్చినట్లు సిద్ధేశ్వర చరిత్రం పేర్కొంటే ఆ కనకగిరిసీమ నేటి కనిగిరి కావచ్చునని మరియొక రూహించినారు. అంతరంగ సాక్ష్యాలనుబట్టి కృష్ణమాచార్యుల తల్లిదండ్రులు లక్ష్మమ్మ నారాయణయ్యలు, ఆయన సింహగిరిస్వామి సంకీర్తనరచనకు ఉపక్రమించి నాడు. నూనూగుమీసాలతో షోడశ కళాపూర్ణుడైన చంద్రునివలె ఆళ్వారుల్లో విప్రనారాయణుని, ఆచార్యుల్లో భగవద్రామానుజులను తలపించే సౌందర్యంతో ఆయన పాడుతుంటే అర్చకస్వాములు, అక్కడి పెద్దలు యాత్రకై వచ్చే భక్తగణం, పర్వతం క్రింద పల్లెవాసులు మైమరచి వినేవారు. ఒకనాడు రాత్రి కలలో నరసింహస్వామి వరాహరూపంలో వచ్చి తనపై చాతుర్లక్ష వచన సంకీర్తన వాక్పూజ చేయుమని కోరినాడు. స్వామి కోరికమేరకు కృష్ణమాచార్యులు తన పదునారవ యేట పరాభవసంవత్సర ఆషాఢ శుద్ధ ద్వాదశినాడు 24-6-1306 వచన సంకీర్తనలు రచించటం ప్రారంభించినాడు. కొన్నాళ్ళకు కృష్ణమాచార్యుల మేనమామ

రంగాచార్యులు సింహగిరికి వచ్చి అతణ్ణి గుర్తించి తన బిడ్డనిచ్చి పెండ్లి చేసినాడు. ఆ పెండ్లికి వరాహ నరసింహస్వామి కూడ వచ్చినాడట. కృష్ణమాచార్యుల దాంపత్యం సింహాచలంలోనే కొంతకాలం సుఖంగా గడచింది. ఆ దంపతులకు ఒక పిల్లవాడు కూడ పుట్టినాడు కాని దురదృష్టవశమున చనిపోయినాడు. వరాహ నరసింహస్వామి ఆలయంలో చాలామంది దేవదాసీలుండేవారు. ప్రాచీనకాలంలో పెద్ద పెద్ద దేవళాల్లో దేవదాసీలు భగవంతునికి నాట్య కైంకర్యం చేయటం ఆచారం. అటువంటి దేవదాసీలలో నాట్యవైదుష్యం గల ఒక అనురూపవతిని కృష్ణమాచార్యులు మక్కువపడినాడు. ఆ దేవదాసి కూడ మహాభక్తుడు అందగాడు ఐన కృష్ణమాచార్యులను వలచినది.

కృష్ణమాచార్యులు దేవదాసి యింటికి రాకపోకలు సాగించినా అతని భక్తికి, రచనా వ్యాసంగానికి భగవత్కృపకు ఎట్టి లోటు కలుగలేదు. ఆయన ఖ్యాతి దేశమంతట ప్రాకినది. ఒకసారి ఆయనను దర్శించవలెనని అహెూబిల నవనారసింహుల నాట్య వినోదులు, పొతకమూరి భాగవతులు నారాయణయ్య, ఔబళయ్య, అచ్యుతయ్య, లక్ష్మయ్య, చెన్నమయ్య సోదరులు సింహాచలం వచ్చినారు. వారు పటం పన్ని అహెూబిలస్వామి సంకీర్తన అభినయ పూర్వకంగా ప్రదర్శించేవారు. సింహాచలంలో వారు కృష్ణమాచార్యుల యిల్లు వెదకివెదకి చివరకా దేవదాసి యింటికి వచ్చి కృష్ణమాచార్యులను గుర్తుపట్టలేక ఆయననే ఆచార్యులవారి జాడలడిగినారు. కృష్ణమాచార్యులు చాలా గొప్ప భక్తులు భగవంతుని 11వ అవతారమని విని చాలాదూరం నుండి వచ్చినామన్నారు. కృష్ణమాచార్యులు వారు కూడ పొతకమూరి భాగవతుల గూర్చి, వారి సంగీతాభి

నయాలకు అహోబిల నారసింహుడు ఆనందించే వాడని వినటం చేత అప్పటి తన దుస్థితికి లోలోన వగచినాడు. కృష్ణమాచార్యుల యిల్లు చూపిస్తాను రండని వారిని తోడ్కొనిపోతూ ఒకచోట వారిని నిలిపి తాను ముందుగా పోయి తలవెంట్రుకలు, మీసములు కొరిగించుకొని విరాగి వేషంతో ఆ భాగవతులను కలుసుకున్నాడు. ఒకరినొకరు సగౌరవంగా సంభావించుకున్నారు. కృష్ణమాచార్యులు భాగవతుల నాట్యవినోదం చూచి పరమానందభరితులైనారు. కృష్ణమాచార్యుల సంకీర్తనం విని భాగవతులు ధన్యులమైనామన్నారు. ఒక పసిబాలుని రూపంలో నరసింహస్వామి వచ్చి పొతకమూరి భాగవతుల నాట్యవినోదం చూచినారు. బాలుని రూపంలో వచ్చి భగవంతుడు భాగవతుల నాట్యం కృష్ణమాచార్యుల సంగీతం వినటం గుర్తించిన ఆ ఉభయులు, మీ మూలంగానే భగవంతుడు వచ్చినాడంటే కాదు మీమూలం గానే వచ్చినాడని ఒకరినొకరు గౌరవించుకున్నారు. తాను దేవదాసి యింట్లో ఉండటం పొతకమూరి భాగవతులు ఎరిగినట్లు గుర్తించిన కృష్ణమాచార్యులు సిగ్గుపడి వైరాగ్యం పూనినారు. కృష్ణమాచార్యులు తాము అప్పటికి చాతుర్లక్ష వచన సంకీర్తనల్లో ఇంకను లక్షయేబదివేలు వ్రాయవలసి యున్నట్లు పొతకమూరి భాగవతులకు చెప్పినారు.

కృష్ణమాచార్యులు సంకీర్తనలు పాడుతుంటే సింహగిరిస్వామి ఘంటంతో వ్రాసేవాడని ప్రతీతి. భక్తులపాటలు భగవంతుడు వ్రాయటం మనం చాలామంది భక్తకవుల చరిత్రల్లో చూస్తాము. శ్రీమన్నారాయణుడు తన పర్మనెంటు అడ్రసు **"మద్భక్తాః యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద"** అని చెప్పినట్లు భారతీయభక్త పరంపరచరిత్రల్లో చూస్తాము. తరువాత కాలంలో ఆ సంకీర్తనలన్నీ

రాగిరేకులపై చెక్కించి సింహాచలం భాండా గారంలో భద్రపరచినారట. తాళ్ళపాకవారి అర తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఉండినట్లు సింహాచలం లో కూడ కృష్ణమాచార్యుల సంకీర్తన భాండాగారం ఉండేది కాబోలు. కృష్ణమాచార్యులు తమ సంకీర్తనలు పాడుతూ సింహాచలం, ఓరుగల్లు, శ్రీరంగంలో జీవితం గడపినట్లు ఐతిహ్యములున్నవి. సంతూరులో కృష్ణమాచార్యుల తమ్ముడు అనంతాచార్యులు ఒక రజకస్త్రీతో పొందు చేస్తుంటే ఒకనాడు ఆమె భర్త చూచి ఆ యిరువురినీ పొడిచి చంపినాడు. శవదహనానికి సంతూరు బ్రాహ్మణ్యం సహకరించకపోతే ఆ వార్తతెలిసి కృష్ణమాచార్యులు స్వయంగా పోయి వాసుదేవసంకీర్తనం చేసినారట. తమ్ముని శవం తానై కదలిపోయి చితిలో కాలినదట. సంతూరు బ్రాహ్మణ్యం తదితరులు అది చూచి కృష్ణమాచార్యుల పాదాలపైబడి క్షమార్పణ కోరినారు. కృష్ణమాచార్యులు తాము రాగద్వేషాల కతీతులైనట్లు చెప్పినారు. ఈ వార్త ప్రతాపరుద్రునికి తెలిసి కృష్ణమాచార్యులను ఓరుగల్లుకు రప్పించుకొని పూజించి కనకగిరి సీమలో నాల్గవభాగం 50 గ్రామాలపై అధికారం, ఒక గ్రామం అగ్రహారంగా ఇచ్చి సత్కరించినాడు. కృష్ణమాచార్యులు సంతూరుకు తిరిగివచ్చి అక్కడ తనకున్న సర్వస్వం పంచిపెట్టి ప్రతాపరుద్రుడిచ్చిన గ్రామాలు ఏలుతూ కల్లూరనే గ్రామం పొందించినారు. ఇంతకాలంగా తాము రచిస్తుండిన నరహరి సంకీర్తనలు చాతుర్లక్షగ్రంథం రాగిరేకులపై చెక్కించి శ్రీవైష్ణవులకు అతిముఖ్యమైన శ్రీరంగక్షేత్రమునకు పయన మైనారు. రాజద్రవ్యం దుర్వినియోగం చేసి రాగిరేకులు చెక్కించి బండ్లపై వేసుకొనిపోతున్నాడని ఎవరో కిట్టనివారు ప్రతాపరుద్రునికి చెప్పినారు. ప్రతాపరుద్రుడు ఆ వార్తలు

తెచ్చినవారితో కృష్ణమాచార్యులు మహాత్ముడు, ఆయనకేది యిష్టమో నాకూ అదే యిష్టమన్నాడు. శైవుడైన ప్రతాపరుద్రుడు వైష్ణవుడైన కృష్ణమాచార్యులను సత్కరించటం ఆయన ఇష్టాన్ని గౌరవించటం ప్రాచీనాంధ్ర రాజుల మతసామరస్య మునకు తగినట్లుగానే ఉంది. ప్రతాపరుద్రుడన్న మాటలు కృష్ణమాచార్యులు తెలిసికొని వాసుదేవుని ఆరాధించి ఒక కీర్తన చెప్పితే ఓరుగల్లులో కనకవర్షం కురిసిందట. కృష్ణమాచార్యులు శ్రీరంగం వెళ్ళినారట. అచ్చటినుండి మరల ఆంధ్రదేశానికి తిరిగి వచ్చినారో లేదో తెలియదు.

ఆంతరిక సాక్ష్యాలనుబట్టి కృష్ణమాచార్యులు అహోబిలం, శ్రీరంగం, వెంకటాచలం కాశీ ద్వారక అయోధ్య, శ్రీ పురుషోత్తము వంటి పుణ్యక్షేత్రాలు దర్శించినారు. తాళ్ళపాక వారికంటె చాలా ముందే కృష్ణమాచార్యులు తమ సంకీర్తనలు రాగి రేకులపై చెక్కించినారు. ఆంధ్రదేశంలో అత్యంత ప్రాచీన కాలంనుండి గుట్టలపైన, రాతిస్తంభాల మీద, రాగిరేకులపైన చారిత్రక శాసనాలు చెక్కించినట్లే కవులకావ్యాలు కూడ చెక్కించే ఆచారం ఉండినది. విష్ణు సంకీర్తనకారుల్లో సింహగిరి కృష్ణమాచార్యులు, తాళ్లపాక కవులు ఈ సంప్రదాయాన్ని పాటించినారు. కృష్ణమాచార్యుల రచనలుగా పరిశోధకులు గుర్తించినవి. 1) కృష్ణమాచార్య సంకీర్తనము 2) తులసీ మాహాత్మ్యము 3) రామనామాలు 4) రామావతారకథ 5) అనంతాచార్యులపై స్మృతికావ్యం 6) నృసింహనామాలు 7) రామనామ సంకీర్తనము ఆయన రచించిన కృతులన్నీ మనకు దక్కకపోవటం విచారకరం.

భక్తయోగి కృష్ణమాచార్యులు రచించిన అనుబంధ కవిత్వానికి చెందిన తాళగంధి వచనములు లేదా విన్నపములు కొన్ని మాత్రమే

ప్రకటితమైనవి. అవియన్నీ సింహగిరి స్వామినుద్దేశించి సంబోధించిన వచనములే. ఈ వచనముల్లో యతిరాజులైన భగవద్రామానుజులను, నూతినుండి తన నుద్ధరించి సాకి సింహాచలస్వామికర్పించిన కృష్ణకుమారు (కువ్వారు)లను, కృష్ణమాచార్యులు స్మరించినారు. తాళ్ళపాక అన్నమాచార్యులు తమ శృంగార మంజరి శ్రీ వెంకటేశ్వర స్వామికి సమర్పిస్తే స్వామి **“ఆడుచు పతకమా కన్నలజోల, పాడగా నాడెల్ల పసిబిడ్డనైతి, నా కృష్ణమాచార్య నధ్యాత్మవినుతి, రాక గొన్నాళ్ళు విరక్తుండనైతి, జగతి నీ శృంగారసంకీర్తనముల, కగపడి మంచి ప్రాయపు వాడనైతి”** నన్నాడని అన్నమాచార్య చరిత్ర సాక్ష్యం. తాళ్ళపాక తిరువెంగళనాథుడు సంకీర్తన లక్షణ గ్రంథంలో **“ధర కృష్ణాచార్యాదిక, పరికల్పితపదము తాళబంధచ్ఛందో, విరహితమై చూర్ణాఖ్యం, బరగు ననిర్యుక్త నామభాసితమగుచున్”** అని లక్షణం చెప్పినాడు. తాళ్ళపాక చిన్నన్నగారు తమ పరమయోగి విలాసంలో **“శఠమత రాద్ధాంత సంహారియైన, శఠకోపముని బోలు శఠకొప మౌని, వేదంబు తెనుగు గావించి సంసార ఖేదంబు మాన్చిన కృష్ణమాచార్య”**లను స్తుతించినాడు. కృష్ణమాచార్యులు భగవ ద్రామానుజులు సిద్ధాంతీ కరించిన విశిష్టాద్వైత మతానుయాయి. భగత్ప్రేమ, శరణాగతి, ప్రపత్తి వైష్ణవులకు పరమో పాదేయములు. ఎన్ని చదువులు చదివినా, ఎన్ని యజ్ఞములు చేసినా, ఎన్ని పుణ్య క్షేత్రములు దర్శించినా విష్ణు భక్తిలేనివాడు బ్రాహ్మణుడైనా భక్తి గల శ్వపచుని కంటె తక్కువవాడనీ, కుల, స్త్రీపుంవివక్ష విష్ణు భక్తులకు కూడదనీ, సర్వ సమానత్వమును చాటినవారీ భక్తయోగులు. ఆళ్వారులు, యామునులు, భగవద్రామానుజులు, అందుకు ప్రమాణము. విమర్శకులు కృష్ణమాచార్యుల వచనములను 1) శ్రీ

వైష్ణవమత సిద్ధాంత ప్రతిపాదకములని 2) పురాణ సంబంధులని 3) వేదాంతపరములని 4) నీతిబోధకములని 5) స్వీయ చరిత్ర సంబంధులని విభజించినారు. ఇట్టివానిలో మచ్చునకు కొన్ని.

1) "దేవా! ఏడు రామాయణంబులు, పదునెనిమిది పురాణంబులు, ద్వాదశస్కందంబులు, భగవద్గీతలు, సహస్రనామంబులు, మొదలైనవి చదివిరేమి, వినిరేమి, వ్రాసిరేమి, సంకీర్తనకు వెయ్యవ పాలింటికి సరిరావు. కడమ సంకీర్తన అనేకసార్లు విన్నారు. ఇందుకు తప్పదు, మీ శంఖచక్రంబు లాన, మీ పాదపద్మంబులాన, నారాయణ నారాయణ మంత్రం బనిరేమి దూదికొండలమీద వటబీజమాత్రమగ్ని హెూత్రుడు ప్రవేశించిన దగ్ధంబై పోదా! శ్రీవైష్ణవులే బ్రాహ్మణులు, శ్రీవైష్ణవులే ఇహపరసాధకులు, యెట్లనన్నను– **"శ్వపచోపి మహీపాల విష్ణుభక్తో ద్విజాధికః। విష్ణుభక్తి విహీనస్తుయతిశ్చ శ్వపచాధమః॥"** అనెడు వాక్యంబు లీశ్వరుండానతిచ్చిన వాడుగాన మీ దాసులకు కుల గోత్రంబులెన్న నేమిటికి? మా యతి రామానుజముని వరముదాతారు. అనాథపతి యైన స్వామీ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ॥

2) దేవా! పెద్దతనంబు సేసి మిమ్ము మెప్పించెదనంటినా జాంబవంతుడు మీ సన్నిధినే యున్నాడే. దేవా! బుద్ధిని మెప్పించెద నంటినా విభీషణుండు మీ సన్నిధినే యున్నాడే. దేవా! బంటుదనంబు సేసి మిమ్ము మెప్పించెద నంటినా, అంజనాసుతుండు హనుమంతుడు మీ సన్నిధినే యున్నాడే. దేవా! తీర్థంబులాడి మిమ్ము మెప్పించెద నంటినా గంగాభవాని మీ యంగుష్ఠంబు నందే యుద్భవించి యున్నదే. దేవా! ప్రదక్షిణములు చేసి మిమ్ము మెప్పించెద నంటినా

సూర్యచంద్రాదులు మీ సన్నిధినే యున్నారే. దేవా వేదవేద్యుండవైన మిమ్ము మెప్పించెదనంటినా బ్రహ్మ మీనాభికమలమందుద్భవించి యున్నాడే దేవా! గీత ప్రబంధములచేత మిమ్ము మెప్పించెదనంటినా కిన్నరకింపురుష గరుడగంధర్వ సనకసనందన సనత్కుమార పరమ భాగవతులు నారదాదులు మీ సన్నిధినే యున్నారే... (ఇట్లే మహాలక్ష్మి, భూదేవి, విదుర, భరద్వాజ, శబరి, రుక్మాంగద ప్రహ్లాద, గరుడ, ద్వారపాల, శేషాహి మొదలైనవారు)... యతి రామానుజా, అనాథపతి స్వామీ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ"

3) దేవా! పరమరహస్యకారియగు పురుషాకార ప్రసన్నుని తప్పు లెన్నుదురు. లౌకికులెరుంగరు. అజ్ఞానులై రౌరవాది నరకమునుండి సంచరించుటయే దీనికి కారణము. నరహరీ పావనుడైన యగ్ని దేవతను ముట్టినం గాలదె ? ఆ యపచారము క్షమవెట్టినంగాని పాయదు. అఖిలాండకోటి సర్వము సర్వేశ్వరు మాయాకల్పితమేమి చేయుదుమని నిరపరాధిని జంతువు లఖిలాండకోటి సర్వము సర్వేశ్వరు మాయకల్పితమేమి చేయుదుమని నిరపరాధిని జంతువు లఖిలాండపూరితములైనవి. జరామరణ వ్యాధులచేత నక్కటా యనుచున్నవి. ఈర్ష్య తగదు. నైర్మల్యాస్పదములైన ఆత్మలందు గుణావగుణములు చింతించుట యవినీతి. సర్వభూతదయా వ్యవగత రాగద్వేషమత్సర శమదమాది గుణంబు లెన్నండు గలుగునో! స్వామీ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ!"

4) దేవా! తానుగాని దేహమందు తానని దుఃఖపడుట యవిద్యాక్లేశము, దేహాదులందభిమానము వలన దుఃఖపడుట యస్మితాక్లేశము, విషయములు కోరి దుఃఖపడుట రాగక్లేశము,

విషయములు దొరుకక దుఃఖపడుట – ద్వేషక్లేశము, విషయము లందు చిక్కి దుఃఖపడుట అభినివేశక్లేశము. ఈ పంచక్లేశముల జిక్కినొచ్చినాడను. ఈ దుఃఖముల ద్రుంపవే పరబ్రహ్మ సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ!"

5) దేవా! అంతట నంధుండైన బాలుండు కులాధారుండాయెనని తన జననీ జనకులు, తన బాంధవులును, గోత్రాదివరులును, సహోదరులును, పితృపితామహ ప్రపితామహులును జనుదెంచి యాశ్చర్యపడి కువ్వారుం జూచి యప్పుడిట్లనిరి. ఓ మహాత్మా! యీ బాలుని భవిష్యద్వర్తమానంబు లెరింగి రక్షించి దివ్యదృష్టి నొసంగి పరమభాగవతోత్తమునిగా జేసితిరని యానందబాష్పములు గురియుచు తమ కుమారుండగు కృష్ణమాచార్యుని కౌగిట జేర్చుకొని పునఃపునరాలింగనము జేసి, యచ్చటనున్న మహాత్ముల గనుంగొని ఓ మహాత్ములారా! ఈ బాలునికి జాతకర్మాన్నప్రాశన చౌలోపనయ నాదులైన బ్రాహ్మణ కర్మములు చేయవలెనని కువ్వారు సన్నిధికి సకలముంజేసి ఆత్మావైపుత్రనామాసియన్న శ్రుతి చాటంగాను నావిధంబున దలంచి లౌకిక కర్మములాచరించిరి. దేవా! ఈ వ్యామోహ మేల కల్పించితివి? దేవా! యీ చాతుర్లక్ష గ్రంథము నే విఘ్నము చేయక నీడేర్చుము. దేవా! యాచారంబెరుంగ, అనాచారంబుగా దిరుగాడుచుందును. జ్ఞానములేని పంచేంద్రియ వ్యవహారిని. దేవా! మీ నామావళి నుచ్చరించు భాగవతులు ధన్యాత్ములు...సింహగిరి నరహరీ నమోనమో దయానిధీ!"

ఇంకను విమర్శకులు విష్ణుభక్తులు వర్ణించు వచనాలని, రామాయణ కథలు వర్ణించు వచనాలని తీరుతీరుగా విభజించినారు.

కృష్ణమాచార్యుల వచనములపై భగవద్రామానుజుల గద్యత్రయ ప్రభావం, బసవేశ్వరుని వచనాల ప్రభావం ఉన్నట్లు, కృష్ణమాచార్యుల వచనాల ప్రభావం తాళ్ళపాక అన్నమాచార్యుల సంకీర్తనలపైన, పెదతిరుమాలాచార్యుల వెంకటేశ్వర వచనములపైన, గంగాధరయ్య వచనాలపైన, భవానీమనోహర వచనాలపైన ఉన్నట్లు విమర్శకులు గుర్తించినారు.

ఆళ్వారుల మూలంగా తమిళంలో ఒక్కసారి వేదం వెలసితే, కృష్ణమాచార్యుల మూలంగా ఒకసారి, అన్నమాచార్యుల మూలంగా రెండవసారి వేదం తెలుగులో వెలయటం ఆంధ్రుల అదృష్టం. అంతటి భక్తయోగి రచనలన్నీ దక్కకపోవటం దురదృష్టం.

ఆధారం :-

1) సింహగిరి వచనములు - కృష్ణమాచార్య ప్రణీతము, సంపాదకుడు, పరిష్కర్త ఆచార్య ఎమ్. కులశేఖరరావు, ఆంధ్ర రచయితల సంఘము, హైదరాబాదు 1968

2) సింహగిరి వచనములు - కృష్ణమాచార్య ప్రణీతము, టి.పి. రామచంద్రాచార్య. సింహాచల దేవస్థానం ప్రచురణ.

3) కృష్ణమాచార్యుని కృతుల పరిశీలన, సి. హెచ్. వెంకటేశ్వరరావు, కడప 1986.

5. తాళ్ళపాక అన్నమయ్య

(1424-1503)

తెలుగు పదకవితా పితామహులని పేరుగాంచిన తాళ్ళపాక అన్నమాచార్యులు సంగీత సాహిత్యముల మార్గదేశి సంప్రదాయాలకు ఏతమెత్తి తెలుగు మాగాణంలో భక్తి సస్యాలు పూటిగా పండించిన పరమ భాగవతోత్తములు; భక్తియోగంతో వెంకటేశ్వరుని మెప్పించిన ధన్యులు. ఆయన వెంకటేశ్వర స్వామి సన్నిధిలో గేయ కవితకు పట్టాభిషేకం చేసినారు. పల్లెపట్టుల్లో భక్త బృందాలలో సెలయేరువలె పరుగెత్తే గేయస్రవంతి అన్నమాచార్యుల నోటి చలువతో వెంకటేశ్వర స్వామి పాదములకడ సంగీతము నింపుకొని పూర్ణ సరస్వతియైనది. ఆళ్వారులమూలంగా తమిళంలో వేదం వెలసింది. కాని సింహగిరి నరహరి భక్తుడైన కృష్ణమాచార్యుల మూలంగాను, తిరుపతి వెంకన్న భక్తుడైన అన్నమయ్య మూలంగాను

వేదం తెలుగులో రెండుసార్లు వెలసింది. ఆయన తెలుగుజాతికి ప్రాతఃస్మరణీయుడు. ఆయన మూలంగా పదకవితా సరస్వతి విహరింపని తెలుగు పొలమే లేదు. తాళ్ళపాక వంశమంతా పదకవితలకు పంట పొలమైనది. "నేనొక్కండ లేకుండితే, నీ కృపకు పాత్రమేది? పూని నావల్లనే కీర్తిబొందే దేవుడ"వని స్వామిని అనగలిగిన మహాయోగి, "ఒక్క సంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించగ, తక్కినవి భాండాగారాన దాచి ఉండనీ" అన్న ప్రసన్నుడు అన్నమయ్య.

కడపజిల్లా రాజంపేట తాలూకాలో తాళ్ళపాక గ్రామం ఉన్నది. అక్కడ ఋగ్వేదులు ఆశ్వలాయన సూత్రులైన నందవరీక బ్రాహ్మణు లుండేవారు. అన్నమయ్యకు ముందు నాల్గు తరములవాడు నారాయణయ్య. ఆయన కొడుకు విఠలయ్య, ఆయన కొడుకు నారాయణుడు, ఆయన కొడుకు నారాయణసూరి, విఠలయ్య కొడుకైన నారాయణయ్యకు చదువు సంధ్యలబ్బలేదు. సమీపానగల ఊటుకూరు బంధువులవద్ద చదువుల కోసం ఉంచినారు. అక్కడ కూడ నారాయణయ్యకు చదువులబ్బలేదు. నారాయణయ్య తన బ్రతుకు పై రోసి ఊటుకూరు గ్రామశక్తి చింతలమ్మ గుడిముందున్న పాముపుట్టలో చేయిపెట్టి ఆత్మహత్యాప్రయత్నం చేసినాడు. చింతలమ్మ ప్రత్యక్షమై తాళ్ళపాకలో వెలసిన చెన్నకేశవస్వామి అనుగ్రహంతో నీవు సకలవిద్యలు నేరుస్తావని దీవించి పంపినది. నారాయణయ్య తాళ్ళపాకకు తిరిగివచ్చి చెన్నకేశవస్వామిని సేవించి సకలవిద్యలు నేర్చినాడు. ఈ నారాయణయ్య కొడుకే, అన్నమయ్య తండ్రి గారైన నారాయణసూరి. నారాయణసూరి భార్య లక్కమాంబ. ఈమె పుట్టినిల్లు మాడుపూరు. అక్కడి చెన్నకేశవ స్వామి లక్కమాంబ

పిలిస్తే పలికేవాడు. నారాయణసూరి వేదవేదాంగములు, సమస్త పురాణము లెరిగిన పండితుడు. దీర్ఘకాలందాక లక్కమాంబ సంతానవతి కాకపోవటంతో భార్యాభర్తలు తిరుమల తిరుపతికి పోయి దేవతలను తీర్థములను సేవించి వెంకటేశ్వర స్వామి ఆలయం గరుడ కంబంవద్ద సాగిలపడ్డారు. వారికి స్వామి తమ ఖడ్గం నందకాన్ని ప్రసాదించినట్లు దృశ్యమైనది. స్వప్నంనుండి మేల్కొన్నట్లు లేచి స్వామిని సేవించి హుటాహుటిగా తిరుగుపయనమైనారు. నందకాంశతో కొడుకు పుడుతాడని స్వామి వరం కనుక లక్కమాంబ అనతి కాలంలోనే గర్భవతి యైనది. ఒక శుభముహూర్తాన దివ్యబాలుని గన్నది. అన్నమయ్య జననం 9-5-1408, నిధనం 1503 అని అన్నమాచార్య సాహిత్య పరిశోధకులు సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, చాగంటి శేషయ్య, గౌరిపెద్ది రామసుబ్బశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, వేటూరి ఆనందమూర్తి నిర్ణయించినారు. కాని అన్నమాచార్య చరిత్రం ప్రకటించే నాటికి వేటూరి పండితులిరువురు అన్నమయ్య కాలం 1424-1503గా నిర్ణయించినారు. నందకాంశ సంభూతుడైన అన్నమయ్య, తన తల్లిదండ్రులు, పరివారం సంబరపడేటట్టు వెంకటేశ్వరస్వామిపై పాటలు పాడుతూ తిరిగేవాడు.

ఆ యెనిమిదేండ్ల బాలుని ఒకసారి ఆవులకు గడ్డి కోసుకరమ్మంటే గడ్డికోస్తుండగా చిటికెన వ్రేలుకు గాయమైనది. ఆ బాధతో భక్తితోపాటు విరక్తి పుట్టినది. కొడవలి అల్లంతదూరాన విసరివైచిన సమయంలోనే అక్కడినుండి తిరుమల తిరుపతికి యాత్రకై పోతున్న ఒక బృందం కనబడింది. అన్నమయ్య ఆ భక్తబృందంలో చేరి తాను కూడ పాటలు పాడుతూ నడక సాగించినాడు. అందరితోపాటు గంగమ్మను సేవించి 108 దివ్య తిరుపతులను కీర్తిస్తూ అలిపిరి నరసింహస్వామిని,

తలయేరుగుండు, శ్రీపాదములు సేవించి **"బ్రహ్మ కడిగిన పాదము"** పాటపాడి, కురువనంబిని కీర్తించి, కప్పురపు కాలువ దాటి మోకాళ్ళ పర్వతం చేరినాడు. నిరాహారంగా నడచి నడచి మెట్లెక్కి యెక్కి అలసిసొలసినాడు. ఒక పెద్దముత్తైదువ వచ్చి, చెప్పుల కాళ్ళతో మెట్లెక్కరాదని బోధించి ప్రసాదం తినిపించి మాయమైనది. ఆమెను అలమేల్మంగాంబగా గుర్తించిన అన్నమయ్య ఆశువుగా ఒక శతకం చెప్పి తిరుమల చేరి పుష్కరిణీ స్నానం చేసి వరాహస్వామిని సేవించి, పెద గోపురానికి, చింతచెట్టుకు ప్రణమిల్లి, గరుడకంబానికి సాగిలపడి శ్రీనివాసుని, భాష్యకారులను, నరసింహస్వామిని సేవించి కల్యాణ మండపం, వివిధ వాహనాలు చూచి బంగారువాకిలి చేరి శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహాన్ని దర్శించినాడు. **"దేవదేవుడితడే దివ్యమూరితి" "కంటిఁగంటి నిలువుచక్కని మేనుదండలును" "ఈ పాదమేకదా ఇలయెల్ల గొలచిన"** పాటలతో వెంకటేశ్వరుని స్తుతించి పంచా యుధాలను కీర్తించినాడు. ఆబాలుని భక్తితత్పరతకు అర్చకులు మెచ్చి తీర్థప్రసాదాలు శఠకోపం ప్రసాదించినారు. మరునాడు తిరుమలపైన గల సమస్తదివ్యతీర్థాలు సేవించి వాటి మాహాత్మ్యం కొనియాడి ఆలయానికి తిరిగివస్తే గుడితలుపులు మూసియున్నవి. ఆయన భక్తితో వెంకటేశ్వర శతకం చెప్పితే గుడితలుపులు తామై తెరుచు కున్నవి. శ్రీనివాసుని దివ్యమంగళ భువన మోహనవిగ్రహం చూసి **"పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా, మమ్ము నెడయకవయ్య కోనేటిరాయుడా"** కీర్తన పాడినాడు. అర్చకులాశ్చర్యచకితులై తీర్థ ప్రసాదములు శఠకోపమిచ్చినారు. ఆనాడు అన్నమయ్య వరాహస్వామి ఆలయంలో విశ్రమించినాడు.

మరునాడు ద్వాదశి, శ్రీనివాసుడు అన్నమయ్యను అనుగ్రహించిన శుభ దినం. ప్రాత స్స్నానసంధ్యాదులు ముగించినాడు. తిరుమలలో

నివాసముంటున్న ఘనవిష్ణువనే వైష్ణవయతి మహాభాగవతుడు భగవదాదేశంతో యజ్ఞశాలకు వచ్చి అన్నమయ్యకు పంచ సంస్కారములు చేసి అన్నమాచార్య నామం ప్రసాదించినాడు. భగవద్రామానుజులు విశిష్టాద్వైతమత ప్రవర్తకులై తిరుమలను వైష్ణవమతక్షేత్రంగా నిరూపించి వైఖానసాగమం ప్రకారం ఆలయ పూజలు కట్టడిచేసియుండిరి. భగవద్రామానుజుల విశిష్టాద్వైత తత్త్వాన్ని ఘనవిష్ణువు అన్నమయ్యకు బోధించినాడు. అన్నమాచార్యుల మూలంగా తాళ్ళపాకవారు శ్రీవైష్ణవం స్వీకరించినారు. ఈ విధంగా ఎనిమిదవయేట తిరుమల చేరిన అన్నమాచార్యులు దినమొక కీర్తన చొప్పున భగవంతుని కీర్తిస్తూ అక్కడ శ్రీనివాసుని సేవలో ఎంతకాల మున్నాడో! తాళ్ళపాకలో ఆయన తల్లిదండ్రులు ఆయనకోసం వెదకి వెదకి వేసారి కన్నులు కాయలుగాయ ప్రతీక్షిస్తూ భగవదాదేశం ప్రకారం తిరుమలచేరి వైష్ణవ దీక్ష పొంది శ్రీనివాసుని కీర్తిస్తున్న కొడుకును చూచి పరవశించినారు. వారు తమ వెంట తాళ్ళపాకకు రమ్మని కోరితే ఆయన నిరాకరించినాడు. కాని శ్రీనివాసుని ఆదేశం ప్రకారం అన్నమయ్య తల్లిదండ్రుల వెంట తాళ్ళపాక చేరి నవవిధ భక్తిమార్గాలలో ఒకటైన సంకీర్తనమార్గాన్ని చేపట్టి భగవన్నామ, లీలా, గుణములను కీర్తిస్తూ భగవత్తత్త్వబోధన ప్రారంభించినాడు. యౌవనంలో అడుగిడుతున్న అన్నమాచార్యులు భక్తివైరాగ్యములు ప్రబోధిస్తుండటం తల్లిదండ్రులకు చుట్టాలకు విడ్డూరంగా తోచి అన్నమాచార్యులకు వివాహప్రయత్నాలు ముమ్మరం చేసినారు. అన్నమాచార్యులు తనకు వివాహం వలదన్నాడు కాని భగవదాదేశంతో తిరుమలమ్మ, అక్కలమ్మ అనే ఇరువురు కన్యలను పెండ్లాడి గృహస్థాశ్రమ ధర్మం నిర్వహిస్తూ, తన సంకీర్తన యజ్ఞాన్ని దినమొక

సంకీర్తన చొప్పున రచిస్తూ, నిర్విఘ్నంగా కొనసాగించినాడు. వైష్ణవ వేదాంతరహస్యాలు తెలుసుకోవటానికి అహోబిలమఠం అధిపతి ఆదివన్ శఠకోపయతిని ఆశ్రయించినాడు. శటకోపయతులవద్ద విశిష్టాద్వైతవేదాంతము నేర్చి నృసింహమంత్రం పొంది శ్రీ వెంకటేశ్వరునిపైవలె అహోబిలనృసింహుని పైన అనేక సంకీర్తనలు రచించినాడు. 32 అక్షరాలు నృసింహమంత్ర పఠన ప్రభావంచేత మొత్తం 32000 కీర్తనలు రచించినాడు. కాని ఈనాడు మనకు దక్కినవి 12000 మాత్రమే.

అన్నమాచార్యుల కీర్తిని విని కడపజిల్లా టంగుటూరు దండనాథుడు సాళువ నరసింహరాయలు (1486-1491) ఆహ్వానిస్తే పోయి సత్కృతుడైనాడు. ఈ నరసింహరాయలు పెనుగొండ ప్రభువైన తరువాత అన్నమయ్యకు పెనుగొండలో ఆవాసం కల్పించినాడు. అన్నమయ్య సంకీర్తనయజ్ఞం చేస్తూ విశిష్టాద్వైతమత వ్యాప్తికై కృషి చేసినాడు. ఒకనాడు సాళువనరసింహ రాయలు వెంకటవల్లభుని పై చెప్పిన శృంగార కీర్తన పాడవలసిందని కోరితే అన్నమయ్య **"ఏమొకొ చిగురుటథరమున యెడనెడ కస్తురి నిండెను, భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా"** అనే భావబంధురమైన మధుర భక్తికీర్తన పాడినాడు. ఆపాటకబ్బురపడి రాయలు తనపై అట్టి కీర్తన ఒకటి పాడుమంటే చెవులు మూసికొని **"హరి హరీ"** యంటూ **"హరిముకుందుని గొనియాడు నా జిహ్వ నిను గొనియాడంగ నేర"**దని నిరాకరించినాడు. ఈ ధిక్కారానికి రాయలు ఆయనకు సంకెలలు వేయించి చెరసాలలో పెట్టినాడు. అన్నమయ్యగారు శ్రీ వెంకటవిభుని వేడుకుంటే సంకెల లూడిపోయినవి. ఆవార్త నమ్మని రాయలు మరల సంకెలలు వేయించినాడు. అన్నమయ్య ఆ వేదనతో **"నీ దాసుల**

భంగములు నీవు చూతువా" అని వేడుకుంటే సంకెలలూడినవి. ఇది ప్రత్యక్షంగా చూచిన రాయలు అన్నమయ్యకు సాగిలపడి క్షమార్పణ కోరినాడు.

అన్నమాచార్యులు రాజును క్షమించి రాజాశ్రయం విడిచి తిరుమలకు చేరి తమ సంకీర్తనయజ్ఞం కొనసాగించినారు. అన్నమయ్య సంకీర్తనలు మెచ్చి వెంకటేశ్వరుడాయనకు ప్రత్యక్ష దర్శనం ప్రసాదించి మెచ్చుకునేవాడు. స్వామికి ప్రతిసంవత్సరం జరిగే బ్రహ్మోత్సవాల్లో అన్నమయ్య పాల్గొనేవారు. దేశసంచారం చేస్తూ అనేక క్షేత్రమూర్తులపై చాలా కీర్తనలు రచించినారు. భగవదనుగ్రహంతో ఆయనకు వాక్శుద్ధి కలిగినది. ఆయన నోటివెంట వచ్చే మాటలు అక్షరాలా జరిగేవి. ఒకనాడు స్వామికి నైవేద్యంగా పెట్టిన మామిడిపండ్లు పుల్లగా ఉండటం గమనించి ఆ చెట్టుపండ్లు తియ్యనివగుగాక అంటే తియ్యని పండ్లైనవి. ఒక పేద బ్రాహ్మణుడు తన కూతురు వివాహానికి అన్నమయ్యను ధనం యాచిస్తే ఒకరాజు కావలసిన ధనం సమకూర్చినాడు. అప్పటి నుండి అందరు **"చెలువొందు నాగురు శ్రీపాదరక్ష, తలనిడి తమ యాపదలు వీడికొనిరి"**.

అన్నమాచార్యులకంటె వయసులో చిన్నవారైన పురందరదాసు (1484-1564, 1470-1564) గారు దాసకూటముల ద్వారా వైష్ణవ భక్తితత్వాన్ని కర్ణాటకమంతట ప్రచారం చేస్తూ 4,75,000 కీర్తనలు రచించినారు. అన్నమయ్యగారి కీర్తనలకు పురందరదాసుల కీర్తనలకు భావసామ్యం ఎక్కువ. అన్నమయ్యగారి వార్ధక్యంలో పురందరదాసులవారు వచ్చి దర్శించి "మీరు సాక్షాత్తు వెంకటేశ్వరుని

అవతార"మని స్తుతిస్తే, అన్నమయ్య పురందరదాసులను కౌగిలించు కొని **"మీరు సంధ్య వార్చు కోవటానికి ఆస్వామితోనే నీళ్ళు తెప్పించు కొన్న భాగ్యశాలురు, విఠలుని అవతార"**మని కీర్తించినారట. ఆ యిరువురు అవతారపురుషులు తెలుగు కన్నడ భక్తిసాహిత్యాలకు సంస్కృతులకు చేసిన సేవ యెనలేనిది.

అన్నమయ్య మహాభక్తుడు, మహాకవి, మహాగాయకుడు; వాసిలో, రాశిలో వైవిధ్యంలో భావప్రధానములైన పదకవితలు రచించి పదకవితాపితా మహుడని ప్రశస్తిని పొందినారు. ఆయన కీర్తనలు భగవద్భక్తి ప్రతి పాదకములు; నవవిధభక్తి బేధాలు, వేదోపనిషత్ ప్రమాణాలు, దేహదేహి అనుబంధం, శరణాగతి, మాయాతత్త్వం, పరంజ్యోతి స్స్వరూపం, సాంఘిక, సామాజిక సమభావన ఆ పదముల్లో పొందుపరచి సామాన్యులకు విశిష్టాద్వైతవేదాంతాన్ని రామానుజమతాన్ని సులభగ్రాహ్యం చేసినారు. **"పావనములు హరి భక్తి విభావనములు సర్వమంత్ర పరమరహస్యోద్భావనములు గాయకనికరావనములు తాళ్ళపాక అన్నయ పదముల్"** అని సంకీర్తనలక్షణం. ఆయన రచించిన ఆధ్యాత్మ సంకీర్తనలవలె శృంగార సంకీర్తనలు కూడ మధురభక్తిలో ఉచ్చకోటికి చెందినవి. పరమాత్మ సంయోగంకోసం జీవాత్మపడే ఆవేదన, అష్టవిధనాయికలు వారి సంభోగ విప్రలంభ శృంగారాలు, అలమేల్మంగా శ్రీనివాసుల దివ్య లీలావైభవాలు, మధురభావాలు భక్తకోటికి పులకరింతలు. తెలుగుదేశి కవితారీతులు, జానపదగేయాల వరుసలు అన్నమయ్యగారి సంకీర్తనల్లో కోకొల్లలు. అన్నమయ్య పదాలు కొన్ని సంస్కృతంలో, కొన్ని జానపదుల యాసలో ఉన్నవి. ఆయన వాడిన సామెతలు, నుడికారాలు, ఇతర కవుల్లో చాలా అరుదు. ఆయన ప్రధానంగా

తిరుమలలో ఉంటూ తమిళనాడు. ఆంధ్రదేశం, కర్ణాటక ప్రాంతాల్లోని దివ్యక్షేత్రాలన్నీ తిరుగుతూ ఆయా దేవతామూర్తులపై అనేకకీర్తనలు రచించినారు. ఆయా దేవతలకు తిరుమలయ్యకు అభేదప్రతిపత్తి పాటించినారు. ఆనాటి ఉత్సవాలు పేర్కొన్నారు. స్వామివారి కల్యాణోత్సవాలపుడు తామే అమ్మవారి పక్షాన కన్యాదానం జరిపేవారు.

తాళ్ళపాక కవుల సాహిత్యాన్ని రాగిరేకులపై వ్రాయించి తాళ్ళపాక అరలో భద్రపరచేవారు. ఈ అర భాష్యకారుల గుడిప్రక్కనే ఉంది. వీటిని తొలుత కనిపెట్టినవాడు A.D. Cambel 1816. అటు తరువాత 1922 నుండి సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి, విజయ రాఘవాచార్యులు, వేటూరి ప్రభాకరశాస్త్రి, ఏ.వి. శ్రీనివాసాచార్యులు, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పి.టి. జగన్నాథరావు, గౌరిపెద్ది రామసుబ్బశర్మ ప్రభృతులు గ్రంథ పరిష్కరణం, ప్రకటనం చేపట్టినారు. 1935 నుండి ఈనాటివరకు తి.తి. దేవస్థానం వారు 29 సంపుటాలుగా ప్రకటించినారు. అన్నమయ్య సంకీర్తనలు 2222, ఇతరులవి 12679 వెరసి 14901.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడకముందు, తిరుమల తిరుపతి దేవస్థానం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉండినపుడు 1956 జూన్ 28,29,30 తేదీల్లో కొండపై గొప్ప విద్వత్సభలు జరిగినవి. నాటి దేవాదాయ శాఖమంత్రి కల్లూరి చంద్రమౌళిగారు కోరితే హైదరాబాదు ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుగారు తెలంగాణం నుండి ఆర్గురు పండితులను పంపించినారు. నేను నా Ph.D. థీసిస్‌లో (1955 జూన్) వ్రాసిన “పదకవితా పితామహుడు పాడిన దేశి

వరుసలు" వ్యాసం చదివినాను. నాటి సభాసదుల కందరికీ అది క్రొత్తవిషయం కాని దేవస్థానంవారి ఆస్థాన వైణిక విద్వాంసులు వేదికపైకి వచ్చి నన్నభినందించిపోయినారు. అటుతరువాత రెండవసారి అన్నమయ్య ప్రాజెక్ట్ డైరెక్టర్ కామిశెట్టి శ్రీనివాసులు ఆహ్వానం అందుకొని అన్నమయ్యగారి ఆరాధనోత్సవాలపుడు అన్నమయ్యగారి భక్తి సాహితీ వైభవం గూర్చి ప్రసంగించినాను. ఆనాడు పల్లవిలోని **"దినము ద్వాదశి నేడు తీర్థదివసము నీకు, (జనకుండ) చరితార్థ అన్నమాచార్య విచ్చేయవే",** మొదటి చరణంలో చివరిపాదం **"వెనుకొని (యారగించ) ఈ సభలకు విచ్చేయవే, రెండవచరణం చివరిపాదం– "ఈకడ (నారగించ నింటికి)ఉత్సవాల కింపుగవిచ్చేయవే",** మూడవ చరణం చివరిపాదం **"నంకెల (మాయింటి విందులారగించవే) మా చేయు వినతులాలకించవే"** అనే చిరు మార్పులతో పాడి నా ప్రసంగం సాగించినాను. సభా సదుల్లోని పెద్దల కనులు చెమ్మగిల్లటం గమనించినాను.

అన్నమయ్యగారి భక్తి శృంగారభావాలు ఫార్సీ ప్రభావం గల ఉర్దూలో తప్ప ఇతర భారతీయ ప్రాంతీయ భాషల్లో ఎచ్చటకానరావు. అందుకు ప్రథమోదాహరణం **"ఏమొకో చిగురుటధరమున యెడనెడ కస్తురి నిండెను"** అనే పాట. సంసారం జంబాలంలో మునిగి తేలుతున్న మనవంటివారికి ఆయన చూపిన **"బ్రహ్మగడిగిన పాదము",** ఆయన స్వామివారి వరదహస్తం **"ఇందరికి నభయంబు లిచ్చుచేయి"** చూపించినా– ఎవరికాళ్ళో చేతులో పట్టుకొని ప్రాకులాడుతున్నాము. ఈ పాటలోని చరణాల్లో తెలుగు సీసపద్యం తొంగిచూస్తున్నది.

తాళ్ళపాక కవులు – ఈ వ్యాసం ప్రారంభంలో అన్నమాచార్యుల వారి పూర్వులను స్మరించినాము. అటు తరువాతి భక్తకవుల రచనలు చాలా ఉన్నవి. అన్నమయ్యగారికి ఇద్దరుభార్యలు 1) తిమ్మక్క 2) అక్కలమ్మలు, తిమ్మక్క సంతానం 1) నరసింహకవి (భార్య అనంతమ్మ) వారి సంతానం నారాయణయ్య 2) అప్పలాచార్య 3) అన్నయార్యులు, అన్నమయ్యగారి రెండవ భార్య అక్కలమ్మ– వారి సంతానం 1) పెదతిరుమలాచార్యులు 2) నరసమాంబ 3) తిరుమలాంబ. ఈ పెద్ద తిరుమలాచార్యుల సంతానం 1) చిన తిరుమలయ్య (భార్య పెద్దమంగమ్మ) 2) అన్నయ్య 3) పెద తిరువెంగళనాథుడు 4) చిన్నన్న 5) కోనేటి తిరువెంగళనాథులు. పైన పేర్కొన్నవారిలో నాల్గవవారైన చిన్నన్నగారే తాతగారైన అన్నమాచార్యుల చరిత్రం వ్రాసినారు. ఈ భక్తయోగుల సాహిత్య సేవ అపారం.

భగవద్రామానుజులు మానవజాతికల్యాణం కోసం విశిష్టాద్వైత వైష్ణవమతం సిద్ధాన్తీకరిస్తే, సింహగిరినరహరి వచనాలు రచించిన కృష్ణమాచార్యులు ఆ మతంలోని సర్వ ప్రాణికోటి సమత్వం ప్రబోధించినారు. అన్నమయ్యగారు మరొక అడుగు ముందుకు వేసి, ఉత్తమమానవత్వం, సామ్యవాదం, అద్వైతహృదయం ప్రబోధించి నారు. వారి తందనాన ఆహి, తందనాన పాటలో బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే, కందువగు హీనాధికములిందులేవు, అందరికి శ్రీహరే అంతరాత్మ, ఇందులో జంతుకులమింతా నొకటే, మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొకటే, చండాలు డుండేటి సరిభూమి యొకటే" అన్నారు. మరొక పాటలో **"విజాతులన్నియు వృధా వృధా**

అజామిళాదుల కదియేజాతి, జాతి భేదములు శరీరగుణములు, జాతి శరీరముతోడనే చెడు" అన్నారు. మరొకపాటలో **"ఏ కులజుడేమి యెవ్వడైననేమి ఆకడ నాతడె హరినెరిగినవాడు అరుదైన భూత దయానిధియగువాడే, పరులు దానేయని భావించువాడు"** అన్నారు. ఇంకొకపాటలో **"కోపము మానితేనే కోటిజపాలు సేయుట, పాపము సేయకుంటేనే బలుతపము, పరకాంత నంటకుంటే బలుపుణ్యాలు సేయుట సొరిది నాస మానుటే సోమపానము"** అన్నారు. ఈ విధంగా కర్మ భక్తి జ్ఞానముల సారాంశం మానవాళి మనుగడకు, సంసార సాగరతరణానికి ముఖ్యములని, తమ సంకీర్తనల ద్వారా చాటినారు.

అన్నమయ్యగారు క్రీ.1503 దుందుభి ఫాల్గున బహుళ ద్వాదశి నాడు అవతారం చాలించినారని పెద్దలు నిర్ణయించినారు. ఇటీవల Dr. R.శేషశాస్త్రిగారు అన్నమాచార్యులు 1550 దాక జీవించియున్నట్లు హంపీ విజయనగరం శాసనాలు ఆధారంగా మూసీ పత్రికలో ప్రకటించినారు. మరొక విషయం. కాకినాడ కమలా ముద్రాక్షర శాలవారు 1910 సం॥ సుభద్రాకల్యాణము – స్త్రీలపాట ప్రకటించి నారు. అందులో చివరన **"వరకవి (శ్రీ) తాళ్ళపాక తిమ్మప్ప, చెప్పెను విష్ణుకథ జగతిలోపలను"** అనియున్నది. వేటూరి ప్రభాకర శాస్త్రిగారు పరిష్కరించిన పాట చివరన **"అవనిలో తాళ్ళపాకన్నయ్య గారి, తరుణి తిమ్మక చెప్పె తాను సుభద్ర కల్యాణమనుపాట కదుమంచితేట"** అని యున్నది. సుభద్రాకల్యాణం రచించినది తిమ్మప్పగారా తిమ్మక్కగారా? తాళ్ళపాక వారెవ్వరూ తిమ్మక్కను కవయిత్రిగా చెప్పలేదు. కనుక ఇది వివాదాస్పదవిషయం.

ఆధారం :

1) తాళ్ళపాక అన్నమాచార్యుల జీవితచరిత్ర (వచనరచన) – Dr. కీసర్ల వాణి T.T.D. ప్రచురణ, తిరుపతి 1997.

2) Prof. చిత్రాజు గోవిందరాజుగారు (తిరుపతి, ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం) అందించిన సమాచారం.

3) విజయనగర వైష్ణవ దేవాలయాలు–తాళ్ళపాక అన్నమాచార్యులు, Dr. R.శేషశాస్త్రి. మూసీ మాసపత్రిక అక్టోబరు 2005.

6. శ్రీవల్లభాచార్యులు (1478 - 1532)

శ్రీవల్లభాచార్యులు స్థాపించినది శుద్ధాద్వైతమనే వైష్ణవ సంప్రదాయం. దీనికే పుష్టి మార్గమని పేరు. అద్వైతుల మాయను వీరు నిరాకరించి మాయారహిత శుద్ధ బ్రహ్మమే జగత్కారణ మన్నారు. సగుణనిర్గుణ స్థితులు రెండూ బ్రహ్మకు సహజములు. ఆ పరబ్రహ్మ **"కర్తుమకర్తుం అన్యథా కర్తుం"** సమర్థుడు. పరబ్రహ్మ అవికృతియైనా భక్తులమీది కృపచేత పరిణామశీలుడౌతున్నాడు. వీరి దృష్టిలో శ్రీకృష్ణుడే పరబ్రహ్మ. ఆయన తన అనంతశక్తులతో ఆత్మానందాన్ని పొందుతున్నప్పుడు **"ఆత్మారాముడు"** అంటాము. బ్రహ్మక్రీడకోసం ఆయన తన శక్తులను బహిర్గతం చేసినపుడు **''పురుషోత్తముడు''** అంటాము. అప్పుడు ఆయన ఆనంద మయుడు, పరమానంద స్వరూపుడు. ఈ శుద్ధాద్వైతమతం గుజరాత్, రాజస్థాన్‌లలో బాగా వ్యాప్తిలో ఉన్నది. శ్రీకృష్ణ

దేవరాయల వారు మధ్వ గురువులైన వ్యాసరాయల అధ్యక్షతన వల్లభాచార్యులకు కనకాభిషేకం చేసినారు. ఇంతటి మహానుభావుడు ఆంధ్రుడు కావటం ఆంధ్రదేశానికి గర్వకారణం.

కృష్ణాజిల్లా మంగళగిరి సమీపాన కాకరవాడలో సాధుస్వభావులైన వెలనాటి వైదికులు భారద్వాజస గోత్రులు, కృష్ణయజుశ్శాఖాధ్యాయులు, ఆపస్తంబ సూత్రులు, కంభంపాటి లక్ష్మణభట్టు ఎల్లమ్మ దంపతులుండేవారు. ఎల్లమ్మగారి తండ్రి సుశర్మ విజయనగరసంస్థాన పురోహితులు. వీరి యిలువేల్పు రేణుకాదేవి. కొంత కాలం తరువాత కాకరవాడవాసులు సమీపానగల అగ్రహారంలో ఇండ్లు కట్టుకున్నారు. లక్ష్మణభట్టు గొప్ప పండితుడు, భక్తుడు. ఈ దంపతులు కొలదిమంది బంధువులతో తీర్థయాత్రలు చేస్తూ కాశీపట్టణం చేరినారు. లక్ష్మణభట్టు దంపతులకు ప్రతిదినం గంగాస్నానం, అన్నపూర్ణావిశ్వనాథుల దర్శనం, కాశీలో దేవీదేవతలందరిని అర్చించటం పరిపాటి యైనది. లక్ష్మణభట్టుగారి పూర్వీకులు యజ్ఞనారాయణభట్టు గొప్ప కృష్ణభక్తులు. ఆయన భక్తికి మెచ్చి శ్రీకృష్ణపరమాత్ముడు ఆవంశంవారు నూరు సోమయజ్ఞాలు పూర్తిచేస్తే వారియింట్లో పుడుతానని వరమిచ్చినాడు. యజ్ఞనారాయణభట్టు 31, ఆయన కొడుకు గంగాధర దీక్షితులు 27, ఆయన కొడుకు గణపతిభట్టు 32, ఆయన కొడుకు వల్లభభట్టు 5, ఆయన ఇద్దరు కొడుకుల్లో పెద్దవాడైన మన లక్ష్మణభట్టు 5 సోమయాగాలు చేసినారు. లక్ష్మణభట్టు పెద్దకొడుకు రామచంద్రభట్టు ఆంధ్రదేశంలోనే పుట్టినాడు. మిగతా యజ్ఞాలు లక్ష్మణభట్టు కాశీలోనే ఉండి పూర్తి చేసినారు. తత్ఫలితంగా కొలది కాలానికే ఎల్లమ్మ భగవత్కృపచేత రెండవసారి గర్భం ధరించినది.

లక్ష్మణభట్టుగారు వారి బంధువులు అందరూ సంతోషించినారు. అట్టి తరుణంలో కాశీనగరంపై ముస్లింలు దండెత్తి వస్తున్నారనే వార్త ప్రబలింది. కాశీలో ఔత్తరాహులేకాక నూర్లకొలది దాక్షిణాత్య కుటుంబాలవారుంటున్నారు. తెలుగు, అరవ, మలయాళ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలవారి వసతులు వాడలు ఇప్పటికీ ఉన్నవి. ముస్లింలు దండెత్తి వచ్చినపుడల్లా గృహదహనాలు, లూటీలు, హత్యలు, మానభంగాలు జరిపి నానాబీభత్సం చేసేవారు. అప్పుడు దాక్షిణాత్య కుటుంబాలవారు కాశీనగరం విడిచి ఇతర సురక్షిత ప్రాంతాలకు గాని స్వస్థలాలకు గాని పోయేవారు.

ఏడవనెల చూలాలు ఎల్లమ్మతో, కొలదిమంది బంధువులతో లక్ష్మణ భట్టుగారు కాశీ విడిచినారు. ఎల్లమ్మను వృద్ధులను పసిపిల్లలను ఒక ఎడ్లబండిలో కూర్చుండజేసి మిగతావారు కాలి నడకన ప్రయాణం చేస్తూ ఒకరేయి మధ్యప్రదేశ్ రాయపూర్ జిల్లా చంపారన్ పరిసరాటవులగుండా పోతుండినారు. ఆరేయి ఎల్లమ్మకు పురుటినొప్పులు మొదలైనవి. ఆమె ఇక ప్రయాణం చేసే స్థితిలో లేదు కనుక ఒకరిద్దరు నమ్మకమైన బంధువులను తమవద్ద ఉంచుకొని మిగతావారిని సమీపానగల చౌదానగరం పంపినారు. ఎల్లమ్మను ఒక చెట్టు క్రిందికి చేర్చి కాపలా కాస్తూ భగవంతుని ప్రార్థిస్తూ శిశూదయం కోసం ఎదురు చూస్తుండినారు. కాసేపటికి ఎల్లమ్మ నెలలు తక్కువ మగబిడ్డను కన్నది. పసికందు ఏడ్వలేదు. చలనరహితంగా పడియున్న ఆశిశువు మృతుడని భావించి ఆ రేయి ఇంకా అడవిలో ఉండటం శ్రేయస్కరం కాదని మృతశిశువును చించిన చీర చెంగులో చుట్టి ఎండుటాకుల్లో పెట్టి సమీపానగల జమ్మిచెట్టు తొఱ్ఱలో నిక్షేపించి, విచారవదనాలతో బరువెక్కిన

గుండెలతో చౌదా నగరం వైపు సాగినారు. అది విక్రమశకం 1535 క్రీ.శ. 1478 వైశాఖ బహుళ ఏకాదశీ ఆదివారం రాత్రి దాదాపు 8–30 గంటల సమయం. తెల్లవారుతుండగా వారణాశి నుండి వచ్చిన రౌతులు ఒక శుభవార్త వినిపించినారు. వారణాశిపై దండెత్తి వచ్చిన ముస్లింలను నాగసాధువులు ఎదిరించి పోరాడి పారద్రోలినారనీ కనుక అందరూ తిరిగి కాశీకి పోవచ్చుననీ చెప్పినారు. లక్ష్మణభట్టు, ఎల్లమ్మ, చౌదానగరంలో తలదాచుకున్న బంధువుల మనస్సులు కుదుట పడినవి. మరల కాశీ క్షేత్రానికే తిరిగిపోవలెనని బయలుదేరినారు.

లక్ష్మణభట్టుకు ఎందువలననో రాత్రి జమ్మిచెట్టు తొఱ్ఱలో దాచిపెట్టిన మృత శిశువును చూచిపోవలెననిపించినది. దంపతులు హుటాహుటిగాపోయి చెట్టుతొఱ్ఱపై కప్పిన ఆకులు తొలగించినారు. ఐతే మృతశిశువనుకొన్న తమబిడ్డ కాళ్లు చేతులు ఆడిస్తూ దైవీకళతో వెలిగిపోతుండటం చూచి ఆశ్చర్యానందాలకు లోనై భగవంతుని కృపను వేనోళ్ల పొగడినారు. ఆ దివ్యశిశువు పుట్టిననాడే సుదూరాన గల గోవర్ధన పర్వతంపై ఒక అద్భుతం జరిగింది. అక్కడ పశువులు మేపుతున్న ఒకతనికి పర్వతంపై ఒక నల్లని ముఖారవిందం కనబడింది. ఆ పసులకాపరి భయపడి కొండ దిగివచ్చి అక్కడి పెద్దలకు చెప్పినాడు. అక్కడ గోవర్ధనజీ ముఖారవింద దర్శనము, ఇక్కడ శిశూదయము ఒక్కసారి జరగటంచేత గోవర్ధనజీ (కృష్ణపరమాత్మ)యే ఇట్లా అవతరించినా డన్నారు. లక్ష్మణభట్టు దంపతులు కొంతకాలం చౌదానగరంలో గడిపి బారసాల నాడు శిశువుకు శ్రీవల్లభులని నామకరణం చేసి సంతోషించినారు. శ్రీవల్లభుడంటే నారాయణుడే; నారాయణుని సంపూర్ణావతారం

శ్రీకృష్ణపరమాత్ముడే. లక్ష్మణభట్టు సకుటుంబంగా సపరివారంగా కాశీనగరం చేరి దైవాంశసంభూతుడైన శిశువుతో కాలం గడుపు తుండేవారు. భట్టుగానే శ్రీవల్లభునికి అక్షరాభ్యాసం చేసి తామే విద్యలు గరపినారు. రామచంద్ర భట్టుకు శ్రీవల్లభునికి ఉపనయనాలు చేసి ఇతర గురువులవద్ద చేర్చినారు.

శ్రీవల్లభులు వేదములు దర్శనములు అనతికాలంలో పూర్తిచేసి గురువులకే ఆశ్చర్యం కలిగించినారు. ఆయన ద్వైతాద్వైతవిశిష్టాద్వైత సిద్ధాంతముల్లోని చిక్కులు విప్పుతూ తమ అభిప్రాయాలు వేదశాస్త్రపురాణేతిహాసాల సమన్వయంతో అందరికీ విశదీ కరించేవారు. భారతదేశంలోని తీర్థములు పుణ్యక్షేత్రాలు దర్శించి అక్కడి పండితులవద్ద నూతనవిషయాలు తెలుసు కోవచ్చునని తండ్రిగారి ఆజ్ఞతో శ్రీవల్లభులు 1491 సం॥ మార్గశిరశుక్ల సప్తమి నాడు బయలుదేరి పూరీ జగన్నాథయాత్ర చేసినారు. అచ్చటి పాలకుడు మహాజ్ఞాని పండితుడు. ఆయన తన రాజధానిలో పండితగోష్ఠులు ఏర్పాటుచేసి సత్యాన్వేషణ చేసేవారు. శ్రీవల్లభులను తమవాదము నిరూపించుటకై ఏర్పాట్లు చేసిన పండితసభకు మహారాజే ఆధ్యక్షం వహించినారు. అప్పటికి ఆ ప్రాంతంలోను రాజస్థాన్‌లోను అద్వైతులు ప్రబలంగా ఉండేవారు. శ్రీవల్లభులు ఆ మాయావాదులతో కొన్నిదినాలు శాస్త్రార్థంచేసి వారిని ఓడించినారు. సభాధ్యక్షులైన మహారాజు ఉభయ పక్షాలవారిని నాలుగు ప్రశ్నలడిగినారు. 1) శాస్త్రములలో ముఖ్యమైన శాస్త్రమేది? 2) దైవములలో ఆదిదేవుడెవరు? 3) ఫలమునిచ్చే మంత్రమేది? 4) అన్నిటిలో సులువైన పనియేమి? ఈ ప్రశ్నలు తాళ పత్రములపై వ్రాసి జగన్నాథుని మందిరంలో పెట్టి తలుపులు మూసి

మరునాడుదయం తలుపులు తెరచి చూస్తే ఆ ప్రశ్నలకు సమాధానాలు శ్రీవల్లభుల సిద్ధాంతాన్ని పోలియున్నట్లు గమనించి మాయావాదులు తమ ఓటమిని అంగీకరించినారు. ఆ సమాధానాలు ఈ విధంగా ఉన్నవి. 1) ఏకం శాస్త్రం దేవకీపుత్రగీతం 2) ఏకో దేవో దేవకీ పుత్ర ఏవ 3) మంత్రోప్యేకస్తస్య నామాని యాని 4) కర్మాప్యేకం తస్య దేవస్య సేవా.

కొడుకు విజయానికి లక్ష్మణభట్టు ఆనందించి తిరుపతికి పోయి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించవలెనన్నారు. తండ్రిగారి కోరికమేరకు శ్రీ వల్లభులు పూరీజగన్నాథం నుండి సపరివారంగా బయలుదేరి అచ్చటచ్చట విశ్రమిస్తూ తిరుపతి తిరుమలలు చేరి ఏడుకొండలవాని సేవించినారు. తిరుమల వరాహస్వామిగుడిలో శ్రీవల్లభాచార్యులు కూర్చున్న స్థలాన్ని యాత్రికులు దర్శిస్తుంటారు. తిరుమల విడిచి లక్ష్మణభట్టుగారు స్వగ్రామం అగ్రహారం చేరి తమ బాధ్యతలు కొడుక్కు అప్పగించి 1491 సం॥ పరమపదించినారు. శ్రీవల్లభులు తండ్రిగారికి అగ్రహారంలోనే అంత్యేష్టి జరిపి భాగవత సప్తాహం చేసి సపరివారంగా విద్యానగరం చేరినారు. అక్కడ కొంతకాలముండి తమ కుటుంబ పరివారాన్ని మేనమామగారింట విడిచి అనుచరులతో పాదయాత్ర చేసి శ్రీరామచంద్రుడుండిన పంపాసరోవర తీరంలో విశ్రమించినారు. మార్గమధ్యంలో ఆయా క్షేత్రాలలోని మూర్తులను సేవిస్తూ, పండితులతో వాదిస్తూ భాగవత సప్తాహాలు చేస్తూ, భక్తిమార్గం ప్రచారం చేస్తూ, వేదవేదాంత సారములు ప్రజలకు అర్థమయ్యేవిధంగా బోధిస్తూ బుందేల్‌ఖండ్ రాజధాని ఓక్కానగరం చేరినారు.

వారు ఓక్కామహారాజు ఆదేశానుసారం ఘటసరస్వతి అనే మహా పండితునితో వాదించి ఓడించినారు. మహారాజు శ్రీవల్లభులకు కనకాభిషేకం చేసినారు. శ్రీవల్లభులు ఓక్కానుండి పలు ప్రదేశాల్లో తమ మతం ప్రచారం చేస్తూ గౌరవసన్మానములందుకుంటూ శ్రీకృష్ణపరమాత్ముడు తమ దివ్యలీలలు చూపిన వ్రజభూమి ప్రవేశించి 1493 సం॥ యమునాతీరం మధురాపట్టణం చేరినారు. తుకర్లిఘాట్‌వద్ద కొన్నిదినాలుండినారు. గోకులంలో వారు పరమాత్మధ్యానం చేస్తూ శ్రీమద్భాగవతం శ్రీపురుషోత్తముని మరొక రూపమంటూ అందరికీ వివరించినారు. సిద్ధాంతాలను క్లిష్టం చేసి పండితులవరకే పరిమితమైన మతాన్ని సామాన్యజనులకు కూడ అందుబాటులోనికి తేవలెనని శ్రీవల్లభుల తపన. అది గ్రహించి గోవర్ధన నాథుడు విక్రమశకం 1549 క్రీ.శ 1494 ఫాల్గుణ శుద్ధ ఏకాదశి గురువారం రాత్రి దర్శనం ప్రసాదించి జీవునికి శ్రీకృష్ణునికి ఉన్న సంబంధాన్ని (బ్రహ్మసంబంధాన్ని) మంత్రంగా వివరించినారు. ఇందులో రెండు భాగాలు 1) జీవుని వేదన – మానవుడు తనకు సంబంధించిన సమస్తం భార్యాపుత్రులు శరీరం ఇంద్రియాలు అంతఃకరణం శ్రీకృష్ణునికి అంకితం చేయటం 2) శరణాగతి–జీవుని చివరి ఆశ్రయం శ్రీకృష్ణుని వద్దనే. దీనినే పుష్టిసేవ అంటారు. శ్రీకృష్ణుని అనుగ్రహం వలననే మానవునికి తాను చేసే కర్మ లభిస్తుంది. ఈ పుష్టిమార్గాన్ని అనుసరించిన మొదటి శిష్యుడు దామోదరదాస్ అర్సానీ. ఈతడే శ్రీవారికి జీవిత సహచరుడైనాడు.

పవిత్రప్రదేశమైన వ్రజభూమి నంతటినీ పర్యటించి శ్రీవల్లభులు మరల విద్యానగరం చేరినారు. అప్పుడు అద్వైతులకు ద్వైతులకు

రాజసభలో వాదములు జరుగుతుండినవి. అద్వైతులు ప్రబలంగా ఉన్న ఆ పండిత మండలిలో శ్రీవల్లభులు మాధ్వులపక్షం వహించి, వేదోపనిషత్తులు, భాగవతం, వివిధశాస్త్రేతిహాసాలు ఆధారంగా వాదించి అద్వైతులను ఓడించి, అఖండమండలాచార్య జగద్గురువనే బిరుద మందుకొని తులాభారం చేయించుకున్నారు. శ్రీకృష్ణ దేవరాయలు దక్షిణగా సమర్పించిన 7000 బంగారు నాణెముల్లో 7 నాణెములు మాత్రం తీసుకొని మిగతా నాణెములు పండితులకు పంచినారు. కొన్నిదినాలు విద్యానగరంలో ఉండి శ్రీవల్లభులు తమతల్లి, ఇతర కుటుంబసభ్యులతో తీర్థయాత్రలకు బయలు దేరినారు. శ్రీవారు జార్ఖండ్ పర్యటిస్తుండగా ఠాకుర్‌జీ (శ్రీకృష్ణ పరమాత్మ) ఆదేశంతో ప్రయాణం ఆపి మధురకు రెండవసారి పోయి అచ్చటి పెద్దల సహాయంతో గోవర్ధనశిఖరం చేరి అక్కడి శ్రీకృష్ణుని ముఖార విందానికి పూజాదికములు చేసి విగ్రహ ప్రతిష్ఠ గోవర్ధన్‌నాథ్‌జీ అని నామకరణం చేసినారు. విద్యానగరం నుండి తెచ్చుకున్న 7 బంగారు నాణెములతో నాథ్‌ద్వారాలో వెలసిన గోవర్ధనునికి బంగారు మొలత్రాడు చేయించినారు. ఈనాడా విగ్రహమే నాథ్‌ద్వారాలో పూజలందుకుంటున్నది. ఈనాటికీ శ్రీవారి వంశీయులే ఆలయ ధర్మకర్తలు. తిరుపతి తిరుమల తర్వాత అతిసంపన్నమైన దేవాలయమదే. ఆయన మరల తీర్థయాత్రల కుపక్రమించినారు. పండరియాత్ర చేస్తుండగా ఆయనకు సంన్యా సాశ్రమం స్వీకరించవలెననే కోరిక కలిగింది. కాని విఠోబా స్వప్న దర్శనమిచ్చి గృహస్థాశ్రమం స్వీకరించి పుష్టిమార్గ ప్రచారం చేయుమని ఆదేశించినాడు. శ్రీవల్లభులు సపరివారంగా కాశీచేరి (1505-1506) మధుమంగళం (దేవభట్టు)గారి కూతురు

శ్రీమహాలక్ష్మిని పెండ్లాడినారు. ఆ సంప్రదాయులందరూ శ్రీమహాలక్ష్మిని అక్కాజీ అని పిలిచేవారు. అక్కాజీ తెలుగింటి ఆడుబిడ్డయే. ఆ పుణ్య దంపతులకు 1513 సం॥ బహుళ ద్వాదశినాడు గోపీనాథ్‌జీ, 1517వ సం॥ పుష్య బహుళ నవమినాడు విఠల్‌నాథ్‌జీ పుట్టినారు. శ్రీవల్లభులు తమ కుమారులకు 8వ యేట ఉపనయనములు చేసి తొలి విద్యా గురువులైనారు. తాత్త్వికసిద్ధాంత రీత్యా శ్రీవల్లభ మతానికి శుద్ధాద్వైతమని పేరు. ఆ మతప్రచారం కోసం బ్రహ్మ సూత్రాలలో కొన్నింటికి అణుభాష్యం, భాగవతంలో కొన్ని అధ్యాయాలకు సుబోధినీవ్యాఖ్య ఇంకను తత్త్వదీపం, పురుషోత్తమ సహస్రనామ స్తోత్రం మొదలైనవి రచించినారు. ఈ గ్రంథాలకు వ్రాయసకాడు మాధవపురి కాశ్మీరీ. శ్రీవారు కాశీ పండితులతో చేసిన చర్చలు మాధవపురి కాశ్మీరీ లేఖల మూలంగా విశ్వనాథమందిరం గోడల కంటించేవాడు. ఆ లేఖలన్నీ తరువాత పత్రావలంబన మనే గ్రంథంగా వెడలినవి. సుబోధినీ వ్యాఖ్యానం చాలా గొప్పరచన.

ఆ రచన చేస్తుండగా శ్రీవల్లభులకు శ్రీకృష్ణపరమాత్మ వద్ద నుండి మూడుసార్లు పిలుపువచ్చింది. రెండుసార్లు శ్రీవారు రచనావ్యాసంగంలో మునిగి తేలుతుండి పోలేదు. మూడవసారి కడసారి పిలుపు రాగానే 5,9 ఆశ్వాసాల వ్యాఖ్యానం విడిచిపెట్టి 1,10 ఆశ్వాసాల సుబోధినీవ్యాఖ్యానం పూర్తిచేసి సంన్యాస స్వీకారానికి భార్య అనుమతి కోరినారు. ఆమె నిరాకరించటంతో సమయం కోసం కాచుకొని ఉండినారు. ప్రయాగ పొలిమేర ఏడల్ ఇంటిలో ఉండగా ఇంటికి నిప్పంటుకొన్నది. అందరూ ఇంటి బయటే ఉన్నారు. శ్రీవల్లభులొక్కరే ఇంట్లో ఉన్నారు. ఇదే మంచి

అదనుగా భావించి శ్రీవల్లభులు తమ భార్య అనుమతి పొంది, ప్రయాగవాసులు శ్రీనారాయణతీర్థస్వామి వారివద్ద సంన్యాసదీక్ష తీసుకొని కొన్నిదినాలుండి 1532 జ్యేష్ఠ బహుళ పాద్యమి నాడు వారణాశి హనుమాన్ ఘాట్ చేరినారు. శ్రీవారి యిద్దరి కొడుకులు, గోపీనాథ విఠలనాథులు ఉపదేశం కోసం ప్రార్థిస్తే శ్రీవల్లభులు ఇసుకపై కొన్నిపద్యాలు వ్రాసినారు. శ్రీకృష్ణ పరమాత్ముడు ప్రత్యక్షమై ఆ పద్యాలు పూరించినాడు. శ్రీగోపీజన వల్లభునికి, శ్రీవల్లభా చార్యులకు భేదం లేదని అందరికీ తెల్లమైనది.

అటు తరువాత 1532 ఆషాఢబహుళ ద్వితీయమధ్యాహ్నం గంగా ప్రవాహంలో ప్రవేశించినారు. శ్రీవారి నిర్యాణాన్ని సంప్రదాయ వాదులు అసురవ్యామోహలీల అంటారు. అచట మూగిన జనులందరు ఒక ఉజ్జ్వల కాంతి గంగాజలంనుండి బయలుదేరి అనంతంలో కలసిపోయినట్లు చూచి శ్రీవల్లభులకు జేజేలు పలికినారు. శ్రీవల్లభాచార్యులవారు తమ దేశ పర్యటనలో 84 ప్రదేశాల్లో భాగవత సప్తాహాలు చేసినారు. వాటిని ప్రభూజీకి బైఠక్ అంటారు. శ్రీవల్లభాచార్యుల నిర్యాణం తరువాత గోపీనాథులు ఆచార్యపీఠ మలంకరించి భాగవత ప్రచారానికై ఎనలేని కృషి చేసినారు. గోపీనాథులు తమ తండ్రిగారు పర్యటించిన జగన్నాథ పూరి మొదలైన పెక్కుక్షేత్రాలు (1540–1546) పర్యటించి స్వస్థలం ఏడెల్‌కు తిరిగివచ్చి సోమ, విష్ణు యజ్ఞములు చేసి భాగవతమతం ప్రచారం చేసినారు. 1563 మరల ఒకసారి గుజరాత్, సింధు, ద్వారకలు దర్శించి జగన్నాథపూరీ బలదేవునిలో లీనమైపోయినారు. గోపీనాథుల తరువాత శ్రీవల్లభుల రెండవ పుత్రుడు విఠలనాథులు గురుపీఠం అలంకరించి తండ్రిగారు అసంపూర్ణంగా విడిచి పోయిన

వ్యాఖ్యానాలు, స్తోత్రాలు పూర్తిచేసినారు. శ్రీవల్లభుల శిష్యుడు స్నేహితుడు దామోదరదాసు సూచనల మేరకు విఠలనాథులు శ్రీకృష్ణుని పూజకు నియమాలు, హవేలీలలో వైష్ణవులు చేయవలసిన సేవలు మొదలైన క్రొత్త విధానం నిర్మించి ఆచరణలోపెట్టి 1545-1583 మధ్యకాలంలో ఆరుసార్లు గుజరాత్ పర్యటించి పుష్టిమార్గ ప్రచారం చేసినారు. అక్బరు చక్రవర్తి కోరికపై విఠలనాథులు 1579, 1583 రెండుసార్లు ఆగ్రాకు వెళ్ళినారు. వారి ప్రసంగాలు విని ముగ్ధుడైన అక్బరు చక్రవర్తి శ్రీవారికి గోసాయి బిరుదాన్ని, భూమిని, గోవులు మేయటానికి విశాలమైన స్థలాన్ని ఇచ్చినాడు. దోపిడి దొంగలు, ఎందరో ముస్లింలు, శ్రీవిఠలనాథుల శిష్యులైనారు. అష్టచాప్ పేరుతో ప్రసిద్ధులైన ఎనమండుగురు భాగవత కవుల్లో విఠలనాథుల శిష్యులు నలుగురు శ్రీవల్లభుల శిష్యుల్లో సూరదాస్ (1535-1640) ప్రథముడు. శ్రీవల్లభులు 1567 సం॥ వైశాఖ శుద్ధ పంచమినాడు సూరదాస్‌కు దీక్ష ఇచ్చి ఆయన రచనలకు **"సూరసాగర్"** నామకరణం చేసినారు. సూరదాస్ ఆనాటినుండి జీవితాంతం వరకు గోకులంలోనే ఉండినారు. విఠలనాథుల ప్రథమశిష్యుడు గోవిందదాసు గొప్ప వాగ్గేయకారుడు. విఠల నాథులు 70 సంవత్సరములు జీవించి గుజరాత్ మధ్యప్రదేశ్ రాజస్థాన్‌లలో పుష్టిమార్గ ప్రచారం చేసి 1587 సంవత్సరం గిరిరాజ పర్వతగుహలో ప్రవేశించి అదృశ్యులైనారు.

శ్రీకృష్ణుని సేవాకైంకర్యాలే మానవుని ధర్మమనీ, శ్రీహరి లీలలను అనుభవించటమే అర్థమనీ, భగవద్దర్శనం లేదా భగవత్సాంగత్యం కోరుకోవటమే కామమనీ, సాయుజ్యమే మోక్షమనీ శ్రీవల్లభా చార్యులవారు చతుర్విధ పురుషార్థాలను నిర్వచించినారు. శ్రీవారు

రచించిన 84 గ్రంథాలలో బాలబోధ, సిద్ధాంతరహస్యం, వివేక ధైర్యాశ్రయ నిరూపణం మొదలైనవి ముఖ్యగ్రంథాలు. అణుభాష్యం, తత్త్వార్థదీపికలు రచించి జీవుడు బ్రహ్మకు అంశమాత్రుడని నిరూపించినారు. సుప్రసిద్ధ **"మధురాష్టకం"** శ్రీవల్లభులు రచించినదే. మన తెలుగుదేశంలో మంగళగిరి, తిరుపతి పుణ్య క్షేత్రాలలో **"ప్రభూజీకి బైఠక్"** పేరిట వల్లభ సంప్రదాయానికి చెందిన మఠాలున్నా యంటారు. శ్రీవల్లభులది వాత్సల్య భక్తి. బాలకృష్ణుడే ఉపాస్యదైవం. శ్రీనింబార్క సంప్రదాయంవారిది మధురభక్తి వారికి రాధాకృష్ణులిరువురు ఉపాస్యదైవతములు.

మధురాష్టకమ్

1) అధరం మధురం వదనం మధురం, నయనం మధురం హసితం మధురం।
హృదయం మధురం గమనం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్॥

2) వచనం మధురం చరితం మధురం, వసనం మధురం వలితం మధురం।
చలితం మధురం భ్రమితం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్॥

3) వేణుర్మధురో రేణుర్మధురః, పాణిర్మధురః పాదౌ మధురౌ ।
నృత్యం మధురం సఖ్యం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

4) గీతం మధురం పీతం మధురం, భుక్తం మధురం సుప్తం మధురం ।
రూపం మధురం తిలకం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్॥

5) కరణం మధురం తరణం మధురం, హరణం మధురం రమణం మధురం।
వమితం మధురం శమితం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్॥

6) గుంజా మధురా మాలా మధురా, యమునా మధురా వీచీ మధురా ।
సలిలం మధురం కమలం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్॥

7) గోపీ మధురా లీలా మధురా, యుక్తం మధురం భుక్తం మధురం।
దృష్టం మధురం శిష్టం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

8) గోపా మధురా గావో మధురా, యష్టిర్మధురా సృష్టిర్మధురా ।
దలితం మధురం ఫలితం మధురం, మధురాధిపతే రఖిలం మధురమ్॥

ఆధారములు :

1) శ్రీవల్లభాచార్యుల జీవితచరిత్ర ఇంగ్లీషు మూలం, పి. కృష్ణ కుమార్, తెలుగు అనువాదం పెద్దిభొట్ల బాలకృష్ణ శ్యామల రావు - 2000-303 స్వస్తిక్ టవర్స్, మోతీనగర్, హైదరాబాద్ - 18. (040) 23832180
2) అవతారతత్త్వ వివేచన, కీ.శే. ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు - 1998
3) వల్లభాచార్యులు Prof. భీమసేన్ నిర్మల్ తి.తి.దేవస్థానములు - 1999
4) శ్రీ వల్లభాచార్య - పరేక్‌భాయి మణిలాల్ - 1940

7. మద్దిమాను గురప్పస్వామి

(15వ శతాబ్దం)

కడపజిల్లా బద్వేలు తాలూకా పోరుమామిళ్ళ మండలం గురప్ప గారిపల్లె ఒక పవిత్రక్షేత్రము, తీర్థము కూడ. శ్రీశైలం మహానంది పర్వతాలనుండి గిద్దలూరు మీదుగా, గురప్పగారిపల్లె సిద్ధవటం తాలూకాలు చుట్టి మల్నేటిపట్నంవద్ద పినాకినిలో కలిసిపోయే సగిలేరు తీరానగల ఈ గ్రామం ఆనది ఒడ్డున నున్న అనేక వైష్ణవశైవ తీర్థాలలో ఒకటి. అక్కడ పీరుసాహెబు పల్లె కంసలపల్లె అనే రెండు దగ్గరిదగ్గరి గ్రామాలున్నవి. పీరుసాహెబుపల్లెలో దాదా పీరుస్వామి ఉండేవాడు. కంసలపల్లెలో ఈశ్వరయ్యపార్వతమ్మ అనే వైదిక దంపతులు సత్యనిష్ఠాగరిష్ఠులుండేవారు. వారు శివభక్తులు. స్వగ్రామంతోపాటు చుట్టుపట్టు గ్రామాల్లోను ఈశ్వరయ్యగారు

పౌరోహిత్యం చేసేవారు. వారికి ఒక కొడుకు ఇద్దరు బిడ్డలు. శివుని ప్రసాదంచేత పుట్టిన ప్రథమసంతానం కనుక శివరామశర్మ అని నామకరణం చేసినారు. శివరామశర్మ ఐదేండ్లవాడయ్యేదాక ఏదో పరధ్యానంలో ఉంటూ ఇంటిముందు అరుగుమీద కూర్చుండి దారి వెంట పోయేవారిని చూస్తుండేవాడు. ఆతని అందచందాలకు తోడు విభూతి రేఖలు ఒడలంతా విభూతితో కుమారస్వామి వలె కనపడే వాడు. గురుబిడ్డడు కనుక అందరు గురప్పస్వామి అని పిలిచేవారు. గురప్పస్వామి తల్లి పిలిస్తేనే లోపలికి పోయి అన్నం తినివచ్చి మరల అరుగుపైన కూర్చుండే వాడు. పీరుసాహెబు పల్లెకు దాదా పీరుస్వామి దర్శనార్థం పోయేవారు. సత్సంగం చేయబోయే సాధు సంతులా బాలుని చూచి మునుముందు ఈతడు గొప్పభక్తుడు సిద్ధపురుషుడు ఔతాడని చెప్పేవారు.

ఒకసారి గురప్పస్వామి దాదాపీరుస్వామిని దర్శించబోయినాడు. ప్రథమ దర్శనంలోనే వారికి గురుశిష్యానుబంధం కలిగింది. గురప్పస్వామి దాదా పీరుస్వామి దపంతులకు సేవలు చేస్తూ సత్సంగానికి వచ్చే సాధుసంతులకు సౌకర్యాలు సమకూరుస్తూ ఎక్కువ కాలం గురువుల సన్నిధిలోనే ఉండేవాడు. దినదినం ఆ బంధం ఎక్కువైనది. గురుపత్ని పెట్టినది తింటూ ఆయిల్లే తన యిల్లుగా భావించి వారికి సేవలు చేస్తుండేవాడు. ఇట్లా 15 సంవత్సరాలు గురుదంపతులను సేవించి వారి మనసుకెక్కినాడు. దాదా పీరుస్వామి గురప్పస్వామిని పరీక్షించి అర్హుడని గుర్తించి బ్రహ్మవిద్య బోధించినాడు. గురువుగారి తలంపుగుర్తించి ముందు గానే ఆపనులు చేస్తూ, తన సాధన, సత్యాన్వేషణ సాగిస్తూ, సత్సంగానికి వచ్చే మహాత్ముల మాటలు అనుభవాలు తనవిగా

మలచుకుంటూ, వారికి ఆహారం వడ్డిస్తూ, నిర్విరామంగా నిస్స్వార్థ సేవలు చేసినాడు. ఒక రేయి సత్సంగం తరువాత సాధుసంతుల భోజనాలైనవి. గురువుగారు అందరినీ విశ్రాంతులు కండని సెలవు తీసుకొని పోతూ గురప్పస్వామిని దీపం ఆర్పుమని ఆదేశించినాడు. గురప్పస్వామి 16 అడుగుల దూరాన ఉండి తన నాలుకను పామువలె చాపి దీపం ఆర్పినాడు. అది గమనించిన దాదాపీరు స్వామి శిష్యుని శక్తికి అబ్బురపడి తనను మించిన వాడైనాడని సంతోషించినాడు. కాని గురుపత్ని భయపడింది. ఏదో పాము దీపం ఆర్పి గురప్పస్వామి నోటిలోనికి పోయిందని గురప్ప పాముల మాంత్రికుడని ఆతణ్ణి తమ యింటినుండి వెడలగొట్టవలెనని భర్తను కోరింది. దాదాపీరు స్వామి అంగీకరించక ఆతడేదైనా నేరం చేస్తే వెడల గొడుదాము, ఇప్పుడే వద్దని భార్యనూరడించినాడు. ఆనాటి నుండి అనితర సాధ్యములైన పనులు కల్పించి దాదాపీరుస్వామి ఆయన భార్య ఇరువురు గురప్పస్వామిని కష్టపెట్టినారు. గురప్ప స్వామి మాత్రం గురుదంపతులు చెప్పే పనులన్నీ అలవోకగా చేస్తున్నాడు.

భార్యపోరు పడలేక దాదాపీరుస్వామి ఒక సాయంకాలం ఆకాశం నిండా మబ్బులు క్రమ్మి పెనుగాలి వీస్తుండగా శిష్యుణ్ణి పిలిచి పెరుమాళ్ళపల్లెకు (ఇప్పటి పోరుమామిళ్లకు తొలిరూపం) పోయి పొగాకు చుట్టలు మోదుగాకు విస్తళ్ళు తెమ్మని ఆదేశించి నారు. ఈసాయంకాలం పెద్ద వానకురుస్తుంది కనుక పొలిమేర వాగు పొంగుతుంది. వీడు చుట్టలు విస్తళ్ళు తేలేకపోతే ఆ సాకుతో వెళ్లగొట్ట వచ్చునని పీరుస్వామి తలంపు గురప్పస్వామి గురువు లాదేశించిన ప్రకారం పోరు మామిళ్ళకు పోయి పొగాకు చుట్టలు

విస్తళ్ళు తీసుకొని వస్తుండగా ఏరు పొంగిపొరలుతున్నది. గురప్ప స్వామి అశ్రునయనాలతో గంగాభవానిని ప్రార్థించినాడు. వేళకు గురువుగారికి ఆయా వస్తువులు సమర్పించకపోతే గురుద్రోహం జరుగుతుంది. నన్నురక్షించుతల్లీ నాకు దారిఇమ్మని ప్రార్థించినాడు. గంగాభవాని ఆతని సత్యసంధతను గురుభక్తిని, ఆర్తిని మెచ్చి ప్రత్యక్షమై దీవించి ప్రవాహాన్ని స్తంభింపజేసి దారియిచ్చినది. గురప్పస్వామి పరుగుపరుగున పోయి ఆవస్తువులు గురువుల కప్పగించినాడు. గురుదంపతులు సంభ్రమాశ్చర్యములకు లోనైనారు. ఏరుదాటి ఎట్లా రాగలిగినావంటే గురప్పస్వామి జరిగినదంతా వివరంగా చెప్పినాడు. దాదాపీరుస్వామి లోలోన సంతోషిస్తూ పైకి మాత్రం కోపం ప్రకటించినాడు. గంగను నిలబెట్టే శక్తి నీకెవ్వరిచ్చినారు. నీవు గురువాజ్ఞను ధిక్కరించినావు, మా ఇంటినుండి వెళ్ళిపో అన్నారు. గురప్పస్వామి గురుదంపతుల కాళ్ళపైబడి క్షమించవలసిందిగా ప్రార్థించినాడు. అప్పుడు పీరు స్వామి ఇది నీకు పరీక్ష. నీ గొప్పతనం నీశక్తి లోకానికి చాటటానికే నిన్ను ఇన్నాళ్ళుగా పరీక్షిస్తున్నాము. నీవు కృతార్థుడ వైనావు. నీవు శివాంశ సంభూతుడవు. ముందుముందు నీవు మద్దిమానువై నిన్ను కొలిచేవారికి కొంగుబంగారం ఔతావు. భక్తుల కోరికలు తీర్చే కల్పతరువు ఔతావు. నీమూలంగా బ్రహ్మవిద్యా ప్రచారం బాగా జరుగుతుంది. నీవు కారణజన్ముడవు. నీమూలంగా నాకు పేరుపెంపులు కలుగుతాయి. నీకు తెల్లగుర్రం వాహనం, ఎదురు వాహనం నంది, కాషాయ వస్త్రాలు, కాషాయ తలపాగా, నొసట విభూతి, మధ్య సింధూరతిలకం, వెండి జందెము, చేతిలో చెలకోల, బంగారు పావుకోళ్ళు, ఊరూరు తిరుగుతూ దుష్టశక్తులను

పారద్రోలి లోకకల్యాణం చేయి, నీకు వారపూజలు నాకు వార్షిక పూజలు, ఇక పోయిరా" అని దీవించినాడు.

20.2.2006 నాడు గురప్పగారి పల్లె కల్లపిచ్చయ్యకు శరీరావేశమై చెప్పిన మాటలు – "గురప్పస్వామి, దాదాపీరుస్వామి, కస్మూర్‌మస్తాన్‌వలీ, రహ్మతాబాదు నాయబ్‌రసూల్, గూగూటి కుల్లాయప్పస్వామి, కదిరి నరసింహస్వామి, మద్దిలేటి స్వామి, పెంచెల నరసింహ స్వామి, గంగమ్మతల్లి, పోలేరమ్మ తల్లి, అందరూ ఒకటే. వారిలో భేదాలు లేవు. వారు భూమ్యా కాశములంతటను ఆవరించి యున్నారు. దాదాపీరుస్వామికి గంధోత్సవం మలీదా ముద్దలు చేసి శుక్రవారం నాడు ఉత్సవాలు జరుపవలెను".

తత్ఫలితంగా 24.2.2006 శుక్రవారం నాడు హిందువులు ముస్లింలు వృద్ధులు స్త్రీలు పురుషులు పిల్లలు దాదాపు 200 మంది కూడి మేళతాళములతో 7గం॥ రాత్రి పోరుమామిళ్ళ నుండి బయలుదేరి ఎగుడుదిగులు కంపపొదలు గడచి భుజముల వరకు వచ్చిన లోతునీళ్ళలో నడచినారు. దాదాపీరుస్వామి, గురప్పస్వామి ఇరువురు మహాత్ములు ఆ భక్త సందోహాన్ని ఆవహించి ఆచీకటిరేయి నీళ్ళలో నడిపించినారు. భక్తులు దాదాపీరుస్వామికి మ్రొక్కులు చెల్లించినారు. ధర్మం నశించేముందు ధర్మోద్ధరణకై మేము ఇట్లా పుడుతామని గురప్పస్వామి అన్నారు.

మద్దిమాను గురప్పస్వామికి 1881 సం॥ పూర్వం సావిశెట్టిపల్లె వారణాసి బ్రాహ్మణయ్య పూజారిగా ఉండి నిత్యార్చనం సాంవత్సరికోత్సవాలు నిర్వహించే వాడు. సావిశెట్టిపల్లెనుండి గురప్పస్వామి పల్లెకు ప్రతిదినం ఉదయాస్తమానములు పోయిరావటం, అందులోను

సగిలేటి మడుగునీళ్ళలో నడచి పోయిరావటం ఇబ్బందిగా ఉండేది. పూజారి తన బాధ్యతలు గురప్పస్వామి పల్లెలోనే ఎవరికైనా అప్పగించవలెననుకున్నారు. తనను భక్తి శ్రద్ధలతో బాధల కోర్చి అర్చించే ఈ పూజారికి మేలు చేయవలెననుకొన్నాడు గురప్ప స్వామి. ఒకనాడు సాయంకాలం దీపార్చన చేసి పోతున్న పూజారి వెంట దిగంబర బాలకుడుగా వెన్నంటినాడు. ఒక మైలుదూరం పోయిన తరువాత తనను ఎవరో వెంబడిస్తున్నారని వెనుదిరిగి చూచిన పూజారికి దిగంబర బాలకుడు కనబడ్డాడు. ఎవరు నాయనా అని అడిగితే సమాధానం లేదు. ఇట్లా మరి కొంచెం దూరం పోయిన తరువాత మరల అడిగినా సమాధానం లేదు. అబ్బాయి మూగవాడు కాబోలుననుకొని ఇల్లు చేరినాడు. భార్య ఈతడెవరని అడిగితే ఎవరో మూగవాడు పాపం. మనయింట్లోనే ఉంటాడులే అన్నాడు. పని ఉండి మరునాడుదయం ఆ పూజారి వేరే గ్రామానికి పోయినాడు. పూజారి భార్య ఆబాలునిగూర్చి అంతగా పట్టించుకోలేదు. సాయం సంధ్యవేళ దీపం వెలిగించింది. భోజనం చేస్తుండగా దీపం సన్నగిలితే ఆమె ఆ అబ్బాయిని పోయి వత్తిని ఎగదోసి నూనె పోయుమన్నది. ఆతడు దూరం నుండే నాలుక సాచి వత్తి ఎగదోసి నూనెపోసినాడు. నోటినుండి పాము వెడలి వత్తి ఎగదోయటం చూచి భయభ్రాంతురాలై ఆమె క్రింద పడిపోయినది. తీవ్రమైన జ్వరం వచ్చింది. మరునాడు భర్తరాగానే ఆమె జరిగినదంతా చెప్పింది. భర్త భార్యతో నాకుగూడ గుడివద్ద నాగుబాము కనిపించింది ప్రతిదినం ఇంతదూరం వచ్చి ఇట్టి భయాందోళనలు కలిగించే సమయంలో దేవాలయార్చ కుడుగా ఉండజాలనంటే నీకు మేలుచేస్తాను వదులుకోకు అని ఈబాలుడు

నిజరూపం చూపినాడన్నాడు. ఐనా పూజారి గుడికి సంబంధించిన డాక్యుమెంట్లు పూజా సామగ్రి గురప్పగారి పల్లె ప్రజలకు అప్పగించినాడు.

1881 నుండి ఆలయ ధర్మకర్తగా ఆపల్లెలోని నాగిరెడ్డి శేషారెడ్డి ఉంటున్నాడు. పూర్వం ఏటిని ఆనుకొని ఒకపల్లె ఉండేది. గురప్ప స్వామి ఆపల్లీయులను ఒకగొల్లబోయ ద్వారా పిలిపించుకొన్నారు. తాము మద్దిమానులో ఉంటూ మీ పల్లెలను దుష్టశక్తుల బారినుండి కాపాడుతానని ఆపల్లెకు తనపేరుతో గురప్పగారిపల్లె అని పేరు పెట్టుకొండి. మీకానుకలు స్వీకరిస్తూ మిమ్ముల కాపాడుతానని వారికి వరమిచ్చినారు. నన్ను మద్దిమాను గురప్పస్వామిగా పిలువండి. నా వెంట పోలేరమ్మ నిలుస్తుంది. నాకు సాత్వికాహారం ఐదు చోళ్ళు పొంగు పాలనైవేద్యం పోలేరమ్మకు మేకపోతు నిమ్మకాయ పులగం నైవేద్యం పెట్టండి అని ఆదేశించినారు. అప్పటి నుండి స్వామివారు గురప్పగారిపల్లె, రెడ్డికొట్టాల, రంగసముద్రం, పీరుసాహెబ్‌పల్లె, సావిశెట్టిపల్లె మొదలైన గ్రామాలను కాపాడు తున్నారు. 1955 సంవత్సరానికి పూర్వం భక్తులు ఏటిమడుగు నీళ్ళలో పోయి నైవేద్యం సమర్పించేవారు. 1956 సం॥ స్వామి సగిలేరు ప్రాజెక్టులో మునిగిపోయినారు. 1958 సం॥ స్వామి ఆజ్ఞ ప్రకారం మరలస్వామికి పశ్చిమాభిముఖంగా గుడికట్టి దాని కెదురు తూర్పుముఖంగా శ్రీరామాలయం నిర్మించినారు. ఈ గురప్పస్వామి హిందువులతోపాటు ముస్లింల పూజలందు కుంటున్నారు.

గురప్పస్వామి దాదా పీరుస్వామివద్ద 15 సం॥ బ్రహ్మవిద్య నేర్చినాడు. దాదాపీరుస్వామి గురప్పస్వామికి నవవిధ, భక్తి మార్గములు, 24 తత్త్వములు, శరీరత్రయము, అవస్థాత్ర యము, పంచకోశముల వివరము, పంచభూతముల వివరము, గుణ

త్రయము, ఈషణత్రయము, అరిషడ్వర్గము, సప్తవ్యసనములు, ఓంకారము, పంచప్రాణాగ్నుల ఆహుతుల వివరములు, అన్నప్రాశనం, సంచితప్రారబ్ధ ఆగామి కర్మలు మొదలైన విషయములు నేర్చినారు. ఈ వివరమంతయు చాలా సులభమైన భాషలో ఉంది.

గురప్పస్వామివారి పంచసూక్తులు I నీ వెంట వచ్చేవి పోయేవి 1. పేదరికం 2. వ్యాధి 3.డబ్బు II నీ వెంటరానివి 1. కాలం, 2. యౌవనం, 3. పరువు III నీవెంట వచ్చి వదలిపోనివి 1. కీర్తి, 2. అజ్ఞానము, 3. విద్య. IV నీ వెంట వచ్చేవి 1. పాపం, 2. పుణ్యం, 3. నీ నీడ V నీవు ఏమిచేసినా చూచేవారు పగలు, 1. సూర్యుడు, 2.ఆకాశం, 3. గాలి, 4.భూమి, 5. నీనీడ, రాత్రి 1. చంద్రుడు 2. ఆకాశం 3. గాలి 4. భూమి 5. నక్షత్రాలు 6. నీనీడ. వీరినే పంచభూతాల సాక్షి అంటారు. వీనిని గమనించి మనిషి బ్రతుకాలె.

1990 సం॥ గురప్పస్వామికి గర్భగుడికట్టి ఆలయ పునరుద్ధరణం చేసినారు. 2001 సం॥ ఈ దేవాలయం ఎండోమెంటు పర్యవేక్షణలోనికి వచ్చింది. పాలకమండలి ధర్మకర్త నాగిరెడ్డి వీరారెడ్డి, సభ్యులు కొండ్రెడ్డి చిన్న గురివిరెడ్డి ఊటుకూరి రమణమ్మ, ఆదిబోయిన చినకొండయ్య, బద్వేలు చిన్నవెంకటయ్య.

ఆధారం :-

శ్రీమద్దిమానుగురప్పస్వామి. రచన సేకరణ, గొడ్లవీటి వీర గురుమూర్తి, అన్నలూరు గ్రామం, మైదుకూరుమండలం, కడపజిల్లా 2007

8. బమ్మెరపోతన

(15వ శతాబ్దం-ఉత్తరార్థం)

ప్రాచీనాంధ్రకవులలో భక్తి, కర్మ, జ్ఞాన, యోగమార్గాల ద్వారా జీవన్ముక్తులైన మహానుభావులెందరో ఉన్నారు. ప్రథమాంధ్ర మహాకవి నన్నయ కర్మమార్గావలంబి, తిక్కన జ్ఞాన మార్గావలంబి, పోతన భక్తిమార్గావలంబి, పరశురామ పంతుల లింగమూర్తి యోగమార్గావలంబి, ఆంధ్ర కవిత్వాకాశంలో తిక్కన పోతనలు సూర్య చంద్రులు, పోతన ఒక కవిప్రవక్త. వంగదేశంలో చైతన్య మహా ప్రభువుకంటె అర్ధశతాబ్దం ముందే ఆంధ్రదేశంలో కృష్ణతత్త్వం ప్రచారం చేసిన మహానుభావుడు. మోక్షశాస్త్రమైన భాగవత కల్పతరువును నారదుడు వైకుంఠం నుండి భూమికి తెచ్చి వ్యాసునికిస్తే దానికి అంటుగట్టి తెలుగునాట నిల్పిన పరమభక్తుడు

పోతన. ఓరుగల్లు మండలం జనగామ తాలూకా బమ్మెరగ్రామం ఆయన జన్మస్థలం; పూర్వులనివాసం కూడ. పురాణం హయగ్రీవ శాస్త్రి వావిలికొలను సుబ్బారావు పోతన రాయలసీమలోని ఒంటిమిట్టవాడని తొలినాళ్ళలో వాదించినారు కాని వీరేశలింగం పంతులు, కొమఱ్ఱాజు లక్ష్మణరావు పంతులు, అటు తరువాత కవి చరిత్రకారులందరు పోతన ఓరుగల్లువాడని అనేక చారిత్ర కాధారములతో నిరూపించినారు.

పోతన పేరుతో ప్రచారంలో ఉన్న ఇతరకృతులు వీరభద్ర విజయము, భోగినీ దండకము, నారాయణ శతకములు ఇందులో వీరభద్రవిజయం పోతన బాల్యకృతి అని తక్కిన రెండు ఆయన కృతులు కావని పండిత విమర్శకుల అభిప్రాయం. కాని చారిత్రకులు మాత్రం భోగినీదండకం పోతన కృతియే అని, దాని కృతిపతి ముమ్మడి సర్వజ్ఞ భూపాలుడని (1430–1470) ఊహించినారు. పోతనకాలం కూడ ఇదమిత్థంగా తెలియదు. ఆయన 1410–1510 మధ్యకాలంలో ఎప్పుడో ఉండినట్లు ఒక్కొక కవిచరిత్రకారు లొక్కొక విధంగా ఊహించినారు. ఐతే 15వ శతాబ్దం ఉత్తరార్ధం పోతనకాలంగా సంభావింపవచ్చు. భాగవతం లోని కొంతభాగం శిథిలమై పోవటానికి కూడ తీరుతీరు కథ లున్నవి. భాగవతంలో ఉత్సన్న మైన భాగాలు షష్ఠ, సప్తమ, ఏకాదశ, ద్వాదశ స్కంధాలు. పోతన శిష్యులు కరీంనగరం జిల్లా వెలిగందల నారయ, ఏర్చూరి సింగన గంగనలు ఈ భాగాలు పూరించినారు.

వీరభద్రవిజయంలో పోతన పూర్వికులు ఆరుతరాల వారి పేర్లున్నవి. వారు మల్లయ భీమయ అన్నయ (భార్యగౌరమ్మ)

సోమన (భార్యమల్లమ) 1) రేచన 2) అన్నయ 3) ఎల్లన 4) అయ్యలు ప్రెగడ 5) మాదయ. ఈ ఐదుగురన్నదమ్ములలో మూడవవాడైన ఎల్లన భార్య మాచాంబిక. ఈ దంపతుల సంతానం 1) కేసన (భార్యలక్ష్మమ్మ) 2) మాధవుడు 3) ఇమ్మడి నాగయలు. ఈ ముగ్గురన్నదమ్ములలో జ్యేష్ఠుడు కేసన లక్ష్మమ్మల సంతానం 1) తిప్పన 2) భాగవతకర్త పోతన, ఆయన భాగవతంలో పేర్కొన్న తన పూర్వులపేర్లు కౌండిన్యసగోత్రికుడు భీమనమంత్రి అన్నయ (భార్య గౌరమ్మ) సోమన (భార్యమల్లమ్మ) ఎల్లన (భార్య మాచమ్మ) కేసన (భార్య లక్కమాంబ). ఈ కేసన లక్కమాంబల సంతానం 1) తిప్పన 2) భాగవతకర్త పోతన. పోతన శ్రీనాథునికి బావమరిదియని పోతన కొడుకు మల్లన అనీ చెప్పేవి కల్పిత కథలు. తరువాతి కాలాన దాక్షాయణీ పరిణయకర్తలు కేసన మల్లనలనే జంటకవులు పూర్వకవిస్తుతిలో పోతన తమపూర్వుడని చెప్పినారు. ఇంకను పోతన కొడుకు కేసన అని అతడు ప్రౌఢసరస్వతి బిరుదాంచితుడని చెప్పినారు ప్రౌఢసరస్వతికి అప్పలమ్మ వీరమ్మ ఇరువురు భార్యలు. అప్పలమ్మ కొడుకు కేసన్న వీరమ్మ కొడుకు మల్లన. వీరికి పోతనతాత. అజ్జరపు పేరయ లింగకవి ఒడయనంబి విలాసం రచయిత. ఆయన ప్రౌఢ సరస్వతి బిరుదాంచితుడైన కేసన పెద్దభార్య అప్పలమ్మ కూతురు ఎల్లమ్మ పుత్రుడననీ, తమ సంతానం వీరనరసమ్మ గంగన్నలనీ చెప్పినాడు. ఇందరి పేర్లు లభిస్తున్నాయి కాని పోతన భార్య పేరేమిటో ఎవరూ చెప్పలేదు. పోతన తరువాత బమ్మెరవంశంలోనే కాక వారి ఆడుబిడ్డల వంశంలోను కవులుండినట్లు తెలుస్తుంది. తరువాతి కాలాన విశిష్టాద్వైతులుగా మారిన పోతన వంశీయులు బమ్మెర, పెండ్యాల

గ్రామాల్లోను చుట్టుపట్టు గ్రామాల్లోను ఇప్పటికీ ఉన్నారు. పోతనకు పూర్వు లందరు శివభక్తులు. పోతన తమ తండ్రి కేసన శైవ శాస్త్రమతము గన్నవాడనీ, తల్లి లక్కమాంబ సదాశివ పాద యుగార్చనాను కంపానయవాగ్భవాని యనీ, అన్నగారైన తిప్పన ఈశ్వర సేవా కాముడనీ వర్ణించినాడు.

వ్యాసులవారి సంస్కృత భాగవతపురాణాన్ని తెలుగులో యథాను వాద, భావానువాద, స్వతంత్రానువాద పద్ధతుల్లో ఆంధ్రమహా భాగవతంగా మలచిన పోతనకు పోతనయే సాటి. భక్తిరస బంధురమూ సులభ సుందరమునైన తెలుగు కృతులలో పోతనగారి భాగవతానికి ఆ భాగవతమే సాటి. భాగవతం ముక్తి నివసనం. పరీక్షిన్మహారాజు ఏడుదినాలు మాత్రమే శుకమహర్షి నోట భాగవతం విని మోక్షం పొందినాడు. అందుకే పోతన తానూ **"శ్రీకైవల్య పదంబు చేరుటకు నై"** మోక్ష ప్రదాతయైన మహా నందాంగనాడింభకుని లీలామహిమాను వర్ణనం చేసే ఆంధ్ర మహాభాగవతం రచించినాడు. భాగవత రచనకు పూనిక చేసిన పోతన ఒకానొక చంద్రగ్రహణ పుణ్యకాలాన గోదావరీ గంగకు (మంథని కరీంనగరం జిల్లా) పోయి స్నానం చేసి మహేశ్వర ధ్యానం చేస్తుంటే "మెఱుగు చెంగటనున్న మేఘంబు కైవడి నువిద చెంగటనుండ నొప్పువాడు" "వల్లీయుత తమాల వసుమతీజము భంగి బలువిల్లు మూపున బరగువాడు" నైన ఒకరాజ ముఖ్యుడు ప్రత్యక్షమై తాను రామభద్రుడననీ శ్రీమహాభాగవతం తెనుగుచేసి తనకు అంకితం చేస్తే "నీకు భవబంధంబులు తెగు"ననీ ఆనతిచ్చి తిరోహితుడైనాడు. పోతన **"పలికెడిది భాగవతమట పలికించెడు వాడు రామభద్రుండట, నే పలికిన భవహరమగునట, పలికెద**

వేరొండు గాథ పలుకగనేలా" (వాడు = సః; నే=అహం = సో ఽ హం. రసోవైసః రసగ్ంం హ్యే వాయం లబ్ధ్వా ఽ ఽ నందీ భవతి) అని కృత నిశ్చయుడైనాడు. **"శ్రీమహాభాగవత పురాణ పారిజాత పాదప సమాశ్రయంబునను, హరి కరుణా విశేషంబునను కృతార్థత్వంబు సిద్ధించెనని"** గుర్తించి ఓరుగల్లుకు తిరిగివచ్చి గురు వృద్ధ బుధ బంధుజనుల ఆజ్ఞతో భాగవతం రచించినాడు. ఇది చాలా విచిత్రమూ అద్భుతమూ ఐన సన్నివేశం పోతన గంగ ఒడ్డున (తెలంగాణంలో గోదావరిని గంగ అంటారు) చేసినది శివధ్యానం, ప్రత్యక్షమైనది రామభద్రుడు; ఆనతిచ్చినది శ్రీమహావిష్ణువు లీలలు వర్ణించుమని, శివభక్తుడైన పోతన శ్రీహరిలీలలు వర్ణించి శ్రీరామచంద్రునికి అంకితం చేసి జీవన్ముక్తుడైనాడు.

నన్నయతిక్కనాది పూర్వకవులు తనకోసమే భాగవతాన్ని విడిచి పెట్టినారనీ భాగవతం తెనుగుచేసి తన జన్మసఫలం చేసుకుంటాననీ ఇక తనకు పునర్జన్మ లేదనే చెప్పినాడు. ఈ విధంగా **"లలిత స్కంధము కృష్ణమూలము శుకాలాపాభి రామం"**బైన భాగవత కల్పతరువు ఆంధ్రులకు చిక్కింది. శ్రీహరి పాదోద్భవయై శివజటా జూటంనుంచి భూమిపైకి అవతరించిన గంగా పుణ్యస్నానాల ఘట్టాలకంటె శ్రీమద్భాగవతంలోని మధురమంజుల పుణ్యఘట్టా లధికం. అవియన్నీ **"చిత్రంబులు త్రైలోక్య పవిత్రంబులు భవలతా లవిత్రంబులు సన్మిత్రంబులు మునిజనవన చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్"**.

పోతన భాగవతం పీఠిక శ్రీకైవల్యపదంబు జేరుటకునై మొదటి పద్యంలో కావ్యవస్తు నిర్దేశం చేసినా కృతిపతినిర్ణయం రెండోపద్యం

“చేతులారంగ శివుని పూజింపడేని, నోరు నొవ్వంగ హరికీర్త నుడువడేని, దయయు సత్యంబులోనుగా దలపడేని, కలుగనేటికి తల్లుల కడుపుచేటు” అంటూ కర్మ, భక్తి, జ్ఞాన మార్గాల ప్రపంచీకరణంగా సూచించినాడు. ఈ మార్గాలు కుంతీదేవీకృత శ్రీకృష్ణస్తుతి, భీష్మకృత శ్రీకృష్ణస్తుతి, విదురమైత్రేయ సంవాదం, కపిల దేవహూతి సంవాదం, పురంజనో పాఖ్యానం, ప్రహ్లోదాజగర సంవాదం, ప్రహ్లోదచరిత్ర, గజేంద్రమోక్షం, వామన చరిత్ర, అంబరీషోపాఖ్యానం, శ్రీకృష్ణావతార ఘట్టం, శ్రుతిగీతలు, రుక్మిణీ కల్యాణం, నరకాసురవధ అవధూత యదుసంవాదం, మార్కండే యోపాఖ్యానం, రుద్రగీత కుచేలోపాఖ్యానం, ధ్రువోపాఖ్యానం, గోపికాగీతలు, జలక్రీడలు, భ్రమరగీతలు మొదలైన శీర్షికల్లో గుర్తించవచ్చు. భగవద్వర్ణన చేసే సందర్భంలో పోతన పరవశుడై మూలాన్ని మించిన వర్ణనలు చేసినాడు. భాగవతంలోని శృంగారం కూడ చాలా విశిష్టమైనది. ఆయన రచనలో భావకవితా స్ఫూర్తి ఎక్కువ. గద్యంలో పద్యంలో పోతన ప్రయోగించిన తీరుతీరు అనుప్రాసలు శబ్దఘటనలు మృదంగ ధ్వనులుగా, మధురమంజుల శబ్దాలు తాళములుగా గంగా ప్రవాహధ్వనులను తలపిస్తాయి. తెలుగుపాఠకులను రసపారవశ్యంలో ఓలలాడిస్తాయి. అందు వలననే భాగవతం సార్వజనీనమైనది; పండిత పామర జనాను రంజకమైనది. ఆపత్సమయముల్లో గజేంద్రమోక్షం, భగవద్గీతల వలె గోపికాగీతలు, యుక్తవయస్కలైనా పెండ్లికాని ఆడపిల్లల యిండ్లలో రుక్మిణీకల్యాణం పఠించటం తెలుగునాట ఆచారమై పోయినది.

భగవాన్ శ్రీసత్యసాయిబాబా తరచుగా పోతన భాగవతంలోని చాలా పద్యాలు తమ ఉపన్యాసాల్లో ఉదాహరిస్తుంటారు. సుయజ్ఞో

పాఖ్యానం నుండి **"మచ్చిక వీరికెల్ల బహుమాత్రము చోద్యము దేహిపుట్టుచుం, జచ్చుచునుండ జూచెదరు చావక మానెడువారి భంగినీ, చచ్చినవాని కేడ్చెదరు చావునకొల్లక దాగవచ్చునే, యెచ్చట బుట్టె నచ్చటికి నేగుట నైజము ప్రాణికోటికిన్"** (VII-46) పద్యం ఉదాహరించి **"భాగవతం చదివితే బాగవుతాం"** అని చమత్క రిస్తుంటారు. ద్రౌపది గొప్పదనం చాటుతూ **"ఉద్రేకంబునరారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు" "కొడుకులబట్టి చంపెనని కోపము నొందదు"** (I-162, 168) పద్యాలుదాహరిస్తారు. కుంతీదేవీకృత శ్రీకృష్ణస్తవం నుండి **"శ్రీకృష్ణాయదుభూషణా నరసఖా శృంగార రత్నాకరా"** (I-200), భీష్మకృత శ్రీకృష్ణస్తవం నుండి **"ఒక సూర్యుండు సమస్తజీవులకు దానొక్కొక్కడై తోచు"** (I-226), **''హరిమయము విశ్వమంతయు''** II-17, **''చిత్రంబులు త్రైలోక్యపవిత్రంబులు భవలతాలవిత్రంబులు సన్మిత్రంబులు మునిజనవన చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్"** (VII-6), ప్రహ్లాద చరిత్ర నుండి **"తనయందు నఖిల భూతములందునొక భంగి సమహితత్త్వంబున జరుగువాడు'' ''పానీయంబులు ద్రావుచుంగుడుచుచున్ భాషించుచున్'' "మందారమకరంద మాధుర్యమునదేలు మధుపంబు వోవునే మదనములకు'' "కమలాక్షునర్చించు కన్నులు కన్నులు" "కంటిరే మనవారు....... త్రోవ వెదకికొనుట దొడ్డబుద్ధి" "ఇందుగలడందులేడని సందేహము వలదు''** (VII-115, 123, 150, 169, 214, 275) గజేంద్రమోక్షం నుండి **"ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై" ''లావొక్కింతయులేదు ధైర్యము విలో లంబయ్యె" "సిరికింజెప్పదు శంఖచక్రయుగమున్"** వామన చరిత్రమునుండి

"కారే రాజులు రాజ్యముల్ గలుగవే" "ఇంతింతై వటుడింతయై" (VIII–73,90,96, 590, 622), **"కలయో వైష్ణవ మాయయో" "కర్మమునబుట్టు జంతువు, కర్మముననవృద్ధిబొందు కర్మమున జెడున్" "నల్లనివాడు పద్మనయనంబులవాడు" "నీపాదకమల సేవయు, నీపాదార్చకులతోడి నెయ్యమును''**, (X–342, 884,1010, 1269) వంటి పద్యాలు ఉదాహరిస్తారు. బాబావారికి పోతన శబ్దాలంకార ప్రయోగాలు చేసిన కొన్ని పద్యాలు కూడ ఇష్టం. అందుకు ఒక ఉదాహరణం. పురుషకారం ఫలించక గజేంద్రుని సర్వస్యశరణాగతుడై శ్రీమహావిష్ణువును ప్రార్థిస్తే గజేంద్రునిమొరాలకించి శ్రీమహావిష్ణువు గొప్పసంరంభంతో తొందరగా బయలుదేరితే లక్ష్మీదేవి ఆ సంరంభమేమిటో తెలుసుకోవలెనని **"అడిగెదనని కడువడిజను, నడిగినతను మగుడనుడుగడని నెడనుడుగున్, వెడవెడ చిడుముడి తడబడ, నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్"** (VIII–103) అనే పద్యం ఉదాహరిస్తారు. బాబా ఉపన్యాసాలు అనువదించే వారి నోళ్ళు మూతలుపడుతవి. శ్రోతలంతా గొల్లుమంటారు.

సందర్భం కాకపోయినా పోతనగారి శబ్దాలంకార ప్రయోగ ప్రభావం నేనెరిగినది ఇంకొకటి మనవిచేస్తాను. సుప్రసిద్ధ వెంట్రిలాకిస్ట్ నేరెళ్ళ వేణుమాధవ్ ఒకసభలో ధ్వన్యనుకరణ ప్రావీణ్యం ప్రదర్శిస్తున్నాడు. శ్రోతల్లో నేనొకడను. నా ప్రక్కన ఒక ఆంధ్రేతరు డున్నాడు. వేణుమాధవ్ భాగవతంలోని నరసింహావతారా విర్భావం ఘట్టంలోని రెండుపుటల దీర్ఘ వచనం "ఇట్లు దానవేంద్రుండు... సభామండపస్తంభంబు వ్రేసిన వ్రేటు తోడన దశదిశలను మిడుంగుఋలు చెదరం జిటిలి పెటిలిపడిబంభజ్య మానంబగు

నమ్మహాస్తంభంబు వలన ప్రళయవేళా సంభూత సప్తస్కంధ బంధుర సమీరణ సంఘటితఘోర జోఘుష్యమాణమహావలాహక వర్గనిర్గతనిబిడనిష్ఠుర దుస్సహ నిర్ఘాత సంఘ నిర్ఘోష నికాశంబు లైన ఛటచ్ఛటస్ఫటస్ఫట ధ్వని ప్రముఖ భయంకరారావ పుంజంబులు జంజన్యమానంబులయి (VIII–285) మేఘగర్జన వలె వినిపించినాడు. నా ప్రక్కనున్న శ్రోత ఇది నిజంగానే నరసింహావతార విర్భావం వలె ఉన్నదని అభినందించినాడు. ఇట్టి గుండెలదరించే వర్ణనలేకాక మధురమంజుల శబ్దాలు గురిపించిన పద్యాలుగద్యములు పోతన గారి భాగవతంలో చాలా ఉన్నవి.

ఒకప్పటి పల్లెటూరి బడులలో అఆలు, గుణింతాలు, ఎరుసుల తరువాత వేమన, సుమతి, కృష్ణ, నరసింహ శతకముల పద్యాలతో పాటు భాగవతంలోని కొన్ని మంచి మంచి పద్యాలు అందమైన ఘట్టాలు కంఠస్థం చేయించేవారు. అంతటితోనే చదువులు ముగించినవారు ఏ వృత్తి అవలంబించినా తమ సంస్కారాన్ని అభిరుచిని అనుసరించి రామాయణ భారత భాగవతాలు వినేవారు చదువుకునేవారు. ఇట్లా విన్నవారు చదువుకున్నవారు స్త్రీ పురుషులు ఎందరో భాగవతం లోని పద్యాలు ఇప్పటికీ స్మరిస్తుంటారు. తల్లిదండ్రుల నుండి నేర్చిన పిల్లలు పెద్దవారైన తరువాత గూడ మరచిపోని పద్యాలు భాగవతంలో మరికొన్ని.

“నిగమములు వేయు చదివిన” “కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి” “మనసారథి మన సచివుడు (I–140, 222, 358), “హరి మయము విశ్వమంతయు”, “కమనీయభూమి భాగములు లేకున్నవే” “ఉపవాస వ్రత” (II–17,21,214), “కామోత్కంఠత

గోపికల్" "రెక్కలురావు పిల్లలకు" "గాలింకుంభిని నగ్నినంబువుల" "పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్" "లోకములన్నియుం గడియలోన" "ఇందుగలడందులేడని" "లేదని యెవ్వరి నడుగను" "నిందింపబరులనెన్నడు" (VII-18, 63, 90, 123, 267, 275, 439, 440),"ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు", "అలవైకుంఠపురంబులో" "సిరికిం జెప్పడు" "ఆశా పాశము దా కడున్నిడువు" "వారిజాక్షులందు వైవాహికము లందు" "ఇంతింతై వటుడింతయై" (VIII-73,95, 96, 575, 585, 622) వంటి పద్యాలు అప్పుడప్పుడు వల్లెవేసుకుంటారు. ఇక దశమస్కంధంలోని పూర్వభాగం శ్రీకృష్ణపరమాత్ముని ఆవిర్భావం, నందవ్రజంలోని సంబరాలు, ఆయన లీలలు వర్ణిస్తూ పల్లెటూరి ఆబాలగోపాలం స్త్రీలు, వృద్ధులు భాగవత రసామృతం అనుభవిస్తారు.

"అన్నవు నీవు చెల్లెలికి" "గురుపాఠీనమవై" "పంకజముఖి నీళ్ళాడను" "స్వచ్ఛంబులై పొంగెజలరాశులేడును" "పాడిరి గంధర్వోత్తములాడిరి" "అన్న శమింపుమన్న" "ఏమినోముఫలమొ" "జో జో కమల దళేక్షణ" "బాలురకు పాలులేవని" "ఓయమ్మ నీ కుమారుడు" "అమ్మామన్నుదినంగనే" "కలయోవైష్ణవ మాయయో" "చిక్కడు సిరికౌగిటిలో" "ఎండన్ద్రమ్మగ్గితి రాకటంపడితి" "ఏలా బ్రహ్మపదంబు" "కటిచేలంబు బిగించి" "మా మా వలువలు ముట్టకు" "నల్లనివాడు పద్మనయనంబులవాడు" "అక్రూరుండని పేరుపెట్టుకొని" "కన్నియమీద నా తలపు" "భూషణములు సెవులకు బుధతోషణములు" "లగ్నంబెల్లి వివాహముంగదిసె" "ఘనుడా భూసురుడేగెనో" "మృగనాభి యలదదు మృగరాజ మధ్యమ" ఉత్తర భాగంలోని "వరుజూచున్ హరిజూచు "బొమ్మ పెండ్లిండ్లకు"

"ఇందీవర శ్యాము వందితసుత్రాము" "ఏమి తపంబు సేసెనొకొ" వంటి పద్యాలు పల్లెటూరి జనం నోళ్లలో నానటం మహా భక్తుడు, పరమ భాగవతుడు బమ్మెరపోతనగారు తెలుగువారికి పెట్టిన భిక్ష.

"ఓయమ్మ నీ కుమారుడు, మాయిండ్లను పాలుపెరుగు మననీడమ్మా,
పోయెదమెక్కడికైనను, మాయన్నల సురభులాన మంజులవాణీ
"జోజో కమలదళేక్షణ, జోజో మృగరాజు మధ్య జోజోకృష్ణా
జో జో పల్లవకరపద, జోజో పూర్ణేందు వదన జోజో యను
చున్" "పాపనికి నూనె తలయంటి పసుపుబూసి, బోరు
కాడించి హరి రక్ష పొమ్మటంచు, జలములొకకొన్ని చుట్టి
రాజిల్లి తొట్ల, నునిచి దీవించి పాడి రయ్యువిదలెల్ల
"లోకములు నిదురవోవగ, జోకొట్టుచునిదురవోని సుభగుదు
రమణుల్, జోకొట్టిపాడ నిదురం గైకొను క్రియ నూర
కుండె కనుదెరవకయున్" వంటి పద్యాలు తెలుగు తల్లులు పాడినంతకాలం పోతనగారి భాగవతం తెలుగు సాహిత్యాకాశంలో ధ్రువతారగా వెలుగుతుంది.

"నాకు మేలుగోర నాభక్తులకు గాని, భక్తజనులకేన పరమగతియు
భక్తుదెందుజనిన బఱతెంతు వెనువెంట, గోవువెంట దగులు
కోదెభంగి IX-120

శ్రీకృష్ణపరమాత్ముడు చేసిన వాగ్దానం మరచిపోకుండా ఉందాము.

ఆధారం: -

శ్రీమదాంధ్రభాగవతము - వావిళ్ళవారి ప్రచురణ.

9. భద్రాచలం రామదాసు

(1620-1687)

భారతీయ కవిత్వం 1) ఆశ్రమకవిత 2) ఆశ్రయకవిత 3) అనుభవ కవిత అని మూడు తీరులుగా ఆచార్య బాడాల రామయ్యగారు వింగడించినారు. వనవాటికల్లో ఆశ్రమాలలో ఉంటూ **"లోకాః సమస్తాః సుఖినో భవన్తు"** అని ఆశించే ఋషులు మునులు రచించేది ఆశ్రమ కవిత. అది సహజకవిత. దానిలో అంతరాత్మ ప్రమేయ మెక్కువ. రాజాస్థానములలో పాలకుల, అధికారుల అభిరుచులకు సమకాలీన సాంఘికాభి రుచులకు అనుగుణంగా పండితకవులు వ్రాసే రసాలంకారరీతిశయ్యా పాకముల గుబాళింపులుండేది ఆశ్రయకవిత. ఇందులో బుద్ధిప్రమేయమెక్కువ. ఆయా కవుల వైయక్తిక సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, ప్రేమసంతోషాల సమస్తా నుభవాలను ప్రతిబింబించేది అనుభవకవిత. దీనిలో హృదయ

ప్రమేయం ఎక్కువ. ఇది సమకాలీన రాజకీయ సాంఘిక మత వ్యవస్థలను ధిక్కరించి వ్రాసినది కావచ్చు లేదా తమకు అభిమత మైన దైవం, మతం, ప్రేమ, భక్తి మొదలైనవి ఆధారంగా వెలువడిన దైనా కావచ్చు. సమకాలీనసమాజాన్ని సంస్కరించ వలెనని మంచి చెడుగులను చూపుతూ సన్మార్గోపదేశం చేసినవారిలో పోతులూరి వీరబ్రహ్మం, వేమన వంటి వారున్నారు. తాము నమ్మిన దైవాన్ని నోరారా కీర్తించి తాము తరించి ఇతరులను తరింప జేసినవారిలో అన్నమయ్య, భద్రాచలం రామదాసు, త్యాగరాజస్వామి వంటి భక్తులు చేరుతారు. ఈ మూడు తీరుల కవితలలో అనుభవకవిత ఎక్కువ వివాదాస్పదమైనది. కారణం; ఎవరి అనుభూతులు వారివి. ఇట్టి కవితలు వ్రాసిన వారెక్కువ కడగండ్ల పాలైనారు. తాను నమ్మిన దైవమును తప్ప రాజులను కీర్తించలేనని ధిక్కరించిన అన్నమయ్యకు సంకెళ్లు పడినవి. రాజద్రవ్యాన్ని దేవాలయ నిర్మాణాలకు ఉత్సవాలకు కైంకర్యం చేసిన భద్రాచల రామదాసు 12 ఏండ్లు కారాగారవాసం అనుభవించినాడు. రాజాశ్రయంకోసం ఉబలాట పడే అన్నగారి కోపానికి గురియై కష్టాలను అనుభవించిన వాడు త్యాగరాజు. ఈ ముగ్గురిలో కంచెర్ల గోపన్న అనే భద్రాచలం రామదాసు మన ప్రస్తుత కథానాయకుడు.

అది మొగలాయి ప్రభుత్వం పరాంకోటి అందుకున్నకాలం. ఔరంగజేబు చక్రవర్తి భారతదేశాన్ని అట్టుడికిస్తున్న కాలం. ఉత్త రాదిలో గురు గోవిందసింగు, దక్షిణాదిలో ఛత్రపతి శివాజీతోపాటు, నిజాంషాహీలు, ఖుతుబ్షాహీలు ఔరంగజేబును ఎదిరిస్తున్న కాలం. హిందూమతంలోని వివిధ శాఖలవాళ్లు, భక్తులు, సాధుసంతులు ప్రజలను జాగృతం చేస్తున్నకాలం. తుకారాం, సమర్థ

రామదాసస్వామి మహారాష్ట్రంలోను, దాస కూటములవాళ్ళు కన్నడ దేశంలోను, ఓఢ్రదేశంలో చైతన్య మహాప్రభువులు, తమిళదేశంలో శైవవైష్ణవ భక్తులు, భక్తి ఉద్యమాల ద్వారా ప్రజలను మేల్కొల్పుతున్న కాలం. అట్టి 17వ శతాబ్దం మధ్యభాగంలో కంచెర్లగోపరాజు భద్రాచలరాముని కీర్తిని భక్తిని ప్రజల్లో వ్యాపింప జేసినాడు. పండితులు భక్తుడనీ, ప్రజలు మహానుభావుడనీ, పామరులు దేవుడనీ కీర్తించిన కంచెర్ల గోపరాజు రామనామ స్రవంతులు పారించి భక్తిసస్యాలు తెలుగుదేశంలో పూటిగా పండించినాడు. ఆయన పుట్టినది ఖమ్మంజిల్లా నేలకొండపల్లి. ఆ మహాత్ముని చరిత్రం ఆయన రచనలద్వారా కొద్దిగా మాత్రమే తెలుస్తున్నది. ఆయన రచించిన దాశరథీ శతకాన్నిబట్టి కంచెర్లగోపన్న ఆత్రేయస గోత్రుడు ప్రథమశాఖ నియోగులు లింగనమంత్రి, కీర్తనల ప్రకారం కామమ్మ దంపతుల పుత్రుడు, రఘునాథభట్టరాచార్యులకు శిష్యుడు. పేర్లను బట్టి తల్లిదండ్రులు శైవులు. గోపన్న మాత్రం రఘునాథ భట్టరాచార్యుల వద్ద వైష్ణవం పుచ్చుకున్నాడు, రామదాసైనాడు.

రామదాసుగారి చరిత్రం తరువాతి భక్తకవులు హరికథలు యక్ష గానాలుగా కూర్చి ప్రచారం చేసినారు. అట్టివారిలో యాదవదాసు ప్రథముడు, హరిభజన సింగరిదాసు ద్వితీయుడు. గుంటూరువాసి రాజా తూము లక్ష్మీనరసింహదాసు గొప్ప భక్తుడు వాగ్గేయకారుడు. ఆయన తిరువయ్యారులో త్యాగరాజులవారిని దర్శించి, కంచిలో నాగండ్ల వరదరామదాసనే వాగ్గేయకారుని కలిసి ఆయనను తోడ్కొని 1832 భద్రాచలం చేరినాడు. ఆ యిరువురి చరమ జీవితాలు భద్రాచల రామచంద్రుని సన్నిధిలోనే గడిచినవి. ఇరువురు భద్రాచల క్షేత్రాభివృద్ధికై కృషిచేసి శ్రీరామపూజాదికాలు ఇతోధిక

ప్రాభవంతో జరిపినారు. భద్రాచల రామదాసుగారు వేయించిన దానశాసనం ధంసా అల్లరుల్లో భ్రష్టమైపోతే నరసింహదాసు అప్పటి నిజాం నాసరుద్దౌలా సహాయంతో పునరుద్ధరించి తిరిగి వ్రాయించి దేవాలయ కైంకర్యాలు యథావిధిగా జరిగే ఏర్పాటు చేసినాడు. ఆత్మీయమిత్రుడు వరదరామదాసు మరణిస్తే ఆయన శవం తీసుకొని భక్తి పారవశ్యంతో రామనామ సంకీర్తనం చేస్తూ గోదావరిలో ఐక్యమైపోయినాడు. ఇట్లా మిత్రసహగమనం చేసినవారు మనచరిత్రలో చాలా అరుదు. వరదరామదాసు భక్తరామదాసు కథను సంగ్రహంగా వ్రాస్తే తాను పెంచి వ్రాసినట్లు సింగరిదాసు చెప్పుకున్నాడు. రామదాసుగారి చరిత్ర హరికథగా అల్లిన తిరుక్కడయూరు కృష్ణదాసుకూడ 1800 ప్రాంతాల్లో ఉన్న వాడే. ఈ రచనలాధారంగా తెలిసే భద్రాచల రామదాసుగారి సంగ్రహచరిత్రం : -

క్రీ.శ. 1324 కాకతీయసామ్రాజ్యం పతనమైపోయిన తరువాత పాడుపడిన హిందూక్షేత్రాల్లో భద్రాచలం ఒకటి. 17వ శతాబ్దం పూర్వార్థంలో భద్రాచలం సమీప గ్రామంలో ఉండే పోకల దమ్మక్క తనకు స్వప్నంలో కనబడిన సీతారామలక్ష్మణుల విగ్రహాలు భద్రగిరిపై కనుగొని చిన్నగుడి కట్టించి ప్రతిదినం అర్చనాదులు జరిపేది. ఆ కాలంలోనే నేలకొండపల్లిలో ఉండే కామమ్మ లింగన్న దంపతులకు శ్రీరామచంద్రుని అనుగ్రహంతో 1620 ప్రాంతంలో ఒక కొడుకు పుడితే గోపరాజని నామకరణం చేసినారు. గోపరాజుకు ఉగ్గుపాలతో రామభక్తి అలవడింది. పెరిగి పెద్దవాడై తెలుగు సంస్కృతాలతో పాటు ఆనాటి రాజకీయాలకు అవసరమైన ఉర్దూ ఫార్సీ భాషలు నేర్చినాడు. బాల రామాయణం గోపరాజు

హృదయనిష్ఠమైనది. రఘునాథభట్టరాచార్యుల మంత్రోపదేశం పంచసంస్కారాలు గోపరాజును విశిష్టాద్వైతం భక్తి ప్రపత్తుల ఆదర్శమూర్తిగా తీర్చిదిద్దినవి. ఇంతలో లింగనమంత్రి కీర్తి శేషుడైనాడు. గోపరాజు తాతతండ్రుల ఆస్తిపాస్తులతో, తల్లిని తనను పోషించుకుంటున్నాడు. సమీపబంధువుల యింటి సంబంధం చూచి కామమ్మ గోపరాజుకు పెండ్లిచేసి తన చివరికోరిక తీర్చు కున్నది. కొంతకాలానికి కామమ్మ చనిపోయినది. గోపరాజుకు తగిన యిల్లాలు కమలమ్మ. దినదినం భక్తి పెరిగి భగవత్కైంకర్యం భాగవతార్చనం అతిథి పూజా సత్కారాలతో గోపరాజు ఆస్తి క్రమంగా కరగిపోయింది. గోరు చుట్టుపై రోకటిపోటువలె ఆ ప్రాంతంలో క్షామం ఏర్పడితే దయార్ద్ర హృదయుడైన గోపరాజు ఉన్న ఆస్తి సమస్తమూ వెచ్చించి పేదలకు అన్నదానం చేసి తానకించనుడైనాడు. చివరకు కమలమ్మ పోరుతో ప్రోత్సాహంతో నాటి ప్రభుత్వంలో గొప్ప పదవుల్లో ఉన్న అక్కన్న మాదన్నల ప్రాపకం సంపాదించి ముందుగా పేష్కారై అటు తరువాత పాల్వంచ పరగణా తహసీల్దారైనాడు. భద్రాచలం పాల్వంచ పరగణాలోనిదే. గోపన్న సంగతి విన్న పోకల దమ్మక్క భద్రాచలం శ్రీరాముని విషయం చెప్పినది. నాటినుండి గోపరాజు భద్రాచల రామునికి అంకితమై పోయినాడు. తన కార్యస్థానం భద్రాచలానికి మార్చుకొని నిత్యమూ భజనలు, భాగవతగోష్ఠులు, దేవాలయ కైంకర్యాలు జరుపుతూ శ్రీరామచంద్రునికి విశాలమైన మందిరం కట్టించి విశేషోత్సవాలు జరుపుతుండేవాడు. గోపరాజు కమలమ్మ దంపతులకు కొడుకు పుడితే రఘురాముడని నామకరణం చేసినారు. ఆ పిల్లవాడు పెరిగి బుడిబుడి నడకలతో తల్లిదండ్రులకు

భక్తులకు ముచ్చట గొలిపేవాడు. ఒకనాడు కమలమ్మ తదీయా రాధనాకార్య నిమగ్నయైయుండగా రఘురాముడు నడుచుకుంటూ పోయి వేడిగంజి గుంటలో పడి స్పృహ కోల్పోయినాడు. అన్న సంతర్పణం ముగిసేదాక ఈ రహస్యం దాచి కమలమ్మ రఘు రాముని విషయం గోపరాజుగారికి చెప్పింది. రామదాసు ఆ బాలుని శ్రీరామచంద్రుని సన్నిధిలో ఉంచి **"ఎంత పనిచేసితివి రామా నిన్నే మనందును సార్వభౌమా'' ''కోదండరామ కోదండరామ, కోదండరామ కోట్యర్కధామ" "మును విప్రసుతుని మనిచినగతిని మనునట్లు సుతుని మన్నించు మదిని"** అని దీనంగా విలపించినాడు. రామచంద్రుని దయవలన రఘురాముడు స్వస్థుడైనాడు. ఈ అద్భుతం చూచినవారందరూ శ్రీరామచంద్రుని భక్తవాత్సల్యం రామదాసు భక్తిని వేనోళ్ళ పొగడినారు.

రామదాసు, భక్తులు రైతులు ఇచ్చిన ధనం చాలకపోతే సర్కారు సిస్తుతో ఆలయగోపుర ప్రాకారాలు, మంటపాలు, భరతునికి పచ్చలపతకం, శత్రుఘ్నునికి మొలత్రాడు, లక్ష్మణునికి ముత్యాల పతకం, శ్రీరామచంద్రునికి కలికితురాయి, సీతమ్మకు చింతాకు పతకం, వాహనాలు చేయించినాడు. దాతలు భక్తులు విరాళాలిస్తే సర్కారుధనం 6 లక్షలు చెల్లించవచ్చు ననుకున్నాడు. కాని అది నెరవేరలేదు. ఈ వార్త తెలిసిన గోలుకొండ సుల్తాను రామదాసుకు 12 ఏండ్లు కారాగారవాసం ఆదేశించినాడు. కారాగారంలో భటులు రామదాసును చాలా హింసించినారు. రామదాసు గారాబాధలు తట్టుకోలేక శ్రీరామచంద్రుని పరిపరివిధాల వేడుకున్నాడు. చివరకు **"నను బ్రోవుమని చెప్పవే సీతమ్మతల్లి"** అని దీనంగా వేడుకుంటే రామచంద్రుని మనసు కరగింది. ఆరేయి రామలక్ష్మణులు భటుల

వేషంలో సుల్తానువద్దకు పోయి ఆరులక్షల ధనం చెల్లించి రసీదు పుచ్చుకున్నారు. సుల్తాను పశ్చాత్తాపపడి రామదాసును చెర విడిపించి సగౌరవంగా భద్రాచలం సాగనంపినాడు. రామదాసు తిరిగివచ్చి శేషజీవితం శ్రీరామచంద్రుని సేవలో గడుపుతూ ఆలయంలో అర్చనకు అంగరంగ వైభవాలకు, ఉత్సవాలకు తగిన ఏర్పాట్లుచేసి శాసనం వేయించి భక్తియోగంద్వారా 1687 ప్రాంతంలో శ్రీరామ సాయుజ్యం పొందినాడు. రామదాసు కీర్తనల్లోను చరిత్రల్లోను గాథల్లోను ఉన్న రామదాసు చరిత్రమిది. ఇందులో కొంత చరిత్ర, కొంత మహిమ, కొంత కల్పనం చోటు చేసుకున్నవి.

పై కథలు ఆధారంగా రామదాసుగారు 1620 ప్రాంతంలో పుట్టి 1687 ప్రాంతంలో పరమపదం అలంకరించినట్లు ఊహించ వచ్చును. కారాగార విముక్తుడై కనీసం మూడేండ్లైనా శ్రీరామ చంద్రుని సన్నిధిలో ఉండినాడను కుంటే 1677 తానాషా (ఖుతుబ్షాహీల) సింహాసనం అధిష్ఠించిన మూడేండ్లకు బంధ విమోచనం కలిగినట్లు భావించవచ్చు. ఆయన 12 ఏండ్లు కారాగారవాసం అనుభవించినది సత్యమైతే 1665లో చెరసాల పాలై యుండవలె. అది అబ్దుల్లా ఖుతుబ్షా 1626-1672 పరి పాలించిన కాలం. రామదాసును బందిఖానాలో పెట్టింది అబ్దుల్లా ఖుతుబ్షాయేగాని, తానాషా కాదు. తానాషా పరిపాలన కాలం 1672-1687.

పింగిలి భానుజయ్య భాగ్యమ్మ దంపతులకు అక్కన్న, మాదన్న, విస్సన్న, మల్లన్నలనే నల్గురు కొడుకులు, ముగ్గురు బిడ్డలు పుట్టినారు. అక్కన్న మాదన్నలు గోల్కొండ సుల్తాను అబ్దుల్లా ఖుతుబ్షా

1626–1672 కాలంలో 1650 ప్రాంతాన చిన్న ఉద్యోగాలలో చేరి క్రమంగా అభివృద్ధిలోనికి వచ్చి తానాషా నామాంతరం గల అబుల్‌హసన్ ఖుతుబ్షా కాలంలో 1672–1687 పేష్కారు మీర్‌జుమ్లా పదవులు అలంకరించినారు. వీళ్ళ పెద్ద తోబుట్టువు కంచెర్లవారింటికి, రెండవ తోబుట్టువు పొదిలివారింటికి, మూడవ తోబుట్టువు పులిపల్లి వారింటికి కోడండ్రైనారు. అక్కన్న మాదన్నలు ఉన్నత పదవుల్లో ఉండగా మేనల్లుండ్రు విస్సన్న హనుమకొండ ఆమిల్, కంచెర్లగోపన్న భద్రాచలం ప్రాంతోద్యోగి, రుస్తుంరావు బిరుదాంకితుడు పులిపల్లి వెంకన్న దండనాయకుడైనాడు. అక్కన్న మాదన్నల మంత్రాంగంతో దుర్నిరీక్ష్యంగా వెలిగిన గోలకొండ రాజ్యం, 1686లో వాళ్ళ హత్య జరగటంతో మొగల్ సమ్రాట్టు ఔరంగజేబు కైవసం అయిపోయింది. ఈ అక్కన్న మాదన్నలకూ రామదాసుకూ ఎట్టి చుట్టరికమూ లేదని కొందరు చారిత్రకు లంటారు. ఉన్న చుట్టరికం ఊడబెరకటానికి గాని లేని చుట్టరికం కలపటానికిగాని అధికారులు, చారిత్రక నవలలు వ్రాసే రచయితలూ మరియు చారిత్రకులు. అక్కన్న మాదన్న, వారి సోదరులు, కంచెర్ల లింగనమంత్రి కామమ్మలు, వారి కొడుకు కంచెర్ల గోపన్నగారల, జన్మస్థలం నేలకొండపల్లి, రఘునాథ భట్టరాచార్యులు మాత్రం చారిత్రక పురుషులనేది సత్యం. అక్కన్న మాదన్నల గూర్చి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసిన కీ.శే. మిత్రులు (Deputy collector) కె.వి. భూపాలరావుగారు, నేలకొండపల్లి జమీందారు నా సహాధ్యాయి కీ.శే. కంకిపాటి జగన్మోహనరావు, నా సహాధ్యాయి కీ.శే. రావులపాటి ప్రసాదరావు (Municipal Commissioner, Hyderabad) నాకు తెలిసిన విషయమింతే. నేను పెరిగిన

మడికొండ దేశముఖులు పింగిలి వెంకటేశ్వరరావు, వరంగల్ దేశముఖులుపింగిలి రాజేశ్వరరావుగారు తాము అక్కన్న మాదన్నల వంశజులమనీ పింగిలివారు మహారాష్ట్ర దేశం నుండి వలస వచ్చినవారని చెప్పేవారు.

వినుకొండ వాసులు కంచర్ల పాండురంగ శర్మగారు భద్రాచలం రామదాసుగారికి తొమ్మిదవతరం వారసులమనీ భద్రాచల రామదాసు చరిత్రము పరిశోధనాత్మకమని 2007 ప్రకటించిన గ్రంథం ఇటీవల చూచినాను. గోపన్నగారు దాశరథీశతకంలో ప్రకటించిన ఆదిశాఖ అర్థం ప్రథమశాఖ వాజసనేయకాణ్వులు యాజ్ఞ్యవల్క్యులని వివరించినారు. గోపన్న జననం 21-2-1645 అని నిర్ణయించినారు. ఆధారం చెప్పలేదు. గోపన్నగారి నిర్యాణం తేది చెప్పలేదు. రామదాసుగారు చనిపోలేదనీ విమానంలో వైకుంఠం పోయినారనీ అన్నారు. రామదాసుగారు చనిపోయిన తేదిగాని సంవత్సరం గాని చెప్పండని నేను ఫోనులో అడిగితే చెప్పలేక పోయినారు. రామదాసుగారు తమ పూర్వుడు కావటం వారికీ, రామదాసు గారి భక్తులందరికీ సంతోష దాయకమే. కాని 1424-1562 నాటి అన్నమయ్యను, 1600-1680 నాటి క్షేత్రయ్యను 1767-1847 నాటి కాకర్ల త్యాగరాజును ఎక్కడ నుండియో భద్రాచలానికి గుంజుకవచ్చి రామదాసు గారికి మ్రొక్కించినారు. ఈ ముప్వరు భద్రాచల రామదాసుగారిలో చతుర్భుజుడైన శ్రీమన్నారాయణుని దర్శించినారట. ఈ గ్రంథం స్వకపోల కల్పితమైన చారిత్రక నవలవంటిది. అది నవలకాదు, చరిత్రము కాదు. ఈ ముప్వరిలో ఒక్క క్షేత్రయ్యగారు మాత్రమే భద్రాచలంలో రామదాసు గారిని దర్శించినారు.

ఇక రామదాసుగారి రచనల గూర్చి తెలుసుకుందాము. రామదాసుగారి రచనలు మనకు దక్కినవి. 1) దాశరథి శతకం 2) నిబంధపద రచనలకు సంబంధించిన తెలుగు సంస్కృత కీర్తనలు 3) అని బంధకవిత్వానికి చెందిన ఒక చూర్ణిక. శతకంలో సాధారణంగా 108 పద్యాలుంటవి. దాశరథి శతకంలో 59 ఉత్పలాలు 42 చంపకాలు మొత్తం 103 పద్యాలే ఉన్నవి. 6వ పద్యంలో **"ఆర్యులకెల్ల మ్రొక్కి వినతాంగుడనై రఘునాథ భట్టరాచార్యుల కంజలించి"** అని 102 పద్యంలో **"పట్టితి భట్టరార్య గురుపాదము లిమ్మెయి నూర్ధ్వపుండ్రముల్ పెట్టితి మంత్రరాజ మొడిబెట్టితి"** అని గురువులను, 103వ పద్యంలో **"అల్లన లింగమంత్రిసుతు డత్రిజగోత్రజుడాదిశాఖ కంచెర్ల కులోద్భవుండన ప్రసిద్ధుడనై"** అని తండ్రిపేరు, శాఖపేరు, ఇంటిపేరు చెప్పినారు. 49వ పద్యంలో **"చేసితి ఘోరకృత్యములు చేసితి భాగవతాప చారముల్, చేసితి నన్యదైవముల జేరి భజించినవారి పొందు"**, 50వ పద్యంలో **"పరుల ధనంబు జూచి పరభామల జూచి హరింపగోరు మద్గురు తరమానసం"** బని తాను ఎప్పుడో చేసిన నేరాలు చెప్పినాడు. ఇవి గోపన్నగారు చేసిన నేరాలో లేక నైచ్యానుసంధానం కోసం చేసిన వినతులో తెలియదు. 7వ పద్యంలో **"మసకొని రేగుపండ్లకును మౌక్తికముల్ వెలవోసినట్లు దుర్వ్యసనము జెంది కావ్యము దురాత్ములకిచ్చితి"** అని తాను మోసపోయిన తీరు చెప్పినాడు. ఆ కావ్యం పేరేమిటో దొంగిలించినవారెవరవో చెప్పలేదు. గోపన్నగారి ఆర్తి, శరణాగతి, దాస్యభక్తి రూపుదాల్చినది దాశరథి శతకం. ఇప్పటికీ పాతతరాలవారి కందరికీ పరమాదరణీయమైనదీ శతకం. రామదాసుగారు రచించిన అనిబంధ కవిత్వానికి చెందిన

చతుర్వింశతి నామప్రతిపాదక చూర్ణిక రెండవది. శ్రీమహావిష్ణువు కున్న కేశవాది చతుర్వింశతి నామాలను శ్రీరామచంద్రుని పరంగా చెప్పుతూ రామాయణం సంగ్రహంగా వర్ణించటం చేత దీనికా పేరు. **"శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ భాండ తండోప తండ కరండ మండల శాంతోద్దీపిత సగుణనిర్గుణాతీత సచ్చిదానంద పరాత్పర తారక బ్రహ్మాహ్వయ దశదిశాప్రకాశం సకలచరాచరా ధీశం"** అంటూ ప్రారంభమై **"భవజనిత భయోచ్ఛేదచ్ఛిద్ర మచ్ఛిద్రం, భక్తజనమనోరథోన్నిద్రం, భద్రాచలరామభద్రం, రామదాసప్రసన్నం భజేహం భజేహం"** అంటూ ముగిసే ఈ దీర్ఘసమాస భూయిష్ఠరచన భద్రాచలంలో ఏకాంత సేవా సందర్భంగా చదవటం 30 ఏండ్ల క్రింద విన్నాను.

రామదాసుగారి రచనలన్నింటిలో ఎక్కువ ప్రచారం పొందినవీ, ఆయన ఆర్తినీ సుఖదుఃఖాలనూ, భక్తి భావాలనూ ప్రకటించేవి ఆయన కీర్తనలు. రామదాసుగారు 100-108 కీర్తనలు రచించి ఉంటారని బాలాంత్రపు రజనీకాంతరావుగారు, 130-140 కీర్తనలు రచించి ఉంటారని మంచాళ జగన్నాథరావుగారు ఊహించినారు. రామదాసు ధ్యానమంటపంలో చెక్కిన కీర్తనల సంఖ్య 220. ఇవికాక హరిదాసులు, గాయక భిక్షుకులు, భజనకూటాలవారి వద్ద మరికొన్ని యున్నవి. నా పర్యవేక్షణలో పరిశోధన చేసి ఎం.ఫిల్ (M.phill) పట్టం అందుకున్న (1984) దశరధుల బాలయ్య 300 పైగా కీర్తనలు సంపాదించినాడు.

త్యాగరాయలవారు తమ తల్లి పాడుతుంటే రామదాసు కీర్తనలు విన్నారు. అప్పటికే రామదాసు కీర్తనలు దక్షిణాదిలో వ్యాపించినా

యన్నమాట. త్యాగరాజులవారు తమ కృతుల్లో రామదాసుగారిని నాలుగైదు మార్లు భక్తితో స్మరించినారు. ప్రహ్లాద భక్తి విజయం యక్షగానంలో ఒక పద్యంలో స్మరించినారు. ఆనందభైరవి రాగాన్ని సంకీర్తనల్లో ప్రథమంగా ప్రవేశపెట్టింది రామదాసు గారేనట. అనుపల్లవిని కీర్తనలో త్యాగరాయలకంటే ముందే ప్రవేశ పెట్టినాడని నూకల చినసత్యనారాయణగారి ఉవాచ. రామదాసుగారి కీర్తనలపై కర్ణాటకసంగీత విద్వాంసులకు చిన్నచూపు. బాలమురళీకృష్ణ గారి మూలంగా ఇటీవల రామదాసు కీర్తనలపై ఈ విద్వాంసులకు మక్కువ కలిగింది. అన్నమయ్యగారి కీర్తనలకు కూడ ఇటీవలిదాకా చిన్నచూపే ఉండేది. రామదాసుగారి కీర్తనలను నామగుణ కీర్తనలనీ, ఆత్మనివేదకములనీ, తాత్త్విక ములనీ మూడు విధములుగా చెప్పవచ్చు. కాలక్రమాన్నిబట్టి తొలికీర్తనలనీ, బంధిఖానా కీర్తనలనీ, మలి కీర్తనలనీ వింగడించ వచ్చు. తారకమంత్రము కోరిన దొరికెను కీర్తనలోను, నారాయణ యనరాదా కీర్తనలోను **"రామరామయని నోట రవ్వంతసేపైన"** కీర్తనలోను, **"శ్రీరాముల దివ్యస్మరణ"** కీర్తనలోను రామదాసుగారు ప్రకటించిన మానవతామూల్యాలు, సామాజిక చైతన్యం, ఆధునికులకు సంఘసంస్కర్తలమని చెప్పుకునే వారికి ఆశ్చర్యం కలిగిస్తవి. **"తారక మంత్రము కోరిన దొరికెను" "శ్రీరామనామం మరువాం మరువాం" "తక్కువేమి మనకూ" "ఏ తీరుగ నను దయ చూచెదవో" "ఇక్ష్వాకు కులతిలక" "రామచంద్రులు నాపై చలము చేసినారు" "సీతారామస్వామీ నే జేసిన నేరంబేమి" "చరణములే నమ్మితి" "నరహరి నమ్మక నరులను నమ్మితె"** వంటి కీర్తనలు శ్రీరామచంద్రుని తెలుగుదేశానికి కట్టివేసేవి. పోతనగారి భాగవతం, రామదాసుగారి కీర్తనలు తెలుగుజాతికి ప్రాతఃస్మరణీయములు.

ఈ వ్యాసం ఫైనల్ ప్రూఫులు దిద్దుతుండగా ఎ.ఎస్. ప్రసాద్‌గారి ద్వారా కంచెర్ల పాండురంగశర్మగారు వైదేశ్వరన్ కోయిల్ అగస్త్యనాడి లోని రామదాసుగారి తేదీల వివరాలు సేకరించినది తెలిపినారు. ఆనాడీ గ్రంథంలో రామదాసుగారి జననం 21-2-1645 నిధనం 9-3-1727, కమలాంబగారి జననం 30-11-1650, నిధనం 24-9-1695, వారి కొడుకు రఘురాముని జననం 29-4-1670 అని ఉందట. భద్రాచలం దేవస్థానంవారు రామదాసుగారి 376వ జయంత్యుత్సవాలు 2009 సం॥ జనవరి 30,31 తేదీల్లో జరుపుతున్నట్లు టి.వి. ప్రకటన చూచినాను. ఇక చదువరులే రామదాసుగారి కాలం నిర్ణేతలు.

ఆధారం : -

1) తెలుగులో తొలిసమాజకవులు - సంపాదకులు ప్రొ.కె.కె. రంగనాథా చార్యులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు-హైద్రాబాదు, 1983.

2) ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము - ప్రథమ ద్వితీయభాగములు - బాలాంత్రపు రజనీకాంతరావు - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయము, 2001

3) రామదాసు కీర్తనలు - సంపాదకులు, మంచాళ జగన్నాధరావు, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ, 1975.

10. కాకర్ల త్యాగరాజస్వామి

(1767 - 1847)

తెలుగు భాషను "దేశభాషలందు తెలుగు లెస్స" అని శ్రీనాథ మహాకవి, శ్రీకృష్ణ దేవరాయలవారు "Italian of the East" అని పాశ్చాత్య పండితులు పొగడినారు. ఈ పొగడ్తలకు కారణం భారతీయదేశభాషలందు తెలుగు అజంతభాష కావటం, సంగీత కృతులకు మాధుర్యం సమకూర్చటం. తెలుగులో సంగీతకృతులు రచించినవారు త్యాగరాజస్వామి కంటె ముందు, తరువాత, ఎందరో ఉన్నారు కాని ఉపనిషత్తులు వర్ణించే **"ఓం ఇత్యేకాక్షరం బ్రహ్మ"** మనే భావనతో ఓంకారరూపుడైన శ్రీరాముడే ఆ పరమాత్మ అని నాదోపాసన చేసి కైవల్యం పొందిన శ్రీత్యాగరాజస్వామి; బయకారుల్లో అగ్రగణ్యుడు. **"శ్రీకైవల్య పదంబు జేరుటకునై"** యన్న

బమ్మెరపోతనగారి వలె త్యాగరాజస్వామివారు కూడ సరస్వతీదేవి చనుబాలు కుడిచినవారే, ఒకరు కుడి మరొకరు ఎడమ. తెలుగు వారు దక్షిణదేశానికి క్రీస్తుశకం పూర్వంనుండే వలసలు పోయినట్లు చరిత్రకారులమాట. ఒకప్పుడు తెలుగుదేశపు దక్షిణసరిహద్దు కాంచీపురం. కథ కంచికి పోయిందనే ఆభాణకం అప్పటిదే. తమిళ దేశంలో తెలుగువారు తంజావూరు మధుర రాజ్యాలు స్థాపించి నప్పుడు నానావర్ణాల తెలుగువారా ప్రాంతములకు వలస పోయినారు. వేదవేదాంగ పండితులు నానాశాస్త్ర కోవిదులు, గీర్వాణాంధ్ర భాషాగిరాంధురంధరులెందరో అగ్రహారాలు పొంది ఆ రాజ్యాల్లో స్థిరపడ్డారు. అట్లా వలసపోయిన కుటుంబముల్లో త్యాగరాజ స్వామివారి పూర్వికుల కుటుంబం ఒకటి. కర్నూలు జిల్లా కంబం తాలూకా కాకర్ల గ్రామవాసులైన భారద్వాజస గోత్రీకులు, ఆపస్తంబ సూత్రులు, ములికినాటి వైదికశాఖకు చెందిన చెరుకూరు ఇంటిపేరున్న వైదిక బ్రాహ్మణులు. క్రీ.శ. 1600కు ముందే ఈ కుటుంబంవారు దక్షిణదేశానికి పోయినారు. ఆనాటినుండి వారి యింటిపేరు కాకర్లవారైనది. ఈ వంశంలోని వారందరు గొప్ప పండితులు, పురాణేతిహాస కోవిదులు. స్వామివారి ముత్తాత కాకర్ల పంచనద బ్రహ్మంగారు తంజావూరు జిల్లా తిరువారూరులో ఉండేవారు. తిరువారూరు కావేరీతటమందలి పుణ్యక్షేత్రం. అక్కడి దైవం త్యాగేశుడు. తిరు+ఆరు+ ఊరు= తిరువారూరు= పవిత్రమైన ఏటి ఒడ్డున వెలసిన ఊరు. పంచనద బ్రహ్మంగారికి ఐదుగురు కొడుకులు 1) సదాశివబ్రహ్మం 2) సదానంద బ్రహ్మం 3) సచ్చిదానందబ్రహ్మం 4) బాలబ్రహ్మం 5) గిరిరాజబ్రహ్మం. చివరివాడైన గిరిరాజ బ్రహ్మం గిరిరాజుకవిగా

ప్రసిద్ధులు, సంగీత విద్వాంసుడు, సంగీతనాటకరచయిత, వాగ్గేయ కారుడు, తంజావూరు నేలిన శాహజీ మహారాజు (1684 – 1711) ఆస్థాన పండితుడు; అటు తరువాత శరభోజీ మహారాజు (1712–1728) ఆస్థానవిద్వాంసుడు. ఆయన రచనలు శాహేంద్రచరిత్రం, రాజమోహన కురవంజి, లీలావతీ కల్యాణం, వాదజయం, సర్వాంగ సుందరీవిలాసం మొదలైన యక్షగానాలు శరభోజి రాజు కథా నాయకుడుగా కొన్ని పాటలు వ్రాసినాడు. గిరిరాజకవి ఐదుగురు కొడుకుల్లో ఒకడు రామబ్రహ్మం ఆయన భార్య సీతమ్మ (శాంతమ్మ యని కొందరు). రామబ్రహ్మంగారు మరుదనల్లూరు మఠం స్వాములవద్ద రామమంత్రం పొంది తులజాజీ మహారాజు ఆస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలపుడు రామాయణ ప్రసంగాలు చేయటంచేత తంజావూరు పాలకులు ఆయనకు తిరువారూరు లోను తిరువైయారులోను ఇండ్లు భూములు ఇచ్చినారు. సీతమ్మ (శాంతమ్మ) రామ బ్రహ్మం దంపతుల తొలిచూలు జపేశుడు, మలిచూలు రామనాథం చదువుసంధ్యలు పట్టక అల్లరిచిల్లరిగా తిరిగేవారు. దంపతులు దుఃఖితులై వంశానికి మంచిపేరు తెచ్చే కొడుకు కోసమై తిరువారూరు త్యాగరాజస్వామిని వేడుకొనగా ఆ దేవుడు స్వప్న దర్శనమిచ్చి శ్రీరామచంద్రుని కీర్తించే సంగీత సాహిత్యనిధి కొడుకుగా పుడుతాడు, ఆతనికి నా పేరే పెట్టుకొండని వరమిచ్చి అంతర్హితుడైనాడు.

ఆ త్యాగరాజస్వామి వరప్రసాదంతో శా.శ. ౧౬౮౯ సర్వజిన్నామ సంవత్సర వైశాఖ శుద్ధ షష్ఠి సోమవారంనాడు (4–5–1767) మన త్యాగరాజు పుట్టినాడు. బారసాల నాడాయనకు క్షేత్రదైవతం పేరుతో త్యాగరాజని పేరు పెట్టినారు. త్యాగరాజు ఉయ్యాలలోను,

అద్దాలలోను ఉన్నపుడే ముందాయన గొప్ప భక్తుడూ గాయకుడూ ఔతాడనే లక్షణాలు కనిపించినవి. భగవన్నామం తల్లిగాని ఎవరుగాని చేసినా ఏడ్పు మాని కేరింతలు కొట్టేవాడు. తండ్రితోపాటు పూజామందిరంలో కూర్చుండి స్తోత్రాలు పాడే వాడు. ఒక పీటపై చిన్న రాముని విగ్రహం పెట్టి పాటలు పాడేవాడు. తోడి బాలురతో ఆటపాటలకు పోక తాళాలు చిరుతలు పట్టుకొని కీర్తనలు పాడేవాడు. శిశువుగా ఆయన హృదయంలో నాటుకున్న రామభక్తి బీజం క్రమంగా మారాకులు తొడిగింది. ఐదవయేట బాల త్యాగయ్యకు కడుపునొప్పి వస్తే ఎవరో ఒక యోగి వచ్చి మరునాటికి తగ్గిపోతుందని ఆశీర్వదించిపోయినాడు. త్యాగయ్య కడుపునొప్పి మరునాడుదయానికి మటుమాయమైనది. త్యాగయ్య ఇంకా పెరిగి పెద్దవాడు కాకముందే ఆయన అన్నలు జపేశుడు రామనాథం చేసే దుడుకుపనుల మూలంగా ఆ యూరివారితో పోట్లాటలు వచ్చి తలెత్తుకొని తిరుగలేని పరిస్థితు లేర్పడగా రామబ్రహ్మంగారు సకుటుంబంగా ఆ వూరు విడిచి తులజాజీ మహారాజుగారిచ్చిన తిరువైయారు గ్రామంలోని మరొక యింటికి పోయినారు. తిరువైయారులో తిరుమంజనం వీథిలో ఉన్నదీ యిల్లు. తిరు+ అయిందు+ ఆఱు = తిరువైయారంటే (అయిదు పాయల పుణ్యక్షేత్రం). ఈక్షేత్రంలోని ముఖ్యదైవతం పంచనదీశ్వరుడు. త్యాగయ్యగారు జీవితపర్యంతం ఈ తిరువయ్యారులోనే ఉండినారు. ఆయనకు 8వ యేట ఉపనయనం జరిగింది. తిరువారూరులో ఉండినప్పుడే తల్లిగారి వద్ద పోతన భాగవతం పద్యాలు, తండ్రి గారి వద్ద రామాయణ భారతముల్లోని శ్లోకాలు కంఠస్థం చేసిన ఏకసంథాగ్రాహి త్యాగయ్య. తిరువయ్యారులో సంస్కృతపాఠశాలలో

ఆంధ్రగీర్వాణ భాషల్లో కవిత్వం చెప్పగలిగే పాండిత్యం అలవడింది. తల్లిద్వారా జయదేవుని అష్టపదులు, పురందరదాసు కన్నడ కీర్తనలు, తాళ్ళపాక అన్నమాచార్యులు, భద్రాచల రామదాసు రచించినభక్తి కీర్తనలు పాడటం నేర్చి, పూజానంతరం ఒంటరిగా కూర్చుండి తనకు వచ్చిన పాటలకు శ్లోకాలకు రాగాలు కూర్చి శ్రావ్యంగా పాడేవాడు.

ఒకనాడు తనకు సొంతమైన రాగవరుసల్లో కవిత్వధోరణి పుట్టి ఒక పాట ఆయన నోట వెలువడింది. అది (దేశికతోడి రాగం–త్రిశ్రలఘులయ) **"నమో నమో రాఘవాయ – అనిశం– నమో నమో రాఘవాయ"** శ్రీత్యాగరాజులవారు కూర్చిన మొదటి దివ్య నామకీర్తన. తాళ్ళపాక అన్నమయ్యగారు శ్రీ వెంకటేశ్వర స్వామి పైవలె త్యాగయ్య శ్రీరామునిపై అనేక ఉత్సవసంప్రదాయ కీర్తనలు రచించిపాడేవారు. (శంకరాభరణం – ఆదితాళం) **'నాపాలి శ్రీరామ భూపాలకస్తోమ, కాపాడ సమయము నీ పాదములీరా'.** (సౌరాష్ట్ర రాగం రూపక తాళం) **"మేలుకో దయానిధీ మేలుకో దాశరథీ, మేలుకో దయానిధీ మిత్రోదయమౌవేళ"** వంటి కీర్తనలట్టివే. ఈ పాటల్లో అందమైన మాటలకూర్పు హంగైన సాంప్రదాయిక సంగీతంతో పాటు, బాలభక్తుని పట్టుదల ఇష్టదైవతం పట్ల వినయమూ, చనువు, విశ్వాసమూ దండిగా ఉన్నవి. తండ్రి రామబ్రహ్మంగారా కీర్తనలు తాటియాకులపై వ్రాసి తిరువయ్యారు లోని సంగీత విద్వాంసులకు చూపిస్తే వారాశ్చర్యచకితులై ఆ పాటల్లోని భక్తినీ కవితాశక్తినీ మెచ్చి భద్రంగా దాచి ఉంచండని ప్రోత్సహించినారు. ఒకనాడు త్యాగయ్య తండ్రి పూజకోసం, అందాణార్కురిచ్చి నుండి పూలు తెస్తుంటే త్రోవలో శొంఠి వెంకట

రమణయ్య గారి సంగీత గురుకులంనుండి సంగీత విద్యార్థుల గానం విని అక్కడే చాలా సేపున్నాడు. ఆ సంగతి తెలిసి సంతోషించి రామబ్రహ్మంగారు కొడుకును వెంటగొనిపోయి శొంఠి వెంకట రమణయ్యగారి కప్పగించి సంగీతం నేర్పండని కోరినాడు. శొంఠి వెంకటరమణయ్యగారు త్యాగయ్య సంగీత సాహిత్య సహజ వైదుష్యం గమనించి ఒక్క యేడాదిలోనే సంగీతశాస్త్ర రహస్యాలన్నీ బోధించి ఇక నీకు నేను చెప్పవలసిందేమీ లేదు. నీవు మహా గాయకుడవౌతావు అని దీవించి పంపినారు.

త్యాగయ్య తమ మేనమామ వీణ కాళహస్తయ్య ఇంటగల సంగీతశాస్త్ర గ్రంథాలన్నీ స్వల్పకాలంలోనే చదివి వీణ వాయించటం నేర్చుకున్నాడు. ఇంత నేర్చినా మరికొన్ని సందేహాలు మిగిలితే తమ తండ్రిగారికి రామమంత్రమిచ్చిన మరుదనల్లూరు మఠం రామకృష్ణానందస్వామి నాశ్రయించి నారదోపాసన మంత్రం ఉపదేశం పొంది పంచనదీశ్వర మందిరంలో భక్తి శ్రద్ధలతో ఆ మంత్రం కొన్నాళ్ళు జపించినాడు. నారదులొకనాడు సన్యాసి రూపంలో వచ్చి త్యాగయ్యకు **'స్వరార్ణవము' "నారదీయము"** అనే రెండు సంగీతశాస్త్ర గ్రంథాలిచ్చి తిరోహితుడైనాడు. త్యాగయ్య **"రాజిల్లు వీణకల్గు గురురాయ" "శ్రీనారద నాదసరసీరుహభృంగ శుభాంగ" "వరనారద నారాయణస్మరణానందాను భవముగల"** కీర్తనల్లో నారదుని గురువుగా ప్రకటించుకున్నాడు. ఆయేడే రామకృష్ణానంద స్వామి త్యాగయ్యకు 18వ యేట రామతారక మంత్ర ముపదేశించినాడు. ఆ యేడే రామబ్రహ్మంగారు త్యాగయ్యకు సుగుణవతియైన పార్వతితో పెండ్లి చేసినాడు. పెద్దన్న జపేశయ్య పౌరోహిత్యానికి సంభావనలకు పోయి వ్యసనాలకు

మరగి కుటుంబానికి చెడ్డపేరు తెస్తున్నాడు. రెండవ కొడుకు కొంచెం ముందుగానే చనిపోయినాడు. తన వంశం తరింపజేసేది త్యాగయ్యే అని కలలుకంటూ, త్యాగయ్య 20వ యేట తండ్రి రామబ్రహ్మంగారు కాలం చేసినారు. నాలుగైదేండ్లు కాపురంచేసి అనుకూలవతియైన భార్య పార్వతమ్మ చనిపోతే శ్రీరాముల కైంకర్యానికి భంగం కలుగగూడదని పెద్దలు ఒత్తిడి చేస్తే త్యాగయ్య పార్వతమ్మ చెల్లెలు కమలమ్మను పెండ్లాడినాడు. త్యాగయ్య 36వ యేట తల్లి సీతమ్మగారు దివంగతురాలైనది. త్యాగయ్య హృదయంలో శ్రీరామచంద్రులు సంపూర్ణంగా నిండుకొన్నారు. ఆయనకు లౌకికమైన లంపటాలతో ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదించ వలెననే కోరికే లేదు. చేత తంబురా చంకకు జోలె ఒకరిద్దరు శిష్యులు మద్దెల తాళాలు వాయిస్తుంటే రామకీర్తనలు పాడుతూ మూడునాల్గు వీథులు తిరిగి గృహస్థులిచ్చే భిక్షతో జీవించేవాడు. అది ఆయన దినచర్య దీనిని ఉంఛవృత్తి అంటారు. జపేశయ్యకు త్యాగయ్య వాలకం సరిపడక ఇల్లు పంచుకున్నాడు. తిరుమంజనం వీథిలోని ఇంటి తూర్పువాటా జపేశయ్య తీసుకున్నాడు. దక్షిణ పువాటా త్యాగయ్య కిచ్చినాడు. తల్లిదండ్రులు పూజిస్తుండిన శ్రీరామ పంచాయతన మందిరం త్యాగయ్యగారి వాటాలోనే ఉండింది. పశుపతి కోవెలవద్ద ఉండే భూమి రెండు వాటాలుగా పంచుకున్నారు. వేరుబడిన రాత్రి ఇంట్లో బియ్యం ఉప్పు పప్పులన్నీ నిండుకుంటే త్యాగయ్యదంపతులు చింతిస్తూ ఉపవాసముండగా బండ్రోతుతో ఒక దంపతుల జంట వచ్చినది. వారు బియ్యం ఇతర వ్యంజనాలన్నీ ఇచ్చి వంట చేయించండన్నారు. రాత్రి 11-30 గంటలపుడు శ్రీరామునికి నైవేద్యం పెట్టి అందరూ

భోజనాలు చేసి ముచ్చటలాడుతూ పడుకున్నారు. తెల్లవారి లేచి చూస్తే వచ్చిన దంపతులు బంట్రోతు కానరాలేదు. సీతారామాంజ నేయులు ఈ విధంగా వచ్చి తనను అనుగ్రహించి నారని త్యాగయ్య రెండు కీర్తనల్లో స్తుతించినారు.

తమ్ముణ్ణి ఏదైనా ధనసంపాదనమార్గంలో పెట్టవలెనని జపేశయ్య ప్రయత్నించి విఫలుడై కోపించి ఒకనాడు త్యాగయ్య అర్చించే మూర్తులను రహస్యంగా కావేరిలో పారవేసినాడు. తెల్లవారి తమ అర్చామూర్తులు కనపడకపోతే త్యాగయ్య దుఃఖించి **"ఎందు దాగినాడో"** అనే కృతిలో తన పరితాపాన్ని వ్యక్తం చేసినాడు. ఇట్లా దిగులుతో త్యాగయ్య కొన్ని దినాలు బాధపడ్డాడు. ఒకనాడు కలలో శ్రీరాముడు కనబడి కావేరీ నదిలో ఆముకస్థలంలో ఉన్నానని చెప్పినాడు. త్యాగయ్య పోయి వెదకితే తన అర్చామూర్తులు లభించినవి. అప్పుడాయన ఏనుగెక్కినంత సంబరంతో **"కనుగొంటిని శ్రీరాముని" "రారా మా యింటిదాకా, రఘువీరా" "ఎట్లా దొరికితివో"** అని పరిపరి విధముల పాడుతూ పల్లకిలో ఊరేగించి ఇంటికి తీసుకవచ్చినాడు. తనకింత కీడుచేసిన అన్న ఒకసారి జబ్బుపడితే త్యాగయ్య **"ఎన్నో తప్పులు చేసినవారిని రాజన్య నీవు బ్రోచినావు"** అనే పాట పాడి వేడుకుంటే జపేశయ్య స్వాస్థ్యం పొంది మనసుమారి రామభక్తుడై తమ్ముని భజనగోష్ఠుల్లో చేరిపోయినాడు.

త్యాగరాజుల సంగీతగురువు శొంఠి వెంకటరమణయ్యగారు శిష్యుని ప్రజ్ఞకు సంతోషించి తిరువైయారులో సంగీతసభ పెట్టించి త్యాగరాజులను పాడుమన్నారు. ఆయన **"దొరుకునా ఇటువంటి**

సేవ" కీర్తన అద్భుతంగా పాడి అందరినీ మెప్పిస్తే పరవశులైన గురువుగారు **"దొరుకునా ఇటువంటి శిష్యుడు"** అని మెచ్చుకుంటూ తనకు తంజావూరు మహారాజులిచ్చిన బహుమతులతో సత్కరించి నాడు. వెంకటరమణయ్య గారి తండ్రి వెంకట సుబ్బయ్యగారు తంజావూరులో ఏర్పాటుచేసిన సంగీతసభలో **"మరి మరి నిన్నే మొరలిడనీ"** అనే కీర్తన ఏకధాటిగా ఎనిమిది గంటలు పాడి అక్కడి సంగీతజ్ఞులందరినీ ఆనందాశ్చర్యాలలో ఓలలాడించినారు. ఈ సంగతి విని శరభోజీ మహారాజు తమ సభలో తనపై పాటలు పాడితే భూమి బంగారము ఇస్తానని వార్త పంపితే త్యాగయ్య (కల్యాణిరాగం–త్రిపుట తాళంలో) **"నిధి చాలసుఖమా రాముని సన్నిధిసేవ సుఖమా"** అని రాజాహ్వానం తిరస్కరించినారు. త్యాగరాజులను తోడుకరావటానికి మహారాజు దూతలను పంపగనే ఆయనకు ఉదరశూల లేచినది. తన తప్పు తెలుసుకున్న రాజు వేగరులను పంపించి ముందుగా పంపిన దూతలను వెనుకకు రప్పించినాడు. శరభోజీమహారాజు అప్పటినుండి తిరువైయారుకు తానే పోయి త్యాగయ్య ఇంట ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొని వచ్చేవాడు. త్యాగరాజును మహారాజు తన సొమ్మును ఏ విధంగా నైనా దైవసేవకు ఉపయోగించండని ప్రార్థిస్తే త్యాగయ్య మహారాజు గారి కల్యాణ మహల్‌లో తన శిష్యులు కొందరికి భోజన సదుపాయం కలిగించటానికి ఒప్పుకున్నారు. ఇట్టిది శ్రీ త్యాగరాజ స్వామివారి అపరిగ్రహదీక్ష.

త్యాగయ్యకు శ్రీరామకృష్ణానందస్వామి ఇచ్చిన మొదటి మంత్రం మూలంగా నారదుల అనుగ్రహం కలిగింది. రెండవది తారక మంత్రం. త్యాగయ్య పంచనదీశ్వరాలయ మంటపంలో ప్రతిదినం

నిష్ఠతో తమకు 38 యేండ్లు పూర్తి అయ్యేనాటికి 125000 సార్లు జపించి 96 కోట్లు పూర్తిచేసి శ్రీరామసాక్షాత్కారం పొందినారు. అప్పుడు చెప్పినదే **"బాల, కనకమయచేల, సుజనపరిపాల, శ్రీరమాలోల, విధృశశరజాల, శుభద, కరుణాలవాల, ఘనలీల, నవ్యమాలికాభరణ, ఏలా నీదయరాదు!"** అనే కీర్తన. త్యాగరాజ స్వామి సంగీతసాహిత్యాలు రెండూ వారి భక్తిరసంలో తెలుగు భాషను తెలుగు జాతిని పునీతం చేసినవి.

త్యాగయ్యగారి సంగతి తెలిసి వారివద్ద సంగీతం నేర్చుకోవటానికి చేరిన శిష్యులెందరో! ఉంఛవృత్తితో లభించే బియ్యం మొదలైన పదార్థాలతో, తమవాటాకు వచ్చిన భూమినుండి వచ్చే ఆదాయంతో వారి సంగీతగురుకులం బాగానే సాగేది. వివిధభావాల ఆవేశంతో త్యాగయ్యగారు కీర్తనలు చెప్తుతుంటే ఒక శిష్యుడు పల్లవి, మరొక శిష్యుడు అను పల్లవి, ఇంకొక శిష్యుడు చరణం వ్రాసి గురువుగారికి చూపేవారు. తమకంటె పూర్వులైన వాగ్గేయకారుల రచనలు శిష్యులకు బోధిస్తూ తాము ఏ విధంగా ఆ సంప్రదాయాన్ని ఎట్లా పెంపు చేయగలరో నిరూపిస్తూ త్యాగయ్యగారొక గురుశిష్య సంప్రదాయాన్ని గట్టి పునాదులపై నిల్పినారు. ఆయనవంటి గురువు, ఆయన శిష్యులవంటి శిష్యులు సంగీత సాహిత్య చరిత్రల్లో చాలా అరుదుగా లభిస్తారు. త్యాగయ్య రెండవ భార్య కమలమ్మగారికి ఒకే కూతురు. సీతాలక్ష్మి. సీతాలక్ష్మిని అమ్మాళ్ అగ్రహారంలో ఉండే కుప్పు సామయ్యకిచ్చి పెండ్లి చేసినారు. అప్పుడు ఆయన శిష్యులు అభిమానులు కానుకలు తెచ్చినారు. పల్లవి ఎల్లయ్య అనే శిష్యుడు సీతాలక్ష్మణసమేత కోదండరాముని చిత్రపటం ఇస్తే చూచిన త్యాగయ్యగారు ఎంతో మురిసి **"నను పాలింప నడచి**

వచ్చితివో నా ప్రాణనాథ" అనే కృతి రచించినారు. త్యాగయ్యగారి 50వ ఏట కమలమ్మ గారు శరీరం చాలించింది. గురుకులంలోని శిష్యులు అయ్యా భాగవతులు, సుబ్బరామ భాగవతులువంటివారు వంట వార్పు, పెరటిలో కూరగాయల పాదులు మొదలైనవాటిని గమనిస్తూ భక్తిశ్రద్ధలతో గురువుల సేవ గురుకులసేవ చేసేవారు.

ఆనాటి కంచి పీఠాధిపతులు ఉపనిషద్బ్రహ్మేంద్రస్వాములవారు త్యాగయ్య పేరు ప్రఖ్యాతులు విని కాంచీపురం రావలసిందిగా వార్త పంపితే త్యాగయ్య గారు కొలదిమంది శిష్యులతో బయలుదేరి త్రోవలోని క్షేత్రాలు దర్శిస్తూ, కొన్నిచోట్ల కలిగిన అనుభవాలు కీర్తనలుగా కూర్చినారు. అప్పటికాయన వయస్సు 67 ఏండ్లు. వారి మొదటి మజిలీ తిరువొత్తియూరు. అక్కడి త్రిపురసుందరిపై నాలుగు కీర్తనలు, మద్రాసు తిరువళ్ళిక్కేణి పార్థసారథి స్వామిపైన కీర్తనలు రచించినారు. సుందరేశ మొదలియారు కోరికపై కోవూరుకు పోయి అక్కడి సుందరేశస్వామిపై ఐదు కీర్తనలు – కోవూరి పంచరత్నాలు రచించినారు. కోవూరినుండి నాగులాపురం మీదుగా తిరుపతి బయలుదేరినారు. స్వామివారికి తెలియకుండా 1000 బంగారు నాణెముల మూట పల్లకిలో పెట్టి శ్రీరామ కైంకర్యానికి వినియోగించండని సుందరేశ మొదలియార్ స్వామి వారి శిష్యులకు చెప్పినాడు. నాగులాపురం దరిదాపుల్లో పల్లకీలో ధనముందని తెలిసిన దొంగలు దాడిచేస్తే శిష్యులు తమకు తెలిసిన రహస్యపు మూట స్వామికి నివేదిస్తే శ్రీవారు ఆమూట దొంగల కీయండని చెప్పుతుండగా కోదండపాణులైన రామలక్ష్మణులు వచ్చి దొంగలను పారద్రోలినారట. స్వామివారు **"ముందు, వెనుక, ఇరుప్రక్కల తోడై"** అనే కీర్తన పాడి రామలక్ష్మణుల సాక్షాత్కారం

పొందిన ఆ దొంగలను అభినందించినారు. ఇది ఒడలు జలదరింప జేసే అద్భుతలీల. త్యాగయ్యగారు శిష్యసమేతంగా తిరుమల గిరులెక్కి అనుష్ఠానాదులు ముగించి వెంకటేశ్వర స్వామి దర్శనానికి పోతే పూజారులు తెరవేసి లోపల ఏదో అర్చనలు చేస్తున్నారు. అప్పుడు రచించినవే సుప్రసిద్ధ కీర్తనలు **"తెరతీయగరాదా నాలోని తెర" "వెంకటేశ నిను సేవింపను పదివేల కన్నులు కావలెనయ్యా"** అనేవి. త్యాగయ్యగారు శిష్యసమేతంగా పుత్తూరు మీదుగా పోతుండగా ఆ రేయి అక్కడ కోవెల ప్రహరికి లోభాగంలో ఉన్న బావిలో ఒక యాత్రికుడు పడి చనిపోతే త్యాగయ్య **"నా జీవనాధార. నా నోము ఫలమా"** అనే కీర్తన పాడి ఆ వ్యక్తిలో చైతన్యం కలిగించి నారట. త్యాగయ్యగారు శిష్యబృందంతో కంచికిపోయి ఉపనిషద్బ్రహ్మేంద్రుల మెప్పులందుకొని కంచి వరదరాజ స్వామి పైన కామాక్షీదేవిపైన కీర్తనలు పాడి వాలాజాపేటలో ప్రియశిష్యుడు వెంకటరమణ భాగవతుల యింట కొన్ని దినాలుండినారు.

కొన్నిదినాల తరువాత త్యాగయ్యగారు వాలాజాపేటనుండి శిష్యసమేతంగా శ్రీరంగంచేరి రంగనాథస్వామి ఉత్సవాల్లో పాల్గొన్నారు. శ్రీరంగనాథుల చైత్రోత్సవం జనసమ్మర్ధం మూలంగా స్వామిని అశ్వవాహనపు ఊరేగింపు దగ్గరనుండి చూడలేక దూరాన సందులో నిలుచుండి **"రాజు వెడలె చూతాము, రారే కస్తూరి రంగరాజు వెడలె చూతాము"** అనే కీర్తన పాడినారు. అశ్వవాహనం కదలకపోతే అర్చకస్వాములు వచ్చి త్యాగరాజ స్వామిని దేవుని సన్నిధికి తీసుకపోయి దర్శనం చేయించినారు. అప్పుడు త్యాగరాజస్వామి "వినరాదా నా మనవి" అనే కీర్తన పాడితేనే ఊరేగింపు సాగిందట. త్యాగరాజస్వామి శ్రీరంగనిపై చాలా కీర్తనలు

పాడి కొన్నిదినాలకు నాగపట్టణం మీదుగా లాల్గుడి చేరి పంచ రత్నాలు పాడి షోలింగర్ చేరి యోగలక్ష్మీ నరసింహస్వామిని యోగాంజనేయుని కీర్తనలద్వారా సేవించి స్వగ్రామం తిరువైయారు చేరినారు.

త్యాగరాజస్వామి దక్షిణదేశయాత్రలో ఆయా ప్రదేశాలలో సంకీర్తన గోష్ఠులు నిర్వహించినందున అక్కడ సంగీతగోష్ఠులు ప్రారంభమై పూర్వ భక్తకవుల కీర్తనలతోపాటు త్యాగయ్యగారు తీర్చిన రాగాలు క్రొత్త అందాలు దిద్దుకొని కర్ణాటకసంగీతం విరివిలోను ఉరవులోను పరువులోను చాలా దొడ్డదై ముందుకు సాగింది. భక్త వాగ్గేయకారుల్లో త్యాగయ్యగారి కృతులు సంగీత సంప్రదాయము తప్పనిసరియైనవి. త్యాగరాజస్వామి కొన్నివేల కీర్తనలతోపాటు తాము చిన్నప్పుడు ఆలయాల్లోను రాజభవనం లోను చూచిన యక్షగానాలనబడే సంగీతరూపకాలవంటివి భక్తిరసప్రధానంగా మూడు సంగీత నాటకాలు 1) ప్రహ్లాద భక్తివిజయము 2) నౌకాచరిత్రము 3) సీతారామవిజయము రచించినారు. చివరి కృతి మనకు దక్కలేదు కాని మొదటి ప్రహ్లాదభక్తి విజయం ఐదంకాల నాటకం. భాగవతంలోని ప్రహ్లాదచరిత్రం దీనికాధారం. ఇందులో 45 పాటలు భజనకీర్తనలను కృతులను పోలినవి కాక పద్యాలు, చూర్ణిక, వచనములున్నవి. ఇందులోని కథాఘట్టాలు త్యాగయ్యగారి సొంతకల్పనలు. హిరణ్యకశిపుని పాత్ర లేదు. విష్ణుమూర్తిని త్యాగయ్యగారు రామా అని సంబోధిస్తారు. దీనికంటె ఎక్కువ ప్రసిద్ధి పొందినది నౌకా చరిత్రం ఏకాంకిక. దీనికి మూలం భాగవతంలో లేదు. ఈ కథ బెంగాల్‌లో ఎక్కువ ప్రచారంలో ఉందట. భాగవతంలోని రాసక్రీడల, జలక్రీడల

ప్రభావంతో వెలసిన గోపికలతో ఏడేండ్ల కృష్ణుడు నౌకావిహారం చేస్తూ రాసక్రీడలు సల్పటం, గాలివానకు నౌకలో చిల్లిపడి నీరు నిండుతుంటే గోపికలు దేహాభిమానం విడిచి తమ చీరలొలిచి రంధ్రం పూడ్చటం, కృష్ణమాయతో గాలివాన తగ్గటం ప్రధానకథ. ఇందులోని కృష్ణుడు మాత్రం రాముడు కాదు గాని రామునివలె త్యాగరాజాప్తుడు, త్యాగరాజసుతుడు. నాటకమున కవసరమైన సంఘటనలు వేరువేరు రసభావాల పోటీ ఇందులో బాగా అమరింది. సీతారామ విజయం లభించకపోవటం ఆంధ్రుల దురదృష్టం.

త్యాగయ్యగారికి చాలా పూర్వం అన్నమయ్యగారి నాటినుండి చిన్నయేరుగా పారుతుండిన సంగీతప్రవాహం త్యాగరాయ కృతులతో మహానదియైనది. వారి భజనగోష్ఠులు వినటానికి సంగీతవిద్వాంసులు భాగవతార్లు సన్న్యాసులు మహారాజులు సామాన్యులు కూడ వచ్చేవారు. శ్రీవారి దివ్యనామసంకీర్తనలు ఉత్సవసంప్రదాయ కీర్తనలు విని భక్తి తన్మయులై శ్రీవారి పాదధూళి తీసుకొనిపోయేవారు. ఆయన కృతులలో భక్తి, సంగీతం, సాహిత్యం ముప్పేటలుగా అల్లుకొన్నవి. స్వామివారు కొన్నివేల కీర్తనలు రచించినా వారి శిష్యుల కాలానికి 3600 మిగిలి ఇప్పటికి 600 కీర్తనలు మాత్రమే దక్కినాయంటారు. ఆయన 72 మేళకర్త రాగాలలో రచించిన కృతులలో 200 రాగాలుపయోగించినారట. ఆయన కృతులు అన్నమయ్యగారి కృతులవలె సామాజిక స్పృహ, నీతిబోధ, అభేదభక్తి పుష్కలంగా ప్రతిబింబిస్తవి. ఆయన సమకాలీనులు శ్యామశాస్త్రులు, ముత్తుస్వామి దీక్షితులు అరవదేశానికి వలసపోయిన ఆంధ్రవాగ్గేయకారులు. తిరువాన్కూరు ఏలిక స్వాతి

తిరునాళ్, కాశీవాసి గోపీనాథ భట్టాచార్యులు, మాయవరం గోపాల కృష్ణభారతి, కేరళీయ రామమంగళం, షట్కాల గోవింద మారార్, తెలుగుదేశపు గుంటూరు తూము నరసింహదాసు, అల్లూరి వెంకటాద్రిస్వామివంటి వాగ్గేయకారులాయనను దర్శించినారు. ఆయన శిష్యుల్లో శ్యామశాస్త్రుల కొడుకు సుబ్బ రాయశాస్త్రి, మానాంబుచావడి వెంకటసుబ్బయ్య, వాలాజాపేట వెంకటరమణ భాగవతులు, కృష్ణ భాగవతులు, సుందర భాగవతులు, తంజావూరు రామారావు, అయ్యా భాగవతులు, సుబ్బరాయ భాగవతులు, సోల్జరి సీతారామయ్య, అమృతలింగం పిళ్ళై వంటివారెందరో వాగ్గేయ కారులై గురువుల కృతులకు బహుళప్రచారం కల్పించిన ధన్యులు.

శ్రీత్యాగరాజస్వామి సంగీతసాధనయోగంలో సిద్ధిపొంది, శ్రీరామ సాక్షాత్కారం అందిన మహాయోగి. **"మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులు కానివారలకు"** అంటూ జీవన్ముక్తుడైన పరమయోగి. 1847 పరాభవ సంవత్సరం పుష్యశుద్ధ దశమినాటి రాత్రి శ్రీరాముడు కనబడి **"నిన్ను పది పూటలపై కరుణించెద"** నని చెప్పి మాయమైనాడు. ఆయన ఆ విషయం ఇంకొకతీరుగా పుష్యబహుళపంచమినాడొక అద్భుతం జరుగుతుంది. మీరందరూ తప్పక రావలెనని శిష్యులకు భక్తులకు ఆప్తులకు చెప్పి పుష్యబహుళ చతుర్థినాడు పరమహంస బ్రహ్మానందేంద్రస్వామి ద్వారా సంన్యాసాశ్రమం స్వీకరించి నాదబ్రహ్మానందస్వామి యైనాడు. మరునాడు పంచమి ఉదయం 11 గంటలకు **"నన్ను శ్రీరామచంద్రమూర్తి తన కడకు తీసుకపోనున్నాడు. కనుక ఆపకుండా భజనగోష్ఠి సాగించం"**డని ఆదేశించినారు. తిరువైయారు అంతటా ఈవార్త ప్రాకి భక్తులు శిష్యులు రాజోద్యోగులు ఆ భజనగోష్ఠిలో చేరినారు.

స్వామివారు "పరమాత్ముడు వెలిగే ముచ్చట బాగ తెలుసుకోరో" అనే కీర్తన పాడి యోగసమాధిలో కూర్చుండి కపాలభేదనం చేసుకొని పరమాత్ముని వెలుగులో శా.శ. ౧౭౬౮ పరాభవ పుష్య బహుళ పంచమి బుధవారం (6-1-1847)నాడు లీనమై పోయినారు. నాదసుధా రసంబిలను నరాకృతైనవాడు నాదలోలుడై బ్రహ్మానందంలో కలిసిపోయినారు. శాస్త్రప్రకారం ఆయనను (తిరువైయారులో) గురువు శొంఠి వెంకటరమణయ్యగారి సమాధి ప్రక్కనే సమాధిచేసి బృందావనం నిర్మించినారు. 1907 నుండి ఆయన శిష్య పరంపరలోని భక్తులు సంగీత విద్వాంసులు ఏటేట పుష్యబహుళపంచమినాడు స్వామివారి సమాధి చెంత త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు జరుపుతున్నారు.

మైసూరు రాజస్థాన నర్తకి శ్రీమతి బెంగుళూరు నాగరత్నం (3-11-1878, 19-5-1952)గారు సంగీత సాహిత్యనృత్య కళల్లో గొప్ప విదుషీమణి. ఆమె త్యాగరాజస్వామి భక్తురాలు; త్యాగరాజస్వామివారి సమాధిమందిరం 1-7-1925 కట్టించి కుంభాభిషేకం చేయించినది. ఏటేట స్వామివారి ఆరాధనోత్సవాలు జరిపేటప్పుడు పలుదేశాల సంగీత విద్వాంసులు వచ్చి ఘనరాగ పంచరత్నకీర్తనలు పాడే ఏర్పాటు చేసింది. ఆమె తన సంపద సర్వస్వం స్వామివారి కైంకర్యానికి సమర్పించినది. 7-1-1952 స్వామివారి విగ్రహప్రతిష్ఠ చేయించినది. స్వామివారి మందిరానికి ముందు ఆమె సమాధి మందిరం కూడ ఉంది. ఆయమ్మ కైంకర్యం మూలంగా త్యాగరాయస్వామివారి సమాధిమందిరం ఒక పవిత్ర క్షేత్రమైనది.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు తాళ్లపాకవారి రచనలను వలె, త్యాగరాజగాన సభలవారు త్యాగరాజ స్వామివారి కృతులు, యక్షగానాలు ఒకచో చేర్చి ప్రచురిస్తే బాగుండును.

ఆధారం : -

1) త్యాగరాజస్వామి – బాలాంత్రపు రజనీకాంతరావు. ఐబిహెచ్ ప్రకాశన, హైదరాబాదు - 1976

2) బెంగుళూరు వాసులు ఆచార్య శంకరనారాయణరాజుగారు (080) 65988635– అందించిన సమాచారం.

11. కౌతాళం మహాపురుష రంగయ్య

(18వ శతాబ్దం)

భగవంతుడు ఎవరిని ఎప్పుడు అనుగ్రహిస్తాడో తెలియదు. ఆయా మహా పురుషుల పూర్వజన్మల సుకృతం చేతనో మరెందు చేతనో గాని ఒక్కొక్క వ్యక్తికి అనుకోని విధంగా భగవత్కటాక్షం లభిస్తుంది. అట్టివారు కొందరు బ్రహ్మచారులుగానే ఉండి తమకు ప్రాప్తించిన మహిమల చేత లోక కల్యాణం చేస్తూ ప్రజలను తమ దివ్యశక్తులద్వారా ఆకర్షించి వారిద్వారా లోకోప కారకములైన పనులు చేయిస్తూ ఆ భక్తులను గూడ సన్మార్గగాములుగా దిద్దుతారు. అట్టి మహాపురుషులలో కౌతాళం మహాపురుష రంగయ్యగారొకరు.

కర్నూలు జిల్లా ఆదోని (యాదవగిరి) తాలూకాలో కౌతాళం అనే గ్రామమున్నది. ఆదోని కర్నూలు మున్నగు ప్రాంతాలు ముస్లింల ఏలుబడిలో ఉండేవి. ఆంధ్రయోగులు ద్వితీయభాగంలో

ఉరుకుంద ఈరణ్ణస్వామి చరిత్రమున్నది. ఉరుకుంద, కౌతాళం ప్రక్క ప్రక్క గ్రామాలు ఉరుకుంద ఈరణ్ణకాలం 1625–1686 ఆ కాలంలో ఆదవాని సిద్ధిమసూద్‌ఖాన్ (1662–1687) ఏలుబడిలో ఉండేది. ఈరణ్ణ మహాపురుష రంగయ్య గారికంటె 60–70 ఏండ్లు ముందుపుట్టినవాడు. రంగయ్యగారి తండ్రి తాతలు ఈరణ్ణ (హిరణ్య)స్వామి భక్తులు. మహాపురుష రంగయ్య ఆదవాని ఏలిక హఫీజ్‌ఖాన్ సమకాలీనుడు కనుక ఆయన 18వ శతాబ్దానికి చెందినవాడు. హఫీజ్ ఖాన్ వద్ద కొలువుండిన దివాన్ కృష్ణారావు మహాపురుష రంగయ్యగారి భక్తుడు, శిష్యుడు.

కౌతాళంలో కౌండిన్యస గోత్రజులైన వైదిక బ్రాహ్మణులు దైవజ్ఞులైన పేద పురోహితులు వెంకటభట్టు. ఆయనను అంబణ్ణ భట్టు అని పిలిచేవారు. ఆయనకు ముగ్గురు కొడుకులు రెండవ కొడుకు మహా పురుష రంగయ్య. రంగయ్యగారి కంటె పెద్దవాడు రంగప్ప, చిన్నవాడు సఖ్ఖప్ప. వెంకటభట్టు నిష్ఠాగరిష్ఠులు పౌరోహిత్యమే వారి జీవనాధారం కనుక చాలీచాలని రాబడితోనే ముగ్గురు కొడుకులతో వెంకటభట్టు జీవనయాత్ర సాగించినారు; సకాలంలో ముగ్గురు కొడుకుల వడుగులు చేసినారు. తండ్రిగారి అదుపు ఆజ్ఞల్లో మసలుతూ ముగ్గురన్నదమ్ములు త్రికాల సంధ్యావందనం ఆచరిస్తూ యాజ్ఞీకం నేర్చుకుంటూ అన్యోన్యంగా ఉంటున్నారు. రంగయ్య 10,11 ఏండ్లవాడైనాడు. ఒకనాడు రంగయ్య బంధువులను చూడటానికి సమీపగ్రామం తోవికి బయలుదేరినాడు. అది మండుటెండల వేసవి. రంగయ్య చెమటలు తుడుచుకుంటూ కొలది సమీపాన వంకలో దాహం తీర్చుకోవటానికై వడివడిగా పోతున్నాడు. అతనికి వెనుక గల్లుగల్లుమను చిరుగజ్జెల

చప్పుడు వినపడినది. తన వెనుక ఎవరో వస్తున్నారని రంగయ్య వెనుదిరిగి చూస్తే ఎవరూ కనబడలేదు. రంగయ్య తనదారిన పోతున్నాడు. మరల గజ్జెల చప్పుడు గల్లుగల్లుమని వినపడినది. రంగయ్య ఆగి మరల వెనుకకు చూచినాడు; ఎవరూ లేరు. నలుదిక్కులు పరికించి చూచినాడు; ఎవరూ కనబడలేదు. తాను భ్రమ పడ్డాననుకున్నాడు వడి వడిగా ఏరు సమీపించి మంచినీళ్ళ కోసం చెలమ తోడుతూ ఇసుక అటుఇటు వేస్తున్నాడు. ఇంతలో ఒక గొల్లపిల్లవాడు వచ్చి రంగయ్యతోడిన చెలమను పూడ్చుతూ ఊరే నీటిలో ఇసుక చల్లుతున్నాడు. రంగయ్య సౌమ్యుడు కనుక గొల్లపిల్ల వాణ్ణి మెల్లగా మందలించినాడు. "ఏమయ్యా దప్పిక తీర్చుకోవటానికి నేను చెలమ తోడుతుంటే పట్టుదలతో ఇసుక చల్లి పూడ్చుతున్నావు. నాకు బాగా దూప ఔతున్నది, నోరెండి పోతున్నది, నన్ను కష్టపెడితే నీకేం లాభం? నన్ను నీళ్ళు త్రాగనీయు"మన్నాడు.

గొల్లపిల్లవాడు "నీవు నా శిష్యుడవైతే నీ కోరిక తీరుస్తా"నన్నాడు. రంగయ్య అవాక్కైనాడు. ఒక్క నిముషం ఆ గొల్లపిల్లవాణ్ణి ఎగాదిగ చూచి "ఏమి మాటలయ్యా, నేను నీకు శిష్యుణ్ణి కావలెనా? ఎందుకు కావాలె. నేను బ్రాహ్మణ్ణి, నీవు శూద్రుడవు. నేనెట్లా నీ శిష్యుణ్ణి ఔతాను? నేను నీకు దాసుణ్ణి కావటం అసంభవం. నీవు దేవుడవా? నువ్వు కనుక కలియుగ వైకుంఠవాసుడవైతే నేను నీకు దాసుణ్ణి ఔతాను; లేకపోతే లేదు" అన్నాడు. గొల్లపిల్లవాడు ఒక్క క్షణంలో సహజరూపంలో శంఖచక్రధారి శ్రీ కలియుగదైవం శ్రీవెంకటేశ్వర స్వామిగా దర్శనమిచ్చినాడు. రంగయ్య సంభ్రమాశ్చర్యాలతో కనులవెంట ఆనందబాష్పాలురాలుసూ్తా వెంకటరమణుని

పాదములపై వ్రాలినాడు. శ్రీనివాసుడు దయాదృష్టులతో రంగయ్యను లేవనెత్తి కూర్చుండబెట్టి ఆతని నాల్కపై ఏదో బీజాక్షరాలు వ్రాసి తిరోహితుడైనాడు. శ్రీనివాసుని దర్శించిన రంగయ్యకు దాహం తీరింది. ఆనందామృత సాగరంలో ఓలలాడినట్లైనది. అప్పటినుండి రంగయ్య జీవితమే మారిపోయింది.

రంగయ్య నిరంతరం దైవధ్యానంలో ఉండేవాడు. ఆతని చదువులు, ప్రాపంచిక జీవితం ముగిసినది. వెంకటభట్టు, రంగయ్య లోని వైలక్షణ్యం గుర్తించినాడు. రంగయ్య ఇంట్లోనే ఒక మూలన సదా బ్రహ్మనిష్ఠుడై ఉండేవాడు. ఎప్పుడైనా ఇల్లు విడిచిపోతే ఎవరితోను మాట్లాడక తిరిగి తిరిగి వచ్చేవాడు. ఇట్లా కాలం గడుస్తుండగా పెండ్లి కెదిగిన జేష్ఠునికి కనిష్ఠునికి వెంకటభట్టు దంపతులు వివాహాలు చేసి, రంగయ్య వాలకం గమనించి ఆతని ఇష్ట ప్రకారమే వివాహం చేయలేదు. రంగయ్య ఆబాల బ్రహ్మచారులు బ్రహ్మ నిష్ఠాపరాయణులుగా మిగిలిపోయినారు. ఆయన ఉరుకుంద శ్రీనృసింహస్వామి ఆలయంలో అర్చకుడుగా సేవచేసేవాడు.

ప్రతి సంవత్సరం రంగయ్యతల్లి శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు దర్శించటానికి తిరుమలకు పోయేది. ఒక యేడు రంగయ్య కూడ తల్లివెంట తిరుమలకు పోతే శ్రీవెంకటేశ్వరస్వామి కలలో కనబడి "రంగయ్యా! నీవెందుకు వచ్చినావు? నీవున్న చోటనే నేనున్నాను కదా! నీకు నమ్మకం లేదా!" అన్నాడు. మరునాడే రంగయ్య కౌతాళంలో ప్రత్యక్షమైనాడు. తండ్రిగారు, రంగప్ప, సఖప్ప రంగయ్యతో అమ్మగారిని అక్కడే విడిచి నీవేల వచ్చినావని అడిగితే 'అమ్మగారు ఎల్లుండి తిరిగివస్తారు నేను అక్కడ చూచిన బ్రహ్మోత్సవాలు

గొప్పగా ఉండినవి అంటూ ఆ వివరాలన్నీ చెప్పినాడు. బ్రహ్మోత్సవాలు దర్శించి వచ్చిన తరువాత రంగయ్యగారు తల్లికి, తనవారికి బంధువులకు అక్కడి విశేషాలు చెప్పినాడు. కౌతాళం ప్రజలు రంగయ్య తిరుమలకు పోకుండానే ఏమో చెప్పుతున్నాడు పిచ్చి వాడన్నారు. కాని అటు తరువాత రంగయ్య ఒకే సమయంలో ఇక్కడ కౌతాళంలోను అక్కడ తిరుమల లోను ఉన్నట్లు తెలిసికొని ఆయన యెడ భయభక్తులు కలవారైనారు. రంగయ్యను మహా పురుషుడన్నారు. తిరుమల తిరుపతికి యాత్ర చేయలేనివారు రంగయ్య సన్నిధిలోనే తమ మ్రొక్కులు చెల్లించుకొనేవారు; ఆశీర్వాదములందుకొనేవారు. ఈవిధంగా రంగయ్యగారి మహిమ చుట్టుపట్టు గ్రామాలవారికి తెలిసి ఆయనకు కొందరు భక్తులైనారు.

కౌతాళం గ్రామానికి తూర్పున మూడు మైళ్ళ దూరాన చిరుతపల్లి గ్రామం ఉన్నది. అక్కడ మంచినీటి కొరత. అందువలన ఊరి పెద్దలు వచ్చి తమకు మంచినీటిబావి త్రవ్వే తావు చూపండని వేడినారు. రంగయ్య వారి వెంట చిరుతపల్లికి పోయి ఒక స్థలం చూపి అక్కడ బావి త్రవ్వండని ఆదేశించినారు. వెంటనే అచ్చట చాలా లోతైన బావి త్రవ్వినారు కాని అడుగున బండ పడినది. రంగయ్యగారికా సమాచారం తెలుపగనే ఆయన అక్కడికి పోయి నూతిలోని బండపై పొయ్యి వెలిగించి అన్నం ఉడికిస్తుండినారు. ఆనాడు ద్వాదశి కనుక బ్రాహ్మణ సంతర్పణ చేయించండి నీరు తప్పకుండా పడుతుందన్నారు. రంగయ్యగారి వంట సిద్ధమయ్యే వరకు ఆ బండ పగిలి నీటిధారలు ఎగజిమ్మినవి. రంగయ్యగారి భోజనం పూర్తి అయ్యేవరకు నూతినిండా నీరూరింది. బ్రాహ్మణ సంతర్పణం జరిగింది. అక్కడి ప్రజలందరూ రంగయ్యగారి

అపరోక్ష జ్ఞానానికి అబ్బురపడి వేనోళ్ల పొగడినారు. ఇప్పటికీ చిరుతపల్లిలోని బావిలో ఎప్పుడూ నీరుంటుంది. దానిని అయ్యగారి బావి అంటారు. అక్కడే ఒకప్పుడు రంగయ్యగారి తోట ఉండేది. కాలక్రమాన ఇతర గ్రామవాసులుకూడ రంగయ్యగారిని తమతమ గ్రామాలకు తోడ్కొనిపోయి మంచినీళ్ళ బావులు పడే స్థలాలు చూపించుకున్నారు. రంగయ్యగారు తమతమ గ్రామాలకు చేసిన ఉపకారం తరతరాలుగా ఇప్పటికీ అక్కడి ప్రజలు చెప్పుకుంటారు.

మహాపురుష రంగయ్యగారు ఆదోని (యాదవగిరి)లో కొంతకాల ముండినారు. ప్రతిదినం ప్రాతఃకాలం అక్కడి కొండ ప్రాంతానికి పోయి స్నానసంధ్యాద్యనుష్ఠానములు చేసుకునేవారు. అప్పటికి శ్రీవారి వయస్సు 40 సంవత్సరాలు. ఒకనాటి వేకువజామున స్వప్నంలో శ్రీ చెన్నకేశవస్వామి ప్రత్యక్షమై నేను కొండ ప్రాంతమున నూతిప్రక్కనే భూస్థాపితమైయున్నాను. నన్ను ఇక్కడినుండి తీసుకపోయి కౌతాళంలో ప్రతిష్ఠించుమన్నాడు. శ్రీవారా విషయం ఆలోచించి కౌతాళంలో దేవాలయ నిర్మాణానికై యోజనచేసి సమయంకోసం వేచియున్నారు. కొంతకాలం ఈ విధంగా గడచిపోయింది. ఒకసారి శ్రీవారు శ్రీశైలం యాత్రకై సంకల్పించి తమ అనుంగుశిష్యుడు దివాన్ కృష్ణారావుగారికి వార్త పంపినారు. కృష్ణారావుగారు కర్నూలు నవాబు హఫీజ్‌ఖాన్ చెంత దివాన్‌గా కొలువుండినారు. కృష్ణారావు గురువుగారి శ్రీశైలం యాత్ర కర్నూలు మజిలీలో ఘనమైన స్వాగత సత్కారాలు ఏర్పాటుచేసి మంగళవాద్య పురస్సరంగా కర్నూలు బయట వేచియుండినారు. గురువుగారు రాగానే పాదపూజచేసి పల్లకిలో ఊరేగిస్తూ తమ భవనానికి తీసుకపోయి బంధుమిత్రయుక్తంగా పాదపూజ చేసి బ్రాహ్మణ

సంతర్పణ చేసినారు. ఇది తెలిసిన కొందరసూయాపరులు నవాబు చెంతకు పోయి కృష్ణారావుగారు నవాబుగారుపయోగించే పల్లకిలో ఒక బ్రాహ్మణుని ఊరేగించి నవాబును అవమాన పరచినాడని చాడీలు చెప్పినారు. నవాబు, కృష్ణారావుగారిని పిలిపించి అడిగితే తమగురువు లెంతటి మహాత్ములో దివాన్ మనవి చేసినాడు. అట్లైతే నీ గురువును మా వద్దకు తీసుకరా చూస్తానన్నాడు నవాబు. కృష్ణారావుగారు గురువులను తోడ్కొనిపోయినారు. అప్పటికే నవాబు మహాపురుష రంగయ్యగారిని పరీక్షించుటకుగాను మాంసాహారము లుంచిన పళ్ళెరంపై పట్టుగుడ్డ కప్పించి సిద్ధంగా పెట్టినాడు. అది స్వీకరించి ప్రసాదం ఆరగించవలసిందిగా కోరినాడు. రంగయ్య గారు ప్రోక్షణచేసి, ఆచ్ఛాదన వస్త్రం తొలగిస్తే పళ్ళెరంలో పూలు పండ్లున్నవి. శ్రీవారా పూలు పండ్లు సభలోని వారికి పంచినారు. నవాబు ఇది కనుకట్టు విద్యగా భావించి రంగయ్యగారిని ఏ విధంగా నైనా శిక్షించవలెనని నిశ్చయించుకున్నాడు. నవాబు కపటవినయం ప్రదర్శిస్తూ "అయ్యా ఈ ప్రాంతాల్లో రెండుమూడేండ్లనుండి వానలు పడక ప్రజలందరూ కరువుతో బాధపడుతున్నారు. తమరు మూడు దినాలలో వర్షం కురిపించగలరా" అన్నాడు. అందుకు మహాపురుష రంగయ్యగారు సరే అన్నారు. మీరు చేసిన బాస నిలుపకపోతే బాగుండదన్నాడు నవాబు. శ్రీవారాతని ఆంతర్యం గుర్తించి అటులే కానిండని తమ బసకు పోయినారు. ఈ సాకుతో ఇద్దరు బాపనయ్యలను శిక్షించవచ్చునని నవాబు సంబరపడ్డాడు.

మహాపురుష రంగయ్యగారు శిష్యుడు కృషారావు ఇంటనే తమ నిత్యవిధులు నిర్వర్తిస్తున్నారు. రెండుదినాలు గడచిపోయినవి. ఆకాశంలో మబ్బు ముక్కైనా కనపడలేదు. వానలు కురిసే

సూచనలేమీ లేవు. మూడవనాడు మధ్యాహ్నమైపోయినది. దివాన్ కృష్ణారావుకూ ఆయన గురువుకు తప్పక శిక్షపడుతుందని కిట్టనివారికి సంతోషమైనది. నవాబు చేత తానూ తన గురువు అవమానపడి మరణించటం కంటె విషం త్రాగి చావటం మేలని కృష్ణారావు నిశ్చయించుకున్నాడు. నవాబు దూతలు వచ్చే సమయం సమీపిస్తుండగా కృష్ణారావు సిద్ధం చేసి పెట్టుకున్న విషపాత్రను తేవలసిందిగా భార్యనుకోరినాడు. ఆమె భర్త ఆజ్ఞ పాటించి విషపాత్ర తెస్తుండగా గురువుగారామెను నిలిపి ప్రమాదమేమీ లేదని వారించినారు. ఇంతలో నవాబు దూతలు వచ్చినారు. కృష్ణారావు గురువులను తోడ్కొని నవాబు దర్బారుకు పోయినాడు. నవాబు రంగయ్యను ఏమిస్వామీ మీమాట నెరవేరలేదన్నాడు. తొందరపడకండి నవాబుగారూ అంటూ ఒక టెంకాయ తెప్పించి కృష్ణారావు కిచ్చి నీబలమంతా ప్రయోగించి ఆ టెంకాయను విసరి వేయుమని ఆదేశించి వరుణదేవుని ప్రార్థించినారు. ఇంతవరకు నిర్మలంగా ఉన్న ఆకాశం ఒక్కసారి మేఘావృతమైనది కుంభ ద్రోణంగా మూడు దినాలు ఎడతెగని వానకురిసి వాగులు వంకలు పొంగిపోయినవి. పూరిండ్లు కుప్పగూలినవి. నవాబు భయభ్రాంతుడై భార్యాయుక్తంగా రంగయ్యగారిని బ్రతిమాలి వర్షం ఆపుమని కోరినాడు. రంగయ్యగారి ఆదేశంతో వర్షం నిలిచిపోయింది. రంగయ్యగారు శ్రీశైలం యాత్రముగించి మరల కర్నూలుకు తిరిగివచ్చినారు. నవాబుతో ఇష్టాగోష్ఠి చేసి మీ పదవులు తనువులు శాశ్వతం కాదు. ధర్మతత్పరులై ప్రజలను పాలించండి. నేను సంకల్పించిన చెన్నకేశవస్వామి దేవళం కోసం విరివిగా ధనం ఇవ్వండి మీకు మేలు జరుగుతుందని ఆశీర్వదించి పోయినారు.

నవాబు ధనం పంపిస్తానన్నాడు. రంగయ్యగారు స్వగ్రామం పోయి దేవాలయ స్థలం చూచి ఆదవానికి పోయినారు. అక్కడ అలనాడు స్వప్నంలో సూచించిన ఆనవాళ్ళు తెలిసికొని శ్రీ చెన్నకేశవస్వామి విగ్రహాన్ని నూతిప్రక్కనగల స్థలం నుండి వెలికితీయించి కౌతాళం తీసుకపోయినారు. కర్నూలు నవాబుకు ధనం పంపవలసిందిగా వార్త పంపించినారు నవాబు ధనం పంపగనే స్వామివారు కౌతాళంలో దేవాలయం నిర్మించి మూలవిరాట్టును స్థాపించినారు. దేవాలయ ప్రాంగణము విశాలంగా ఉంచి ఉట్లస్తంభం నిలిపినారు.

మంత్రాలయం పీఠాధిపతులు యతీశ్వరులు వసుధేంద్రపాదులు ఒకసారి కౌతాళం వచ్చి ఒక భక్తునింట పూజలందుకుంటుండగా అచ్చటి బ్రాహ్మణ సముదాయంలో ఉన్న రంగయ్యను చేరబిలిచి "నాయనా! రంగయ్యా నీవు మా మఠానికి శిష్యుడవు కమ్మని" కోరగా అందుకు రంగయ్య గారంగీకరించినారు. పీఠాధిపతులు రంగయ్యను ఏకాంతానికి తోడుకపోయి తప్తముద్ర ధారణ చేయటానికి సిద్ధమైనారు. కాని వసుధేంద్రపాదులకు రంగయ్యగారి శరీరంలో శంఖచక్రములు సహజంగా కనబడినవి. పీఠాధిపతులు సంతోషించి "రంగయ్యా నీవు సహజంగానే భక్తుడవు మహా పురుషుడవు నీకు ప్రత్యేకంగా ముద్రధారణ చేయింపనవసరం లేదు" అని విరమించుకున్నారు. ఈ సంఘటన క్రీ.శ. 1753, 1754 ప్రాంతంలో జరిగింది. అప్పటికి మహాపురుష రంగయ్య గారి వయస్సు ఇంచుమించు 56 సంవత్సరాలు. మహాపురుష రంగయ్యగారు భూమిపై అవతరించి చేయవలసిన కార్యములన్నీ ముగించినారు. తమ అంత్యకాలం సమీపించినట్లు గుర్తించి తనవారిని బంధువులను పిలిపించుకొని "నా జీవితాంతం నా

శరీరాన్ని దహనం చేయవద్దు, సమాధి చేయండని" చెప్పినారు. మరికొన్ని దినాలకు తమవారికి బంధువులకు గురువులకు స్వప్నంలో కనిపించి నాకు బృందావనం నిర్మించండని చెప్పినారు. కాని శ్రీవారు శరీరం చాలించిన తరువాత అక్కడి బ్రాహ్మణ్యం వత్తిడి మూలంగా వారి పార్థివ శరీరాన్ని బంధువులు దహించినారు. బంధువులు దహన స్థలంలో వెదికితే రంగయ్యగారి తులసిమాల, కౌపీనము, చిటికెన వ్రేలు – మూడు వస్తువులు దొరికినవి. వాటిని అగ్నిదేవుడు దహించకుండా మిగిల్చినాడని రంగయ్యగారి పరివారం గుర్తించినారు. కుంభకోణం నుండి రంగయ్యగారి గురువులువచ్చి మేళతాళాలతో ఆమూడు వస్తువులు భూ నిక్షిప్తంచేసి బృందావనం నిర్మించినారు. ఈ బృందావనం చెన్నకేశవ స్వామి దేవాలయానికి దక్షిణ దిశలో ఉన్నది. భక్తులు ఆ బృందా వనాన్ని సేవిస్తున్నారు. శ్రీవారి ఆరాధన ప్రతిసంవత్సరం వైశాఖ బహుళద్వాదశినాడు జరుగుతున్నది. మహాపురుష రంగయ్యగారు సమీపగ్రామం ఉరుకుందలో శ్రీహిరణ్యులవారి సన్నిధిగావించు కొన్న శ్రీనరసింహ స్వామి దేవస్థానంలో మహాపురుష రంగయ్య గారు పూజాదికైంకర్యాలు నిర్వహించటంచేత ఆ నరసింహస్వామి ప్రభావం చేతనే వారు మహిమాధికులైనారని ప్రజల విశ్వాసం.

1. శ్రీ ఉరుకుంద ఈరణ్ణ క్షేత్రమహిమ
   రచయిత – మందగిరి అరళప్ప (అశ్వత్థప్ప)
   ఆదవాని – 1972 మార్చి

ప్రచురణ: ఉరుకుంద నరసింహ దేవస్థానకమిటి, ఉరుకుంద,
ఆదవాని తాలూక, కర్నూలుజిల్లా.

2. అరిసెట్టిసాయి ప్రసాద్‌గారు (గుంటూరు) పంపించిన సమాచారం.

12. బందరు రంగావధూత

(1880 - 1905)

కారణజన్ములు పూర్వజన్మావశేషకర్మ పూర్తిచేసి తాము వచ్చిన పని కాగానే శరీరం చాలిస్తారు. కొందరు దీర్ఘకాలం జీవిస్తారు. కొందరు చాలా స్వల్పకాలమే జీవిస్తారు. పూర్ణపురుషాయుషం నూరేండ్లంటారు. అందులో నాల్గవవంతే జీవించి యశఃకాయులైన వారు బందరు రంగావధూతలవారు. మచిలీ బందరు లేదా మచిలీపట్నం కృష్ణాజిల్లాలో ప్రాచీననగరం; కృష్ణాజిల్లాకు సాంస్కృతిక కేంద్రం. అక్కడ తలారి కృష్ణవేణమ్మ సుబ్బయ్యలనే కాపు దంపతు లుండేవారు. వారి పూర్వజన్మసుకృతం పండి ఒక మహాయోగి, అవధూతయైన దివ్యబాలుడు 8-6-1880 మంగళవారమో 11-6-1880 శుక్రవారమో రోహిణీ నక్షత్రంలో పుట్టినాడు. బారసాలనాడా బాలునికి రంగయ్య అని నామకరణం చేసినారు.

పువ్వు పుట్టగానే పరిమళించినట్లు శిశువు రంగయ్య చూపులు చేష్టలు అసాధారణంగా ఉండేవి. అందువలన తల్లిదండ్రులా బాలుణ్ణి 8వ యేట బడిలో చేర్పించినారు. రంగయ్య శ్రద్ధగానే చదువుకున్నాడు కాని తోడిబాలురతో ఆటపాటల్లోగాని వేడుకల్లో గాని పాల్గొనకపోయేవాడు. ఒంటరిగా భజనకీర్తనలు పాడుతూ తిరిగేవాడు. సహాధ్యాయులను ఒకచో చేర్చి భజనలు చేసేవాడు. ఏవో విగ్రహాలు పెట్టి అలంకరించి పూజలు చేసేవాడు. స్నేహితులు రాకపోతే వారిండ్లకు పెక్కుసార్లు పోయి తీసుకవచ్చి భజనలు చేయించేవాడు. తోడివారు భజన చేస్తుంటే మైమరచేవాడు. ఏతరుకొని స్నేహితులకు భగవంతుని గూర్చి పూర్వకాలపు ధ్రువుడు ప్రహ్లాదుని గూర్చి చెప్పేవాడు. బడి జీతం కట్టటానికి తండ్రిగారు డబ్బులిస్తే పేదవారికి బిచ్చగాండ్రకు పంచేవాడు. కొంతకాలం తరువాత పాఠశాలకు పోవటం మాని ఏకాంతంగా ఉండేవాడు.

రంగయ్య వినయ సౌశీల్యములమూర్తి. తనకంటె చిన్నవారిని గాని పెద్దవారినిగాని, పనిపాటుల వాళ్ళనుగాని, అయ్యా అమ్మా అని పిలిచేవాడు. స్త్రీలనందరినీ తల్లులుగా, తోబుట్టువులుగా సంభావించేవాడు. హరికథలు జరిగే చోటికి పోయి భక్తిశ్రద్ధలతో వినేవాడు. ఎవరైనా మహాత్ములు బందరుకు వచ్చినారని తెలిస్తే వారి సన్నిధికిపోయి సేవించి వచ్చేవాడు. ఒకనాడు తండ్రిగారు పైకమిచ్చి పండ్లు కొనుక్కొని రమ్మంటే వట్టి చేతులతో ఇంటికి తిరిగివచ్చినాడు. తండ్రిగారు పండ్లు తేలేదా అని అడిగితే “క్షణకాలం సుఖమిచ్చే పండ్లు కొనక మీకోసం శాశ్వత సుఖమిచ్చే పండ్లు తెచ్చినా” నన్నాడు. ఎవరో ఆకలిగొని అన్నం అడుగుతూ బిచ్చం కోసం ఇల్లిల్లు తిరిగేవారికిచ్చి శాశ్వత పుణ్యం కూర్చే పండ్లు కొన్నట్లు

చెప్పినాడు. తల్లిదండ్రులు నివ్వెరపోయినారు. ఈ విధంగా రంగయ్య 14-15 ఏండ్ల ప్రాయం వచ్చేవరకు వైరాగ్య పూర్ణుడైనాడు.

ఇట్లుండగా రంగయ్యకు తమకు సమీపానగల కోట పెద్దవీథిలో ఉండే చందమ్మ అనే గృహస్థురాలితో పరిచయమైనది. చందమ్మ గారు పంచవర్ష ప్రాయమందే మహా భక్తురాలుగా పేరెన్నికగన్నది. ఆమె అచలతత్త్వం ఒంటబట్టించుకున్న సాధ్వి. ఆమె తెల్లచీర నల్లరవిక ధరించేది. నీళ్ళబావికి పోతే ఎవరితోను మాట్లాడక తన పనితాను చూచుకొనిపోయేది. చందమ్మను మహాత్మురాలని గుర్తించిన రంగయ్య ఆమెను ఆశ్రయించినాడు. చందమ్మగారు రంగయ్యను పుత్ర నిర్విశేషంగా సంభావించి ప్రేమతో ఆదరించి జ్ఞానబోధ చేస్తుండేది. రంగయ్య తన యింట్లో కంటె చందమ్మ గారింట్లోనే ఎక్కువసేపు గడిపేవాడు. రంగయ్య వాలకం కనిపెట్టిన తల్లిదండ్రులు ఆయనకు సమీప బంధువులింటి కన్యతో పెండ్లి చేద్దామనుకున్నారు. రంగయ్య తనకు సంసారజంజాటం ఇష్టం లేదంటే పెద్దలచేత చెప్పించినారు. ఐనా రంగయ్య ఒప్పుకోలేదు. పండిన పండు చెట్టునుండి క్రింద పడితే మరల ఆ పండును చెట్టుకు అతికించగలమా? రంగయ్యకు సంపూర్ణవైరాగ్యం అబ్బింది. ఇక మౌనసాధన ప్రారంభించినాడు. రంగయ్య సాధన ఆయన సాఫల్యం గుర్తించిన చందమ్మ తానే రంగయ్యకు శిష్యురాలన్నట్లు వర్తించేది. కొంతకాలం తరువాత చందమ్మ సమాధి చెందినది. రంగయ్య ఎక్కువకాలం అడవిలోను, సముద్రతీరాన ఏకాంతంగా ఉంటూ శీతాతపములు సరకుచేయక, ఆకలి దప్పులు లేక, నిద్రపోకుండా రేయింబవలు ఏకాగ్రచిత్తుడై తపస్సు చేసేవాడు. తెలిసిన వారెవరైనా ఎదురుపడి పల్కరిస్తే ఒకసారి మౌనంగా

ఉంటూ ఇంకొకసారి నవ్వుతూ ఉండేవాడు. బ్రహ్మానందమగ్నుడై తనలోతాను నవ్వుకొనేవాడు. అందరూ రంగదాసు పిచ్చివాడనే వారు. రంగదాసు మాత్రం అజ్ఞానాంధకారంతో కన్నుకానక ఉండే సంసారుల పై జాలిగొని పాటలరూపంగా, పద్యాల రూపంగా, వచనధోరణిలోను అనర్గళంగా బోధలు చేసేవాడు. ఆయన కవితానైపుణ్యం ఆ మాటల మాధుర్యం, గాంభీర్యం చవిజూచినవారు చదువుసంధ్యలంతగా రాని పిచ్చిరంగయ్య విలువను గుర్తించి ఆయనను రంగావధూతగా మన్నించినారు.

కొంతకాలం తరువాత ఆయనకు చాలామంది శిష్యులు ప్రోగై ఆయన పాడే పాటలు, పద్యాలు వ్రాసిపెట్టేవారు. ఆయనకు శుశ్రూషలు చేసేవారు. ఒకనాడున్నట్లుండి రంగావధూతలవారు తనచుట్టు మూగిన శిష్యులతో ఇక ఆరు మాసాలకు నిజస్థితికి చేరుతున్నానన్నారు. మీరు మేలుకొనండి అని హెచ్చరించినారు. కొంతకాలం తరువాత ఇక 15 దినాలకు దేహం చాలిస్తామని చెప్పి, పరమాత్మలో పూర్ణైక్యం పొందేదాక శిష్యులకు బోధలు చేస్తుండినారు. గురువుగారు మనల విడిచిపోతున్నారని దుఃఖించే శిష్యులకు నేను లేనని మీరు బాధపడవలదు. నేను చెప్పినవి శ్రద్ధగా ఆచరించినవారికి దర్శన మిస్తానని వాగ్దానం చేసి 4-12-1905 నాడు బ్రహ్మైక్యం చెందినారు.

రంగావధూతలవారు చెప్పిన తత్త్వాలు పాటలు పద్యాలు వారి శిష్యులు ప్రోగు చేయగా శ్రీవారి శిష్యులు గుంటూరువాసులైన ఆత్మూరి రామమోహన రాయ్‌గారు 1915 సంవత్సరం ముద్రించి జిజ్ఞాసువులకు అందించినారు. అటు తరువాత ఆ గ్రంథాలు

అలభ్యమైపోతే రామమోహన్‌రాయ్‌గారి పుత్రులు ఆనందమోహన సోమయాజి, G.M.సోమయాజి అన్ని హక్కులతో ముద్రించుటకు ఏర్పేడు వ్యాసాశ్రమం అధిపతులు శ్రీ విమలానంద స్వాములకు అప్పగించినారు. వ్యాసాశ్రమంవారీ గ్రంథాన్ని 1971 సంవత్సరం పునర్ముద్రణ గావించినారు. ఈ గ్రంథానికి పీఠికారూపంగా రామమోహన రాయ్‌గారు అవధూతలవారి చరిత్రం చాలా స్వల్పంగా వ్రాసినారు. అవధూతలవారి శిష్యురాలు బెజవాడ వాసిని జ్ఞానమాంబ. 'శ్రీరంగావధూతలవారి దివ్యజీవితము జ్ఞానబోధ' పేరుతో ఒక పద్యకృతి రచించినది. ఆకృతి 1909లో బందరులో ముద్రింపబడినది. దీని Zerox copy గుంటూరు వాసి మిత్రులు A.S. ప్రసాద్‌గారు నాకు పంపినారు. ఇది 88 వివిధవృత్తముల కృతి. ఇందులో కూడ రంగావధూతల జ్ఞానబోధల గూర్చియే అధికంగా ఉంది. శ్రీవారి జీవితవిశేషాలు ఎక్కువగా లేవు.

ఇక శ్రీరంగావధూతలవారి జ్ఞానబోధలు కొన్ని పేర్కొంటాను. కీర్తన లన్నియు రాగతాళ నిర్దేశములతో ఉన్నవి. రంగావధూత తమ గురువు చందమ్మను పెక్కు కీర్తనల్లో స్తుతించినా మొదటి కీర్తన గురుకీర్తనమే. అందులో గురువులపేరు లేదు రెండవకీర్తనలో **"నయనారె చందమ్మా"** అని సంబోధిస్తూ చివరిపాదంలో **"వాసిగ ధర రంగదాసుడనమ్మా, మోసమేమిక నన్ను పోషించుమమ్మా"** యని వేడినాడు. మూడవ కీర్తనలో గురువుండే పెద్దవీథిని పేర్కొన్నారు. ఐదవ కీర్తనలో గురువుగారి వేషభాషలు తీరుతెన్నులు "తెల్లని చీరకట్టి, నల్లని రవిక తొడిగి... ఒంటికాసు నల్లపూస, కంఠమున తాలిబొట్టు... కాళ్లకు కడియాలు, వ్రేళ్ళకు వెండిమట్టెల్, నీళ్ళబావి యొద్దనైన నిలుచుండుటెరుగద''ని పేర్కొన్నారు.

ఏడవకీర్తన చివరి చరణంలో "రంగదాసుసుతుడొంగి, సేవలు ప్పొంగుచు జేయునో యమ్మా - అంగనరో పరసంగతెరుంగక భంగపడితి చందమ్మా" యని వేడుకున్నారు. 13వ కీర్తన చివరి పాదంలో వాసిగ తలారివారి వంశమందున రంగదాసుని మాటలు మోక్షపు బాటలు" అని 15వ కీర్తనలో "వాసిగా నేటైన బందరు ప్రాతరామనపేటలోన, భాసురంబుగ వెలసి రంగ, దాసునై నేనెల్లవారికి వందనం బొనరింతు"నని తన సంగతి చెప్పినారు. తక్కినవన్నియు అచల వేదాంత తత్త్వములు; చివరి 30వ కీర్తన గురువుల మంగళహారతి. మిగతావి జ్ఞానబోధలు వచన రూపంలో గురుశిష్య సంవాదరూపంలో ఉన్నవి. అటు తరువాత జ్ఞానమార్గ పద్యములు 32, కందార్ధదరువులు 12 ఉన్నవి.

సద్గురు శ్రీరంగావధూతలవారి దివ్యజీవితము జ్ఞానబోధ పద్యకృతి రచించినది శ్రీజ్ఞానమాంబగారు. అవధూతలవారి ప్రియశిష్యుడు సీతారామావధూతలవారు బోధించగా రచించినదీ కృతి. శ్రీరంగావధూత భక్తజనమాసం గుంటూరు కార్యదర్శి ఆత్మూరి రామమోహనరాయ్‌గారు ప్రకటించినదీ కృతి. ఇందులో తొలి 88 పద్యాలతో రంగావధూతల వ్యక్తిత్వం మలి 137 పద్యాలలో కేవలం వేదాంత విషయములున్నవి. 84వ పద్యంలో రంగావధూతల శిష్యురాలు మౌనానందవాణి, 85వ పద్యంలో శ్రీవారి శిష్యులు కొందరు భక్తజనసమాజంగా ఏర్పడిన విషయాలున్నవి. బెజవాడ వద్ద సీతానగరంలో సమాధి చెందిన మౌనానంద అవధూతఅమ్మ 1874 - 1989 (ఆంధ్రయోగులు చతుర్థభాగం) రంగావధూతల శిష్యురాలు మౌనానందవాణి భిన్నులు.

ఆధారం:

1) శ్రీరంగావధూతలవారి జ్ఞానబోధావళి – ఏర్పేడు వ్యాసాశ్రమము, 1971.

2) శ్రీరంగావధూతలవారి దివ్యజీవితము జ్ఞానబోధ, పద్యకృతి, శ్రీజ్ఞానమాంబ 1909.

13. లద్దగిరి చినరామదాసు

(1902 - 1947)

కర్నూలు జిల్లా కోడుమూరు మండలం హంద్రీనదీ తీరానగల లద్దగిరి అత్యంత ప్రాచీనస్థలం. ఉత్తరభారతదేశం నుండి వచ్చి అక్కడ స్థిరపడిన రామదాసు (1833-1893) అవధూత సమాధి అక్కడున్నది. అవధూతల వారిని దైవంగా కొలిచిన భక్తులెందరికో యోగశక్తులలవడినవి. అట్టివారిలో కమ్మరి చినరామదాసు ముఖ్యుడు. ఎల్లయ్యశాంతమ్మ అనే భక్తులకు పెదరామదాసు వరంచేత పుట్టిన ఈ చినరామదాసు కూడ అనేకమహిమలు చూపిన అవధూత. ఆయన పరివారంవారే పెదరామదాసు గుడి పూజారులు. చిన రామదాసు వరంచేత పుట్టినవారు కల్లూరు దిగంబరావధూత రామిరెడ్డి తాత (1947-1993). పెద రామదాసును భక్తితో కొలిచిన పెదమాదన్న చినమాదన్న అనే మనుబ్రహ్మలు (కమ్మరులు)

గురుదేవులు వరం కోరుకొండి అంటే తమ వంశం వారే పరంపరంగా మీసమాధి పూజారులుగా ఉండవలెననీ, తమ సమాధులు కూడ అక్కడే ఉండవలెననీ కోరుకున్నభక్తులు. పెదరామదాసు వారికి ఆరెండువరాలు ఇచ్చి వారు కోరని మరొక వరం ప్రసాదించినారు. కొంతకాలం తరువాత మీ వంశంలో నా అంశతో మరొక పుత్రుడు కలుగుతాడు; ఆతనికి నాపేరే పెట్టుకొండి అని దీవించినారు. వారు దీవించినట్లే చినమాదన్న కొడుకు ఎల్లయ్య ఆయనభార్య శాంతమ్మ కన్న ఐదుగురు కొడుకుల్లో అతి తేజస్వంతుడుగా జన్మించిన (1902) మూడవ శిశువుకు చిన రామదాసని పేరు పెట్టుకున్నారు.

చినరామదాసు బాల్యం లద్దగిరిలోనే గడచింది. ఆయన తండ్రి పెదరామదాసు గుడిపూజారి కనుక కౌమారప్రాయం నుండి చినరామదాసు తండ్రితోపాటు గుడిలోనే ఎక్కువకాలం గడిపేవాడు. తండ్రిగారు బడిలో చేర్పించినా సరిగా బడికి పోక లద్దగిరి కొండల్లోనో ఎక్కడో తిరిగితిరిగి రాత్రి గుడికి చేరేవాడు. ఆతని వింత ప్రవర్తనకు తల్లిదండ్రులు లోలోన బాధపడినా గురువుల వరంచేత పుట్టినవాడు కనుక ఏమీ అనలేకపోయేవారు; గురువుల పైనే భారం వేసేవారు. కౌమారం దాటగనే చినరామదాసులో ఆధ్యాత్మికచింతన భవిష్యజ్ఞానం వికసింపసాగినవి. అడుగకుండానే ఎదురు పడినవారికి, తమ యింటికి వచ్చినవారికి మీకు ఇట్లా జరుగుతుంది; మీ ఇంట్లో ఇట్లా ఔతుంది అని చెప్పేవాడు. ఆ మాటలు నిజమయ్యేవి. యౌవనం ప్రవేశించగనే చినరామదాసు లద్దగిరి చుట్టుప్రక్కల గ్రామాలన్నీ తిరిగేవాడు. ఏపూట ఎక్కడుంటాడో ఎవరికీ తెలియదు. ఒకసారి తమ ప్రత్తిచేనులో మంచెపై పడుకొని ఆదారిన పోయేవారిని ప్రత్తి ఏరుకపొండి అని పిల్చి చేను లూటీ పెట్టినాడు.

ఒక్కొక్కసారి తమగ్రామం వీథులవెంట ఏడుస్తూ తిరిగేవాడు. జనులు ఆతడు పిచ్చివాడన్నారు. పెదరామదాసుగుడిలో ఒక మూలన నాల్గేసి దినాలు నిద్రాహారాలు మాని పరధ్యానంలో ఉండేవాడు; గుడికి వచ్చేవారిపై రాళ్ళు విసిరేవాడు. గుడి ఊడవటానికి వచ్చినామెను బాగా కొడితే ఆమె గ్రామం పెద్ద రెడ్డిగారితో మొర పెట్టుకున్నది. రెడ్డిగారు పిచ్చిరామదాసును కట్టివేసి కొట్టబోతుండగా పెద్దన్న మాదన్న వచ్చి తానే బాగా కొట్టినాడు. రామదాసా నాడంతా బందిగానే ఉండి మరునాడు గ్రామం వదలి పారిపోయినాడు. కర్నూలు, నందికొటుకూరు, ఆత్మకూరు మొదలైనచోట్ల ఎవరేమి పెట్టినా తింటూ చావిడీల్లో పడుకున్నాడు. అతడు ఇల్లు విడిచి పోయిన రెండునెలలకు శాంతమ్మ బ్రతిమాలగా బ్రతిమాలగా మాదన్న తమ్ముని వెదుకుతూ గ్రామాలు తిరిగితిరిగి నంది కొటుకూరువద్ద గార్గేయపురంలో పట్టుకొని లద్దగిరికి తీసుక పోయినాడు. కాని చినరామదాసు లద్దగిరిలో ఉండక గ్రామాలు చుట్టి తన మహిమలు ప్రదర్శించినాడు. తమ పెద్దక్క పెద్ద వెంకమ్మ నిచ్చిన మల్లగుర్తికి తరచుగా పోయేవాడు. అక్కడ కటిక రామన్నకు సంతానం ప్రసాదించినాడు.

ఒకనాడు రామదాసు ఇటికెలపాడుకు వచ్చినవిషయం తెలిసి సమీపగ్రామం మానవపాడు గ్రామస్థులు బండి కట్టించుకపోయి ఆయనను తమగ్రామానికి సగౌరవంగా తీసుకవచ్చినారు. అప్పటి నుండి రామదాసు సంచరించే గ్రామాల్లో మానవపాడు ఎక్కువ ప్రాధాన్యం సంతరించుకున్నది. మానవపాడులో అంతకు పూర్వం ఒక గురువులమ్మ గొప్ప మహాత్మురాలుండేది. ఆమెవద్ద మంత్ర దీక్షితులైన వారిలో అప్పలరెడ్డి; భీమలింగం వెంకటరామయ్య

అనే కమ్మరి సోదరులు ముఖ్యులు. గురువులమ్మ తమ శిష్యులతో ఒకనాడు నాతరువాత ఇక్కడికి మరొక మహాత్ముడు వస్తాడు. ఆతణ్ణి సేవించండని చెప్పినది. మన రామదాసుగారక్కడికి చేరకముందే ఆమె దేహం చాలించినది. గురువులమ్మ సమాధి మానవపాడు గ్రామం బయట రైల్వేస్టేషన్ సమీపాన ఉన్నది.

రామదాసు ముఖం తలవెంట్రుకలు నిగనిగలాడుతుండేవి. ఆయన అంత పొడుగరి కాదు, పొట్టివాడు కాదు, ఆకర్షణీయమైన దేహయష్టిపై నిలువుటంగీ ధరించేవాడు. మానవపాడుకు వచ్చిన తరువాత ఉల్లెందకొండ వాసి హరిజనుడు బుడ్డన్న, కల్లూరు రామిరెడ్డి, అనుగొండ హరిదాసు ఆయనకు ముఖ్య శిష్యులైనారు. గురుపుత్రుడైన భీమలింగంకు రామదాసుపై భక్తి కుదిరినందువలన ఆయనయిల్లు రామదాసుకు భోజనకేంద్రం, కార్యక్రమాలకేంద్రం ఐనది. మానవపాడులోని విశ్వకర్మకులజులందరూ ఆయన శిష్యులైనారు. రామదాసు నిరంతరం రామనామం చేస్తూ భక్తులచేత శిష్యులచేత భజనలు చేయించేవారు. ఐతే వారి ఇండ్ల మధ్యన ఉన్న ముస్లింలకు ఈభజనలు, భజనచేస్తూ ఊరేగటం కిట్టలేదు. భీమలింగం పినతండ్రి పాపయ్య. రామదాసు భీమ లింగం ఇంటినుండి పాపయ్య ఇంటికి పోతూ రామభజన చేస్తుంటే ఈరెండిండ్ల మధ్యనగల తురకల ఇండ్లలోనివారు కోపించేవారు. ఒకనాడు అలీనాయక్ రామదాసును గద్దించి బెదరిస్తే నాటినుండి ఆయన "ఆయెర అలీసాహెబ్ – తెడ్డుకట్టె షాలీ సాహెబ్" అని పాడుతూ పోయేవాడు. మూడుదినాల తరువాత ఆసాహెబుకు రామదాసు కలలో కనబడినాడట. ఏమి జరిగిందో తెలియదు గాని ఆసాహెబు మరునాడుదయం టెంకాయ, శర్కర తీసుకొని

భార్యాసమేతంగా పోయి భజనచేస్తున్న రామదాసుకర్పించి దండం పెట్టి పోయినాడు. అవి రజాకార్ల దురాగతాలు మితిమీరుతున్న దినాలు. అక్కడి రజాకార్ల పెద్ద కతాల్‌సాహెబు పెద్దభవనం కట్టించుకుంటున్నాడు. రామదాసు ఒకనాడు నంబి తిరుమలమ్మ యింటికిపోతూ చెంతనే నిర్మాణంలో ఉన్న ఆ భవనం చూచినాడు. తిరుమలమ్మయింటికి పోయినతరువాత ఆమెతో రామదాసు "ఈయిల్లు నిలువదమ్మా ఎందుకు ఇంతపెద్దగా కడుతున్నాడు" అన్నారు. తిరుమలమ్మ భయంభయంగా ఆమాట అనకండి వానికి తెలిస్తే మనలందరినీ చంపుతాడన్నది. నేను నిజమే చెప్పుతున్నా నమ్మా అని రామదాసుగారన్నారు. వారా మాటలన్న పదిహేను దినాలకే హైదరాబాదుపై పోలీసుచర్య జరిగింది. రజాకార్లెందరో మిలిటరీ నెదిరించి బలియైపోయినారు. హిందువులా కతాల్ సాహెబు ఇల్లు కూలగొట్టినారు. ఆయింటి దూలాలు దంతెలతో మానవపాడు ఊరివాకిలి కట్టినారు.

భీమలింగం పెదతండ్రి వెంకటరామయ్య ఇంటిముందున్న రెండుపెద్ద అరుగులపై అప్పుడపుడు రామదాసుగారు కూర్చుండేవారు. ఒక అరుగుపై గచ్చు చేసిన పెద్ద నీటికుండిక ఉండేది. ఒకనాడు వెంకటరామయ్య చిన్నకొడుకు పారాడుకుంటూ వస్తే రామదాసు వాణ్ణి తీసుకొని ఆజలకుండికలో వేసినారు. వాడు కాళ్ళు చేతులు కొట్టుకొని అడుగు పట్టేవరకు చూచినవారిట్లా ఎందుకు చేస్తిరి స్వామీ అంటే వెంటనే బయటికి తీసి నీళ్ళు తుడిచినారు. వాడు కేరింతలు కొడుతూ పోయినాడు. రామదాసు గారాబాలుని ఇట్లా మూడుసార్లు వేయటం, వాడు ఉక్కిరిబిక్కిరై అడుగంటటం బయటికి తీసి తుడవటం జరిగింది. నాలుగవసారికి

ఆబాలుడు నీటిలో మునగక రబ్బరుబంతి వలె పైన తేలియాడుతూ కేరింతలు కొట్టినాడు. ఇట్లే మరొక చిన్నపిల్లవాణ్ణి ఎఱ్ఱటెండలో మలమలమాడే బండపై అటుఇటు నడిపించిన అద్భుతాలు మానవపాడువాసులు ఇప్పటికీ చెప్పుతుంటారు.

రామదాసుగారు మానవపాడులో ఉంటూ అపుడపుడు లద్దగిరికి పోయి వస్తుండేవారు. ఒకసారి ఆయన వెంట భీమలింగం, పాపయ్య ప్రభృతులు సకుటుంబ సపరివారంగా బండ్లుకట్టుకొని ఉల్చాలమీదుగా పోతుండగా అక్కడి దొర వాసారెడ్డి ఆయనభార్య (రామదాసుగారి వరంచేత పుట్టినామె) ఆ బండ్లను ఆపి తమ యింట్లో రెండుమూడు దినాలుంచుకొని అతిథి మర్యాదలు సత్కారాలు చేసినారు. అప్పటికి భీమలింగం కొడుకు రామబ్రహ్మం ఆరునెలలవాడు. ఒక సాయంకాలం ఆ బాలుని వాకిలి వద్ద మంచం పైన పడుకోబెట్టితే గోధూళివేళ తిరిగివచ్చిన నాలుగు ఆవులు వాకిలికి అడ్డంగా ఉన్న మంచంపైనుండి దూకి లోపలికి పోయినవి. ఆ దృశ్యం చూచిన వారందరూ ఇది రామదాసుగారు ప్రదర్శించిన అద్భుతలీలగా గుర్తించినారు. ఆనాటి బాలుడు రామబ్రహ్మం ఈనాడు విశ్రాంతోపాధ్యాయుడు చినరామదాసుగారి చరిత్ర రచయిత.

రామదాసుగా రెక్కడుంటే అక్కడ ఆధివ్యాధిపీడితులు మూగి ఉండేవారు. వారు తమ బాధలు చెప్పుకుంటుంటే రామదాసుగారు వారికి పరిష్కారములు చెప్పుతుండేవారు. కొందరిని తిట్టేవారు, కొందరిని కొట్టేవారు. అట్లా తిట్లు తిన్నవారు దెబ్బలు తిన్నవారు తమ గండాలు గడిచినట్లుగా తలచేవారు. రామదాసుగారికి

పట్టరాని కోపం వస్తే ఆయన మెడనరం ఒకటి బాగా ఉబ్బేది. అది గమనించి చుట్టున్నవారు దూరం పోయేవారు. అట్టి సమయంలో ఆయన చేతికి ఏది చిక్కితే దాన్ని వారిపైకి విసరేవారు. లేదా ఆవస్తువును నేలకు కొట్టేవారు. ఒకసారి రామదాసుగారు కోపంగా ఉన్నది గమనించి వెంకటరామయ్య ఆతని పరివారం దూరం పోయినారు. స్వామి చిన్న పిల్లలకేమి హాని చేయరుగదా అని రామబ్రహ్మంను అక్కడే విడిచిపోయినారు. రామదాసుగారు కోపోద్వేగంతో చేతికి చిక్కిన పీట ఆ బాలునిపైకి విసరినారు. రామబ్రహ్మం ముక్కు పగిలి నెత్తురోడినది. బాలుడు కాసేపు ఆబాధతో ఏడ్చినా ఆతని మరణగండం గడచిందనుకున్నారందరు. రామదాసుగారు ఎవరి యింటి ముందెపుడైనా కూర్చుండి ఏడ్చినారంటే వారి యింట్లో ఒక పీనుగు వెళ్ళినట్లే లెక్క.

రామదాసుగారు మానవపాడులో జాతిభేదం లేకుండా అందరినీ ఒకచోట కూర్చుండజేసి రామభజన చేయించేవారు. అప్పుడప్పుడు రామదాసుగారు "రామదాసు వస్తున్నాడు రామ బజారులోన, దేవు డొస్తున్నాడు రామ బజారులోన, శాంతమాంబ వస్తుంది రామ బజారులోన, వీరబ్రహ్మం వస్తున్నాడు రామ బజారులోన, సిద్దయ్య వస్తున్నాడు రామ బజారులోన" అంటూ పాడేవారు. అప్పుడప్పుడు భజన చేస్తున్నవారి నడుమ కూర్చుండి ఏమైనా విషయాలు చెప్పేవారు. భజన మంచి ఊపు అందుకున్న సమయాన లేచి ఆవేశంతో చిందులు వేసేవారు. ఇటువంటి సమయాల్లోనే ఆగతా నాగతాలు చెప్పేవారు. వెంకటరామయ్య ఒకనాడు రామదాసు గారితో "నాయనా మీరున్నారు కనుక మమ్ములందరినీ ఏక పంక్తిన మీ సన్నిధిలో కూర్చుండబెట్టుకున్నారు. మీతరువాత మాగతేమిటి

అంటే అఘోరస్వామి ఉన్నాడన్నారు. మరొకసారి వెంకట రామయ్య "స్వామీ! ఊరిలో కొందరు మీరు కనుకట్టువిద్యలు గారడీలు చేస్తున్నారు అంటున్నారు. మీరేదైనా ఒక మహిమ చూపండి. మీరిక్కడ ఉండగా వాకిలి వేస్తాము. మా చిన్నాయన భీమలింగం గారింట్లో కనబడండి" అంటే రామదాసుగారు ఏమీ అనలేదు. ఆరాత్రి రామదాసుగారు వెంకటరామయ్యకు తాడిచెట్టు ప్రమాణంలో దర్శన మిచ్చినారు. అంతటితో వెంకటరామయ్య నోరు మూత పడినది. మరేమీ అడుగలేదు. పరమభక్తుడైన గంగు కృష్ణారెడ్డికి కూడ ఇట్టి దృశ్యమే కనపడినది. మానవపాడు గ్రామానికి పెద్దగంగు కృష్ణారెడ్డి తమయింట్లో భజన ఏర్పాటు చేసినాడు. అందులో హనుమంతరెడ్డి అప్పలరెడ్డి కొందరు హరిజనులు నంబి తిరుమలమ్మ బోయవారున్నారు. భజన ఊపందుకొనగనే రామదాసు గారు లేచి ఆవేశంతో "ఏదిరా గండ్రగొడ్డలి" అంటూ గ్రుడ్లురిమినాడు. ఎవరికీ అర్థం కాలేదు. హంద్రీతీరాన ఒక ప్రాచీనశివలింగం బయటి పడినప్పుడు పుష్పగిరి పీఠాధి పతులు వచ్చి అది పరశురామ ప్రతిష్ఠ అనీ, పరశురాముడు సంచరించిన ప్రదేశమనీ అన్నారు. అందుకే కాబోలు రామదాసుగారప్పుడు పరశురామావేశం పొందినారు. ఇప్పటికీ ఆ ప్రాంతంలో గండ్ర గొడ్డండ్ల వేటలెక్కువ. ఆ భజనలో పాల్గొన్న మరొకరెడ్డి తనను రెండు దినాలక్రింద గండ్రగొడ్డండ్లతో వేటాడవచ్చిన ఎదుటి గుంపువారు తాను రామదాసస్వామిని బిగ్గరగా పిలిచినంతనే పారి పోయినారన్నాడు.

ఇప్పుడు మానవపాడులో ఉంటున్న మొహరీర్ రాంరెడ్డి బాల్యంలో వనపర్తిలో చదివేవాడు. ఆయన తలిదండ్రులు

పరివారమంతా రామదాసుగారి భక్తులే. పండుగు నాల్గుదినాల సెలవులకు రాంరెడ్డి మానవపాడుకు వచ్చినాడు. తిరిగిపోయేనాడు తల్లి దండ్రులతోపాటు రామదాసుగారి దర్శనానికి వచ్చి సెలవు తీసుకున్నాడు. కాని రామదాసు గారా బాలుని వనపర్తికి మూడు దినాలదాక పంపవద్దని తల్లిదండ్రులను ఆదేశించటంచేత అతడు మానవపాడులోనే నిలిచిపోయినాడు. అది వర్షాకాలం కుంభవృష్టి కురిసి సాయంకాలం ఉక్కుసెట్టి వాగుపైగల రైలువంతెన కూలిపోయి ఆ సాయంకాలం పోయే రైలు పెట్టెలన్నీ పడిపోయి చాలా మంది చనిపోయినారు. రాంరెడ్డిని వనపర్తికి స్వామి ఎందుకు పోవద్దన్నారో అప్పుడు తెలిసింది. ఇట్టి భవిష్యజ్ఞానం తెలిసి భక్తుల నాదుకునే వారే భగవత్స్వరూపులైన మహాత్ములు, అవధూతలు. మరొక వానకాలం రామదాసుగారు మానవపాడులో భక్తులు పరివేష్టించి యున్నప్పుడు అయ్యో మునిగిపాయె, మునిగిపాయె, చచ్చిరి, చచ్చిరి అని అరచినారు. అప్పుడది ఎవరికీ అర్థం కాలేదు. మరునాడుదయం వార్తాపత్రికల్లో "తుంగభద్రలో పంచలింగాల దగ్గర పుట్టిమునక" అనే పతాక శీర్షికతో చాలామంది దుర్మరణం పాలైనట్లు వచ్చింది.

రామదాసుగారు మానవపాడులో ఉంటూ అప్పుడప్పుడు యథేచ్ఛగా చుట్టుపట్టు గ్రామాలు తిరిగేవారు. వారు ఎక్కడికి పోయినా మాదిగబుడ్డన్న తన భుజాలపై స్వామిని అవలీలగా ఎంతదూరమైనా మోసుకపోయేవాడు. బుడ్డన్నపై ఈర్ష్య పెంచుకున్నవారిలో అమరవాయి నాయక్ గోపాల్ ఒకడు. స్వామిది బక్కపలుచని దేహం, బరువేమీ ఉండదు. ఎంతదూరమైనా మోయ వచ్చుననే అహంకారం అతనిలో ప్రబలింది. అతని గర్వాహంకా

రములు గుర్తించిన స్వామి ఒకనాడు నాయక్ గోపాల్‌తో నన్ను మీగ్రామం అమరవాయికి తీసుకుపోతావా అంటే అతడు చాలా సంతోషించి స్వామిని తన భుజాలపై ఎక్కించుకొని బయలు దేరినాడు. అమరవాయికి మానవపాడుకు మధ్యన ఒక వాగున్నది. ఆవాగువరకు పోయేవరకు స్వామి కొండంత బరువైనాడు. నాయక్ గోపాల్ స్వామిని వాగువద్ద దించి ఇక నేను మోయలేను స్వామీ అని బ్రతిమాలినాడు. ఆతని అహంకారం అణగిపోయింది. అప్పుడు రామదాసుగారు ఇక నేను బరువుకానులే అని ఆతని భుజ మెక్కినారు. బెండువలె తేలికైన స్వామిని నాయక గోపాల్ తన ఊరికి మోసుకపోయినాడు. ఇట్లే మానవపాడు చినసుబ్బారెడ్డికి బుడ్డన్నపైగల ఈర్ష్యను గుర్తించి ఆతనికి స్వామి ఇట్టి అనుభవమే కలిగించినారు. గర్వాహంకారము ఈర్ష్యాద్వేషాలు స్వామివారీ విధంగా తొలగించి తన భక్తులను మంచి మానవులుగా దిద్దేవారు. ఉల్లెందకొండ మాదిగ సుంకన్నగూడ బుడ్డన్నవంటి గొప్ప భక్తుడు. రామదాసస్వామిని 12 ఏండ్లు తన భుజాలపై మోసిన ధన్యుడు. పాణ్యం మండలం ఎఱ్ఱపాడు గ్రామవాసులకు ఈసుంకన్న అవధూత రామదాసు మహిమలు చెప్పేవాడు. అక్కడి వారంతా స్వామిభక్తులై ఇప్పటికీ లద్దగిరికి పోయి స్వామి సమాధిని సేవిస్తుంటారు.

రామదాసుగారు సుదూరభవిష్యత్తులో జరిగేవి కూడ చెప్పేవారు. మానవపాడు రైల్వేస్టేషన్. స్టేషన్‌కు సమీపానగల గురువులమ్మ సమాధి, ప్రక్కన తులశమ్మగారి ఆరెకరాల చేను, ప్రక్కనే మరొక పెద్దచేనులుండేవి. స్వామి ఎక్కడికైనా రైలుప్రయాణం చేయదలచు కుంటే రైలు రాకపోకలు ఆలస్యమైనపుడు స్వామి ఆ ప్రాంతాలు

తిరుగుతూ అబ్బో ఏమి బంగ్లాలు ఏమి బంగ్లాలు ఎంతజనం ఎంతజనం అనేవారు. అప్పుడా మాటలు ఎవరికీ అర్థం కాలేదు. స్వామి సమాధిగతులైన 20 ఏండ్లకు ఆ ప్రాంతమంతా పెద్ద కాలనీ, సిమెంటు భవనాలు, ఆసుపత్రి, సినిమాథియేటర్ ఏర్పడినవి. అవధూతల వారికి చాలా మునుముందు జరగబోయే విషయ పరిజ్ఞానం కరతలగతమన్నమాట. రామదాసుగారి ప్రత్యేకత భక్తుల కలల్లో ప్రత్యక్షమై వారివారి కోరికలు తీర్చటం. మానవపాడు మారుమునగాల గొల్లరాములు, అనుపూరు సుబ్బారాయుడు వంటివారికి స్వప్నంలోనే ప్రత్యక్షమై స్వామివారు సంతానం ప్రసాదించినారు. ఆంధ్రరాష్ట్రం మంత్రివర్గంలో ఉన్న ఉల్లెందకొండ బాషామియా స్వామి వరప్రసాదమే. మంత్రివర్గంలో ఉన్న బి.వి.మోహన్ రెడ్డిగారి తల్లిదండ్రులకు స్వప్నంలో బాలెంత రూపంలో కనబడి మామిడి పండిచ్చినారట. స్వామి అడుగకుండానే కొందరికి వాచా, మరికొందరికి కర్మణా వారి భవిష్యత్తును సూచించేవారు. ఎల్దండ కొట్టాల హనుమంతు విద్యార్థిదశలో స్వామిని దర్శించబోయినపుడు ఉపాధ్యాయుడు విద్యార్థిని బెత్తంతో బెదరించిన విధంగా బెదరించినారట. తత్ఫలితంగా హనుమంతు చదువు పూర్తిచేసి ఉపాధ్యాయుడైనాడు. వెంకటరామయ్య భార్య సంతానం కోసం పదే పదే ప్రార్థిస్తుంటే ఎందుకీ ఆరాటం, నీకు కూతురు కొడుకు పుడుతారుగాని ఏకాకులైపోతారన్నారట. స్వామి అన్నట్లే ఈనాడామె దిక్కులేనిదైపోయినది. బేతంచెర్ల శివారెడ్డి స్వామిని తన గ్రామానికి తీసుకపోయి మర్యాదలు చేసి తన భూమిచూసి బండలగని పడుతుందా అని అడిగితే స్వామి తప్పక పడుతుంది. బేతంచెర్ల వాసులందరికీ బండలగనులే అన్నం

పెడుతాయి అన్నారు. ఈనాడదే జరుగుతున్నది. మానవపాడు ప్రక్కగ్రామం యంజర్ల. దానినే నారాయణ పురమంటారు. ఆ గ్రామం నారాయణ బాలుడుగా స్వామిని దర్శించవచ్చేవాడు. రామదాసస్వామి ఆతణ్ణి తనదగ్గర కూర్చుండబెట్టుకొని బాలయోగీ అనేవారట. వారి మాటలు నిజమైనవి. ఇప్పుడా బాలుడు నారాయణ అనే యోగిపుంగవుడు ఆహారం తీసుకోడు పాలుపండ్లు మాత్రమే ఆహారం. ఆగ్రామవాసు లాయనకు ఒక ఆశ్రమం అందులో ఒక గుడి కట్టించినారు.

అవధూతల ప్రవర్తన చాలా వింతగా విడ్డూరంగా ఉంటుంది. రామదాసు అవధూత కల్లు సారాయివంటి మత్తుపదార్థాలు కూడా సేవించేవారు. ఒకసారి రామదాసుగారు కల్లుపెంటకు పోయి కల్లడగితే యజమాని గౌడు విసుక్కున్నాడు, దురుసుగా మాట్లాడినాడు. స్వామి అలిగిపోతూ నీతిత్తి పగులుతుందన్నారు. అన్నట్లే మరునాడు బండిపై కల్లుతిత్తి తెచ్చి గోలెంలో నింపుతుండగా ఆతిత్తి పగిలి కల్లంతా నేలపాలైనది. నాటినుండి గౌడు స్వామియెడ భయభక్తులతో మెలుగుతుండేవాడు. స్వామి నిజంగా కల్లు త్రాగేవారో లేదో ఎవరికీ తెలియదు. వారు కల్లుముంత నోటికి పట్టగానే కల్లంతా గడ్డం వెంట ధారగా క్రిందపడుతుంటే భక్తులు పాత్రల్లో దోసిళ్ళలో పట్టుకొని తీర్థంగా పుచ్చుకునేవారట.

రామదాసు స్వేచ్ఛాజీవి. మానవపాడులో ఉన్నా చుట్టుపట్టు గ్రామాలు, అడవులు కొండలు రేయింబవలు తిరిగేవారు. ఒక్కొక్కసారి నడిరేయి బయలుదేరి ఒంటరిగా ఎటో పోయి వచ్చేవారు. అప్పుడప్పుడు శ్మశానంలో పడుకునేవారు. ఆయనకు

చుట్టుపట్టు గ్రామాల్లో పేదవారు శ్రీమంతులు అన్నికులాలవారు చాలామంది భక్తులైనారు. వారివారి వస్తువులు పోతే స్వామి చెప్పినచోట్ల చెప్పిన దినాలకు లభించేవి. ఒకసారి కోడుమూరు మండలం కిష్టాపురంలో ఉండే మల్లారెడ్డి తల్లి స్వామిదర్శనానికి వస్తుంటే త్రోవలో హంద్రీనదిలో చేతి బంగారు కడియం జారిపోయింది. ఎంత వెదకినా లభించలేదు. స్వామి దర్శనం తరువాత ఆమె ఈవిషయం మనవిచేయగా స్వామి ఆమె వెంటపోయి హంద్రీనది నడుంబంటి నీళ్ళలో ఆకడియం తీసి ఆమెకిచ్చినారు. లద్దగిరిలో బలిజ అంగటి వీరన్న, అనుగొండలో వడ్ల తిమ్మప్పాచారి స్వామివారికి కూర్చు భక్తులు. చిన్న రామదాస స్వామి జీవించినది 45ఏండ్లే ఐనా కర్నూలుజిల్లా పెక్కు గ్రామాల్లో తమ మహిమలు ప్రదర్శించి లద్దగిరి తిరిగివచ్చి 27-7-1947 శా.శ. ౧౮౬౯ సర్వజిత్ సంవత్సరం శ్రావణ శుద్ధదశమి ఆదివారం నాడు తమ తనువు చాలించినారు. మానవపాడు, ముండ్లగుర్తి మొదలైన గ్రామాల భక్తులు వచ్చి శ్రీవారి పార్థివశరీరాన్ని తమకిస్తే సమాధిమందిరాలు కట్టిస్తామన్నారు. కాని శ్రీవారి సోదరీసోదరులు దానికంగీకరించలేదు. విధివిధానోక్తంగా వారిని ఊరేగించి పెద్ద రామదాసు ఆలయం ఎడమప్రక్కన తూర్పుముఖంగా కూర్చుండ బెట్టి పూజించి సమాధిచేసినారు. కాలాంతరాన స్థానికులైన రెడ్లు శ్రీవారికి పెద్దరామదాసుకువలె పెద్ద సమాధి మందిరం, యాత్రికులకు వసతులు ఏర్పాటు చేసినారు.

ఈనాడు లద్దగిరి గొప్ప పుణ్యక్షేత్రం. పెద్దరామదాసు చిన్న రామదాసు సమాధి మందిరాలు దర్శించటానికి దూరదూరాల నుంచి ఆస్తికులు వచ్చి తమ మ్రొక్కులు చెల్లించి శాంతి

సౌఖ్యాలనుభవిస్తున్నారు. ఇరువురు మహాత్ముల సమారాధనలు పెద్దయెత్తున జరుగుతున్నవి.

దాసుగారి తోబుట్టువులు మగవారు : 1) మాదన్న 2) నాగప్ప 3) అవధూత రామదాసు 4) రామలక్ష్మమ్మ 5) శేషయ్య.

ఆడతోబుట్టువులు 1) పెద్దవెంకమ్మ 2) చిన్నవెంకమ్మ 3) అక్కమ్మ 4) రామలక్ష్మమ్మ 5) సుబ్బమ్మ వీరి సంతానపరంపర చాలామంది ఉన్నారు.

ఆధారం:

నాగర్‌కర్నూలునుండి శ్రీకపిలవాయి లింగమూర్తిగారు పంపించిన వ్యాసం రామదాస స్వామి గుడిపూజారులు పెద్ద పెద్దయ్యగారు చిన్నపెద్దయ్యగారు లద్దగిరి కర్నూలుజిల్లా, ఫోను (08518) 237509, సెల్ : 9344032105.

14. హనుమకొండ సచ్చిదానంద సాంబమూర్తి స్వామి (1909 - 1979)

కడచిన జన్మలో సగాన ఆగిపోయిన తపస్సాధన మరుజన్మలో పూర్వ సంచిత ఫలంగా లభిస్తుందనీ, ఈ మరుజన్మలో ఆ తప స్సాధనపూర్తి చేసుకొని బ్రహ్మానుభవం పొందుతారనీ అంటారు. అట్టి బ్రహ్మానుభవం పొందినవారిలో శ్రీ సచ్చిదానంద సాంబమూర్తి స్వామి ఒకరు. ఐదు తరాలకు పూర్వం కరీంనగరం జిల్లా గోదావరీతీర పుణ్యక్షేత్రం ధర్మపురిలో ఉండే అడ్లూరి జొక్కయ్య అనే విశ్వకర్మ సంభవుడైన యువకుడు. వరంగల్‌జిల్లా ఉర్సు జాగీరులో ఉండే లక్ష్మి అనే అమ్మాయిని పెండ్లాడి ఉర్సులోనే స్థిరపడ్డాడు. ఆ దంపతుల కొడుకు వెంకటరామయ్య ఆయన భార్య లక్ష్మమ్మ. ఈ దంపతులకు ఐదుగురు కొడుకులు. నాల్గవ

కొడుకు రాజయ్య ఆయన (భార్యరామలక్ష్మి) వీరికి ఇలువేల్పు కరీంనగరం జిల్లా వేములవాడ రాజరాజేశ్వరుడు. ఈ దంపతులకు, ఏడుగురు కొడుకులు. అందులో రెండవవాడు చంద్రయ్య ఆయనభార్య వెంకటరామమ్మ, వెంకటరామమ్మ గొప్ప శివ భక్తురాలు. వేములవాడ రాజరాజేశ్వరుని ఐనవోలు వీరభద్రస్వామి మల్లన్నలను కొండపర్తి సమీపానగల ఫణికల రామలింగేశ్వర స్వామిని ఆరాధించేది. వీరి సంతానం 1) రామలక్ష్మి 2) రాజయ్య 3) లింగయ్య 4) సాంబమూర్తి. నాల్గవ సంతానమైన సాంబమూర్తి గారే మన కథానాయకులు సచ్చిదానంద సాంబమూర్తి స్వామి. ఆయన జననం శా.శ. ౧౮౩౧ సౌమ్యసంవత్సర భాద్రపద బహుళ త్రయోదశి మంగళవారం 12-10-1909 సాయం 6.49 గంటలప్పుడు ఆయన జాతకం గుణించిన పెద్దలు వంశపావనుడని మహాజాతకుడని చెప్పినా ఆయన మాతృగర్భంలో ఉన్నపుడే గిద్దలూరు పిచ్చమాంబ యోగిని ఓరుగల్లు ప్రాంతములు పర్యటించి నపుడు చూలాలు వెంకటరామమ్మ ఆమె వద్ద పంచాక్షరీ మంత్రోప దేశమును పొందినది. గర్భవతిగా ఉన్నపుడే ఫణికల రామ లింగేశ్వరస్వామి సన్నిధిలో ఒక రాత్రి నిద్రించినది. కలలో పరమ శివుడు కనపడి 'నీ గర్భంలో పుట్టబోయే శిశువు బ్రహ్మవేత్తగా వెలుగొందగల"దని ఆశీర్వదించినాడట. ఈసాంబమూర్తి పుట్టక పూర్వమే అక్క రామలక్ష్మమ్మకు జనగామ తాలూకా పెంబర్తి అయిలాబుచ్చయ్యతో వివాహం జరిగింది. సాంబమూర్తి బాలుడుగా దినదినప్రవర్ధమానుడు ఔతుండగా 3వ యేటనే తండ్రి చంద్రయ్య చనిపోయినాడు. పెద్దకొడుకు రాజయ్య కుటుంబభారం వహించినాడు.

సాంబమూర్తికి ఐదవయేట వీధి బడిపంతులు లక్ష్మీనరసింహా చార్యులచేత అక్షరాభ్యాసం జరిగింది. సాంబమూర్తి క్రమంగా అక్షరాలు గుణింతాలు అంకెలు ఎక్కాలు సుమతి, కృష్ణ, నారసింహ శతకాలు పెద్ద బాలశిక్ష మొదలైనవి శ్రద్ధగా నేర్చినాడు. శ్రావ్యంగా పద్యాలు పాడుతూ తన స్ఫురద్రూపంతో అందరినీ ఆకర్షించేవాడు. అన్నల చెంత కులవిద్యలు నేర్చినాడు. పెద్దన్న రాజయ్యకు కొక్కొండ సీతారామయ్య కూతురు జగదాంబతోను చిన్నన్న లింగయ్యకు వీణవంక దేవరకొండ ధర్మయ్య కూతురు కృష్ణ బాయమ్మతోను వివాహాలు జరిగినవి. సాంబమూర్తి కులవృత్తిలో ఆరితేరి తాము చేసే ఇత్తడి పాత్రలు దూరదూర ప్రాంతాలకు బండ్లపై తీసుకపోయి విక్రయించి వచ్చేవాడు. అప్పుడప్పుడు పెంబర్తికి పోయి అక్క రామలక్ష్మమ్మను చూచివచ్చేవాడు. తల్లి వెంకట్రామమ్మ అనారోగ్యంతో ఉంటే ఆమెకు సేవలు చేసేవాడు. అన్నలిద్దరు సంతానవంతులైనారు. సాంబమూర్తి యౌవనంలో అడుగు పెట్టినాడు. పూర్వజన్మ సంస్కారంచేత సాంబమూర్తికి దైవారాధన, ఉపాసన, సత్కర్మాచరణ, సత్సంగం రూపుదిద్దుకున్నవి. భజనకీర్తనలు శ్రావ్యంగా పాడుతూ దేవాలయాల్లో ఆరాధనలు చేయటం, ఏకాదశీ ఉపవాసం సోమవారం శివారాధన, వీధి నాటకాలు, హరికథలు, తోలుబొమ్మలాటలు మొదలైనవానిలో భక్తి శ్రద్ధలు పెరిగినవి. అన్నలకు తల్లికి సాంబమూర్తి సంన్యాసి ఐపోతాడో ఏమో అన్న భయం పట్టుకున్నది. ఇట్లుండగా ఒకనాడొక అజ్ఞాత సాధువు వచ్చి భిక్ష కోరగనే సాంబమూర్తి దోసెడుబియ్యం తెచ్చి ఆతని జోలెలో పోసినాడు. ఆ సాధువు సాంబమూర్తిని తనతో ఊరి బయటికి తీసుకపోయి ఒక అశ్వత్థవృక్షం క్రింద పంచాక్షరీ

మంత్రం దేవీమంత్రం ఉపదేశించి పూర్వజన్మలో నీవు గొప్పజ్ఞానివి. ఈ జన్మలో దైవభక్తి జ్ఞానం ఆర్జించి దైవానుగ్రహం పొందుమని ఆశీర్వదించి పోయినాడు. అన్నలు తదితర బంధువులు సాంబ మూర్తికోసం వధువును అన్వేషించ సాగినారు. కరీంనగరం జిల్లా కమలాపురం వాసులు సిరికొండవారింటి అమ్మాయి కాంతలక్ష్మితో వైభవంగా వివాహం జరిపించినారు. కొంతకాలానికి ఇంటికి పెద్ద రామలక్ష్మమ్మ చనిపోయిన తరువాత ఉర్సులో తగినంత చేతిపని లభించకపోవటంచేత సాంబమూర్తి తన నివాసం 1932 చివరన పెంబర్తికి మార్చినాడు. పెంబర్తిలో సగం జనసంఖ్య విశ్వబ్రాహ్మణు లదే. ఈ కులం వారికి ఆరాధ్యదేవత ఏకాంబరేశ్వర మహామాయి అమ్మవారి దేవాలయం కూడ వారుండే వీధిలోనే ఉండేవి. సాంబమూర్తి పెంబర్తికి క్రొత్తకాదు పూర్వం ఆయన అక్కరామలక్ష్మి ఇంటికి తరచుగా వచ్చి కొంతకాలం ఉండిపోయేవాడు. ఆయన ఉదయమే బ్రహ్మముహూర్తంలో లేచి శుచియై గుడికిపోయి శివ పార్వతులను అర్చించి ధ్యానం చేసుకొని 8 గంటలకు జీవనోపాధి కార్యక్రమంలో పాల్గొంటూ తరువాత మరల గుడికిపోయి మ్రొక్కులు చెల్లించి ఇంటికివచ్చి భోజనానంతర సద్గ్రంథ పఠనం చేసి విశ్రమిస్తూ నియమబద్ధ జీవితం గడిపేవాడు. ఇట్లుండగా ఒకసారి సాంబమూర్తికి ఏర్పేడు వ్యాసాశ్రమం వారు ప్రకటించిన సద్గురు మలయాళ స్వామి (1885–1962) విరచిత శుష్కవేదాంత తమో భాస్కరమనే గ్రంథం చిక్కినది. అందులోని విషయ వివరణలు స్తోత్రాలు సాంబమూర్తికి బాగా నచ్చినవి. ఆయనకు ఆ గ్రంథం పారాయణ గ్రంథమే కాక మార్గదర్శక గ్రంథంగా తోచి అందులోని విషయాలన్నీ సాకల్యంగా గ్రహించినారు. దీనికితోడు శ్రీకృష్ణ

పరమాత్ముడు భగద్గీతలో చెప్పిన కర్మయోగం బాగానచ్చినది. నిత్యకర్మానుష్ఠానం చేస్తున్న సాంబమూర్తికి నిష్కామకర్మ ఏకాగ్రతతో కూడిన సంకల్ప రహిత ధ్యానమార్గం ధ్యేయములైనవి. ఆయన పెంబర్తిలో విశ్వబ్రాహ్మణ భజనసమాజం స్త్రీల భజనసమాజాలు స్థాపించి నిర్దిష్టమైన నియమావళిని కార్యక్రమాలను ఏర్పాటుచేసి నడిపినారు. ఆదినాల్లో దేశమంతటా పండరి భజనలు భద్రాచల యాత్రలు బాగా ఉండేవి. అది భక్తి ప్రచారయుగమని చెప్పవచ్చు. భక్తిమార్గం ఇతర మార్గాలకంటె సులభమైనదంటారు పెద్దలు. సాంబమూర్తిగారు భక్తితో పాటు తమసాధనలో 1) నిత్యానిత్యవస్తు వివేకం 2) ఇహాము త్రార్థ ఫలభోగ విరాగం 3) శమాది షట్కసంపత్తి 4) ముముక్షుత్వం ఈ నాల్గుమార్గాలు పట్టుదలతో ఆచరించి పరిపక్వత చెందినారు. ఐతే కర్మానుష్ఠానం ద్వారా బహుళ జనానికి మేలు కలుగు తుందని ఆచరణ పూర్వకంగా తాము చేసేదే ఇతరుల కుపదేశిస్తుండేవాడు. వారి అభివృద్ధిని సహించలేని క్షుద్రమాంత్రికుల ప్రయోగాలను త్రిప్పి కొట్టినారు. పెంబర్తి గ్రామంలోని చాలామంది సాంబమూర్తిగారి భక్తి ప్రచారాల మూలంగా అక్షరాస్యులైనారు. అట్టి తరుణంలో సాంబమూర్తిగారు రామకోటి వ్రాసే విధం అనుకరిస్తూ శివకోటి వ్రాసే పద్ధతిని ప్రవేశ పెట్టినారు. దానికి కావలసిన నోటుబుక్కులు పంచినారు. అది ఒక ఉద్యమంగా ఇటు హైదరాబాదు సికింద్రాబాదు నగరాల వరకు అటు వరంగల్ కరీనగరం జిల్లాల్లో వ్యాప్తి గాంచినది. శివకోటి లిఖిత జపం పూర్తియైన తరువాత ఒక ఉత్సవం చేయాలె. శివకోటి గ్రంథాలు పూజించి యజ్ఞాలు హవన రుద్రాభిషేకాలు చేయవలె. పూజ్యులైన వారిని సత్కరించాలె. అందుకై ద్రవ్యం కావాలె. పెంబర్తి వాసులు

ఈ వ్యయం భరించలేరు కనుక సాంబమూర్తి పర్యటనకుపక్రమించి నిత్యం అభిషేకం జపం ధ్యానం ప్రార్థనలతో పాటు ఆహారనియమం ఒకేపూట భోజనంతో కొందరు సహచరులతో జనగామ, భోనగిరి, సికింద్రాబాదు, ఓరుగల్లు, సిద్ధిపేట, కామారెడ్డి, నిజామాబాదు, జగిత్యాల, కరీంనగర్ ముఖ్యపట్టణ ప్రాంతాలు తిరుగుతూ భక్తులను ప్రబోధిస్తూ ప్రచారం చేసి ధనార్జనచేసినారు. ఆయనకు నాటి ప్రముఖ సంస్కర్త కె.ఎల్. నారాయణాచారిగారి తోడ్పాటు లభించినది. ఇట్లా అందరి సహకారంతో వారు శివకోటి యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించినారు. ఇన్నాళ్ళు ఎంతో శ్రమించి దైవకార్యం ముగించిన నాటిరాత్రి సాంబమూర్తిగారు హాయిగా నిద్రించినారు. ఐతే వారి ఆత్మ కైలాసమునకు ప్రయాణించి శివపార్వతులను ప్రమథగణాన్ని దర్శించి ఆనందపారవశ్యంతో మూడుదినాలు అట్లే సుషుప్త్యవస్థలో ఉండినారు. వారికి ఆ దర్శనం పరమేశ్వరుని ఆజ్ఞ. లోకకల్యాణ కారకములైన కార్యాలు చేసి కర్మానుభవం పూర్తిచేసి, నీ సంకల్పం పూర్తి చేసుకుంటావు అనే ఆదేశం ఆశీస్సులు లభించినవి. మూడవదినం వారు సహజంగా నిద్రనుండి లేచినట్లు లేచినారు. తమకు కలిగిన అనుభవం భక్తులకు చెప్పినారు. శివలోకంనుండి మరల ఈ ప్రపంచం లోనికి వచ్చి నందుకు కాసేపు చింతించినా పరమశివుని ఆజ్ఞప్రకారం తన కర్తవ్యం నెరవేర్చ వలెననుకున్నారు.

శ్రీ సాంబమూర్తిగారీవిధంగా నిత్య సత్కర్మాచరణం చేస్తుండగా ఒకనాడు భక్త మార్కండేయ సినిమా చూడటం జరిగింది. మార్కండేయుడు పరమభక్తితో శివుని పూజిస్తుంటే ఆ పూజా పుష్పాలు కైలాసంలో ఉన్న పరమశివుని చేరిన దృశ్యం ఆయనకు

బాగానచ్చింది. తాను పూజించే పూలు కూడ పరమశివునికి చేర వలెననే ఉద్దేశంతో శ్రద్ధాభక్తులతో ఒక్కొక్క పుష్పం వేస్తూ దీక్షతో పూజించినారు. శివలింగమంతా పుష్పాలతో నిండిపోయింది. ఇవన్నీ ఒక్క పువ్వు మిగలకుండా శివుని చేరవలె ననుకుని కండ్లు మూసుకున్నారు. నిజంగానే ఒక్క పూవు మిగలకుండా ఆ పూలన్నీ శివునికి చేరిపోయినవి. సాంబమూర్తికి చాలా సంతోషం కలిగింది ఈ విషయం తమ భక్తులకు చెప్పినారు. పెంబర్తికి చేరిన రెండు మూడేండ్లకు సాంబమూర్తిగారు ధర్మ ప్రచారానికి హరికథలు నాటకాల ద్వారా సులభంగా చేయవచ్చు ననుకున్నారు. ఆ ఉద్యమంలో ఆయనకు మేనల్లుండ్రు బాలలింగయ్య శంకరయ్యలు తోడుపడ్డారు. పౌరాణిక హరికథలు, వీరబ్రహ్మేంద్రస్వాముల చరిత్ర, భక్తప్రహ్లాద, భక్తమార్కండేయ నాటకాలు ప్రదర్శించి ప్రజల్లో గొప్ప ప్రభావం కల్పించినారు. వినాయకోత్సవాలపుడు ఊరేగింపు తీయటానికి మహమ్మదీయులు అభ్యంతర పెడితే (1938-1939) ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుగారిని రప్పించి ఆ సమస్యను పరిష్కరించినారు. ఇంకను శ్రీరామనవమి శ్రీకృష్ణ జయంతి తొలి ఏకాదశి, బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు చాలా నిష్ఠతో చేస్తూ తీర్థప్రసాదాలు పంచేవారు. ఇట్లా త్రికరణ శుద్ధిగా దైవకార్యాలు చేస్తూ మొదటిసారి మౌనవ్రతం మండలం దినాలు పాటించి దీక్ష విరమణం చేసి సామూహిక అర్చనలు అభిషేకాలు అన్నదానంతో ముగించినారు. సాంబమూర్తిగారి ధ్యానం తపస్సు అధికమైన కొలది వారికి వాక్శుద్ధి సంకల్పసిద్ధి వంటి సిద్ధులు సమకూడినవి. వాటిద్వారా సాంబమూర్తిగారు పీడితులకు సేవచేసినారు. ఒకనాడు నిశ్చల ధ్యానావస్థలో ఉండగా స్పృహతప్పి

ఒరిగిపోయినారు. భక్తులు కావలి కాస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటలపుడు స్వామి స్పృహలోనికివచ్చి 'నన్నీ లోకానికి ఎందుకు తెచ్చినారని అన్నారు. అటుతరువాత పొరపాటున యమభటులు వారిని యమలోకానికి తీసుకపోయినట్లు యముడు జరిగిన పొరపాటుకు భటులను కోపించినట్లు తాము మరల ఈ లోకానికి వచ్చినట్లు తమ యిండ్ల దగ్గర ఉండే ఒక చాకలి వృద్ధురాలు చనిపోయినట్లు చెప్పినారు. ఇట్టి అనుభవాలు సాంబమూర్తి స్వామికి ఎన్నో కలిగినవి. తాము పూర్వజన్మలో ఒక అమ్మవారి గుడి పూజారిగా ఉండినట్లు ఆజన్మలో తమకు సన్నిహితంగా ఉండిన భక్తులు తమ అక్క రామలక్ష్మి, తమ తల్లి వెంకటరామమ్మ, తమభార్య కాంతలక్ష్మి మొదలైనవారుగా గుర్తించినారు. ఇట్లా వారి ఆధ్యాత్మిక జీవితం నిత్యాభివృద్ధిగా జరుగుతుంటే తమకు జగద్గురువు లభిస్తేనే తమ సాధన సరియైన మార్గంలో నడుస్తుందని తోచి గురువులకై అన్వేషణ ప్రారంభించినారు. ఇట్టి తరుణంలో మాతామునులసాటి వీరపిచ్చమాంబగారు పెంబర్తికి పర్యటనకు వచ్చినారు. ఆమె కర్నూలు జిల్లా గిద్దలూరులో ఉండే గొప్ప యోగిని. విశ్వబ్రాహ్మణు లందరికీ ఆమె ఆరాధ్య గురువు సాంబమూర్తి స్వామిగారు ఆమె వద్ద మంత్రదీక్షితులై ప్రధాన శిష్యులైనారు. ఆయమ్మ కెందరో శిష్యులు కాని సాంబమూర్తిగారివలె ఉచ్చకోటికి చెందిన సాధకులు ఎవరూలేరు. సాంబమూర్తిగారితోపాటు ఆయన అక్కబావలు, మేనల్లుండ్రు పెద్ద మేనగోడలు కనకమ్మ, భార్య కాంతలక్ష్మి వంటి వారెందరో ఆమెవద్ద మంత్రదీక్షితులైనారు. సాంబమూర్తిగారి దృష్టిలో తమ భార్య కాంతలక్ష్మితో అనుకూల క్షణాలు లేకుండెను. అదే చింతలో ఆయనకు ఒకసారి ధ్యానంలో శంకరుడు దర్శనమిచ్చి

"నీవు ఈమెను భార్యగా స్వీకరించకతప్పదు. స్వీకరించినప్పటికి ఈమె నీకు దక్కదు" అని ఆదేశమైనది. ఆయనకు తన కర్తవ్యం తెలిసి వచ్చింది. ఆమెను ఆధ్యాత్మిక మార్గంలో పెట్టటానికి కృషి చేసినారు. 1934సం॥ విశ్వకర్మ బ్రాహ్మణ వంశాగమము రచయిత వడ్డెపాటి నిరంజనశాస్త్రి పెంబర్తికి వచ్చినపుడు వారిని కలిసి సాంబమూర్తిగారు అనేక వైదిక శాస్త్రీయ ధర్మముల సారం ఎరిగినారు. పెంబర్తిలో స్వామివారు శ్యామలాంబ అనే గృహిణికి పట్టిన లంబాడి దయ్యమును విడిపించినారు. భువనగిరివాసులు ఉత్పల వెంకట్రావు స్వామివారు ఫణికల రామేశ్వరాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేసినప్పటినుండి పరిచయమై అటు తరువాత స్వామివారికి చాలా సన్నిహితులైనారు. స్వామి కొందరు అనుచరులు శిష్యులతో కలసి ఆంధ్రదేశంలోని క్షేత్రాలు. సందర్శించినారు. బందరు సముద్రస్నానమపుడు మొసలి వాతపడ కుండా ఒక దివ్యపురుషుడు మార్గ దర్శనం చేసినారు. స్వామివారు వ్యాసాశ్రమ శ్రీమలయాళస్వామిని దర్శించి ఆధ్యాత్మిక గోష్ఠి చేసినారు. మలయాళ స్వామి సాంబమూర్తి స్వామివారి ఆధ్యాత్మిక ప్రగతిని గుర్తించినారు. అటువంటి ఆశ్రమం తాము కూడ స్థాపించ వలెననుకున్నారు. సాంబమూర్తిగారు మలయాళస్వామి వారికి సికింద్రాబాదు పర్యటనలో వెంట ఉండి సహకరించినారు. సాంబమూర్తిగారు సద్గురు మలయాళ స్వామికి మనసుకెక్కిన యోగిపుంగవులైనారు. మలయాళస్వామి సికింద్రాబాదు నుండి తిరుగు ప్రయాణమై రైలులో పోతూండగా ఆ రైలు బండిని ఎక్కువసేపు పెంబర్తిలో ఆపించి అక్కడివారికందరికీ దర్శనం చేయించినారు. పెంబర్తి వాసులపై స్వామివారికి గల ప్రేమ అట్టిది.

స్వామివారు సాంబమూర్తిగారు కాళహస్తి తిరుపతి బ్రహ్మంగారి మఠములను దర్శించినారు. తిరుపతిలో తమ తమ సంకల్ప ప్రకారంగా శ్రీవెంకటేశ్వర స్వామి సర్వాలంకారభూషితుడై స్వప్న దర్శనం ప్రసాదించినారు.

పెంబర్తిలో సాంబమూర్తిగారు జీవనోపాధికై కాంస్యరజిత శిల్ప వృత్తులవలంబించినారు. మేనల్లుండ్రుపోయి ఇంకను 10-12 మంది శిల్పులు వారిక్రింద పనిచేసేవారు. నవాబులకు జాగీర్దారు లకు సంస్థానాధి పతులకు కావలసినన్ని రజత కాంస్య పాత్రలు సిద్ధం చేసేవారు. గద్వాల సంస్థానాధీశులకై నూతన సింహాసనం చేసి వారి మెప్పుపొందినారు. సాంబమూర్తిగారు పెంబర్తిలో తమ అక్క రామలక్ష్మి ఇంటనే ఉండేవారు రామలక్ష్మి భర్త బ్రహ్మయ్య విశ్వబ్రాహ్మణులందరికీ సభాపతులు. ఆ దంపతుల నల్గురు కొడుకులు కూతురు సాంబమూర్తిగారికి శిష్యులు. గురువు పిచ్చమాంబగారు సాంబమూర్తి యోగమార్గంలో సాధించిన ప్రగతికి మెచ్చి ఆయనకు బోధాధికార మిచ్చినది. సాంబమూర్తి స్వామి గురుపీఠం అధిరోహించినారు. వరంగల్ చిటిమల్ల లక్ష్మి నారాయణ దంపతులు కొంపెల్ల రాజమల్లయ్య వంటివారు పెంబర్తి వాసులు చాలామంది శ్రీవారి వద్ద దీక్షితులైనారు. అక్కబావలు గతించిన తరువాత స్వామివారు పెంబర్తివిడిచి హిమాలయాల్లో ఉంటూ తపస్సు చేసుకోవలెననే సంకల్పం కలిగింది. వరంగల్ శిష్యులు శ్రీవారిని పెంబర్తిలో దర్శించి అదే రైలుబండెక్కి కాజీపేటలో దిగి పోదామనుకున్నారు. అది 1942 సంవత్సరం చాలామంది ఆ రైలులో ఎక్కినారు. వరంగల్‌లోని భక్తులు ఖాజీపేటకు వచ్చినారు కాని ఆ భక్తులు శిష్యుల అనురోధం మూలంగా స్వామివారి

హిమాలయ యాత్ర సంకల్పం మారిపోయినది. ఫణికల రామప్ప కొండపై నివసిస్తూ ఆ ప్రశాంత ప్రదేశంలో తపస్సు కొనసాగించ వలెననుకున్నారు. వరంగల్ ఒకరిద్దరు శిష్యులకు వెంటనుండే రావుల యాదగిరికి గుడిపూజారికి మాత్రమే ఈ విషయం తెలుసు. ఫణికల రామప్ప క్షేత్రం ఖాజీపేటకు నాల్గు కి.మీ. దూరంలో ఉంటుంది. లక్ష్మీనారాయణ దంపతులు శ్రీవారికి కావలసిన ఏర్పాట్లు చేసినారు. కర్మానుష్ఠానం బ్రహ్మనిష్ఠ రెండు మార్గాలు స్వామికి ప్రీతిపాత్రములు. శ్రీవారు కఠోరదీక్ష కొనసాగిస్తుండగా ఒకనాడు పకీరు ఒక సాధువు భిక్ష చేసి తమకు భిక్షగా పెట్టిన గోధుమ రొట్టెలో ఒక భాగం స్వామికి ఒక భాగం వెంటనున్న కనకమ్మకు ఇచ్చి మిగతా మూడవ భాగం తాముతిని ఇక్కడ ఇంత తపస్సు సాగుతుంటే ఎవరూ పట్టించుకోలేదా నేను వారికి చెప్తుతాను అన్నారు అక్కడ స్వామిపైకి కూడ ఎగబ్రాకుతున్న చీమతో ఏయ్ చీమలూ మీరంతా ఇక్కడెందుకున్నారు. ఈ ప్రాంతంలో మీరుండ వద్దంటూ శాసించి బయలుదేరి కొలది దూరంలో తిరోహితు డైనాడు. స్వామి తపస్సు చేసుకొనే చోటంతా వ్యాపించిన ఆ చీమలు బారులుతీరి ఎటో వెళ్ళిపోయినవి. అట్లా తిరోహితుడై పోయిన తరువాత అక్కడ చీమలన్నీ మటుమాయమై పోయిన తరువాత ఆ సాధువు పరమశివుడని గుర్తించినారు. సాక్షాత్తు శంకరుడే వస్తే గుర్తించలేకపోతినే అని సాంబమూర్తి స్వామి దుఃఖించి శివుని ప్రార్థించినారు. రెండవనాడు వరంగల్ వర్తకులు రామిని రాజమౌళి స్వయంగా బండినిండా బియ్యం ఇతర సరుకులు తెచ్చి స్వామి కప్పగించినా క్రింద వారి తోటలో ఉన్న పనివారికి స్వామికి ఏ అవసరం కలిగినా తీర్చవలసిందిగా

ఆజ్ఞాపించినారు. ప్రతివారం ఒకనాడు వచ్చి శ్రీవారిని దర్శించి కావలసిన సామగ్రి ఇచ్చిపోతే 1944 తారణ నాటికి స్వామి వారి ఉనికి చాలామందికి తెలిసిపోయింది. వరంగల్, రంగశాయిపేట, ఉర్సు ప్రాంతాలవారు చాలామంది స్వామి చెంత దీక్షితులైనారు. 23-4-1944 రాత్రి 4 గంటలపుడు స్వామివారి పెద్దవదిన జగదాంబ వచ్చి స్వామిని క్షమార్పణ కోరితే ఆమెను లోపలికి రండనిపిలచినారు. ఆమె లోపలికి రాకుండా వెనుకకు నడుస్తూ అదృశ్యమైనది. తెల్లవారి ఆ వచ్చినది జగదాంబ వదినగారి ప్రేతాత్మగా గుర్తించినారు. ఆ సమయానికే అక్కడ ఉర్సులో జగదాంబ మరణించినది. స్వామివారి అక్క చిన్న కొడుకు పెండ్లి 1944 అక్టోబరులో హనుమకొండలో జరిగినపుడు స్వామి అక్కడికి పోయి అందరినీ దీవించి వచ్చినారు. వారికంటె పెద్దవారైన అన్నలు కూడా స్వామికి లేచి నమస్కరించబోతే స్వామి వారించి వారికి తిలకం దిద్దినారు. ఇదివారి వినయసంపదకు గుర్తు. స్వామి ఫణికల రామప్ప ఆశ్రమంలో ఉంటూ భక్తులు శిష్యుల కోసం ప్రతి ఆదివారం భగవద్గీత సామూహిక పారాయణం సంవత్సర ఏకాదశీనియమాలు ఏర్పాటు చేసినారు. కార్తీక శుద్ధ ఏకాదశినాడు స్వామి కూర్చునే అరుగుపై ఒక కుక్క చచ్చిపడి ఉండటం అది అపమృత్యువని గమనించి దానిపై రుద్రాభిషేక జలం ప్రోక్షించి అక్షతలు చల్లితే అది మరల బ్రతికినంతకాలం గుడివద్ద స్వామివారితో ఉండినది. ఫాల్గుణ బహుళ ఏకాదశీ వ్రత సమాప్తినాడు కార్యక్రమం అంతా ముగిసి భోజనాలైన తరువాత ఒక బక్క సాధువు వచ్చి భిక్ష కోరినాడు. అప్పుడేమీ మిగలలేదు. ఆ వచ్చిన సాధువును మాటల్లో పెట్టి కనకమ్మగారితో వంట చేయించి భోజనం పెడితే ఆ సాధువు

బయటికిపోయి అదృశ్యుడైనాడు. ఆ వచ్చిన సాధువు సాధువుకాదు. సాక్షాత్తు పరమేశ్వరుడని గుర్తించినారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరికీ అందుబాటులో ఉండ వలెనని స్వామివారు ప్రణవ పంచాక్షరీ ఏకాహములారంభించినారు. శివకేశవులకభేదం తెలుపుతూ హరిహర ఏకాహము లేర్పాటుచేసినారు. దైవనిర్దేశం ప్రకారం అందరికీ అన్న సంతర్పణ జేయగలిగినంత బియ్యం ఇతర వస్తువులు వచ్చిపడేవి. ఫణికల రామప్ప ఆశ్రమం లోనికి ఒక పెద్దపాము వచ్చి పడగవిప్పి స్వామిని చూచేది. జనం భయపడుతారు నీవెందుకు వస్తావని స్వామి మందలిస్తే అది దూరంపోయింది అప్పుడప్పుడు వచ్చి భక్తులు నమస్కరించగా వెళ్ళిపోయేది. కొండపర్తి గ్రామకరణం సాంబశివరావు భార్య సుశీలమ్మను పట్టిన పిశాచాన్ని పారద్రోలినారు. ఒకసారి గొప్ప యోగసంపన్నులైన కెంపాపుర అగ్రహారం బెంగుళూరు వాసి కడప సచ్చిదానందయోగీశ్వరులు (1865–1957) (శ్రీజీవ బ్రహ్మైక్య రాజయోగసారామృత రచయిత, మనస్వామిని చూడటానికి ఫణికల రామప్పకు చాలామంది శిష్యులతో చూడవచ్చినపుడు కొద్దిపాటి మిగులు వస్తువులతో అందరికీ సరిపడునంత ప్రసాదం చేయించి వడ్డించినారు. కడప యోగీంద్రులు సాంబమూర్తి భక్తికీ యోగనిష్ఠకీ ఎంతో సంతోషించి ఆశీర్వదించి పోతూ తమను దర్శించవచ్చిన ఇతర ప్రదేశాల వారికందరికీ సాంబమూర్తి స్వామిని ఆశ్రయించండని చెప్పిపోయినారు.

సాంబమూర్తి స్వామి తమ గురువులు వీర పిచ్చమాంబ సమాధి హనుమకొండ సిద్దేశ్వరాలయం వద్ద అడ్లూరి మల్లయ్య తోటలో 1937 మే నెలలో ఏర్పరచినారు. స్వామివారు తరచుగా వచ్చి

గురువుల సమాధిని సేవించిపోయేవారు. గురువుల సమాధిపై నెలకొల్పిన శివలింగం భిన్నమైనందున స్వామివారు అక్కడ మందిర నిర్మాణానికి పూనిక చేసినారు. అప్పుడే తమకున్న సిగరెట్లు త్రాగే వ్యసనం మానివేసినారు. ఆ సమయంలో వారు సిద్ధేశ్వరాలయంలో ఉండేవారు. అక్కడి చెట్ల నాశ్రయించి ఉన్న పిశాచాలను పారద్రోలినారు. మందిర నిర్మాణం కోసం నాలుగు వైపుల నిలిపిన రాతిస్తంభాలు ఒరిగిపోతే సద్గురువుల నామం స్మరించి టెంకాయ కొట్టి అవి పడిపోకుండా ఆపి మరునాడు క్రేన్ ద్వారా చక్కగా నిలిపినారు. ఆదినాల్లోనే హిందువులను భయభ్రాంతులను చేస్తూ చంపుతూ హైద్రాబాదు రాజ్యంలో బీభత్సం సృష్టించిన రజాకార్లు సాయుధులై సిద్ధేశ్వరాలయానికి స్వామిపూజ వేళ వచ్చినారు. స్వామి పార్వతీపరమేశ్వరుల కిచ్చిన హారతిని ఆ రజాకార్ల వైపు త్రిప్పితే వారు నమస్కరించి చిల్లర డబ్బులు వేసి పోవటం స్వామివారి అమేయమహిమా ప్రభావం. మందిర నిర్మాణం తరువాత భక్తుల కోసం సత్రాలు నిర్మించి బావి త్రవ్వించినారు. ఆదినాల్లోనే కొందరు అచలగురువులు వచ్చి స్వామిని పరీక్షించి సిగ్గుతో తలలువంచి పోయినారు. స్వామి నిర్మాణ మందిరం ముందున్న పందిరిలో గీతాపారాయణం జరుగుతుండగా ఉద్ధృతమైన గాలి వచ్చింది. స్వామి తమ శిష్యుల భక్తి ఎట్టిదో పరీక్షిద్దామని ఒక్కొక్కరినే వచ్చి దీపం వెలిగించుమన్నారు. ముట్టించిన మరుక్షణమే గాలికి దీపం ఆరిపోతే చిట్టచివరకు స్వామివారే దీపం వెలిగించినారు. అది నిర్వాత దీపకళిక వలెనిలిచినది. ఇట్టిది వారి నిశ్చలభక్తి. స్వామివారు శిష్యులతో ఒకసారి గుళ్ళరామప్ప అక్కడి శిల్పాలు రామప్ప చెరువు చూచినారు. అక్కడున్న బ్రహ్మరాక్షసిని దూర

ప్రాంతాలకు పంపినారు. స్వామివారు 1955 వేసవిలో ఉత్తర దేశ యాత్రలు, అలహాబాదు, త్రివేణి సంగమం కాశీగయా గోరఖ్‌పూర్‌లు సందర్శించి తమ పూర్వులకు చేయవలసిన పైతృకములు చేసి తిరిగివచ్చినారు. వారికి ఖాజీపేటలో పెద్దస్వాగత సత్కారం లభించింది. 1960 నుండి వీర పిచ్చమాంబగారి మందిర ప్రాంతము వారికి ఆశ్రమమైనది. అప్పుడే గురుదైవభక్త సమాజం ఏర్పాటుచేసినారు. మొదటి చిటమళ్ల లక్ష్మీనారాయణ 1982 వరకు అటు తరువాత 1983 అడ్లూరి ఆగయాచార్య (Author) ఈ సమాజానికి కార్యదర్శిగా పనిచేస్తూ ప్రతి సంవత్సరం 1) వసంతనవరాత్ర్యుత్సవాలు 2) వైశాఖం వీరబ్రహ్మేంద్రుల ఆరాధనోత్సవం 3) వైశాఖ బహుళంలో వీరపిచ్చమాంబగారి ఆరాధనోత్సవం 4) ఆషాఢ శు॥ ఏకాదశీవ్రతం శివార్చన 5) శ్రావణము నిత్యరుద్రాభిషేకాలు 6) శివరాత్రి 7) దేవీ శరన్నవ రాత్రములు 8) అప్పుడే చివరినాడు హరిహర ఏకాహము జరపటం విధిగా జరుగుతున్నాయి. 1951 వేసవిలో స్వామివారికి తీవ్ర జ్వరంవచ్చి అపస్మారక స్థితికి జారినా స్వామివారు స్వర్గస్థులైనట్లు వరంగల్లు హనుమకొండల్లో వార్త ప్రచారమైనది ఎక్కడెక్కడి భక్తులు శిష్యులు ఏడుస్తూ వచ్చినారు. రాత్రి 9కి స్వామికి అపమృత్యువు తొలగిపోయింది. ఒకసారి గొప్ప హరికథకులు కొమ్మూరి బాల రత్నానందదాసుగారి హరికథా గానం ..... మఠాధి పతులు శ్రీనివాస స్వాములు దంపతులు వచ్చి ఇక్కడ జరిగే కార్యక్రమాలు చూచినారు. 1967-68 సం॥ కంచి జగద్గురువులు శ్రీ చంద్ర శేఖరేంద్రస్వామివారు వరంగల్‌కు వచ్చినపుడు సాంబమూర్తి స్వామితో అద్వైత వేదాంత ప్రసంగం చేసినారు. మహా స్వామివారు

అర్చన తరువాత సాంబమూర్తి స్వామికి 5 రూ. దక్షిణ ఇచ్చినారు. చెన్నపురివాసులు శ్రీకృష్ణ విశ్వరూప దర్శన చిత్రపట రూపశిల్పులు మాకం తిమ్మయ్య శ్రేష్ఠిగారు స్వామిని దర్శించి ఆశీస్సులు పొందినారు. స్వామివారిని సేవించి అద్వైతసిద్ధి పొందినవారిలో క్రూరకర్ములు బుచ్చన్న స్వామిని దర్శించి భక్తులై యోగులై ఆత్మసాక్షాత్కారం పొంది స్వామి సన్నిధిలో బ్రహ్మైక్యం పొందినారు. రెండవవ్యక్తి దానకర్ణులని పేరు గాంచిన చందా కాంతయ్యగారు స్వామి శిష్యులు భక్తులు కలసి గురుపూజా కార్యక్రమం జరుపవలె ననుకున్నారు. స్వామివారు అందరు శిష్యుల గ్రామం పోవటం కష్టం కనుక ప్రథమపూజ చివర పూజలు స్వామిసన్నిధిలో జరుప వలెననుకున్నారు. ప్రథమపూజ స్వామివారికి అత్యంత భక్తులు శిష్యులు అడ్లూరి ఆగయాచార్యులు. స్వామి పెద్దన్న రాజయాచార్యులు జగదాంబల కొడుకు స్వామి చరిత్రం వ్రాసిన పండితుడు అడ్లూరి ఆగయాచార్యులు. పూజాకాలంలో స్వామి బ్రహ్మనిష్ఠలో ఉండి ప్రార్థనలో బహిర్ముఖులై బొట్టు తీర్థం ప్రసాదం ఇస్తారు. ప్రతి గ్రామంలో స్వామిపటానికి పూజచేసి పారాయణ, వేదాంతో పన్యాసాలు భజనలు తీర్థ ప్రసాదాలు అన్నదానం ఇట్లా జరిపి చివరి కార్యక్రమం హనుమకొండ మందిరంలో జరిపినారు. ఒక సంవత్సరం ప్రతి ఆదివారం సద్గ్రంథపఠనం ప్రాణాయామ సాధన 1945లో ప్రారంభించినారు. ఏకాహములు ఫణికల రామప్పకు ఆషాఢశు॥ ఉపవాసం రుద్రాభిషేకం భజన జాగరణం ఉదయం పారణ జరిగేవి. స్వామివారు బ్రతికియున్న చివరిదినం దాకా నిత్యసమాధి స్థితి ఆత్మ సాక్షాత్కార స్థితిలో ఉండేవారు. నిత్యం ఉదయం అభిషేకం, శివారాధన, గురుపూజ, భగవద్గీత

పారాయణం, సామూహిక ప్రార్థన నిత్యభజన నిర్వహించినారు. ఒకనాడు స్వామికి గుండెపోటు వచ్చింది. స్వామిని ఆసుపత్రిలో చేర్చినారు. రెండుదినాలు చికిత్స జరిగింది. మూడవనాడు శా.శ. ౧౯౦౧ సిద్ధార్థి సం॥ కార్తీక బహుళ దశమి మంగళవారం 13-11-1979 రాత్రి 11 గంటలు స్వామివారు బ్రాహ్మీభూతులైనారు. మరునాడు వేల భక్తులు శిష్యులు యధావిధిగా 14-11-79 బుధవారం రాత్రి 8-30 గురువు శ్రీవీర పిచ్చమాంబ సమాధిమందిరం ఉత్తరం వైపు సమాధి చేసి మండలం దినాలు ఆత్మ సాక్షాత్కారం పొందిన మహాత్ములకు చేయవలసిన నిత్య కార్యక్రమాలు జరిపి మందిర నిర్మాణం చేసినారు.

ఈ మందిరం హనుమకొండ నుండి శాయంపేట వెళ్ళే రోడ్డుకు అనుకుని పద్మాక్షి ఆలయం సిద్ధేశ్వరాలయము మధ్యన విశాలమైన స్థలంలో ఉంది. భక్తులు ఆధ్యాత్మిక సాధన చేసుకోవటానికి అనువైన వసతులు స్వామివారి శిష్యురాలు శ్రీమతి సుశీలమ్మ మందిర కార్యక్రమాలు భక్తుల తోడ్పాటుతో జరుపుతున్నారు.

చిరునామా – శ్రీ సద్గురుసచ్చిదానందసాంబమూర్తి స్వాముల వారి ఆశ్రమం శ్రీమాతామునులపాటి వీర పిచ్చమాంబ మందిర ప్రాంతము పద్మాక్షి దేవాలయము సమీమున శాయంపేట రోడ్డు హనుమకొండ వరంగల్‌జిల్లా ఆం.ప్ర. పి.సి. 506011

సాంబమూర్తిగారి తత్త్వాలు, జోలపాటలు, మంగళహారతులు చాలా రచించినా ఆ పాటల్లో చివర వారి నామాంకిత ముద్ర ఉండటం అందులో తమను సాంబయదాసుగా చెప్పుకున్నారు. భక్తిద్వారా జ్ఞానమార్గం అధిగమించిన వారందరు తమను భగవద్దాసులుగానే చెప్పుకుంటారు.

ఆధారం :-

శ్రీ శ్రీ సద్గురు సచ్చిదానంద సాంబమూర్తి స్వాములవారు - రచయిత డా॥ అడ్లూరి ఆగయాచార్యులు. ఎమ్.ఎ. పిహెచ్.డి. ఎమ్ఇడి. 12-5-188/7/1 విజయపురి లాలాగూడ పోస్టు, సికిందరాబాదు 500017 ఫోన్: 27002782

15. ఖాజీపేట శివభక్తేంద్రస్వామి

(1950-1988)

భారతీయ వివిధమతాలవారు గురువును త్రిమూర్తిస్వరూపుని గాను, గురువే భగవంతుడుగానూ ఆరాధిస్తారు. భారతీయేతర మతాలవారు కూడ గురువుకు ప్రముఖ స్థానమిస్తారు. యోగులు, మహాత్ములు, సిద్ధులు, భక్తులు అందరూ గురూపదిష్ట మంత్రమో ఉపదేశమో పొంది సాధన చేసి కృతకృత్యులైనవారే. కాని మానవ శరీరధారులైన గురువులుకాక సాక్షాత్తు శివుడో విష్ణువో దత్తాత్రేయుడో అమ్మవారో ప్రత్యక్షంగానో స్వప్నంలోనో సాక్షాత్కరించి ఉపదేశించిన ఉదాహరణలు చాలా ఉన్నవి. ఉదాహరణకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి (1608–1693), శ్రీధరవెంకటేశ అయ్యావాళ్ (1635–1720), మాస్టర్ సి.వి.వి (1868–1922), ముమ్మిడివరం

పెద్దబాలయోగి (1930–1985), కాకరపఱ్ఱు సుధీంద్రబాబు (1936–2005) వంటి మహాత్ములకు నరరూపగురువులు లేరు. అట్టి మహాత్ముల కోవకు చెందినవాడే శ్రీశివభక్తేంద్రస్వామి. రాయలసీమ కడపజిల్లా ఖాజీపేట మండలం కేంద్రానికి తూర్పున కూనవారిపల్లెలో గుల్లయ్యగారి చెన్నారెడ్డి నాగమ్మ అనే కాపు దంపతులుండేవారు. ఆ పుణ్యదంపతుల సంతానం 1) పెద్ద సుబ్బారెడ్డి 2) చిన్న సుబ్బారెడ్డి 3) చెన్నారెడ్డి 4) లక్ష్మమ్మలు. ఇందులో రెండవ కొడుకైన చిన్నసుబ్బారెడ్డిగారే శ్రీ శివభక్తేంద్ర స్వామిగా ప్రసిద్ధులైనారు. ఆయన 1950 సం॥ జన్మించినాడు; ప్రక్కగ్రామం రహ్మత్‌ఖాన్ పల్లెలో పెరిగినాడు.

పూవు పుట్టగనే పరిమళించినట్లు చిన్న సుబ్బారెడ్డి పుట్టుకతోనే దివ్య గుణసంపన్నుడు. పసితనంలోనే అతనికి శివభక్తి అలవడినది. ఆతని ప్రవర్తన, మాటలు, వినయసంపద, తల్లిదండ్రులతోపాటు చుట్టాలకు ఇరుగు పొరుగు వారికి ఆశ్చర్యం కలిగించేవి. వింతగాతోచేవి, పిట్టకొంచెం కూతఘనం సామెతను తలపించేవి. పాఠశాలలో ఉపాధ్యాయుని అనుమతితో బెంచిపైకెక్కి తరగతిలోని తోడి విద్యార్థులకు ఒక ప్రవక్తవలె హితోపదేశం చేసేవాడు. "తల్లిదండ్రులు జన్మనిస్తారు. భగవంతుడు మన బుద్ధిలో కాసెట్లు ఉంచుతాడు. దాంట్లో టీచర్ చెప్పే ప్రతిపదాన్ని రికార్డ్ చేసుకో గలిగితే విజయం పొందుతాము. కంటిచూపు ఒక కెమెరా వంటిది. ఏది చూస్తే అది రికార్డ్ అవుతుంది" అని చెప్తుతుంటే ఉపాధ్యాయుడే అతని బుద్ధి కుశలతకు ఆశ్చర్యపోయేవాడు. బడికి పోని దినాలలో అతడు నాగేశ్వరుని కొండకు గోవులను తోలుకపోయేవాడు. తోడి బాలురు నీ గోవులు మేము కాయమని నిరాకరించినా చిన్న

సుబ్బారెడ్డి ఆవులను స్వేచ్ఛగా విడిచి కొండ ఎక్కి నాగేశ్వరాలయంలో ధ్యానమగ్నుడయ్యేవాడు. ఒక్కొకనాడు అమ్మవారి ముందు కూర్చుండి ధ్యానం చేస్తూ ఎంత ప్రొద్దు గడిచిందో! కండ్లు తెరచేవరకు సాయంకాల మైనట్లు తెలిసింది. చిన్న సుబ్బారెడ్డి అమ్మా పార్వతీ నా ఆవులేమైనవో! తోడి పిల్లలు తమ గోవులతో తమతమ ఇండ్లకు పోయుంటారు. నా తల్లిదండ్రులు నా కోసం ఎంత ఆందోళనపడుతున్నారో" అని దీనంగా వేడుకున్నాడు. పార్వతీదేవి "నాయనా నీ గోవులు క్షేమంగా కొండ క్రింద నీకోసం చూస్తున్నాయి. ఇంటికి తోలుకపో" అన్నది. చిన్న సుబ్బారెడ్డి తన ఆవులతో క్షేమంగా ఇల్లుచేరినాడు.

అంత బాల్యంలోనే శివపార్వతుల ప్రత్యక్షదర్శనం చేసుకున్న భక్తుడాతడు. ఒక ఆదివారం సెలవునాడు చిన్న సుబ్బారెడ్డి ఉదయమే కొండపైకి పోయి ఆలయంలో మధ్యాహ్నం దాక ధ్యానం చేసుకొని కొండ దిగుతుండగా 2 గంటలపుడు ఒక పెద్దాయన మెట్లపై కూర్చున్నాడు. అంతలో ఒక పాము వచ్చి ఆవృద్ధుని కాటు వేయనుండగా చిన్న సుబ్బారెడ్డి పాముకాటు వేయకుండా శివుని ప్రార్థించినాడు. పాము వెడలిపోయింది. చిన్న సుబ్బారెడ్డి ఆ వృద్ధుని సమీపించి "తాతా! ఒక పాము నిన్ను కాటు వేయటానికి పడగ విప్పింది. నన్ను చూచి వెళ్ళిపోయింది" అన్నాడు. వృద్ధుడు వలవలా ఏడుస్తూ "నన్ను ఎందుకు రక్షించినావయ్యా అది కాటు వేస్తే నేను చచ్చేవాడిని, నా కష్టాలు తీరిపోయేవి కదా" అన్నాడు. అతని దుఃఖం చూచి చిన్న సుబ్బారెడ్డి కనులు చెమ్మగిలినవి. "నేను చేసినది తప్పా తాతా" అని ఆ వృద్ధుని కోనేటి వద్దకు తీసుకపోయి తన చొక్కా నీటిలో ముంచి ఆతని నోటిలో పిండి దప్పితీర్చి "ఇంకా ఏడువు

తాతా! నీ గుండెలోని బరువు దించుకో; కన్నీరుతో నీ దుఃఖాన్ని కడిగేసుకో" అన్నాడు. ఆ వృద్ధుడు మనసారా ఏడ్చి ఏడ్చి కొంత కుదుట పడగానే చిన్న సుబ్బారెడ్డి "చావుకు చోటివ్వకు తాతా! అది అర్థం కానిది. భగవంతుడు మనలో ఆత్మను పెట్టిన తరువాత దానిని కాపాడుకోవటం మన బాధ్యత" అంటూ చేయూతతో ఆ వృద్ధుని ఆతని ఇంటికి తీసుకపోయినాడు. వృద్ధుని భార్య ఎన్నడో గతించినది. కొడుకు కోడలు, మనుమలు ఉన్నారు. వీరు ఇంటి వాకిలి సమీపిస్తుండగా వృద్ధుని కోడలు రాత్రి మిగిలిన అన్నం పాసిపోతే బయట పారవేస్తున్నది. చిన్న సుబ్బారెడ్డి "అమ్మా ఇట్లా అన్నం మిగిల్చి పాసిపోతే పారవేసే బదులు ఈ తాతకు పెడితే తాత మీయింటి కావలిగా ఉంటాడు గదమ్మా! తాతను వెళ్ళగొట్టటం ఎందుకు? అన్నం పారవేయటం ఎందుకమ్మా మహాపాపం గదా" అంటూ బుద్ధిచెప్పి జ్ఞానోదయం కలిగించినాడు. అప్పటికి ఆయన వయస్సు 13 సంవత్సరాలు మాత్రమే. చిన్న సుబ్బారెడ్డి మాటలు ప్రవర్తన గమనించినవారు కొందరు ఆయనను తిక్కసుబ్బారెడ్డి అనేవారు మహాత్ములందరికీ ఈ తిక్కశబ్దం అజ్ఞానులు మూర్ఖులు బిరుదుగా ఇవ్వటం చాలామంది చరిత్రల్లో గమనించవచ్చు.

చిన్నసుబ్బారెడ్డి ఖాజీపేటలో తన హైస్కూలు విద్యపూర్తి చేసి అనంతపురం లో ఐటిఐ మెకానికల్ కోర్సు చేసినాడు. అనంతపురంలో ఉన్నా రాత్రులు నిరంతరం శివధ్యానం చేస్తూ భక్తి పారమ్యమును అనుభవించినాడు. ఒకనాడు చిన్న సుబ్బారెడ్డి చిలమకూరు (యర్రగుంట్ల దగ్గర) తెలిసిన వారింటికి వెళ్లినపుడు ఆయింటి కన్య తిరుపతమ్మను చూచి ఆమెయే తనకు భగవంతుడు

నిశ్చయించిన భార్యగా గుర్తించి పెద్దల అనుమతితో ఆమెను పెండ్లాడ నిశ్చయించి తల్లిదండ్రులకు సమీప బంధువులకు చెప్పినాడు. చిన్న సుబ్బారెడ్డికి పెండ్లీడు వచ్చింది కనుక వారు చిలమకూరు తిరుపతమ్మ తండ్రి భగవంతుడు నారాయణరెడ్డి యింటికి పోయి మాట్లాడినారు. నారాయణరెడ్డి దంపతులు సరేనన్నారు. కాని ఉద్యోగం లభించిన తరువాత పెండ్లి చేస్తా మన్నారు. ఈశ్వరానుగ్రహంతో చిన్న సుబ్బారెడ్డికి రాయచోటి తాలూకా పింఛా ప్రాజెక్ట్‌లో ఫిట్టర్ మెకానిక్‌గా ఉద్యోగం లభించినది. భగవంతుడు నారాయణరెడ్డి అసలుపేరు సింగమరెడ్డి నారాయణ రెడ్డి. ఆయన మొదటి భార్య లక్ష్మీనరసమ్మ. ఆమె సంతానమే తిరుపతమ్మ. లక్ష్మీనరసమ్మ చనిపోతే నారాయణరెడ్డి జయలక్ష్మమ్మ నుద్వాహమైనాడు. ఆమె సంతానం శ్రీనివాసులురెడ్డి, వెంకటలక్ష్మి, పద్మావతమ్మ, మధుసూదనరెడ్డి. చిన్న సుబ్బారెడ్డికి ఉద్యోగం లభించగనే తిరుపతమ్మతో పెండ్లి కుదిరింది. అప్పటికామె వయస్సు 18 ఏండ్లు. తొమ్మిదవ తరగతి వరకు చదువుకున్నది. 26.3.1976 నాడు ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరాలయంలో చిన్న సుబ్బారెడ్డి తిరుపతమ్మల పెండ్లి జరిగింది. వారిది ఆదర్శ దాంపత్యం. కొన్నాళ్ళకు చిన్నసుబ్బారెడ్డి తమ్ముడు చెన్నారెడ్డికి తిరుపతమ్మ చెల్లెలు వెంకటలక్ష్మమ్మతో పెండ్లి జరిగింది.

చిన్న సుబ్బారెడ్డి శివభక్తి ఆయన చర్యలు గమనించినవారందరు ఆయనను స్వామి అని శివభక్తేంద్రస్వామి అని పిల్చేవారు. బాల్యం నుండి ఆయన శివాలయంలో ఏకాంతంగా ధ్యానమగ్నుడయ్యేవాడు. ఆయనకు నరాకారంలో వేరే గురువు లేదు. సాక్షాత్తు శివుడే ఆయనకు గురువు. ఆ పరమశివుని ఆదేశం ఎట్లా వచ్చేదో ఆ

భాష ఏమిటో ఆయనకు మాత్రమే తెలుసు. పింఛా ప్రాజెక్టులో చేరిన తరువాత ఆయన అక్కడే కాపురం పెట్టినాడు. వారి దాంపత్య ఫలాలు 1) సుధాకర్ (ప్రస్తుతం కంప్యూటర్ ఇంజనీర్) 2) సురేశ్ (ప్రస్తుతం హోమియో డాక్టరు). పింఛలోనే కాపురముంటున్న అక్కమ్మ ఈశ్వరయ్య దంపతుల సంతానం నల్గురు మగవారు ఆర్గురు ఆడవారు. ఆ నల్గురు మగవారిలో నాగేంద్రబాబు ఒకరు. ఆయన చిన్నప్పటినుండి చిత్తూరు జిల్లా పీలేరు తాలూకా పెద్ద కొంపల్లెవాసులు అమ్మమ్మ నరసమ్మ, తాత వెంకటప్పనాయుడు వద్ద పెరిగినాడు. ఈ వృద్ధదంపతులు 7 ఏండ్ల నాగేంద్రబాబును 1976 సం॥ పింఛా ప్రాజెక్టుకు తీసుకవచ్చి శివభక్తేంద్ర స్వామికి అప్పగించినారు. ఈ నాగేంద్రబాబు తరువాత కాలాన బాబు స్వామిగా ప్రసిద్ధులు. శ్రీ శివభక్తేంద్రులా బాలుని చూడగనే "ఏంటి దొరా! ఇలా వస్తున్నారు? ఎట్లున్నారు? ఇటురండి" అంటూ దగ్గరకు తీసుకున్నారు. అటు తరువాతనే ఈశ్వరయ్య అక్కమ్మ దంపతులు వచ్చి కొడుకు నాగేంద్రబాబును తమ యింటికి తీసుకపోయినారు. శివభక్తేంద్రస్వామి నాగేంద్రబాబుల పూర్వజన్మ అనుబంధ మెట్టిదో తెలియదు. స్వామివారు నాగేంద్రబాబును ఒకటవ తరగతిలో చేర్పించి చదివిస్తూ పుత్రనిర్విశేషంగా చూచినారు.

ఒకనాడు సుధాకర్, సురేశ్, నాగేంద్రబాబు ముగ్గురు బడినుండి తిరిగివస్తుండగా రౌండు టాంక్‌వద్ద ఒక పాము ఒక ఉడుము ఎదురు వచ్చినవి. వాటిని చూచి ముగ్గురు బాలురు ఒకదానిని చంపవలె ననుకున్నారు. స్వామీజీ పెద్దకొడుకు సుధాకర్ పామును చిన్నకొడుకు సురేశ్ ఉడుమును చంపవలెనన్నారు. కొద్ది సేపటికి పాము వెళ్లిపోయింది. ఉడుము మాత్రము అక్కడే ఉంది. ఈ

ముగ్గురు కలిసి ఉడుమును చంపినారు. ఎవరో వచ్చి ఆ చచ్చిన ఉడుమును తీసుకపోయి వండుకతిన్నారు. ఈవిషయం స్వామిజీకి తెలిసింది. స్వామీజీ "ఏ ప్రాణిని చంపకూడదు" అని హితబోధ చేసి "భగవంతుడు ఉడుముకు మంచి రూపం సృష్టించినా"దన్నారు. ఒకప్పుడొక రాజు ఉడుములు తినేవాడు. ఆ రాజే ఈ ఉడుము అవతారమెత్తినాడు. ఎదురు వచ్చిన పాముతో తనను చంపుమని ఆ ఉడుము కోరితే కొలదిసేపటికి నీవే చనిపోతావు నేను చంపవలసిన పనిలేదంటూ ఆ పాము వెళ్ళిపోయింది. ఆతరువాత మీరు ముగ్గురు దానిని చంపినారు. దాని మాంసం తిన్నవారికి ఉత్తమ జన్మవస్తుందని స్వామీజీ ఆ పిల్లలతో అన్నారు. (నాగేంద్రబాబు) బాబుస్వామి చదువు మానివేసినాడు. ముగ్గురు బాలురు కలిసి రెండు ఉడుత పిల్లలను పెంచినారు. వాటిని చూచి స్వామీజీ సంతోషించేవారు. ఒకనాడు స్వామీజీ బాధతో ఆ ఉడుతలు వెళ్ళిపోతాయి అన్నారు. కొలది దినాల్లోనే ఆ ఉడుతలను కుక్కలు తిన్నవి. స్వామీజీ "ఆ ఉడుతలు నాకోసం వచ్చినవి. అవి మరల ఇంకొక జన్మ ఎత్తవలె కనుకనే కుక్కలు వాటిని తిని తమ ధర్మం నిర్వర్తించినవి'' అన్నారు. ప్రతిదినం స్వామీజీ ఆ ముగ్గురు బాలురను ఉదయం 4 గంటలకు లేపి జింకచర్మంపై కూర్చుండి ధ్యానమగ్నులయ్యేవారు.

1982 నుండి స్వామీజీ అడవుల్లోకి పోయి ధ్యానం చేసేవారు. తమవెంట బాబుస్వామిని తోడ్కొని పోయేవారు. బాబుస్వామిని ఒక శివాలయంలో శివలింగానికి ఎదురుగా కూర్చుండబెట్టి కొంతసేపైన తరువాత ఒక నిర్జన ప్రదేశానికి తీసుకపోయి ఒకచోట వృత్తాకారం గీసి అందులో కూర్చుండి ఆ శివాలయంలో శివుని

చూస్తున్నట్లు ధ్యానించుమనేవారు. అటు తరువాత తాము ధ్యానమగ్నులయ్యేవారు. తామే మరల పోయి బాబు స్వామిని లేపేవారు. బాబు స్వామికి ఆకలైతే తినటానికి దేవదారు ఆకులిచ్చి తినుమనేవారు. పింఛాలో అక్కగారికోన పరికిబండవద్ద కొండపై కోనేరున్నది. స్వామీజీ అక్కడ 29 దినాలు తపస్సు చేసినారు. బాబుస్వామి కూడ 29 దినాలు అక్కడే ధ్యానమగ్నులై యుండినారు. బాబుస్వామికి ఆ 29 దినాలు ఒక్కనాడే ధ్యానమగ్నులైనట్లు అనుభవమైనది. ఇంకా స్వామివారు బాబుస్వామితో "నీవు నా శరీరానికి కాపలా! నా జీవాత్మ భగవంతుని దగ్గర ఉంటుంది. నేను అక్కడ సేవ చేస్తాను. ఇతరులకు చెప్పకూడని మహత్తులు నీకు చెప్పినాను" అన్నారు. స్వామీజీ కొన్ని ప్రాంతాల పేర్లు చెప్పి "నేను అక్కడుంటాను. నీవూ అక్కడికి పో" అన్నారు. పింఛా ప్రాజెక్టు ఆంజనేయస్వామి గుడివద్ద స్వామీజీ బాబుస్వామిని తాము చెప్పిన ప్రాంతాలకు పొమ్మంటే ఆయన పోలేదు. స్వామీజీ "పోకపోతే ఎట్లా"? అని గట్టిగా మందలించినారు. స్వామీజీ అక్కడే ఉన్నారు. బాబుస్వామి క్రిందికి వచ్చినాడు. ఆకలైతే టెంకాయనీరు త్రాగి చెట్టుపైనే నిద్రపోయినాడు. రెండు దినాలకు లేచి చెట్టు దిగి టెంకాయలు జామకాయలు ఆంజనేయ స్వామికి తీసుకపోతుంటే లస్కర్‌కొడుకు బాబుస్వామిని అడ్డగిస్తే ఆతణ్ణి దూరం విసరివేసి ఇంటికివచ్చి స్వామివారి శంఖుమార్కు ఆకుపచ్చలుంగీ తీసుకొని సిమెంటు లారీ ఎక్కి రాజంపేట పాతబస్సు స్టాండు వద్ద దిగినాడు. ఆయనకు తెలిసిన వారెవ్వరూ అక్కడలేరు. రాజంపేట పోయే మార్గంలో అమ్మవారి గుడిలో పడుకుంటే ఎవరో పెద్దాయన వచ్చి అన్నం పెట్టి పోయినాడు. తెల్లవారుజామున 4 గంటలకు శ్రీ శివభక్తేంద్రస్వామి వచ్చి "నీ వెంట నేనున్నాను" అన్నారు. బాబుస్వామి ప్రైవేటు బస్సు టాప్ ఎక్కి కడప అవధూతేంద్రస్వామి

దేవాలయం వద్ద దిగినాడు. 40 దినాలు అవధూతేంద్రస్వామి గుడివద్ద సేవలు చేసినాడు. స్వామీజీ ఆజ్ఞ ప్రకారం దోర్నాలకు పోయి 4 దినాలు వడ్రంగం పనిచేసి శ్రీశైలం వెళ్ళి గుడిలో ప్రసాదం తిని ఆడవుల్లోకి పోయినాడు. అక్కడ స్వామీజీ తోడుగా ఉన్నారు. బాబుస్వామి 1983 దాకా శ్రీశైలం అడవుల్లో ఉంటే స్వామీజీ అప్పుడప్పుడు వచ్చి చూచిపోయేవారు. ఇద్దరూ మహానందిలో 40 దినాలున్నారు. స్వామీజీ నీళ్ళపై తపస్సు చేస్తుంటే బాబుస్వామి కాపలా ఉండినాడు. తరువాత కొంతకాలం అడవుల్లో ఉండినారు.

1984 బాబుస్వామి నెల్లూరు చేరినకొలది కాలానికి స్వామీజీ అక్కడికి చేరినారు. ఒకనాడు వారిరువురు స్నానం చేస్తుండగా స్వామీజీ **"ఒక దేశాధినేత జీవాత్మ వెళ్తున్నది"** అన్నారు. మరునాడే శ్రీమతి ఇందిరాగాంధి హత్య జరిగింది. స్వామీజీ "గొలగమూడి వెంకయ్యస్వామి జిల్లా కలెక్టర్ లాగా వెలుగుతాడ"న్నారు. ఇరువురు ఒంగోలు టంగుటూరు సింగరాయకొండ చుట్టు గ్రామాలు చిలకలూరిపేట సంచారం చేసినారు. స్వామీజీ ఆదేశం ప్రకారం బాబు స్వామి బంగారు కొట్టులో పనిచేసినాడు. బాబుస్వామి తల్లిదండ్రులు స్వామీజీతో తమ అబ్బాయిగూర్చి వాదులాడితే "దొర వస్తాడులే" అన్నారు. స్వామీజీ పింఛాలో భౌతికంగా ఉద్యోగం చేస్తూ యోగశరీరంతో బాబుస్వామి వెంట ఉండేవారు. 1984 డిసెంబరులో బాబుస్వామి పింఛా ప్రాజెక్టు చేరుకున్నాడు. ఒక మాంత్రికుడు స్వామీజీని పింఛాలో వెంటనంటి ఉండి తన శక్తులతో చాలామందిని మోసగించి స్వామీజీ వస్తువులు కూడ దొంగలిస్తుంటే బాబుస్వామి ఆతని ఆటలు కట్టించినాడు. 1985 సం॥ స్వామీజీకి పింఛానుండి సగిలేరు ప్రాజెక్టుకు బదిలీ జరిగింది. బాబుస్వామి తన పురుషకారంతో స్వామీజీ సామాను లారీలో తరలించినాడు. 1986 సం॥ ఇరువురూ సింహాచలం వెళ్ళినారు. తరువాత అన్నవరం, భద్రాచలం, శబరిమలై ప్రాంతాలు తిరిగినారు. ఆకులు

వనమూలికలతో స్వామీజీ మధుమేహానికి, పాముకాటుకు, స్త్రీల గర్భకోశవ్యాధులకు మందులు సిద్ధం చేసి ఎందరికో ఆరోగ్యం ప్రసాదించినారు. ఆ వైద్యవిధానం బాబు స్వామికి నేర్పినారు.

1987 సం॥ శివభక్తేంద్రస్వామి సగిలేరులో తమగదిలో తపస్సు చేస్తుంటే ఒక నాగుపాము వచ్చి నాట్యం చేసేది. ఆ గదిలో పెద్దపుట్ట పెరిగింది. స్వామీజీ ఏకాంతంగా ఉన్నపుడు వారి ముందు నాట్యం చేసేపాము పగలు పిల్లివలె మారేది. తిరుపతమ్మ ఆ పిల్లికి పాలుపోసేది. స్వామీజీ అప్పుడప్పుడు "పుట్టుకతోనే పసుపు కుంకుమ గాజులు స్త్రీకి అలంకారాలుగా వస్తుంటాయి. మధ్యలో భర్తపోయినంత మాత్రాన అవి ఎందుకు పోవాలె" అనేవారు. తిరుపతమ్మ స్వామీజీతో 13 ఏండ్లు కాపురం చేసింది. ఆమెకు దేవభాష తెలుసు. స్వామీజీ ఆజ్ఞప్రకారం ఆమె వ్రాస్తుండేది. స్వామి చదివేవారు. 1988 స్వామీజీ తమ పిల్లలను కడప మునిసిపల్ హైస్కూలులో చేర్పించినారు. తిరుపతమ్మగారు పిల్లలతో కడపలో ఉండేది. స్వామీజీ సగిలేరునుండి వస్తూ పోతుండేవారు.

1987 సం॥ స్వామీజీ సగిలేరులో ఉన్నపుడు వర్షాలు పడక చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు వచ్చి ప్రార్థిస్తే శ్రీవారు వర్షాలు కురిపించినారు. కాళ్ళు చచ్చుబడినవారికి కనుచూపు పోయిన వారికి, సంతానహీనులకు, దయ్యాలు భూతాలు పట్టినవారికి స్వామి వారివారి లోపాలు దిద్ది సంతోషం కూర్చినారు. ఒక బ్రహ్మ రాక్షసి ఆవహించిన స్త్రీ మనుష్యుల పశువుల రక్తం త్రాగుతుంటే స్వామీజీ దానిని పారద్రోలినారు. పుట్టమట్టితో గంగాదేవి విగ్రహం చేసి పాలతో అభిషేకించి గంటలో వర్షం కురిపించినారు. ఒకసారి శ్రీ మహాలక్ష్మి పరీక్షకోసమై స్వామీజీ యింట ధనం కురిపిస్తే దాన్ని ముట్టక "నీ ధనం పాముకాటు వంటిది, నా కక్కరలేదు. నీ సేవ చేసే భాగ్యం ఒక్కటే చాలు"నన్నారు. అమ్మవారు మూడు దినాలు కష్టపెట్టినా భరించినారేకాని ధనం ముట్టలేదు. స్వామీజీ బ్రహ్మం

గారి మఠానికిపోయి వీరబ్రహ్మేంద్రస్వాములతో మాట్లాడినారు. వీరబ్రహ్మేంద్రులిచ్చిన డబ్బు మరల హుండీలోనే వేసి మీ అనుగ్రహ మొకటే చాలునన్నారు. అట్టి నిస్పృహులు విరాగులు శ్రీ స్వామీజీ వారు. వారు 1988 సం॥ జనవరి నుండి అనేక తాళపత్ర గ్రంథాలు వ్రాసి భూమిలో పూడ్చి వాని చుట్టు దీపాలు పెట్టినారు. అవసరమైనపుడు నేను వ్రాసిన గ్రంథాలు వాటంతట అవే వస్తాయన్నారు. ఆ గోతిలో ఆనాటి దీపాలు ఇప్పటికీ వెలుగు తున్నాయట. స్వామీజీ తమ అంత్యం గురించి "ఏలాటి ఇబ్బంది లేకుండా నేను సమాధి కావలె. నేనెల్లప్పటికీ ఉంటాను. నన్నొక గదిలో ఉంచండి" అని వ్రాసినారు. శ్రీస్వామీజీ బాబుస్వామిని దేవుని కడపకు తీసుకపోయి "నేననుకున్నది సాధించినాను. నేను వెళ్తున్నాను. నీవు బాధపడవద్ద"ని చెప్పినారు. తమ బావమరిది శ్రీను కనబడితే చేతినిండా లడ్డూలు వేసిపోయినారు. త్రోవలో మరల శ్రీనుకు కనబడితే అతడాశ్చర్యంతో అక్కడ నాకు లడ్డూలిచ్చి మరల ఇక్కడ ఎట్లా కనబడుతున్నారంటే "నన్ను మీరింతవరకు తిక్కసుబ్బారెడ్డి అని భ్రమించినారు. ఇప్పటికైనా సత్యం తెలుసుకొం"దన్నారు. కడపలో తమ భార్య పిల్లలున్న ఇంటికిపోయి ఇంట్లో అడుగు పెట్టకుండా "అందరినీ కాపాడే అధికారం నాకిచ్చినారు. ఇకమీదట ఏ బంధమూ లేదు" అని పాత బస్‌స్టాండుకు పోయి తమవద్ద ఉన్న డబ్బంతా బాబు స్వామికిచ్చి కేవలం ఛార్జీలకు మాత్రం సరిపడేటంత పైకం తీసుకొని పోయినాడు.

శ్రీ శివభక్తేంద్ర స్వామీజీ తమ నిర్యాణం గూర్చి ఎవరికీ చెప్పలేదు గాని మహాభినిష్క్రమణం జరిగే విధం 1988 సం॥ వ్రాసినారు. తమను ఒక గదిలో 5 ఏండ్లు తాళం వేసి ఉంచుమంటే తిరుపతమ్మ

గారు ఒప్పుకోనందున ఆమెను పిల్లలను తమ్ముడు చెన్నారెడ్డితో కడపకు పంపించినారు. శివుడు వేణుగోపాలుడు ఆజ్ఞాపించి నందున లస్కర్ మద్దిరెడ్డిని నిద్రలేపి తోడ్కొని పోరుమామిళ్ళకు డాక్టరు వద్దకు పోయి తిరుగు ప్రయాణంలో వేణుగోపాల స్వామి ఆలయంలో పడుకున్నారు. మద్దిరెడ్డి మంచినీరు తెస్తే స్వామీజీ త్రాగి తమ చేతికున్న గడియారం ఉంగరం గుర్తుగా ఇంటివద్ద ఇమ్మని చెప్పి గర్భగుడిలో మద్దిరెడ్డి తొడపై పడుకున్నారు. మద్దిరెడ్డి ఏడుస్తుంటే వేణుగోపాలస్వామి ఆ మద్దిరెడ్డిని ఎందుకు తోడుక వచ్చినావంటే నా దేహం ముక్కలు కాకుండా కాపాడటానికి తోడుగా తీసుకవచ్చినామన్నారు. వేణుగోపాలస్వామి భార్యబిడ్డల విషయం అడిగితే "భగవంతుడు అందరినీ కాపాడేటందుకు వెలుగునిస్తాడు. ఆ వెలుగులో నా భార్య బిడ్డలుకూడ ఉంటా" రన్నారు. అటు తరువాత భూదేవికి కృతజ్ఞతలు తెలిపి ప్రాణం విడిచినారు. శిష్యుడు భక్తుడు టీచర్ గురివిరెడ్డికి స్వప్నంలో కనబడి చెప్పితే ఆయన అందరికీ ఈ వార్త పంపినాడు. బాబుస్వామి తదితరులు కారులో పోయి స్వామి శరీరాన్ని తీసుకొనిపోయి స్వామీజీ అన్నగారి స్థలంలో 24-11-1988 ఖాజీపేట క్రాసింగ్ రోడ్డువద్ద సమాధిచేసినారు.

శ్రీమతి తిరుపతమ్మగారికి కలలో కనబడి **"నేనున్నాను. తీయవద్దు"** అన్నారు. ఐనా శ్రీవారి దినవారాలనాడు ఆయమ్మ పసుపుకుంకుమ గాజులు తాళిబొట్టు తీసివేసినది. శ్రీవారిని సమాధి చేసిన తరువాత 11 నెలలకు గురివిరెడ్డికి కలలో కనబడి నా సమాధికి 9సార్లు ప్రదక్షిణలు చేయి. నేను భూగర్భంనుండి ఉద్భవిస్తామన్నారు. గురివిరెడ్డి ఉదయం 11గం. ప్రదక్షిణలు చేసిన తరువాత 19-10-1989 సాయం 6.30 గంటలకు స్వయంభూ

విగ్రహంగా బంగారు గాజులు మట్టెలు తాళిబొట్టు ముక్కుపుడక పసుపుకుంకుమలతో వెలికి వచ్చినారు. తిరుపతమ్మగారు వాటిని ధరించి మరల ముత్తైదువుగానే ఉంటున్నది. పూర్వం ఒకప్పుడు స్వామీజీ తిరుపతమ్మగారితో తమను ఒక గదిలో 5 యేండ్లు ఉంచి తాళం వేయుమంటే ఆమె విననందున స్వామి కైలాసం చేరుకోవటంకోసం నిర్యాణం చెందినారట.

స్వామీజీ భూగర్భం నుండి వెలికివచ్చిన సమయంలో బాబు స్వామి ప్రొద్దుటూరులో ఉండినారు. ఆయనవచ్చి ఆ విషయం నిరూపణకై గురివిరెడ్డి యింటియిపోయి ఒక పెట్టె తాళం తీయించగా అందులో పసుపుగుడ్డలో చుట్టిన ఒక ఫైలు బయటపడింది. గురివి రెడ్డి తప్ప మరెవ్వరూ అది తెరచి చదువరాదనీ, ఎవరైనా తెరచి చదివితే తల 12 ముక్కలౌతుందనీ ఫైలుపై వ్రాసి ఉంది. గురివిరెడ్డి గారా ఫైలు చదివి తిరుపతమ్మగారిని ముత్తైదువుగా అలంకరించి నారు. ప్రభుత్వం వారికి స్వామి విగ్రహాన్ని స్వామి విగ్రహంతో పాటు వచ్చిన నగలను అప్పగించినారు. వాటిని కడప ట్రెజరీలో పెట్టినారు.

స్వామీజీ భక్తులా విగ్రహాన్ని స్థాపించుకోవటానికి కలెక్టర్ శ్రీమతి చందనాఖాన్‌ను లేఖద్వారా అభ్యర్థించినారు. శివభక్తేంద్రస్వాముల శిష్యులు భక్తులు సమావేశమైనారు. ఆలయనిర్మాణం కోసం విరాళాలు సేకరించినారు. మందిరం ఏ విధంగా కట్టవలెనో అని బాబుస్వామి పూజలో కూర్చున్నాడు. ప్లాన్ కాగితం వచ్చింది, అందరికీ ఆశ్చర్యం కలిగింది. దాని ప్రకారం ఆలయం నిర్మాణం జరుగగనే సబ్ ట్రెజరీ కార్యాలయం నుండి స్వామీజీ విగ్రహాన్ని

ఇతరవస్తువులను తెచ్చి 1995 ఏప్రిల్‌లో శాస్త్రోక్తంగా మందిరంలో ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించినారు. తిరుపతమ్మగారికి ఆమె పుట్టింటి వారు స్వామి ఆరాధనోత్సవంనాడు నవంబర్ 24నాడు ఒడి బియ్యం కడుతారు. భక్తులు కూడ చీరలు రవికలు సమర్పిస్తారు. ఆలయంలో శ్రీ శివభక్తేంద్రులకు క్షీరాభిషేకం యజ్ఞం చేస్తారు. అన్నదానం జరుగుతుంది. బాబుస్వామిగారు స్వామీజీ ఆదేశంతో భక్తుల సమస్యలకు పరిష్కారాలు చెప్పుతున్నారు.

శ్రీ శివభక్తేంద్రస్వామివారు ప్రదర్శించిన మహిమలనేకం.

1) శ్రీస్వామీజీ తాటియాకులపై వ్రాసిన కాలజ్ఞానం గోతిలో పూడ్చినారు. ఆ గోతిపై కందిచెట్టు పెరిగి మల్లెపూలు పూసింది. సగిలేరులో స్వామివారా పూలతోనే పూజ చేసేవారు. ఇప్పుడక్కడ ఒక పుట్ట పెరిగింది. బ్రహ్మంగారు తమ కాలజ్ఞానంలో కందిచెట్టుకు మల్లెపూలు పూస్తాయన్నది వాస్తవ మైనదిక్కడనే.

2) అక్కగారి కోనపరికి బండవద్ద కొండపైన కోనేరు ప్రక్కన స్వామివారు 1982 సం॥ 29 దినాలు తపస్సు చేసినారు. ఆ సంవత్సరమే రాజంపేట అమ్మవారి గుడిలో బాబుస్వామి ఉండగా తెల్లవారుజామున 4 గంటలకు వచ్చి నీ వెంట నేనున్నానన్నారు. మహానందిలో నీళ్ళపై తపస్సుచేసినారు. మహానంది పడమర శివాలయంలో 10 దినాలు తపస్సు చేసినారు.

3) 1984 నెల్లూరు రంగనాథాలయం ప్రక్కన పెన్నారులో స్నానం చేస్తూ ఒకనాడు ముందు ఇందిరాగాంధీ హత్య సూచించినారు.

4) శ్రీవారు తమ యోగశరీరంతో ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండ చిలుకలూరిపేట నెల్లూరులు బాబుస్వామితో తిరిగినారు.

5) పోరుమామిళ్ల స్త్రీపై ఆవహించిన రాక్షసి చేతిలో కనకదుర్గ యజ్ఞం నిప్పుకణికలు పోసి పారద్రోలినారు.

6) 1987 సగిలేరులో పుట్టమట్టితో గంగాదేవి విగ్రహం చేసి పాలతో అభిషేకించి ఒక గంటలో వర్షం కురిపించినారు.

7) లక్ష్మీదేవి తమ ఇంట్లో ధనం కురిపించినా, వీరబ్రహ్మేంద్రులు ప్రత్యక్షమై పైకమిచ్చినా పరిగ్రహించలేదు.

8) 24-11-1988 సమాధిచేసిన తరువాత టీచర్ గురివిరెడ్డికి స్వప్నంలో 11 నెలల తరువాత నా సమాధికి 9 ప్రదక్షిణలు చేస్తే భూగర్భం నుండి వస్తానని 19-10-89 సాయంకాలం అట్లే ఆవిర్భవించటం అద్భుతమైన చర్య.

9) 2000 సం॥ ఆరాధననాడు నిర్మాణంలో ఉన్న అన్నదాన సత్రం మీదినుండి నాగజ్యోతమ్మ క్రిందపడి అందరు మూగిన తరువాత తనను స్వామీజీ క్రిందికి దించినట్లనిపించినదన్నది. ఆమె వెన్నెముక విరిగినా మరునాటికే బాగు కావటం ఇంకొక పరమాద్భుతం.

10) ఎగువపల్లె సుబ్బారెడ్డి మనుమనికి మాటలురావు. తింటే వాంతి చేసుకుంటాడు. ఆ పిల్లవాని తల్లి శారద ఎందరో డాక్టర్లను సంప్రదించింది. ఎవ్వరూ ఏమీ చేయలేకపోయినా ఆమె స్వామీజీ మందిరానికి వస్తే బాబు స్వామి గుడిలో నిద్ర చేయండన్నారు. వారు నిద్రచేస్తే స్వామీజీ ఆ అబ్బాయికి ఆపరేషన్ చేసినట్లు మచ్చ ఏర్పడింది. తెల్లవారేవరకు స్వస్థుడైనాడు.

11) నెల్లూరు చెంచురామారెడ్డి చావుబ్రతుకుల్లో ఉండి వచ్చి ప్రార్థిస్తే "ఆరునెలల తరువాత ఆరాధనోత్సవం మరునాడు

చనిపోతా"వని బాబు స్వామితో చెప్పించినారు. ఆ మాటలు నిజమైనవి.

12) పింఛా ప్రాజెక్టులో పనిచేస్తుండగా వడ్లమిల్లు యజమాని రామసుబ్బారెడ్డి భార్యకు మెడచుట్టు కాన్సర్ గడ్డలైతే స్వామీజీ మూడు ముష్టిగింజలు తినిపించి ఒక్కవారంలో ఎవ్వరూ నయం చేయలేని ఆ గడ్డలు కరిగేటట్లు చేసినారు.

ఈ విధంగా స్వామి సజీవులైయుండగాను సమాధిగతులైన తరువాతను అనేక లీలలు ప్రదర్శిస్తున్నారు.

ఆధారం : –

నెల్లూరునుండి మిత్రులు రామావఝుల శ్రీశైలంగారు పంపిన గ్రంథం శ్రీ శివభక్తేంద్రస్వామివారి దివ్యచరిత్ర – రచన కూర్పు చెన్నంశెట్టి లక్ష్మీనారాయణ 2/659 శ్రీహరిరావు వీథి నాగరాజు పేట – కడప (08562) 279680; ప్రచురణ – శ్రీబాబుస్వామి శ్రీశివభక్తేంద్రస్వామి దేవస్థానం ఖాజీపేట – 516203 (కడపజిల్లా) 2006.

16. హిందూపురం నరహరి సద్గురు పరంపర (1859-2003)

ఒకే కుటుంబంలో మూడుతరాలవారు సద్గురువులై, తమ నాశ్రయించిన వారిని మోక్షగాములుగా దిద్దిన ఉదంతం ఆంధ్రయోగుల చరిత్రలో అరుదైన విషయం. బ్రహ్మానుభవం పొందిన మహాత్ములెందరో అత్యంత ప్రాచీన కాలం నుండి నేటి వరకు మన భారతదేశం వివిధ ప్రాంతాలను పునీతం చేస్తున్నారు. బ్రహ్మవిద్వరేణ్యులే తమనాశ్రయించిన శిష్యులకు సరియైన మార్గ దర్శనం చేయిస్తారు. అట్టి వారినే సద్గురువులంటారు. ఆ సద్గురువుల కోవలోనివారే అనంతపురంజిల్లా హిందుపురానికి చెందిన నరహరి సద్గురు పరంపర. హిమాలయపర్వతాల్లో తపస్సు చేసుకునే నారాయణ యతీశ్వరులు 1830 ప్రాంతాల్లో దక్షిణ భారతదేశం పర్యటిస్తూ మహబూబునగరం జిల్లా గద్వాల

సంస్థానానికి వచ్చినారు. అది ఆదిమహాలక్ష్మమ్మగారు పరిపాలించే కాలం. ఆయమ్మకు పురోహితులు శ్రీనివాసయ్య సర్వశాస్త్ర పారంగతులు అధ్యాత్మవిద్యాకోవిదులు. వానప్రస్థులైన తరువాత ఒకనాడాయన ఈశ్వర దేవస్థానంలో భగవద్గీత V-18 వ శ్లోకం శ్రోతలకు వివరిస్తుండగా దేవస్థానం ఒక మూలన కూర్చున్న నారాయణ యతీశ్వరులు విని ఆ శ్లోకంలో చెప్పబడిన 1) విద్యా వినయసంపన్నే బ్రాహ్మణే 2) గవి 3) హస్తిని 4) శుని 5) శ్వపచుడు ఈ ఐదింటి యందే పండితులు సమదర్శులుగా ఎందుకుండవలె ఈ సంఖ్యానియమం ఎందుకని ప్రశ్నించినారు. శ్రీనివాసయ్యకు ఎటూ తోచలేదు. నారాయణ యతీశ్వరులు అది చాలా రహస్యమైన విషయమనీ, గురూపదేశం చేత మాత్రమే సాధ్యమనీ, తెలుసు కోవలెననే తీవ్రమైన ఇచ్ఛ ఉంటే నావెంట రండనీ ఆదేశించినారు. శ్రీనివాసయ్య **"యదహరేవ విరజేత్ తదహరేవ ప్రవ్రజేత్"** శ్రుతి వాక్యం తలచుకొని గురువుల వెంట బయలుదేరి వైఘానదీ తీరంలోని ఒక గుహ చేరినారు. గుహద్వారంలో శిష్యుడు, గుహలో గురువులైన నారాయణయతీశ్వరులు అన్నపానము లుడిగి 3 దినాలు సమాధిలో ఉండినారు. ఈ విధంగా నారాయణ యతీశ్వరులు శ్రీనివాసయ్యను పరీక్షించినారు. శ్రీనివాసయ్యకు భగవద్గీత మొదటి 6 అధ్యాయాల అర్థం, శ్రవణమనననిధి ధ్యాసనములైనవి. గురువులు మరల హిమాలయాలకు వెళ్ళిపోయినారు. శ్రీనివాసయ్య గద్వాలకు తిరిగివచ్చినారు. నారాయణ యతీశ్వరులు శ్రీనివాసయ్యకు

"న కేవలం త్వాముద్ధర్తుం పరం తత్త్వం సమీరితమ్
కింతు మోహవిపన్నానా మన్యేషాం హితమీప్సితమ్"

నేనుపదేశించిన పరతత్త్వం నీ ఉద్ధరణ కోసమేకాదు; అజ్ఞానంలో చిక్కినవారి ఉద్ధారం కూడ నీవు చేయవలెనని ఆజ్ఞాపించినారు. శ్రీనివాసయ్య గురువుల ఆదేశం శిరమున ధరించినారు.

గద్వాల సంస్థానంలో ఏటేట పండిత సభలు జరిగేవి. వారివారి అర్హతను బట్టి ఆయా పండితులకు సత్కారాలు జరిగేవి. కర్ణాటక దేశం చిత్రదుర్గజిల్లా చెళ్ళకెరె తాలూకాలో శిరివాళం (ఓబళాపురం) గ్రామంలో లక్ష్మణయ్య అనే ఆజన్మ బ్రహ్మచారి బ్రహ్మవర్చస్వి తెలుగు కన్నడ సంస్కృత భాషల్లో ఉద్దండ పండితుడుండేవాడు. ఆయన పండిత సన్మానం కోసం ఒక యేడు గద్వాలకు వచ్చినాడు. శ్రీనివాసయ్య లక్ష్మణయ్య స్వరూప స్వభావాలు గుర్తించి బ్రహ్మ విద్యను ధారపోసి యోగ్యులైన శిష్యులకు ఆ విద్యను బోధించు మన్నారు. లక్ష్మణయ్య బళ్ళారి, రాయదుర్గం, చళ్ళకెరె, శిరివాళం ప్రాంతాలు సంచరిస్తూ సద్భక్తులకు బ్రహ్మానందానుభూతి కలిగించే వారు. ఒకసారి లక్ష్మణయ్య రాయదుర్గం వెళ్ళినపుడు యాదాటి నరహరి శాస్త్రి యనే యువకుని గుర్తించి బ్రహ్మజ్ఞానం వైపు మళ్ళించినారు. (ఈ నరహరి శాస్త్రుల మేనత్త లక్ష్మీదేవమ్మ ఇతఃపూర్వమే లక్ష్మణయ్యగారి వద్ద దీక్ష తీసుకున్నది కనుక నరహరి శాస్త్రి లక్ష్మణయ్యగారి పరిపూర్ణానుగ్రహానికి పాత్రులైనారు.) ఈ విధంగా నరహరి గురుపరంపరకు బీజావాపం జరిగింది. లక్ష్మణయ్యగారు శిరివాళం గ్రామంలో ఒక ఫాల్గుణ శుద్ధ దశమి నాడు జీవసమాధి చెందినారు. ఇప్పటికీ ప్రతిసంవత్సరం ఫాల్గుణ శుద్ధ దశమినాడు ఆ జీవసమాధిచెంత పూజలు విశేష కార్యక్రమాలు జరుగుతున్నవి.

1) నరహరి సద్గురుస్వాములు (1859-1929)

అనంతపురం జిల్లా రాయదుర్గంలో కౌండిన్యస గోత్రులు ములికినాటి శాఖ వైదికులు యాదాటి ఓబళేశ్వరశాస్త్రులుండేవారు. ఆయన భార్య ఓంకారమ్మ పుట్టినిల్లు చిత్రదుర్గం తాలూకా తురువనూరు. లోహాచలం షణ్ముఖదేవుని అనుగ్రహంతో ఆయమ్మ 1859 సం॥ సిద్ధార్థి సం॥ పుష్యశుద్ధ ద్వాదశినాడు తమ పుట్టింటిలోనే ఒక మగశిశువును కన్నది. బారసాల నాడా శిశువుకు నరహరి అని నామకరణం జరిగింది. నరహరి బాల్యం 10 సంవత్సరాలు తురువనూరులోనే గడిచింది. 10వ యేట తండ్రి ఓబళేశ్వర శాస్త్రి పరమపదించటం చేత తల్లిగారి ఆజ్ఞానుసారం నరహరి కన్నడ తెలుగు రాజ్యాల్లో పెక్కురు పండితులను సాధువులను సేవిస్తూ వేద వేదాంగములు, ఉపనిషత్పురాణేతిహాసాలలో లోతైన జ్ఞానం సంపాదించి రాయదుర్గం తిరిగివచ్చి తమ సంగీత సాహిత్యముల ప్రావీణ్యంలోను ఆధ్యాత్మిక జ్ఞానంలోను పేరు పెంపులు సంపాదించినారు. ఆయన దేశ సంచారం చేస్తూ గద్వాలలో యోగిపుంగవులు లక్ష్మణయ్యగారినీ, లక్ష్మణయ్యగారి గురువులు శ్రీనివాసయ్యగారినీ సేవించి వేదాంతతత్త్వ రహస్యములు గ్రహించినారు. రాయదుర్గం తాలూకా మెచ్చెరి గ్రామకరణం భీమప్పగారి కూతురు ఆదిలక్ష్మమ్మను పెండ్లాడి ఐదుగురు కొడుకులు ఒక బిడ్డను కన్నారు. యోగమార్గము కష్టతరము. జ్ఞానమార్గమే గృహస్థాశ్రమానికి యోగ్యమని గుర్తించిన నరహరి గారు షట్ఛాస్త్రాలు సమస్త వేదాంతగ్రంథాలు శంకరుల భాష్యాలు, విద్యారణ్యుల పంచదశి, సురేశ్వరాచార్యుల నైష్కర్మ్యసిద్ధి సాధు

నిశ్చల దాసుల విచార సాగరమాదిగా గల గ్రంథాలు పరిశోధించి తమ గురువులానతిచ్చిన వాక్యాలతో సమన్వయ పరచి తమను ఆశ్రయించిన ముముక్షువులకు అతద్వ్యావృత్తి, తటస్థ స్వరూప లక్షణములచే నిజతత్త్వాన్ని పండిత పామరులకు బోధిస్తూ ఎందరినో ఉద్ధరించినారు. వారి రచన **"వేదాంత రహస్యార్థము"** సాధన చతుష్టయము సంపాదించినవారికి కల్పతరువు.

నరహరి స్వాములవారు, నేత్రపల్లి, వెంకటంపల్లి, గొల్లపల్లి పులకుంట, రంగసముద్రం, చిత్రదుర్గంజిల్లాలో తురవనూరు, బెళగట్ట, చళ్ళకెరె, పెద్దసిద్దంపల్లి గ్రామాల్లోను, హిందూపురం పట్టణంలోను శివమొగ్గజిల్లా శిరాళకొప్ప సొరబలో పర్యటిస్తూ తెలుగు కన్నడ భాషల్లో శ్రావ్యంగా తమరచనలు పాడుతూ తత్త్వరహస్యాలు బోధించేవారు. గొల్లపల్లి ఈశ్వరాలయంలో శివరాత్ర్యుత్సవాలు, గురువుల ఆరాధనా కార్యక్రమాలు జరిపేవారు. వారు 1929 సం॥ రాయదుర్గంలో ఉండగా అకస్మాత్తుగా ఉదర శూలకు లోనై తమకు అంత్యకాలమాసన్నమైనదని గుర్తించినారు. కర్ణాటకాంధ్ర ప్రదేశములందలి పెక్కుగ్రామాల భక్తులు శిష్యులు వచ్చినారు. 16-1-1929 శుక్ల సం॥ పుష్య బహుళ తదియ శుక్రవారం ఉదయం 7 గంటలపుడు **"అహం బ్రహ్మాస్మి"** అంటూ మూడుసార్లు ఉచ్చరించి భౌతికకాయం విడిచి విశ్వవ్యాప్తులైనారు. శ్రీనరహరి సద్గురువులు వేదరహస్యాలు జీర్ణించుకున్నా వారిలో వేదవ్యాసులను, బ్రహ్మవిద్యా సముపార్జనలో శుకమహర్షిని, గృహస్థాశ్రమ నిర్వహణలో జనక మహారాజులను, ఆధ్యాత్మిక తత్త్వప్రచారంలో ఆదిశంకరాచార్యులను తలపించేవారు.

శ్రీలక్ష్మీనృసింహ సద్గురువులు (1890-1966)

శ్రీ నరహరి సద్గురువుల జ్యేష్ఠ పుత్రులు శ్రీలక్ష్మీనృసింహ సద్గురువులు. వారి అనుజులు శ్రీపుట్ట నరసింహశాస్త్రులు, శ్రీ అహోబళ నరసింహ శాస్త్రులు, శ్రీ జ్వాలా నరసింహశాస్త్రులు, శ్రీకంఠీరవ నరసింహశాస్త్రులు, నరహరి సద్గురువుల ఇలువేలుపు లక్ష్మీ నరసింహస్వామి కావటంచేత తమ ఐదుగురు కొడుకులకు ఇష్ట దేవతానామములే ఉంచినారు. శ్రీ లక్ష్మీనృసింహ శాస్త్రులు పుట్టినది రాయదుర్గం తాలూకా మెచ్చెరి గ్రామంలో వారి జన్మతిథి (1890 జులై) నందనసంవత్సరం ఆషాఢ బహుళ చతుర్దశి. ప్రాథమిక మాధ్యమిక విద్యలు రాయదుర్గంలోనే పూర్తిచేసినారు. అక్కడే సంగీతాభ్యాసం జరిగింది; నాటకముల్లో పాల్గొనటంలో అమితోత్సాహం ప్రదర్శించేవారు చిత్రలేఖనంలో పట్టా పొందినారు. బళ్ళారిలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తిచేసి సెంట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉంటూ తండ్రిగారి వద్ద ప్రస్థాన త్రయం పూర్తిచేసినారు. 1911 సం॥ వారికి కల్యాణ దుర్గం వాసులు ఆదెప్పశాస్త్రిగారి కూతురు రాజమ్మతో వివాహమైనది. ఆదంపతుల ప్రథమ సంతానం శ్రీ సింహాద్రిస్వాములు జననం (1921). అటుతరువాత లక్ష్మమ్మ, పద్మాక్షమ్మ, వనజాక్షమ్మలు పుట్టినారు. 1911-1929 మధ్యకాలంలో లక్ష్మీనృసింహశాస్త్రులు, విధ్యుక్తంగా గృహస్థాశ్రమం పాలిస్తూ, ఉపాధ్యాయ వృత్తి త్రికరణశుద్ధితో చేస్తూ లలితకళల్లో గడిదేరి పితృపాదులు నరహరి సద్గురువులనుండి ఆత్మతత్త్వ రహస్యాలు ఆమూలాగ్రం గ్రహించినారు. 16-1-1929 శుక్ల సం॥ పుష్యబహుళ తదియ శుక్రవారం నరహరి సద్గురువులు బళ్ళారిలో అవతారం చాలించగా

అనుజులతో కలిసి పితృ కార్యములు ముగించి తండ్రిగారు పెంచిన ఆధ్యాత్మిక వృక్షాన్ని శాఖోప శాఖలుగా దిద్ది తీర్చటానికై కంకణ బద్ధులైనారు. తల్లి ఆదిలక్ష్మమ్మగారి మార్గదర్శనం లభించినది. కాని హఠాత్తుగా 1939 అర్ధాంగి రాజమ్మ పరమపదించినది. కొడుకు సింహాద్రి శాస్త్రి చేత విధ్యుక్త కార్యాలు చేయించి తండ్రిగారి మార్గంలో నడుస్తూ భక్తులనుద్ధరించే కార్యం చేపట్టినారు. 1940 సం॥ మాతృవియోగం జరిగింది. స్థితప్రజ్ఞులైన లక్ష్మీనృసింహ సద్గురువులు ఆంధ్రదేశంలో అనంతపురంజిల్లా కర్ణాటకలో చిత్రదుర్గం, బళ్ళారి, శివమొగ్గ ఉత్తరకన్నడ జిల్లాల్లో 30 సంవత్సరాలు నిర్విరామంగా సంచరించి, ప్రార్థనలు, ప్రవచనములు, భజనలు చేస్తూ, చేయిస్తూ పామరులకు సైతం దివ్యబోధామృతం పంచినారు. హిందూపురం, రాయదుర్గం, రామజోగి పల్లెలో ఆశ్రమాలు స్థాపించి తమశిష్యులు శిష్యరాంద్రద్వారా గొప్ప ఆధ్యాత్మిక విప్లవం సాధించినారు. వారు సంచరించిన ప్రతి గ్రామంలో కనీసం 15 దినాలు, ప్రధాన కేంద్రాల్లో రెండు మూడు నెలలు ఉంటూ తమ గంభీర ప్రవచనములద్వారా వివేకానందుల వలె శ్రోతలను ఉఱ్ఱూత లూగించేవారు. శ్రీలక్ష్మీనృసింహ సద్గురువులు కూడ 1965-1966 సంవత్సరాల్లో ఉదరశూలతో దైహికబాధ అనుభవించినారు. హిందూపురం శిష్యులు భక్తులు శ్రీవారిని హిందూపురం ప్రధానాశ్రమానికి తరలించినారు. అగ్రసుతులు సింహాద్రిస్వాములు వారి పత్ని నాగవేణమ్మగారు పరిచర్యలు చేసినారు. తమ సంకల్పబలంచేత తేరుకొని, అత్యంత వైరాగ్య ప్రపత్తి గల శిష్యులను స్వాతిముత్తెపు చిప్పలవంటి వారిని ఎన్నుకొని వారిలో ఆధ్యాత్మిక బీజాలు నాటి వారిని ముముక్షువు లుగా మంత్రపిండాలుగా తీర్చిదిద్దినారు.

శ్రీవారి వ్యక్తిత్వము చాలా విశిష్టమైనది. కపటము, అసత్యము, ఆడంబరములు వారికి నచ్చేవికాదు. శిష్యుల్లో ఈగుణాలుంటే ఉగ్రులై వారిని సరిదిద్ది మరల శాంతులయ్యేవారు. ఎట్టి లౌకిక సమస్యలైనా పారమార్థిక దృష్టితో పరిష్కరించేవారు. తమ పుత్రులు సింహాద్రి శాస్త్రినివలెనే శిష్యులందరిని సమంగా చూచేవారు. వారి శిష్యవర్గంలో హరిజనులు ముసల్మానులు కూడా ఉన్నారు. ఈ విధంగా వారు దీర్ఘకాలం సద్గురు సంప్రదాయ లక్ష్యాన్ని సాధించ టానికే అంకితమై 1966 సం॥ భౌతికముగా కనుమరుగైనా వారు ప్రసాదించిన జ్ఞానభిక్ష చూపిన క్రియాశీలత, భక్తులపట్ల వాత్సల్య ప్రదర్శన అనుపమములు.

శ్రీలక్ష్మీ నృసింహ సద్గురువుల తరువాత వారి పుత్రులు శ్రీ సింహాద్రి సద్గురుస్వాములు సంప్రదాయ పరిరక్షణ కార్యభారం వహించినారు. 26-6-1921 నాడు దుర్మతి సం॥ జ్యేష్ఠ బహుళ షష్ఠి ఆదివారం బళ్ళారి కన్యకాపరమేశ్వరీ ఆలయం ఈశాన్యమూల చిన్న గదిలో పుట్టినారు. 5వ యేడుదాక తల్లిదండ్రులు శ్రీమతిరాజమ్మ శ్రీలక్ష్మీనృసింహస్వాముల గారాబానికి పాత్రు లైనారు. తాతగారైన సద్గురు నరహరి స్వాములవారు అక్షరాభ్యాసం చేయించి భారత భాగవత రామాయణాలు బోధించినారు. 15-20 ఏండ్ల వయస్సులో యోగాభ్యాసము చేసి తండ్రిగారి ఆదేశం ప్రకారం జ్ఞానమార్గం ప్రవేశించినారు. 17వ యేట మన్నేకోట వాసులు జానకమ్మ శ్రీనివాస రావుల పుత్రిక నాగవేణమ్మతో వివాహం జరిగింది. పల్లేపల్లి గ్రామంలో సుమారు 7 సంవత్సరాలు వైవాహిక జీవితం గడిపినారు. ఉద్యోగరీత్యా వారు కోసిగి గ్రామంలో 18 సంవత్సరాలున్నారు. వారి నివాసము మార్కండేశ్వర దేవస్థానం

మంటపాలు, అక్కడ తమ పిల్లలు చాలామంది విద్యార్థులు వారి యింటనే భోజనం విద్యాభ్యాసం, వసతి పూర్వ కాలపు గురుకులాన్ని తలపించేది. ఉదయం 10 గంటలనుండి సాయం 5 గంటలదాక ఉన్నత పాఠశాలలో అధ్యాపక వృత్తి చేసి దేవాలయానికి తిరిగివచ్చి పురాణ ప్రవచనం చేసేవారు. శ్రీమతి నాగవేణమ్మగారు శిష్యులందరినీ పుత్ర నిర్విశేషంగా సంభావించే వారు. ప్రతి సంవత్సరం తండ్రి, గురువులైన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారు వచ్చి మూడుమాసాలుండి సింహాద్రిస్వాముల ప్రగతి శిష్యవర్గం ప్రగతి అరసికొనేవారు. శ్రీలక్ష్మీ నృసింహస్వాములవారు దేహం చాలించగనే సింహాద్రిస్వామివారు ఉద్యోగం విరమించి తండ్రిగారు అడుగుజాడల్లో పల్లెలు పట్టణాలు సంచరిస్తూ, భారతీయ సంస్కృతి, వేదాంతవిషయాలు, శృతి, యుక్తి అనుభవ పూర్వకంగా అనేక దృష్టాంత ద్రాష్టాంతికముల ద్వారా అధ్యాత్మిక ప్రచారం చేసినారు. వారి ధర్మపత్ని నాగవేణమ్మగారు మహిళా భక్తులకు మార్గదర్శనం చేస్తూ, హిందూపురం, చళ్ళకెరె, రాయదుర్గం, బళ్ళారి, శివమొగ్గ పర్యటించేవారు. ఆయమ్మ దళితులకు పేదలకు దీనులకు వారిమధ్యనే ఉంటూ చేసిన సేవ నిరుపమానం జాతిమత ప్రసక్తి లేకుండా ఎందరో మహిళలకు పూరిగుడిసెల్లో ఉండే వారికి మంత్రోపదేశం చేసి వారిలో నూతన చైతన్యాన్ని కలిగించినది.

చెళ్ళకెరలో (నరహరినగర్) ఆ ఋషి దంపతులు ఒక ఇల్లు కట్టుకున్నారు. తమచెంతకు వచ్చే వారికి భోజన సదుపాయములకై కొంతపొలం కొన్నారు భక్తులు ముందుకు వచ్చి నరహరేశ్వర పంచాయతనంలో దేవస్థానం ఏర్పాటుచేసినారు. వారి ఇంటికి నారాయణ నిలయమని పేరు. శ్రీసింహాద్రి స్వాములు వారి పత్ని

నాగవేణమ్మ పర్ణశాలలో భక్తుల మధ్యనే ఉంటూ బోధలు చేసేవారు. కావలసిన, అత్యవసరమైన వసతులు వారి సంకల్ప బలంతో తమంత తామే సమకూరేవి. ఇట్లుండగా 12-10-1989 ఆశ్వయుజ శుక్ల త్రయోదశినాడు ఋషిపత్ని నాగవేణమ్మగారు పరమపదించినారు. సింహాద్రి సద్గురువులు స్థిత ప్రజ్ఞులు కనుక ఆ దుఃఖాన్ని అలవోకగా భరించినారు. సద్గురువుల బోధలు ఒంట బట్టించుకున్న తను సంజాతులు, కరసంజాతులు కూడ ఆ తీరని లోటును కొంతకాలం తరువాత అధిగమించినారు. స్వాములు నిరంతర పర్యటనలు నిర్విరామ బోధలు చేస్తూ (1994 జూన్) తళకాడు సంచారంలో గుండెపోటు అనుభవించినారు. 5-8-1994 మద్రాసు అపోలో ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ జరిగినది. త్వరలోనే మరల పర్యటనల కుపక్రమించినందున పక్షవాతం మరల వచ్చి కుడికాలు కుడిచేయి పడిపోయినవి. మాటకూడ పడిపోయినది. 2002 నవంబర్‌లో మెదడు శస్త్రచికిత్స జరిగింది. 29-1-2003 పుష్యబహుళ ద్వాదశి రాత్రి 11-30 గం. బెంగుళూరు మల్లేశ్వరం స్వగృహంలో తనువు చాలించినారు.

శ్రీ సింహాద్రి సద్గురుస్వాములు (1921-2003) సంప్రదాయ పరిరక్షణకై బ్రహ్మవిద్యా ప్రబోధమునకై భక్తులను శిష్యులను ఉద్ధరించటానికై 1966-2002 మధ్యకాలంలో 500000 కిలోమీటర్లు 500 గ్రామాలు పర్యటించి 25000 భక్తుల నుద్ధరించినారు. 22 కేంద్రాల్లో శ్రీనరహరి సద్గురు ఆశ్రమాలు స్థాపించినారు. 250 గీతాజ్ఞాన యజ్ఞాలు నిర్వహించినారు. భక్తులను శిష్యులను ఉద్దేశిస్తూ 100000 లేఖలు వ్రాసినారు. 35 సంవత్సరాలు శ్రీనరహరి సద్గురువులు శ్రీలక్ష్మీనృసింహ

సద్గురువుల ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించినారు. ఆ యిరువురి విగ్రహాలు పలుతావుల ప్రతిష్ఠించినారు. 30 సంవత్సరాలు లలితా త్రిపురసుందరీ అమ్మవారినుపాసించి ప్రతి శుక్రవారం మౌనం పాటించినారు నరహరి నగర్‌లో శ్రీనరహరేశ్వర స్వామి దేవస్థానం శివ పంచాయతనం స్థాపించినారు. దొడ్డ సిద్దవ్వనహళ్ళిలో శివరాత్ర్యుత్సవాలు చేస్తూ వేలసంఖ్యలో హరిజన భక్తుల నుద్ధరించినారు. చిత్ర దుర్గ శివమొగ్గ జిల్లాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు శ్రీరామేశ్వర రథోత్సవాలు ప్రారంభించినారు పాఠశాలలు లేని గ్రామాల్లో పాఠశాలలు స్థాపించి బీద విద్యార్థులకు అనాథలకు ఆశ్రయం కల్పించి చదువులు చెప్పించినారు. ఉచిత వైద్య పరీక్షా కేంద్రాలు నేత్రచికిత్సా శిబిరములు నిర్వహించినారు. అసంఖ్యాక గ్రంథాలు తెలుగు, సంస్కృతం కన్నడభాషల్లో ప్రకటించినారు. శ్రీనరహరి వాణి త్రైమాసిక పత్రికను స్థాపించినారు. స్వీయ చరిత్ర ప్రకటించినారు. పల్లెటూరి పాటల వరుసల్లో పాటలు కూర్చి తత్త్వప్రబోధం చేసినారు. వారి ధర్మపత్ని మాతృశ్రీ నాగవేణమ్మగారు మామగారికి, భర్తగారికి, వచ్చిపోయే అతిథులకు, శిష్యులకు కన్న సంతానానికి, గ్రామాల్లో భక్తులకు, అమాయక జానపదులకు కన్నకొడుకులకు చేసినసేవ అనన్యమైనది. ఆ సద్గురువులవలె ఆయమ్మ కూడ ఒక కారణజన్మురాలు. ఆమె సంతానము 1) పూజ్యశ్రీ సద్గురుమూర్తి 2) శ్రీశాంతారాం 3) శ్రీరాజారాం 4) శ్రీరఘురాం, 5) శ్రీ ఏకాంతరాం 6) శ్రీనరహరిగారలు, ఈ సోదరులందరు మూడుతరాల తమపూర్వులు వ్యాపింపజేసిన సత్సంప్రదాయాన్ని అజరామరంగా నిలుపటానికై అహరహము శ్రమిస్తున్నారు. గృహస్థాశ్రమ ధర్మం పాలిస్తూ త్రికరణశుద్ధి,

దైవచింతన, ధార్మిక మూల్యాల సంరక్షణ, ఆధ్యాత్మిక ప్రచోదనం, స్వస్వరూపాను సంధానం వాని ద్వారా బ్రహ్మానందమయజీవనం గడపటానికి మార్గదర్శనం చేయటం శ్రీనరహరిసద్గురు పరంపరలోని మహాత్ములందరి ధ్యేయం.

ఆధారం: –

శ్రీ నరహరి సద్గురు పరంపర. శ్రీనరహరి సద్గురు ఆశ్రమము, హిందూపురం, అనంతపురం జిల్లా 2004